అనుదినం... జనస్వరం
www.navatelangana.com
16 పేజీలు వెల: 6.50
నవతెలంగాణ
గురువారం 20-03-2025
సమగ్ర తెలుగు దినపత్రిక
సంపుటి : 11 సంచిక : 78 Published from Hyderabad, Rangareddy, Khammam, Karimnagar



బడ్జెట్‌ను పున: సమీక్షించాలి



విద్య, వైద్యం, వ్యవసాయం, గృహ నిర్మాణ రంగాలకు నిధులు పెంచాలి 3లో..

ఎస్సీ,ఎస్టీ,బీసీ,మైనార్టీ సంక్షేమానికి అధిక నిధులివ్వాలి

లేకుంటే ఆందోళనలు, ఉద్యమాలు తప్పవు : సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ

మన పద్దు రూ.3,04,965 కోట్లు



రానున్న (2025-26) ఆర్థిక సంవత్సరానికి గాను రూ.3,04,965 కోట్లతో రాష్ట్ర ప్రభుత్వం బడ్జెట్‌ను ప్రతిపాదించింది. బుధవారం ఉదయం ఆర్థిక శాఖ మంత్రి మల్లు భట్టి విక్రమార్క శాసనసభలో, శాసన మండలిలో ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు పద్దును ప్రవేశపెట్టారు.

రెవెన్యూ వ్యయం రూ. 2,26,982 కోట్లు
మూలధన వ్యయం రూ. 36,504 కోట్లు

రెవెన్యూ మిగులు రూ. 5,944 కోట్లు

కేటాయింపులు ఇలా....



శాఖ	కేటాయింపు
వ్యవసాయ శాఖ	రూ. 24,439 కోట్లు
పశు సంవర్ధక శాఖ	రూ. 1,674 కోట్లు
పౌరసరఫరాల శాఖ	రూ. 5,734 కోట్లు
విద్యాశాఖ	రూ. 23,108 కోట్లు
కార్మిక ఉపాధికల్పనకు	రూ.900 కోట్లు
పంచాయతీ రాజ్ గ్రామీణాభివృద్ధి	రూ.31,605 కోట్లు
మహిళా శిశు సంక్షేమం	రూ.2,862 కోట్లు
షెడ్యూల్ తెగల	రూ.17,169 కోట్లు
వెనుకబడిన తరగతుల శాఖ	రూ.11,405 కోట్లు
షెడ్యూల్ కులాల సంక్షేమం	రూ. 40,234 కోట్లు
చేనేత రంగానికి	రూ. 371 కోట్లు
మైనారిటీ సంక్షేమం	రూ. 3,591 కోట్లు
పరిశ్రమల శాఖ	రూ. 3,527 కోట్లు
ఐటీ శాఖ	రూ.774 కోట్లు
విద్యుత్ శాఖ	రూ. 21,221 కోట్లు
మున్సిపల్ పరిపాలన పట్టణాభివృద్ధి శాఖ	రూ.17,677 కోట్లు
నీటిపారుదల శాఖ	రూ.23,373 కోట్లు
హోం శాఖ	రూ.10,188 కోట్లు
దేవాదాయ శాఖ	రూ.190 కోట్లు
అడవులు పర్యావరణ శాఖ	రూ.1,023 కోట్లు
క్రీడాశాఖ	రూ. 465 కోట్లు
పర్యాటకశాఖ	రూ. 775 కోట్లు
రోడ్లు భవనాలు శాఖ	రూ. 5,907 కోట్లు
వైద్య ఆరోగ్య శాఖ	రూ.12,393 కోట్లు
ఆరు గ్యారంటీలకు	రూ. 56,084 కోట్లు

అసమానతలు లేని వ్యవస్థే లక్ష్యం

తెలంగాణ రైజింగ్-2050 విజన్‌తో ముందుకు

పారదర్శకత, జవాబుదారీతనంతో పాలన... సమాఖ్య స్ఫూర్తిని కొనసాగిస్తాం

వ్యవసాయం, సంక్షేమం, విద్య, వైద్య రంగాలకు ప్రాధాన్యం

రాష్ట్ర బడ్జెట్‌ను ప్రతిపాదించిన డిప్యూటీ సీఎం, ఆర్థిక మంత్రి భట్టి విక్రమార్క

ఎస్సీ, ఎస్టీ సంక్షేమానికి పెద్దపీట

ఆ తర్వాత పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖకు ప్రతిపాదనలు

మండలిలో బడ్జెట్ ప్రవేశపెట్టిన మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్


తెలంగాణ రైజింగ్ 2050 ప్రణాళికతో రూ.3,04,965 కోట్లతో 2025-26 ఆర్థిక సంవత్సర బడ్జెట్‌ను ఉప ముఖ్యమంత్రి, ఆర్థిక శాఖ మంత్రి మల్లు భట్టివిక్రమార్క ప్రతిపాదించారు. రాష్ట్ర ఆర్థిక పరిణామం 200 బిలియన్ డాలర్లు అనీ, పదేండ్లలో దాన్ని ట్రిలియన్ డాలర్లకు పెంచుతామని ధీమా వ్యక్తం చేశారు. రెవెన్యూ వ్యయం రూ.2,26,982 కోట్లుగా, మూలధన వ్యయం రూ.36,504 కోట్లుగా చూపెట్టారు. ఎస్సీ, ఎస్టీ సంక్షేమానికి పెద్దపీట వేశారు. బుధవారం శాసనసభలో ఆయన బడ్జెట్‌ను ప్రవేశపెట్టారు. రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్.అంబేద్కర్ చూపిన నైతిక విలువలను పాటిస్తూ ప్రజాప్రయోజనాలే ధ్యేయంగా పారదర్శకత, జవాబుదారీతనంతో తమ పాలన సాగుతున్నదని నొక్కి చెప్పారు. ప్రభుత్వం చేసే ప్రతిచర్యనూ శంకిస్తూ సోషల్‌మీడియా వేదికగా కొందరు తమ ప్రభుత్వంపై అబద్ధపు ప్రచారాలు చేయడాన్ని తప్పుబట్టారు. సమాఖ్యస్ఫూర్తిని కొనసాగిస్తున్నామన్నారు. క్లీన్ ఎనర్జీ, సుస్థిర అభివృద్ధితో తెలంగాణ రాష్ట్రాన్ని అగ్రగామిగా నిలబెట్టేందుకు మెగా మాస్టర్‌ప్లాన్ -2050 రూపొందించామన్నారు. ఆరోగ్య రంగాన్ని విస్తరించి ప్రజలకు మెరుగైన వైద్యసేవలందించేందుకు మెడికల్ కాలేజీల ఏర్పాటుకు నిధుల కేటాయింపులు పెంచుతామని చెప్పారు. విద్యావ్యవస్థను పటిష్టపరుస్తామన్నారు. రైతు సంక్షేమమే తమ ప్రభుత్వ తొలి ప్రాధాన్యమని నొక్కి చెప్పారు. బుధవారం శాసనసభలో బడ్జెట్ ప్రసంగాన్ని డిప్యూటీ సీఎం, ఆర్థిక మంత్రి మల్లు భట్టి విక్రమార్క చదివి వినిపించారు. శాసన మండలిలో శాసనసభావ్యవహారాల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు బడ్జెట్‌ను ప్రవేశపెట్టారు.

10.1 శాతం వృద్ధిరేటు

2024-25 ఆర్థిక సంవత్సరంలో తెలంగాణ స్థూల రాష్ట్ర ఉత్పత్తి 16,12,579 కోట్లు అనీ, గతేడాదితో పోలిస్తే వృద్ధిరేటు 10.1 శాతంగా ఉందని భట్టి విక్రమార్క వివరించారు. అదే ...7లో

చేదు, తీపి కలగలిసిన బడ్జెట్


సీపీఐ ఎమ్మెల్యే కూనంనేని



రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన బడ్జెట్ ప్రజల ఆశలు నెరవేర్చే బడ్జెట్‌గా ఉందని సీపీఐ ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అన్నారు. బుధవారం అసెంబ్లీ మీడియా పాయింట్‌లో ఆయన మాట్లాడుతూ అప్పులపై ఆధారపడి రాష్ట్రాన్ని నడపడం సాధ్యం కాదన్నారు. కేంద్ర బడ్జెట్ విషయంలో సమ పంపిణీ లేదని చెప్పారు. ఇచ్చిన వాగ్దానాలను అమలు ...15లో

ఆరు గ్యారంటీలు గోవిందా..

మాజీమంత్రి కేటీఆర్



ఆరు గ్యారంటీలకు కాంగ్రెస్ ప్రభుత్వం గోవింద పలికిందని మాజీ మంత్రి కేటీఆర్ విమర్శించారు. బుధవారం అసెంబ్లీ మీడియా పాయింట్‌లో బీఆర్ఎస్ ఎమ్మెల్యేలతో కలిసి మాట్లాడారు. తమ ప్రయోజనాలకు అనుగుణంగా బడ్జెట్ కేటాయింపులు ఉంటాయని రైతులు, ప్రజలు ఎదురు చూశారని చెప్పారు. 420 హామీల్లో ఒక్క గ్యారంటీపై కూడా మాట్లాడలేదన్నారు. రూ. నాలుగు వేల పింఛన్ మరిచి పోయారని చెప్పారు. మహిళలకు ...15లో

ప్రజలను వంచించే బడ్జెట్

బీజేపీ శాసనసభాపక్షనేత మహేశ్వర్‌రెడ్డి



రాష్ట్ర ప్రజలను ఈ బడ్జెట్ వంచించిందని బీజేపీ శాసన సభా పక్ష నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి విమర్శించారు. బుధవారం అసెంబ్లీ మీడియా పాయింట్‌లో తమ పార్టీ ఎమ్మెల్యేలతో కలిసి మాట్లాడారు. బడ్జెట్ అంతా డొల్లగా ఉందని చెప్పారు. ప్రజల ఆకాంక్షలకు భిన్నంగా ఉందని చెప్పారు. ఏ ఒక్క హామీ సంపూర్ణంగా అమలు అయ్యే పరిస్థితి లేదని చెప్పారు.

సుదీర్ఘ నిరీక్షణకు తెర

ఫ్లోరిడా జలాల్లో దిగిన నాసా వ్యోమగాములు

- హూస్టన్ అంతరిక్ష కేంద్రంలో వైద్య పరీక్షలు
- సునీతకు ప్రముఖుల ప్రశంసలు



కేప్ కెన్వెరల్ : అంతరిక్షంలో 286 రోజుల సుదీర్ఘ నిరీక్షణ అనంతరం నాసా వ్యోమగాములు సునీతా విలియమ్స్, బచ్ విల్మోర్ బుధవారం స్పేస్ ఎక్స్ డ్రాగన్ క్యాప్సుల్ (వ్యోమనౌక)లో సురక్షితంగా భూమికి చేరుకున్నారు. వారిని తీసుకొచ్చిన క్యాప్సుల్ భారత కాలమానం ప్రకారం తెల్లవారుజామున 3.27 గంటలకు ఫ్లోరిడా సముద్ర జలాలలో దిగింది. గత సంవత్సరం జూన్ ఐదవ తేదీన వారం రోజుల మిషన్ కోసం అంతరిక్ష కేంద్రానికి వెళ్లిన సునీతా విలియమ్స్, బుచ్ విల్మోర్ సాంకేతిక సమస్యల కారణంగా తొమ్మిది నెలలకు పైగా అక్కడే గడపాల్సి వచ్చింది. అంతరిక్షం నుండి క్యాప్సుల్ బయలుదేరిన సమయం నుండే ప్రపంచ వ్యాప్తంగా అందరిలోనూ ఉత్కంఠ నెలకొంది. వ్యోమగాములు క్షేమంగా భూమికి తిరిగి రావాలంటూ పలుచోట్ల ప్రార్థనలు చేశారు. స్పేస్ ఎక్స్ క్రూ డ్రాగాన్ క్యాప్సుల్ వ్యోమగాములను సురక్షితంగా భూ వాతావరణంలోకి తీసుకొని రాగానే అప్పటికే వారి కోసం సముద్రంలో ఎదురు చూస్తున్న సహాయ బృందాలు వారిని అందులో నుండి బయటికి తీశారు. అనంతరం హూస్టన్‌లోని జాన్సన్ అంతరిక్ష కేంద్రానికి తరలించి వైద్య పరీక్షలు నిర్వహిస్తున్నారు. ఎనిమిది రోజుల యాత్ర కోసం అంతరిక్షంలోకి వెళ్లిన వ్యోమగాములు గంటకు 28 వేల కిలోమీటర్ల వేగంతో స్పేస్ స్టేషన్‌లో ప్రయాణించారు. అంటే రోజుకు 16 సార్లు సూర్యుడిని చుట్టే వారు. వారికి ప్రతి 45 నిమిషాలకు ఒకసారి ...15లో

అర్హులకు రేషన్ కార్డులు
అందడం లేదు

ప్రభుత్వాలది ఒట్టి ప్రచారమే

సుప్రీంకోర్టు అసంతృప్తి



నవతెలంగాణ-న్యూఢిల్లీ బ్యూరో

రేషన్ కార్డుల అంశంపై దేశ సర్వోన్నత న్యాయస్థానం కీలక వ్యాఖ్యలు చేసింది. రేషన్ కార్డు పాపులారిటీ కార్డుగా మారిందని సుప్రీం ధర్మాసనం వ్యాఖ్యానించింది. అర్హులకు రేషన్ కార్డులు అందడం లేదని సుప్రీంకోర్టు అసంతృప్తి వ్యక్తం చేసింది. తలసరి ...15లో



అన్యాయంపై తిరుగుబాటు చేసిన
ధీరవనిత మల్లు స్వరాజ్యం

ఆమె స్ఫూర్తిని పునికి పుచ్చుకోవాలి

యూపీఏ హయాంలో ఉపాధి హామీ వంటి అనేక కీలక చట్టాలు వచ్చాయ్..

ట్యాంక్‌బండ్‌పై స్వరాజ్యం విగ్రహం, ట్రస్టుకు స్థలం కేటాయింపునకు కృషి చేస్తా :

మల్లు స్వరాజ్యం 3వ వర్ధంతి సభలో మంత్రి సీతక్క

నవతెలంగాణ-సిటీబ్యూరో

అగ్రకులంలో పుట్టినా, వందలాది ఎకరాల ఆస్తిపాస్తులను కాదనుకుని పేదలకు భూమి, భుక్తి కోసం, వెట్టిచాకిరీ నుంచి విముక్తి కోసం తన జీవితాంతం నిస్వార్థంగా పోరాడిన.. అన్యాయాలపై తిరుగుబాటు జెండా ఎగరేసిన ధీరవనిత మల్లు స్వరాజ్యం అని మంత్రి సీతక్క కొనియాడారు. తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట యోధురాలు మల్లు స్వరాజ్యం 3వ వర్ధంతి సభ ఐద్వా రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో బుధవారం హైదరాబాద్ బాగ్‌లింగంపల్లిలోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో జరిగింది. మల్లు స్వరాజ్యం చిత్రపటానికి మంత్రి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఐద్వా రాష్ట్ర అధ్యక్షులు అరుణజ్యోతి అధ్యక్షతన జరిగిన సభలో మంత్రి మాట్లాడుతూ.. మల్లు స్వరాజ్యం దళ కమాండర్‌గా అడవుల్లో పనిచేశారని, ఎంతో స్ఫూర్తిదాయకమైన జీవితం ఆమెదని తెలిపారు. తాను దళాల్లో పని చేసినప్పుడు స్వరాజ్యం చరిత్ర చదివానని, తమను తాము చక్కదిద్దుకోవటానికి, జనాలతో మమేకం కావటానికి ఎంతో స్ఫూర్తినిచ్చిన పోరాట యోధురాలు మల్లు స్వరాజ్యం అన్నారు. ఆమె స్ఫూర్తిని అందరూ పునికిపుచ్చుకోవాలన్నారు. తమ ప్రభుత్వం ఆనాటి ఉద్యమకారులు, చరిత్ర కలిగిన వారిని ఈనాటి సమాజానికి గుర్తుచేసేలా చేస్తుంటే కొందరు అడ్డుకునే ...15లో

రైల్వే భద్రత, నియామకాల్లో
కేంద్రం నిర్లక్ష్యం

రైల్వే ట్రాక్‌లపైనే రైల్వే కార్మికుల మరణాలు

ప్యాసింజర్ రైళ్లను ఎక్స్‌ప్రెస్ రైళ్లుగా మార్చి అధిక చార్జీలు వసూలు 15లో.

దోపీడీకి గురవుతున్న ప్రయాణికులు : రాజ్యసభలో సీపీఐ(ఎం) ఎంపీ ఎఎ రహీమ్

ఐఏఎస్ స్మితా సబర్వాల్‌కు
నోటీసులు ?



15లో.

వాహనం అద్దె కింద రూ. 63 లక్షలు చెల్లింపు

ఆడిట్‌లో అభ్యంతరం.. నిధుల రికవరీకి చర్యలు

సిద్ధమైన జయశంకర్ వ్యవసాయ యూనివర్సిటీ



పంజాబ్ పోలీసుల
ఉక్కుపాదం 6లో..

రైతు నాయకుల అరెస్టు, శిబిరాలపై జేసీబీతో జులుం

కేంద్రంతో చర్చలకు వెళ్లిన నేతలు అదుపులోకి..

పాఠాలు నేర్వని ప్రభుత్వం

'ప్రజా ప్రయోజనాలే ధ్యేయంగా, పారదర్శకత, జవాబుదారీతనం, వాస్తవాలతో కూడిన బడ్జెట్‌ను ప్రవేశపెడుతున్నందుకు సంతోషంగా ఉంది...' శాసనసభలో బుధవారం బడ్జెట్‌ను ప్రవేశపెట్టిన సందర్భంగా ఉప ముఖ్యమంత్రి, ఆర్థిక మంత్రి భట్టి విక్రమార్క తొలి పలుకులివి. అయితే 72 పేజీల బడ్జెట్ ప్రసంగ పాఠాన్ని, సంబంధిత గణాంకాలను చూసినప్పుడు 'భోజనం సంగతి తర్వాత.. ముందయితే విస్తరేసేద్దాం...' అనే తరహాలో పద్దు కూర్పు కొనసాగింది. 'గంజిలోకి ఉప్పు లేదురా అంటే పాలలోకి పంచదార కావాలి...' అన్నాడట వెనకటికెవడో. ఇప్పుడు అదే చందంగా ప్రభుత్వం తన బడ్జెట్‌లో అంచనాలేసుకుంది.

రాని ఆదాయాన్ని వచ్చినట్టు చూపిన గణాంకాలు

గత పద్దుకు రూ.13 వేల కోట్లను పెంచి చూపిన సర్కార్

భూముల అమ్మకాలపై మళ్లీ అదే ఆశ

మద్యం, ఇసుక, రిజిస్ట్రేషన్లు, ఎల్‌ఆర్ఎస్‌పైనే భారం

ఉద్యోగుల బకాయిలు, పెండింగ్ బిల్లులపై నిర్దిష్ట కార్యాచరణ శూన్యం

అదనపు ఆదాయ మార్గాలపై మౌనం

బీఆర్ఎస్ చెప్పుల్లోనే కాళ్లు పెట్టి నడుస్తున్న కాంగ్రెస్

-బి.వి.యన్.పద్మరాజు



గతంలో రాని, భవిష్యత్తులో రావటానికి అవకాశం లేని మార్గాల ద్వారా ఆదాయం వస్తుందంటూ సర్కారు 'అతి అంచనాలకు' పోయింది. ఎన్నికల్లో కాంగ్రెస్ చెప్పిన ఆరు గ్యారెంటీల అమలుకు, ఉద్యోగులు, ఉపాధ్యాయులకు చెల్లించాల్సిన బకాయిలు, గ్రాట్యూటీ, ఇతర ప్రయోజనాలను ఎప్పటిలోగా ఎలా చెల్లిస్తారు, వాటికి ఎక్కడి నుంచి నిధులు తెస్తారనే దానిపై బడ్జెట్‌లో స్పష్టత లేకుండా పోయింది. ఆరోగ్య శ్రీ బకాయిలు, ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్పులు, విద్యుత్ బకాయిలు, కాంట్రాక్టర్లు, సప్లయర్లకు చెల్లింపులు తదితరాంశాలపై పద్దులో క్లారిటీనివ్వలేదు. గత బీఆర్ఎస్ ప్రభుత్వాన్ని కాదని, తమ పార్టీపై నమ్మకంతో ప్రజలు ఓట్లేసారంటూ డిప్యూటీ సీఎం తన బడ్జెట్ ప్రసంగంలో పేర్కొన్నారు. కానీ ఆ నమ్మకాన్ని, విశ్వాసాన్ని కాపాడుకునే విధంగా బడ్జెట్, అందులో కేటాయింపులు లేవనే విమర్శలను ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వం ఎదుర్కొంటోంది. వెరసి... గత బీఆర్ఎస్ చెప్పుల్లోనే ఇప్పటి కాంగ్రెస్ సర్కారు కాళ్లు పెట్టి నడుస్తోందే తప్ప కొత్తదనమేమీ లేదనే వాదనలు వినబడుతున్నాయి. వాస్తవాలకు అనుగుణంగా తాము బడ్జెట్‌ను ప్రవేశపెడతామంటూ గత కొద్ది కాలంగా ప్రభుత్వ పెద్దలు చెబుతూ వచ్చారు. కానీ ప్రస్తుత పద్దును చూస్తే అది 'వాస్తవాలకు దూరంగానే' ఉంది. గత (2024-25) బడ్జెట్‌లో రెవెన్యూ ఆదాయం రూపంలో రూ.2.21 లక్షల కోట్లు ఖజనాకు చేరతాయని రేవంత్ సర్కార్ అంచనా వేసుకుంది. కానీ వేసుకున్న అంచనాల్లో జనవరి నాటికి కేవలం రూ.1.30 లక్షల కోట్లే వచ్చాయి. మిగిలిన ఫిబ్రవరి, మార్చిలో ఇంకొంత ఆదాయం వస్తుందని భావించి, దాన్ని కూడా కలుపుకున్నా రూ.1.70 లక్షల కోట్లకు మించి ఉండబోదనేది ఆర్థిక నిపుణుల అంచనా. అంటే గత బడ్జెట్‌లో ప్రభుత్వం వేసుకున్న అంచనాల్లో ఇంకా రూ.50 వేల కోట్ల లోటుతోనే బండి ...7లో

గట్టెక్కించేది ఆ నాలుగే..

ఇలాంటి విపత్కర పరిస్థితుల్లో రాష్ట్ర ప్రభుత్వం ప్రధానంగా మద్యం, ఇసుక అమ్మకాలు, రిజిస్ట్రేషన్లు, ఎల్‌ఆర్ఎస్ మీదనే నమ్మకం పెట్టుకుంది. మద్యం అమ్మకాల ద్వారా ఈ యేడాది రూ.60 వేల కోట్లు ఆర్జించాలని లక్ష్యంగా నిర్ణయించుకుంది. ఇసుక అమ్మకాల ద్వారా మొన్నటి వరకు రోజుకు రూ.కోటి దాకా ఆదాయం వచ్చింది. ఇప్పుడది రూ.రెండున్నర కోట్లకు పెరిగిందని సమాచారం. వీటితోపాటు రిజిస్ట్రేషన్లు, ఎల్‌ఆర్ఎస్ ప్రక్రియను పకడ్బందీగా అమలు చేయటం ద్వారా ఎంతో కొంత నిధులు సమకూర్చుకోవాలని సర్కారు భావిస్తోంది. కాగా బీఆర్ఎస్ హయాంలో బడ్జెట్లను భారీగా పెంచుకుంటూ పోయారనీ, ఇప్పుడు ...7లో

ఉస్మానియాలో నాన్ టీచింగ్ సిబ్బందికి వేతనాలు పెంచాలి



కాంట్రాక్ట్ సిబ్బందిని టైమ్ స్కేల్ ఉద్యోగులుగా మార్చాలి : సీఐటీయూ

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

ఉస్మానియాలో నాన్ టీచింగ్ సిబ్బందికి వేతనాలు పెంచాలనీ, కాంట్రాక్ట్ సిబ్బందిని టైమ్ స్కేల్ ఉద్యోగులుగా మార్పు చేయాలని డిమాండ్ చేస్తూ తెలంగాణ యూనివర్సిటీస్ ఎంప్లాయీస్, వర్కర్స్ యూనియన్ రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో బుధవారం హైదరాబాద్‌లో నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా ఆ యూనియన్ గౌరవాధ్యక్షులు జె.వెంకటేశ్ మాట్లాడుతూ.. రాష్ట్రంలోని అన్ని యూనివర్సిటీలలో పనిచేస్తున్న టైమ్ స్కేల్ డైలీవేజ్, కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ తదితర నాన్ టీచింగ్ సిబ్బందికి వేతనాలు పెంచాలనీ, రెండో పీఆర్సీని వెంటనే ప్రకటించాలని డిమాండ్ చేశారు. ఈ నెల 26న తలపెట్టిన చలో హైదరాబాద్ ధర్నా కార్యక్రమంలో పెద్దఎత్తున నాన్ టీచింగ్ స్టాఫ్ పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. ఉన్నత విద్యా రంగాన్ని కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కార్పొరేట్ సంస్థలకు ధారాదత్తం చేస్తున్నదని విమర్శించారు. దేశవ్యాప్తంగా విశ్వవిద్యాలయాలు ప్రజాస్వామ్య వాతావరణానికి విఘాతం కలిగిస్తున్న తీరును ఎండగట్టారు.

ఓయులో కూడా ధర్నాలు, నిరసనలను రద్దు చేస్తూ వైస్ ఛాన్స్‌లర్ విడుదల చేసిన జీఓను తక్షణం ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఆ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు మెట్టు రవి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వి.నారాయణ, రాష్ట్ర కార్యదర్శి టి. మహేందర్, రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎం.పద్మశ్రీ, అమీర్, కోశాధికారి మహమ్మ ద్ సలార్, తదితరులు పాల్గొన్నారు.

మద్యం దరఖాస్తుల గడువు పెంపు



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలో కొత్త మద్యం బ్రాండ్ల దరఖాస్తులను ప్రభుత్వం పెంచింది. నూతన బ్రాండ్లకు సంబంధించిన దరఖాస్తులను సమర్పించేందుకు మార్చి 15 వరకు గడువు ఇవ్వగా, తాజాగా ఆ గడువును ఏప్రిల్ 2 వరకు పొడిగించింది. ఈ మేరకు ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖ కమిషనర్ సీహెచ హరికిరణ్ బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. తెలంగాణలో లేని విదేశీ, దేశీయ లిక్కర్, బీరు కంపెనీలు తమ మద్యం ఉత్పత్తి బ్రాండ్లను అమ్మకాలు జరుపుకునేందుకు టీజీబీసీఎల్‌కు 39 సంస్థలు దరఖాస్తు చేసుకున్నాయి. టీజీబీసీఎల్‌లో రిజిస్టర్ కాని కొత్త కంపెనీలు ఇతర రాష్ట్రాల్లో జరుపుతున్న తమ మద్యం అమ్మకాలపై నాణ్యత ప్రమాణాలతో అమ్మకాలు జరుపుతున్నట్టుగా నిర్ధారణ సర్టిఫికేషన్ పత్రం దరఖాస్తుతో జత పరచాలని టీజీబీసీఎల్ తెలిపింది.





యువతకు నిరాశే...

● బడ్జెట్‌లో నిరుద్యోగ భృతి, జాబ్ క్యాలెండర్, యూత్ డిక్లరేషన్ హామీల ఊసేలేదు ● నేడు రాష్ట్రవ్యాప్త నిరసనలు

డీవైఎఫ్ఐ రాష్ట్ర కమిటీ పిలుపు

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన 2025-26 బడ్జెట్ యువతను నిరాశపర్చిందని భారత ప్రజాతంత్ర యువజన సమాఖ్య (డీవైఎఫ్ఐ) రాష్ట్ర కమిటీ విమర్శించింది. ఈ మేరకు ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షులు కోట రమేష్, కార్యదర్శి ఆనగంటి వెంకటేశ్ బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. కాంగ్రెస్ ఎన్నికల మ్యానిఫెస్టోలోని యూత్ డిక్లరేషన్‌లో ఉన్న జాబ్ క్యాలెండర్, నిరుద్యోగ భృతి, యూత్ కమిషన్‌ను ఏర్పాటు చేస్తామంటూ హామీ ఇచ్చిందని తెలిపారు. కానీ ఈ బడ్జెట్‌లో నిరుద్యోగ యువతు ఉద్యోగ, ఉపాధి అవకాశాలను కల్పించేంత వరకు రూ.నాలుగు వేల నిరుద్యోగ భృతికి నిధులను కేటాయించలేదని పేర్కొన్నారు. పేరుకు మాత్రమే జాబ్ క్యాలెండర్‌ను ప్రకటించిందనీ, ఉద్యోగాల భర్తీకి నోటిఫికేషన్లను విడుదల చేయడం లేదని తెలిపారు. అధికారంలోకి వచ్చిన మొదటి ఏడాదిలోనే రెండు లక్షల ఉద్యోగాలను భర్తీ చేస్తామన్న కాంగ్రెస్ ఇప్పటి వరకు 57 వేల కొలువులను భర్తీ చేసిందని వివరించారు. స్వయం ఉపాధి రుణాలను రూ.ఆరు వేల కోట్లు కేటాయిస్తున్నామని చెప్పి అది కూడా ఐదు లక్షల మంది ఇస్తామని ప్రకటించారని తెలిపారు. రాష్ట్రంలో 35 లక్షల మంది నిరు ద్యోగులున్నారని పేర్కొన్నారు. రాజీవ్ యువ వికాసం పేరుతో నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పిస్తామని చెప్పిన ప్రభుత్వం రేషన్‌కార్డులో పేరు ఉంటేనే అర్హులని చెప్పడం సరైంది కాదని తెలిపారు. రేషన్‌కార్డుతో సంబంధం లేకుండా రాజీవ్ యువ వికాసం పథకాన్ని అర్హులైన నిరుద్యోగులందరికీ వర్తింపజేయాలని డిమాండ్ చేశారు. ఈ బడ్జెట్‌లో ఉపాధి రంగానికి రూ.900 కోట్లు కేటాయించిందనీ, దాన్ని సవరించాలని కోరారు. క్రీడారంగానికి రూ.465 కోట్లు సరిపోవని తెలిపారు. యువతను విస్మరించిన రాష్ట్ర బడ్జెట్‌కు వ్యతిరేకంగా గురువారం రాష్ట్రవ్యాప్తంగా నిరసన కార్యక్రమాలను చేపడుతున్నట్టు వారు పిలుపునిచ్చారు.

యువజన రంగానికి అన్యాయం : ఏఐవైఎఫ్

రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో యువజన రంగానికి తీవ్ర అన్యాయం జరిగిందని ఏఐవైఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు వలీ ఉల్లాఖాద్రి, కార్యదర్శి కల్లూరు ధర్మేంద్ర విమర్శించారు. యువజన కమిషన్‌ను ఏర్పాటు చేస్తామంటూ హామీ ఇచ్చి బడ్జెట్‌లో ప్రస్తావించకపోవడం బాధాకరమని తెలిపారు. ఉద్యోగ, ఉపాధి రంగాలకు అధిక నిధులను కేటాయించక పోవడం సిగ్గుచేటనమి విమర్శించారు. ఇచ్చిన హామీలను అమలు చేయాలని ప్రశ్నించే నిరుద్యోగులపై బీఆర్ఎస్ తరహాలోనే కాంగ్రెస్ ప్రభుత్వం నిర్బంధాన్ని ప్రయోగించడాన్ని మాను కోవాలని డిమాండ్ చేశారు. లేదంటే యువత ఆగ్రహానికి గురికావాల్సి వస్తుందని హెచ్చరించారు.

చేనేతకు హామీలు ఫుల్ నిధులు నిల్

బడ్జెట్లో నేతన్నలకు కాంగ్రెస్ మొండి చెయ్యి: తెలంగాణ చేనేత కార్మిక సంఘం



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

చేనేత, పవర్లూమ్ పరిశ్రమకు, ఆ పరిశ్రమ కార్మికుల అభివృద్ధి కోసం 2025-26 ఆర్థిక సంవత్సరానికి రాష్ట్ర ప్రభుత్వం బడ్జెట్లో నిధులు కేవలం రూ.371 కోట్లు కేటాయించి చేనేతకు కాంగ్రెస్ ప్రభుత్వం మొండి చేయి చూపించిందని తెలంగాణ చేనేత కార్మిక సంఘం ఆగ్రహం వ్యక్తం చేసింది. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాకముందు కార్మికులకు ఉపాధి కల్పిస్తామనీ, సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టి నేత కుటుంబాలను అభివద్ధి చేస్తామని అనేక హామీలు ఇస్తూ కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మ్యానిఫెస్టోలో ప్రకటించిందని గుర్తుచేసింది.

ఈ మేరకు ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షులు వనం శాంతి కుమార్, ప్రధాన కార్యదర్శి గంజి మురళీధర్ ఒక ప్రకటన విడుదల చేశారు.

చేనేత, పవర్లూమ్ కార్పొరేషన్లను ఏర్పాటు చేసి వాటికి నిధులను కేటాయిస్తామని హామీ ఇచ్చిందని తెలిపారు. రాష్ట్రంలో ఇప్పటికే ఉన్న సిరిసిల్,ల వరంగల్ మల్యాపూర్, గుండ్ల పోచంపల్లి టెక్స్టైల్ పార్కుల అభివృద్ధితోపాటు కొత్తగా జగిత్యాల, నారాయణపేట, భువనగిరిలో మెగా పవర్లూమ్ క్లస్టర్ ఏర్పాటు, ప్రభుత్వ రంగ సంస్థలకు కావలసిన వస్త్రాలను మన రాష్ట్రంలోని కార్మిక ద్వారా ఉత్పత్తి చేయిస్తామని తెలిపిందన్నారు. పరికరాలను 90 శాతం సబ్సిడీ, చేనేత ఉత్పత్తులను ఈ కామర్స్‌లతో అనుసంధానం హామీలు విస్మరించిం దన్నారు. చేనేత కార్మికులకు రూ. రెండు లక్షల రుణ మాఫీ ఇవ్వకుండా రూ.లక్ష వరకు రుణాలను మాఫీ చేస్తామని ప్రకటించింది. కానీ ఈ బడ్జెట్లో ఆ ఊసే లేదని తెలిపారు.

నేతన్న అభయహస్తం, పొదుపునిధి, నేతన్న బీమా పథకాలను అమలు ఏదని ప్రశ్నించారు. మహిళా స్వయం సహాయక గ్రూపుల్లో ఉన్న మహిళలకు సంవత్సరానికి రెండు చీరలు చొప్పున ఒక కోటిన్నర చీరలు ఇస్తామని తద్వారా కార్మికులకు ఉపాధి కల్పించి మెరుగైన ఆదాయం లభించే విధంగా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చిందని చెప్పారు. వాటికే రూ.500 చొప్పున రూ.700 కోట్లు కావాలని చెప్పారు. చేనేత మరియు పవర్లూమ్ పరిశ్రమ, కార్మికులను అభి వృద్ధి చేస్తామని ఇచ్చిన హామీలు అమలు కావాలంటే రూ. 2,000 కోట్లు కేటాయించాల్సిన ప్రభుత్వం బడ్జెట్లో రూ.371 కోట్ల రూపాయలను మాత్రమే కేటాయించి ప్రభుత్వం చేతులు దులుపు కుందని విమర్శించారు.

ఆత్మ హత్యలు చేసు కుంటూ దారుణ పరిస్థితిలో ఉన్న నేతన్నలను ఆదు కోవాలనీ, లేకపోతే ప్రభుత్వ నిర్లక్ష్యానికి వ్యతి రేకంగా రాష్ట్రవ్యాప్త ఆందోళన పోరాట కార్యక్రమాలు నిర్వహిస్తామని హెచ్చరించారు.

బడ్జెట్‌లో దళితులకు రూ.6,512 కోట్ల కోత : డీబీఎఫ్

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

బడ్జెట్‌లో దళితులకు రూ.6,512 కోట్ల కోత పెట్టారని డీబీఎఫ్ జాతీయ కార్యదర్శి పి శంకర్ ఆరోపించారు. గత బడ్జెట్‌లో ఎస్సీ ప్రత్యేక అభివృద్ధికి రూ.33,127 వేల కోట్లను కేటాయించగా ఈ ఏడాది కేవలం రూ.26,615 వేల కోట్లు మాత్రమే కేటాయించారని తెలిపారు. ఆర్థిక శాఖ మంత్రి బడ్జెట్ ఉపన్యాసంలో గత ప్రభుత్వం ఎస్సీ ఎస్టీ సబ్ ప్లాన్‌నునిర్లక్ష్యం చెసిందని చెపుతు 2023-24 ఆర్థిక సంవత్సరం బడ్జెట్‌లో ఎస్సీ ప్రత్యేక అభివృద్ధి నిధులను రూ.13,617 ఖర్చు చేయనందున ఈ బకాయిలను కలిపి నిధులను కేటాయిస్తున్నట్టు ప్రకటించారని తెలిపారు. అన్ని కలిపి ప్రస్తుత బడ్జెట్ లో ఎస్సీలకు రూ.40,232 వేల కోట్లను కేటాయించారని పేర్కొన్నారు. 2024-25 బడ్జెట్‌లో ఎస్సీ లకు కేటాయించిన రూ.33,127 కోట్ల బడ్జెట్‌లో కేవలం 9,824 వేల కోట్లను మాత్రమే ఖర్చు చేశారని తెలిపారు. ఇంకా రూ.23,303 కోట్లను ఖర్చుచేయకుండా మిగిలిన బకాయిలను ఎందుకు క్యారీ పార్వడ్ చేయలేదని ప్రశ్నించారు. బడ్జెట్ ఉపన్యాసంలో చేవెళ్ళ డిక్లరేషన్ గురించి కానీ, అంబేద్కర్ అభయ హస్తం గురించి ఊసెత్త లేదని విమర్శించారు.

జీహెచ్ఎంసీ కాంట్రాక్ట్ కార్మికులు

విధుల్లో చేరడానికి సర్క్యులర్ విడుదల

పోరుబాటలో విజయం సాధించిన కార్మికులకు సీఐటీయూ అభినందనలు

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

అనారోగ్య, వ్యక్తిగత సమస్యల కారణంగా గైర్హాజరైన సుమారు 1,500 మంది జీహెచ్ఎంసీ కాంట్రాక్ట్ కార్మికులను హాజరు పట్టీ నుండి జీహెచ్ఎంసీ యాజమాన్యం తొలగించిన విషయం తెలిసిందే. సహేతుకమైన కారణాలతో గైర్హాజరైన వారందర్నీ తిరిగి విధుల్లోకి తీసుకోవాలని ఏడాది కాలంగా జీహెచ్ఎంసీ ఎంప్లాయీస్ యూనియన్(సీఐటీయూ అనుబంధం) గ్రేటర్ హైదరాబాద్ కమిటీ ఆధ్వర్యంలో అనేక ఆందోళనా కార్యక్రమాలను కార్మికులు నిర్వహించారు. జీహెచ్ఎంసీ కమిషనర్, అడిషనల్ కమిషనర్ (హెల్త్&శానిటేషన్)లకు యూనియన్ నాయకులు వినతి పత్రాలు అందజేశారు. ఫలితంగా జీహెచ్ఎంసీ యాజమాన్యం ప్రొసీడింగ్స్ నెం.జు-371012/శానిటేషన్/జిహెచ్ఎంసి/2025 సర్క్యులర్‌ను విడుదల చేసింది. పోరాడి సర్క్యులర్ సాధించిన పారిశుధ్య కార్మికులకు తెలంగాణ మున్సిపల్ ఎంప్లాయిూస్, వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు పాలడుగు భాస్కర్ అభినందనలు తెలిపారు. జీహెచ్ఎంసీ కమిషనర్ ఆ సర్క్యులర్‌ను మినహాయింపులు లేకుండా అమలు చేయాలని కోరారు.



బడ్జెట్‌ను పున:సమీక్షించాలి

- విద్యావైద్యం, వ్యవసాయం, గృహ నిర్మాణ రంగాలకు నిధులు పెంచాలి
- ఎస్సీ,ఎస్టీ,బీసీ,మైనార్టీ సంక్షేమానికి అధిక నిధులివ్వాలి
- లేకుంటే ఆందోళనలు, ఉద్యమాలు తప్పవు : సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్



రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన 2025-26 బడ్జెట్‌ను పున:సమీక్షించాలని సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ డిమాండ్ చేశారు. విద్యావైద్యం, వ్యవసాయం, గృహ నిర్మాణ రంగాలకు నిధులను పెంచాలని కోరారు. ఎస్సీ,ఎస్టీ,బీసీ,మైనార్టీ సంక్షేమానికి అధిక నిధులను కేటాయించాలని సూచించారు. ఈ మేరకు ఆయన బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి భట్టి విక్రమార్క రూ.3,04,965 కోట్లతో బడ్జెట్‌ను ప్రవేశపెట్టారని తెలిపారు. ఎన్నికలకు ముందు కాంగ్రెస్ ఇచ్చిన మ్యానిఫెస్టో అమలుకు, ప్రస్తుత ప్రతిపాదనలకు ఎలాంటి పొంతన లేదని విమర్శించారు. ప్రాజెక్టుల కోసం నిధుల కేటాయింపులు గతేడాది కేటాయించిన దానిలో సగం కూడా ఖర్చుపెట్టలేదని తెలిపారు. ఇప్పుడు కూడా అలాంటి పద్ధతిలోనే ప్రతిపాదనలున్నాయని వివరించారు. ఆరు గ్యారెంటీలను అమలు చేస్తామని చెప్పారని గుర్తు చేశారు. మహిళలకు రూ.2,500 ఇస్తామన్న పథకానికి నిధులు సరిపడా కేటాయించకుండా కేవలం రూ.నాలుగు వేల కోట్లు ప్రతిపాదించారని వివరించారు. దాదాపు 30 లక్షల కుటుంబాలు ఇండ్లు లేనివారు ఉంటే కేవలం 4.50 లక్షల మందికి మాత్రమే ఇందిరమ్మ ఇండ్లు ఇవ్వడానికి ప్రతిపాదన పెట్టారని తెలిపారు. దీని వల్ల ఈ ఏడాది కూడా అమలు జరగని పరిస్థితి కనపడుతున్నదని పేర్కొన్నారు. వ్యవసాయ కూలీలకు రూ.12 వేలు ఇస్తామన్నారని గుర్తు చేశారు. 40 లక్షల మంది రాష్ట్రంలో ఉంటే కేవలం 5.50 లక్షల మందికే పరిమితం చేయడంతో వ్యవసాయ కూలీలకు అన్యాయం జరుగుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. వ్యవసాయానికి గతంలో ఇచ్చినదానికి కూడా కోత పెట్టారని విమర్శించారు.

ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు ఇచ్చిన నిధుల కేటాయిపుల్లో కామారెడ్డి బీసీ డిక్లరేషన్, చేవెళ్ల ఎస్సీ, ఎస్టీ డిక్లరేషన్‌కు సంబంధం లేకుండా ఈ కేటాయింపులున్నాయని జాన్‌వెస్లీ తెలిపారు. ఎస్సీ, ఎస్టీలకు కుటుంబానికి రూ.12 లక్షలు ఇస్తామన్నారని పేర్కొన్నారు. ఈ బడ్జెట్‌లో ఆ ఊసే లేదని విమర్శించారు. కామారెడ్డిలో బీసీ సబ్‌ప్లాన్ అమలు చేస్తామన్నారనీ, ఈ బడ్జెట్‌లో రూ.20 వేల కోట్లు కేటాయిస్తామన్నారని తెలిపారు. ఇప్పుడు కేవలం రూ.11,400 కోట్లు మాత్రమే కేటాయించారని వివరించారు. మైనార్టీ సంక్షేమానికి కేవలం రూ.మూడు వేల కోట్లకు పరిమితం చేశారని పేర్కొన్నారు. విద్యారంగానికి గతం కంటే 0.2 శాతం నిధులను పెంచారని తెలిపారు. విద్యారంగమంతా ప్రయివేటుపరమవుతున్నదని ఆందోళన వ్యక్తం చేశారు. అది ప్రభుత్వ రంగంలోనే కొనసాగించాలనీ, బడ్జెట్‌లో 30 శాతం నిధులను కేటాయించాలని ఒకవైపు ఉపాధ్యాయ, విద్యార్థి సంఘాలు ఆందోళనలు చేస్తుంటే 7.57 శాతానికే పరిమితం చేశారని విమర్శించారు. ఆర్టీసీ పరిరక్షణ కోసం, ఉద్యోగులుగా గుర్తిస్తూ, వారిని అభివృద్ధి చేసేదానికి చర్యలు తీసుకుంటామన్నారని తెలిపారు. కానీ ఎలాంటి నిధుల కేటాయింపు లేదని పేర్కొన్నారు. అసంఘటితరంగం, ఆశా, అంగన్‌వాడీల వేతనాల పెంపునకు ఎలాంటి ప్రతిపాదనలు లేవని పేర్కొన్నారు. పోడు భూములు సాగుచేసుకున్నవారికి పట్టాలిస్తామన్నారని గుర్తు చేశారు. గిరిజన గూడెం, తండాల అభివృద్ధికి రూ.25 లక్షలు ఇస్తామన్నారని తెలిపారు. ఈ బడ్జెట్‌లో ఆ ఊసేలేదని పేర్కొన్నారు. రేషన్ కార్డుల ద్వారా పేదలకు 14 రకాల సరుకులను ఇచ్చేందుకు కేటాయింపుల్లేవని వివరించారు. ఈ విధంగా మొత్తం సంక్షేమ రంగంలో ఆరు గ్యారెంటీలు కూడా ఈ ఏడాది కూడా అమలు జరగబోదని తెలిపారు. కేవలం ప్రచారానికి పరిమితమయ్యే పద్ధతిలోనే ఈ బడ్జెట్ ఉందని విమర్శించారు. ఈ బడ్జెట్‌ను పున:సమీక్షించాలని ఆయన డిమాండ్ చేశారు. కేంద్రం నుంచి రావాల్సిన వాటా కోసం రాష్ట్ర ప్రభుత్వం గట్టిగా పోరాడాలని కోరారు. కీలక రంగాలు, సంక్షేమ రంగాలకు కేటాయించిన పద్దులను అవసరానికి అనుగుణంగా పెంచకపోతే ప్రజల నుంచి తీవ్ర వ్యతిరేకత వస్తుందని తెలిపారు. ఉద్యమాలు, పోరాటాలు తప్పవని ఆయన రాష్ట్ర ప్రభుత్వాన్ని హెచ్చరించారు.



ఎలక్ట్రిక్ బస్సుల రాయితీలు ఆర్టీసీలకు ఇవ్వాలి

- ప్రయివేటీకరణకు కేంద్రం దొడ్డిదారిన కుట్ర
- రౌండ్‌టేబుల్‌లో రాజకీయపార్టీల విమర్శ

నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

కేంద్ర ప్రభుత్వం కార్పొరేట్ సంస్థల ఎలక్ట్రిక్ బస్సులకు ఇస్తున్న రాయితీలను ఆర్టీసీలకు కూడా ఇవ్వాలని పలు రాజకీయపార్టీల నేతలు డిమాండ్ చేశారు. పర్యావరణ పరిరక్షణ పేరుతో దేశవ్యాప్తంగా ఆర్టీసీలను నిర్వీర్యం చేసి, ప్రయివేటీకరణ చేయాలనే కుట్రల్ని కేంద్ర ప్రభుత్వం చేస్తుందని విమర్శించారు. దొడ్డిదారిన ఆర్టీసీలోకి ప్రయివేటు ఎలక్ట్రిక్ బస్సుల్ని ప్రవేశపెడుతున్నారని ఆక్షేపించారు. సీపీఐ రాష్ట్ర సమితి ఆధ్వర్యంలో బుధవారంనాడిక్కడి మఖ్దూం భవన్‌లో 'ఆర్టీసీని పరిరక్షిద్దాం-ప్రజాసేవను కొనసాగిద్దాం' అంశంపై రౌండ్ టేబుల్ సమావేశం జరిగింది. సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు దీనికి అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ మాట్లాడుతూ ఆర్టీసీ పరిరక్షణ ప్రజలందరి బాధ్యత అని చెప్పారు. గ్రాస్ కాస్ట్ కాంట్రాక్ట్ ద్వారా విద్యుత్ బస్సుల్ని ఆర్టీసీలో ప్రవేశపెట్టి, క్రమేణా ప్రజారవాణా వ్యవస్థను ప్రయివేటుపరం చేస్తున్నారని విమర్శించారు. ఒక్కో ఎలక్ట్రిక్ బస్సుపై కార్పొరేట్లకు దాదాపు రూ.40 లక్షల సబ్సిడీని కేంద్ర ప్రభుత్వం ఇస్తున్నదనీ, దాన్ని ఆర్టీసీలకు ఇస్తే ప్రజారవాణా మరింత సమర్థవంతంగా పనిచేస్తుందని వివరించారు. 2030 నాటికి రాష్ట్రంలో పూర్తిగా ఎలక్ట్రిక్ బస్సుల్ని ప్రవేశపెడతామని రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిందని గుర్తుచేశారు. అదే జరిగితే ఆర్టీసీ పూర్తిగా కార్పొరేట్ల చేతుల్లోకి వెళ్ళి, బస్‌డిపోలు సహా లక్షల కోట్ల ఆస్తులు అన్యాక్రాంతం అవుతాయనీ, టిక్కెట్ ధర నిర్ణయంపై ప్రభుత్వ నిర్ణయం లేకుండా పోతుందని విశ్లేషించారు. రాష్ట్రంలో దాదాపు 40వేల బస్సుల అవసరం ఉండగా, ప్రస్తుతం 9,400 మాత్రమే తిరుగుతున్నాయనీ, మహాలక్ష్మి ఉచిత బస్సు ప్రయాణం పథకం అమల్లోకి వచ్చాక ఆర్టీసీ బస్సుల్లో ఆక్యుపెన్సీ రేషియో పెరిగిందని చెప్పారు. ఆర్టీసీలో యూనియన్ల కార్యకలాపాలను అనుమతించాలనీ, డీజిల్ రేట్లపై పన్నుల్ని మినహాయించాలని డిమాండ్ చేశారు. ఆర్టీసీ పరిరక్షణ కోసం తాము సొంతంగా పోరా డుతూనే, అందరితో కలిసి ఐక్య పోరాటా ల్లోనూ భాగస్వాములమవుతామని స్పష్టం చేశారు. తెలంగాణ జన సమితి అధ్యక్షులు, ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కోదండరాం మాట్లాడుతూ ఆర్టీసీ పరిరక్షణకు ప్రభుత్వంతో చర్చలు జరపాలనీ, ఆ బాధ్యతను సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు తీసుకోవాలని సూచించారు. సంస్థలో కార్మిక సంఘాలను అనుమతించాలని కోరారు.

సీపీఐ ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం మాట్లాడుతూ ఆర్టీసీలకు టోల్‌ట్యాక్స్‌లు మినహాయించాలనీ, ఎలక్ట్రిక్ బస్సులకు కిలోమీటర్‌కు రూ.58 కాకుండా, రూ.30 మాత్రమే చెల్లించాలని చెప్పారు. ఎలక్ట్రిక్ బస్సుల తయారీ లైసెన్స్‌ను ఆర్టీసీకి కూడా ఇవ్వాలనీ, లాభాలు వచ్చే వరకు ట్యాక్స్ హాలిడే ప్రకటించాలని కోరారు. వామపక్షపార్టీల నాయకులు డీజీ నర్సింహారావు (సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యులు), కే గోవర్ధన్ (సీపీఐ ఎమ్ఎల్ న్యూ డెమోక్రసీ), బండ సురేందర్‌రెడ్డి (ఫార్వర్డ్ బ్లాక్), జానకిరాములు (రివల్యూషనరీ సోషలిస్ట్ పార్టీ), సీహెచ్ మురహరి (ఎస్‌యూసీఐ-సీ), ఎమ్ హన్మేష్ (సీపీఐ ఎమ్ఎల్ మాస్‌లైన్), బీ కృష్ణ (పీవైఎల్), టీజీఎస్‌ఆర్టీసీ జేఏసీ నాయకులు ఎస్ బాబు, ఈ వెంకన్న, ఎమ్ థామస్‌రెడ్డి, బీ యాదయ్య, ఎన్ కమలాకర్‌గౌడ్, సుద్దాల సురేష్, విజయలక్ష్మి పండిట్ (సీపీఐ వికారాబాద్ జిల్లా) ఏఐటియుసి రాష్ట్ర అధ్యక్షులు ఎమ్‌డీ యూసుఫ్, ఆర్ అంజయ్య నాయక్ (తెలం గాణ గిరిజన సమాఖ్య) కే కాంతయ్య (వ్యవసాయ కార్మిక సంఘం), మారుపాక అనిల్‌కుమార్ (దళిత హక్కుల పోరాట సమితి), ఏసురత్నం (మున్సిపల్ ఎంప్లాయిస్ యూనియన్) తదితరులు మాట్లాడారు. ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేయాలని డిమాండ్ చేశారు. ఆర్టీసీ ఉద్యోగుల సంఖ్య గణనీయంగా తగ్గుతున్నదనీ, ఖాళీ పోస్టుల భర్తీ, కొత్త రిక్రూట్‌మెంట్లు లేవని ఆందోళన వ్యక్తం చేశారు. ఆర్టీసీకి సంబంధించి కాంగ్రెస్‌పార్టీ ఎన్నికల మ్యానిఫెస్టోలో ప్రకటించిన హామీలన్నింటినీ నెరవేర్చాలని డిమాండ్ చేశారు. అంతకు ముందు సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు పీఎస్ బోస్ స్వాగతోపన్యాసం చేశారు.

ఇజ్రాయిల్ మారణకాండను

తీవ్రంగా నిరసించండి

పార్టీ శాఖలకు పొలిట్‌బ్యూరో పిలుపు

న్యూఢిల్లీ : గాజాలో ఇజ్రాయిల్ సైన్యం విచక్షణారహితంగా జరుపుతున్న మారణకాండను సీపీఐ(ఎం) పొలిట్‌బ్యూరో తీవ్రంగా ఖండించింది. కేవలం ఒక్క రోజులోనే 400మందికి పైగా ఈ దాడుల్లో మరణించారు. వీరిలో ఎక్కువ మంది మహిళలు, పిల్లలే వున్నారు. ఇంతటి కిరాతకమైన రీతిలో విచ్చలవిడిగా వైమానిక దాడులకు పాల్పడడం ద్వారా రెండో దశ కాల్పుల విరమణకు తాము దూరమనే సంకేతాలను ఇచ్చిందని పొలిట్‌బ్యూరో పేర్కొంది. ఈ మేరకు బుధవారం ఒక ప్రకటన విడుదల చేసింది.

మార్చి 2 నుంచి గాజాకు ఆహారం, ఇంధనం, నీరు, మందులు సహా అన్ని నిత్యావసరాల సరఫరా పూర్తిగా నిలిచిపోయింది. వాటన్నింటికీ పరాకాష్టగా తాజా మారణకాండ మొదలైంది. గాజాను పూర్తిగా నేలమట్టం చేసి, పాలస్తీనియన్లను కరువు కాటకాలకు గురిచేసి వారి మాతృభూమి నుంచి పారద్రోలాలన్నది ఇజ్రాయిల్ లక్ష్యంగా వుంది. ఇజ్రాయిల్ తాజా దురాక్రమణ చర్యలతో ట్రంప్ ప్రభుత్వం కుమ్మక్కైందని పొలిట్‌బ్యూరో విమర్శించింది. ఇక ఇజ్రాయిల్ మిలటరీ చర్యలకు స్వస్తి చెప్పి కాల్పుల విరమణ రెండో దశను అమలు చేయాల్సిన అవసరం వుందని స్పష్టం చేసింది. ప్రపంచవ్యాప్తంగా శాంతి కాముకుల డిమాండ్ ఇదేనని పేర్కొంది.ఇజ్రాయిల్ దురాక్రమణ చర్యలను మోడీ ప్రభుత్వం బహిరంగంగా వ్యతిరేకించాలని పార్టీ కోరింది. మొత్తంగా పాలస్తీనియన్ల జాతిని కరువు కాటకాలకు గురిచేస్తూ, మూకుమ్మడి హత్యలకు పాల్పడుతుంటే మౌనంగా చూస్తూ వూరుకోరాదని పేర్కొంది. కొనసాగుతున్న ఇజ్రాయిల్ ఊచకోతను నిరసించాల్సిందిగా అన్ని శాఖలకు పొలిట్‌బ్యూరో పిలుపిచ్చింది. తక్షణమే కాల్పుల విరమణను అమలు చేసి, శాంతి స్థాపనకు చర్యలు తీసుకోవాలని కోరింది.

కాగితాల్లో అంకెలు పెంచుతూ ఖర్చులో తుంచుతారా?

● నేడు రాష్ట్ర వ్యాప్తంగా నిరసనలు : కేవీపీఎస్

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

2025- 26 ఆర్థిక సంవత్సరానికి రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన బడ్జెట్‌లో దళితుల సంక్షేమ అభివృద్ధికి కాగితాల్లో అంకెలు పెంచుతూ ఖర్చులో తుంచారని కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం(కేవీపీఎస్) విమర్శించింది. ఈ మేరకు ఆ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి స్కైలాబ్‌బాబు ఆరోపించారు. ఈ మేరకు బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. దళితుల సంక్షేమాన్ని మరిచిన ప్రభుత్వ నిర్లక్ష్యాన్ని నిరసిస్తూ నేడు రాష్ట్ర వ్యాప్త నిరసన కార్యక్రమాలు చేపట్టాలని పిలుపునిచ్చారు. ప్రభుత్వం ప్రకటించిన చేవెళ్ల డిక్లరేషన్ అమలుకు కేటాయింపులు లేవని తెలిపారు. అంబేద్కర్ అభయహస్తానికి ఏటా రూ.750 కోట్లు కేటాయిస్తామంటూ వాగ్దానం చేశారనీ, అందుకు తగిన విధంగా నిధులు కేటాయించలేదని పేర్కొన్నారు. బడ్జెట్‌ను సవరించి దళితుల జనాభా దామాషా ప్రకారం నిధులు కేటాయించి వారి ప్రత్యక్ష ప్రయోజనాల కోసం ఖర్చు చేయాలని డిమాండ్ చేశారు.



తెలంగాణ రాష్ట్ర వార్షిక బడ్జెట్ (2025-26) ప్రతులను శాసనసభాపతి గడ్డం ప్రసాద్ కుమార్‌కు శాసనసభ భవనంలోని స్పీకర్ ఛాంబర్‌లో అందజేసిన రాష్ట్ర ఉపముఖ్యమంత్రి, ఆర్థిక శాఖ మంత్రి మల్లు భట్టి విక్రమార్క. ఆయన వెంట శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి దుద్దిళ్ళ శ్రీధర్ బాబు, రాష్ట్ర రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ గౌడ్, విప్‌లు ఆది శ్రీనివాస్, బీర్ల ఐలయ్య, శాసనసభ్యులు, ఆర్థిక శాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ రామకృష్ణా రావు, లెజిస్లేటివ్ సెక్రెటరీ డాక్టర్ వి.నర్సింహా చార్యులు, అధికారులు ఉన్నారు.

సంపాదకీయం

వ్యోమగాములకు అభినందనలు!

అనూహ్య సాంకేతిక సమస్యలతో తొమ్మిది నెలలకు పైగా అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రంలో గడిపిన వ్యోమగాములు సునీతా విలియమ్స్, బచ్ విల్మోర్ సురక్షితంగా దివి నుంచి భువికి దిగిరావటంతో యావత్ ప్రపంచం ఊపిరి పీల్చుకుంది. అంతేకాదు, సంతోష, హర్షాతిరేకాలను వెల్లడించింది.గుజరాత్ నుంచి వలస వెళ్లి అమెరికాలో స్థిరపడిన ప్రవాస భారతీయ కుటుంబంలో జన్మించి, పశువైద్యురాలు కావాలనుకున్న సునీతా విలియమ్స్(59) జీవితం అనేక మలుపులు తిరిగి అంతర్జాతీయ వ్యోమగామిగా మారటమే కాదు రికార్డులు సృష్టించింది. తొమ్మిది రోజుల పాటు అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రంలో గడిపేందుకు వెళ్లి అనూహ్యమైన సాంకేతిక కారణాలతో తొమ్మిది నెలల పాటు అక్కడే చిక్కుకు పోవటంతో వారికి ఏమౌతుందో అన్న ఆందోళన, ఆతురత

> **కొంత మంది పెద్దలు మాధ్యమాల్లో ఈ కృషిని ప్రశంసించాల్సిందిపోయి, దేవుడి కృపతోనే వారు సురక్షితంగా వచ్చారని వ్యాఖ్యానించటాన్ని ఏమనాలి? ఇలాంటి వ్యాఖ్యలు చేసే వారు అభినందనలకు పరిమితమైతే అదో తీరు, మిగతా అంశాలపై నోరు మూసుకున్నా దేశానికి నష్టం లేదు, అలాంటి మాటలు మన శాస్త్రవేత్తల మీద ఎలాంటి ప్రభావం చూపుతాయో ఆలోచించాల్సిన పని లేదా? మన ఇస్రో శాస్త్రవేత్తలు ప్రతి రాకెట్, ఉపగ్రహాల ప్రయోగం ముందు సుళ్లూరుపేట, తిరుపతి వెంకన్న సన్నిధిలో పూజలు చేస్తున్న తీరు తెన్నులు చూసిన తర్వాత ఇంతకంటే భిన్నమైన స్పందనలు ఎలా వస్తాయి?**

యావత్ శాస్త్ర ప్రపంచం ప్రత్యేకించి అంతరిక్ష ప్రయోగాలలో నిమగ్న మైన వారిలో కనిపిం చింది. ఈ ఉదంతం పరిశోధనా సంస్థలకు, వ్యోమ గాములుగా ఉన్న వారికి, భవిష్యత్‌లో కావాలనుకునేవారికి ఎన్నో అనుభవాలను నేర్పుతుంది, ఉత్తేజం కలిగిస్తుందనటంలో ఎలాంటి సందేహం లేదు. సునీత నావికాదళంలో చేరి యుద్ధ హెలికాప్టర్లు నడపటంలో శిక్షణ పొంది ఇరాక్‌పై జరిగిన దాడి సన్నాహక కార్యకలాపాల్లో భాగస్వామిగా, నాసా వ్యోమగామిగా పనిచేశారు. మనదేశానికి చెందిన కల్పనా చావ్లా తర్వాత అంతరిక్ష యాత్ర చేసిన రెండవ మహిళగా, 62 గంటల ఆరు నిమిషాల పాటు అంతరిక్షంలో నడిచిన తొలి మహిళగా చరిత్ర సృష్టించారు. స్పేస్‌వాకర్ల మొత్తంలో నాలుగవ స్థానంలో నిలిచి మహిళగా తన సత్తాను యావత్ ప్రపంచానికి చాటారు. వయస్సులో ఉన్నపుడు సాహసాలు చేసేందుకు ముందుకు రావటం వేరు, అరవయ్యవపడిలో ఆమె ధైర్యంతో అడుగు వేయడం వేరు. ఇది మహిళలకే కాదు యావత్ యువతకు ఎంతో ఉత్సాహం, ఉత్తేజాన్ని ఇచ్చిన ఆమెను ఎంత అభినందించినా తక్కువే.



ప్రతిదాన్ని చౌకబారు రాజకీయం చేయటంలో రాజకీయ నేతలు పెట్టింది పేరు. సునీతా విలియమ్స్, బచ్ విల్మోర్ తిరిగి రావటానికి చేసిన ఏర్పాట్లు, తీసుకున్న చర్యల అంశంలో డోనాల్డ్ ట్రంప్ అదే చేశాడు. నాసా రూపొం దించిన బోయింగ్ స్టార్‌లైనర్‌లో సమ స్యలు తలెత్తిన కారణంగా ఆలస్యం కావటం తర్వాత ఎలన్‌మస్క్ కంపెనీ స్పేస్‌ఎక్స్‌ను సంప్రదించటం తెలిసిందే. అయితే మాజీ అధ్యక్షుడు జో బైడెన్ కావాలనే వ్యోమగాములను అంతరిక్ష కేంద్రంలో వదలి వేసినట్లు, తాను వారిని రక్షించేందుకు ఎలన్ మస్క్‌కు పురమాయించినట్లు చెప్పుకోవటం ట్రంప్‌కే చెల్లింది. నిజానికి ఇది బైడెన్ మీద విమర్శకంటే నాసా శాస్త్రవేత్తల కృషిని అవమానించటం తప్ప మరొకటి కాదు. స్పేస్‌ఎక్స్ అయినా నాసా అయినా ఆ సంస్థల్లో పని చేసేది శాస్త్రవేత్తలే. తమ పని జయప్రదంగా ప్రయోగించటం, సురక్షితంగా తీసుకురావటం తప్ప రాజకీయాలను పట్టించుకోబోమని నాసా ప్రతినిధి ఎంతో హుందాగా చెప్పాడు. ఇద్దరు వ్యోమగాములు సురక్షితంగా తిరిగి వచ్చినందుకు యావత్ శాస్త్ర ప్రపంచం సంబరాలు చేసుకుంటున్నది. నిమిషాల ప్రకారం నిర్దేశించిన కార్యక్రమంలో వారిని తీసుకువచ్చిన డ్రాగన్ 17గంటల పాటు ప్రయాణించి సముద్ర జలాల్లో సురక్షితంగా దిగింది. ఇదంతా మాయలు, మంత్రాలతో జరిగింది కాదు, సైన్సు సాధించిన విజయం.

కొంత మంది పెద్దలు మాధ్యమాల్లో ఈ కృషిని ప్రశంసించాల్సింది పోయి, దేవుడి కృపతోనే వారు సురక్షితంగా వచ్చారని వ్యాఖ్యానించటాన్ని ఏమనాలి? ఇలాంటి వ్యాఖ్యలు చేసే వారు అభినందనలకు పరిమితమైతే అదో తీరు, మిగతా అంశాలపై నోరు మూసుకున్నా దేశానికి నష్టం లేదు, అలాంటి మాటలు మన శాస్త్రవేత్తల మీద ఎలాంటి ప్రభావం చూపుతాయో ఆలోచించాల్సిన పని లేదా? మన ఇస్రో శాస్త్రవేత్తలు ప్రతి రాకెట్, ఉపగ్రహాల ప్రయోగం ముందు సుళ్లూరుపేట, తిరుపతి వెంకన్న సన్నిధిలో పూజలు చేస్తున్న తీరు తెన్నులు చూసిన తర్వాత ఇంతకంటే భిన్నమైన స్పందనలు ఎలా వస్తాయి? అన్నీ వేదాల్లోనే ఉన్నాయనే పెద్దలు, మన పూర్వీకులు ఉపయోగించిన పుష్పక విమానాల సాంకేతిక పరిజ్ఞానాన్ని, పశ్చిమదేశాల వారు తస్కరించి విమానాలను రూపొందించారని చెప్పిన పోసుకోలు కబుర్ల గురించి తెలిసిందే. మనదేశ మూలాలున్న సునీతా విలియమ్స్ అంతరిక్షంలో చిక్కుకుపోతే ఆమెను రక్షించటానికి మన సంస్కృత పండితులు రంగంలోకి దిగి పుష్పక విమానాన్ని రూపొందించి తీసుకువచ్చేందుకు ఎలాంటి ప్రయత్నాలు ఎందుకు చేయలేదు? ఎవరేమనుకున్నప్పటికీ దేశం, ఖండాలతో నిమిత్తం లేకుండా శాస్త్రవేత్తలు సాధించిన ఈ విజయానికి జేజేలు పలకాల్సిందే. సురక్షితంగా తిరిగి వచ్చిన వ్యోమగాములు సంపూర్ణ ఆరోగ్యంతో తిరిగి సాధారణ జీవితం గడపాలని మనసారా కోరుకుందాం!

కాలం నుదిటిపై మెరిసే సింధూరం



రాంపల్లి రమేష్

"మనకు సోషలిస్టు విప్లవం కావాలి. దానికి ముందు రాజకీయ విప్లవం రావాలి. రాజకీయ విప్లవమంటే ప్రభుత్వం బ్రిటీష్ పాలకుల నుండి భారతీయుల చేతుల్లోకి మారడం మాత్రమే కాదు. విశాల ప్రజా మద్దతుతో విప్లవ పార్టీ చేతుల్లోకి అధికారం రావాలి. ఆ తర్వాత సోషలిస్టు ప్రాతిపదికపై మొత్తం సమాజ పునర్నిర్మాణానికి పూనుకోవాలి" స్వాతంత్ర్యానంతర భారతదేశ నిర్మాణం పట్ల భగత్‌సింగ్ భావనలివి.

తనను ఉరితీయడానికి కొద్దిరోజుల ముందు... 1931 ఫిబ్రవరి 2న జైలు నుండి వెల్లడించిన ఓ వ్యాసంలోని ఈ వ్యాఖ్యలు ఆయన లోతైన ఆలోచనలకు ప్రతీకలు. భగత్‌సింగ్‌ను కేవలం ఓ స్వాతంత్ర్య సమరయోధుడిగా, బ్రిటీష్ పాలకులను గడగడలాడించిన సాహసిగా మాత్రమే చూస్తే అది అసమగ్రమేనని ఈ వ్యాఖ్యలు తెలియజేస్తున్నాయి. చరిత్రలో ఏ వ్యక్తినైనా పరిశీలించేందుకు, అందునా భగత్‌సింగ్ లాంటి ఆలోచనాపరుడిని, విప్లవకారుడిని అంచనా వేయడానికి లోతైన పరిశీలన అవసరం. మౌలికంగా ఆ వ్యక్తి ఆలోచనా విధానం, దాని వికాసం తెలుసుకోకుండా పరిశీలిస్తే వాస్తవాలకు దూరంగా ఉండిపోతాం. పాక్షిక సత్యాలకే పరిమితమవుతాం. భగత్‌సింగ్ విషయంలో అదే జరిగింది. అందుకు కారణం వలసపాలకులు సరిగ్గా నమోదు చేయని అధికారిక రికార్డులు కావొచ్చు, ఆయన ఆలోచనల విస్మృతిని నివారించాలన్న స్వాతంత్ర్యానంతర పాలకవర్గాల ఉద్దేశాలు కావొచ్చు, మితవాద శక్తుల కుతంత్రాలు కావొచ్చు. ఇలా కారణాలేమైనప్పటికీ మనం భగత్‌సింగ్‌ను పూర్తిగా తెలుసుకోవడంలో వెనుకబడి పోయాం. ఫలితంగా ఆయన కేవలం గొప్ప దేశభక్తుడిగా, పోరాట యోధుడిగా, త్యాగధనుడిగానే మనలో చాలామందికి గుర్తుండిపోయాడు. బ్రిటీష్ పాలన నుంచి విముక్తి సాధించడమే ఆయన ఏకైక రాజకీయ లక్ష్యంగా ప్రచారంలో ఉండిపోయింది. కానీ అంతకు మించిన ఆయన సైద్ధాంతిక పునాది గురించి, ప్రాపంచిక దృక్పథం గురించి ఎంతమందికి తెలుసు? అది తెలుసుకోవడం ఇప్పుడు దేశానికి చాలా అవసరం.

నేడు దేశంలో నిజం నిందలు మోస్తున్నది. అబద్ధం అందలమెక్కి ఊరేగుతున్నది. మనుషులు మనుషులుగా కొనసాగే పరిస్థితులు సన్నగిల్లిపోతున్నాయి. మోసం ద్వేషం ప్రజల మెదళ్లలోకి చొప్పించబడుతున్నది. అనేకానేక ఆధిపత్యాల నుంచి, అజ్ఞానపూరిత మూఢనమ్మకాల నుంచి దేశాన్ని కాపాడవలసిన పాలకులు, శాస్త్రీయతను పెంపొందించాల్సిన ప్రభుత్వాలే పౌరులను తిరోగమనంలో ముంచెత్తుతున్న వర్తమానమిది. ప్రశ్నిస్తే పౌరస్వేచ్ఛను, ప్రజాస్వామ్యాన్ని నిర్బంధంలోకి నెట్టేస్తున్న కాలమిది. మతాన్ని రాజ్యంతో విడదీయలేనంతగా కలిపేసి, మత ప్రాతిపదికన రాజకీయ సమీకరణలకు పాల్పడుతున్న రోజులివి. విశ్వాసం విద్వేషంగా మారి మన రాజ్యాంగ స్ఫూర్తికే సవాలు విసురుతోంది. మన ప్రజాస్వామ్యం మునుపెన్నడూ లేనంతగా ప్రమాదంలో పడింది. సమాజంలో సామరస్యం బీటలువారుతున్నది. ప్రజాజీవితంలో భయం రాజ్యమేలుతున్నది. ఒక అభద్రతాభావం వెంటాడుతున్నది. అబద్ధాల పునాదుల మీద మిథ్యా చరిత్రని నిర్మించే మిత- మతవాద రాజకీయాలు సమాజాన్ని తప్పుదారి పట్టిస్తున్నాయి. దీన్ని ప్రశ్నించాల్సిన పౌరసమాజం మౌనంగా వీక్షిస్తున్నది. ఈ మొత్తం సందర్భాన్ని మనం ఎలా చూడాలి? ఎలా ఎదుర్కోవాలి? లౌకిక, ప్రజాస్వా మిక శక్తుల పాత్ర ఎలా వుండాలి? ఈ ప్రశ్నలన్నిటికీ సమాధానమివ్వగలిగిన మేధోసంపత్తిని మనకు వారసత్వంగా అందించి పోయాడు భగత్‌సింగ్. అది పూర్తిగా ఆచరణాత్మకమైనదీ, సైద్ధాంతికమైనది. అందువల్ల భగత్‌సింగ్‌ను అధ్యయనం చేయటం నేటి తరానికి అత్యంత అవసరం.

"మతమౌఢ్యం, మతోన్మాదం మన పురోగతికి పెద్ద అడ్డుగోడలు. అవి దారిలో అనేక ఆటం కాలు సృష్టిస్తాయి. మనం వాటిని పక్కకు నెట్టుకుంటూ ముందు కెళ్లాలి. మతాలన్నింటిలో కనిపించే మూఢవిశ్వాసాలు, ఛాందసవాదం, సంకుచిత ధోరణుల వల్లే మనుషులు దోపిడీకి గురవుతున్నారు" అంటాడు భగత్‌సింగ్. మతం దోపిడీదారుల చేతుల్లోని ఒక సాధనమని ఆయన ఆనాడే గ్రహించాడు. కాబట్టే 1924లో తన పదిహేడేళ్ల వయసులోనే "విశ్వమానవ సౌభ్రాతత్వం" అనే అద్భుతమైన రచన చేశాడాయన. అందులో "ప్రపంచంలోని మానవు లందరూ ఒకటే.. ఎవరూ మరెవరికీ పరాయి కాదు" అంటాడు. "నలుపు-తెలుపు, నాగరికులు-అనాగరికులు, పాలకులు-పాలితులు, ధనిక -పేద, అగ్రవర్ణాలు- అంటరాని వర్గాలు అనేవి ఉనికిలో ఉన్నంత కాలం విశ్వమానవ సౌభ్రాతత్వం ఎలా సాధ్యమవుతుంద"ని ప్రశ్నించాడు. ఇవి సర్వమానవ సౌభ్రాతృత్వానికి అవరోధాలని చెప్పాడు. ఆ వయసులో ఎవరైనా అంతటి ఆలోచనాపరులై ఉంటారని ఊహించగలమా? కానీ ఆయన అలాంటి ఆలోచనలు కలిగి ఉండటమే కాదు, వాటి ఆచరణకు జీవితాన్నే ధారపోశాడు. మనిషి అసలు గుణం ప్రేమ. సహజీవన సౌందర్యం. అంతే కానీ కులమూ మతమూ కాదు అని చెప్పదలచుకొన్నాడు భగత్‌సింగ్. జనజీవితంలో అత్యంత సహజమైనవిగా ఉన్న లౌకిక విలువల పట్ల అచంచలమైన విశ్వాసాన్ని ప్రకటించాడు.

1926లో "నౌజవాన్ భారత సభ" స్థాపన ద్వారా భగత్‌సింగ్ తన ఆలోచనలకు నిర్మాణ రూపమిచ్చాడు. ప్రజలకోసం ప్రజల చేత విప్లవం సాధించడం సభ లక్ష్యంగా ప్రకటించాడు. ఈ లక్ష్యసాధనలో మతం మన పురోగతికి అతిపెద్ద ఆటంకమని సభ ప్రణాళికలో నిర్దిష్టంగా పేర్కొన్నాడు. విభేదాలు పక్కనపెట్టి ఒక ఉమ్మడి అజెండాతో లౌకిక, ప్రజాస్వామిక ప్రాతిపదిక మీద కలసి పనిచేయడం ద్వారానే మనం పురోగమించగలమని చెప్పాడు. మతాన్ని రాజకీయాల నుండి విడదీయ గలిగితేనే మనం ప్రజలను ఐక్యంగా ఉంచగలమని స్పష్టం చేశాడు. భారతదేశ అభ్యున్నతిని కోరేవారెవరైనా దీన్నే అనుసరిస్తారని చెప్పాడు. భారత దేశానిది సమ్మిళిత సహజీవన సంస్కృతి అని నినదించాడు. నిజమే కదా..! 'భారతదేశం నా మాతృభూమి. భారతీయులందరూ నా సహోదరులు. సుసంపన్నమైన బహువిధమైన నా దేశ వారసత్వ సంపద నాకు గర్వకారణం' అని నిత్యం ప్రతిజ్ఞ చేస్తున్నాం మనం. శతాబ్దాలుగా దేశం సంతరించుకున్న ఈ విలువలను కాపాడుకోవడం, సమున్నతంగా నిలబెట్టు కోవడం ఇప్పుడు కాలం మన ముందు నిలిపిన అతిపెద్ద సవాలు. ఈ సవాలును ఎదుర్కోవడానికి మనకిపుడు భగత్‌సింగ్ కావాలి. ఆయన భావజాలం కావాలి.



> **మనువాదం మనిషిని తిరిగి మధ్యయుగాలకు మళ్లించజూస్తోంది. దారిలో ముండ్లు కనబడితే ఎత్తిపారేసే మనిషి, రాళ్లూ రప్పలూ ఎదురైతే తొలగించి నడిచే మనిషి ఇప్పుడు అచేతన జీవిలా మారిపోతున్నాడు. మనిషి మనిషిగా జీవించడానికి కావాల్సిన సహజమైన ఆవరణమే లేకుండాపోతోంది. ఈ ఆవరణాన్ని కమ్ముకుంటున్న చీకటిని ఛేదించే టార్చ్‌బేరర్ భగత్‌సింగ్. అందుకే మనకు భగత్‌సింగ్ కావాలిప్పుడు. ఈ స్థితిని అర్థం చేసుకోవడానికీ అధిగమించడానికీ కావాల్సినంత అవగాహననూ చేతననూ మనకందించి పోయాడు భగత్‌సింగ్. వాటిని అందిపుచ్చుకోవాలి. విద్వేషం వీధివీధినా పారుతున్న వేళ.. ప్రేమను గడపగడపకూ పంచిపెట్టాలి. రక్తసిక్తమైన హృదయాలకు లేపనాలు పూయాలి.. మతమౌఢ్యం మనకు వారసత్వంగా సంక్రమిస్తున్న ఓ పెద్ద అబద్ధమని కుండబద్ధలు కొట్టాలి. నీతికి మూలం మనిషి కావాలి తప్ప, మతం కాకూడదని నినదించాలి.**

భగత్‌సింగ్‌ను అర్థం చేసుకోవాలంటే ఆయన రచనలు చదవాలి. ముఖ్యంగా జైలు నోట్‌బుక్ మనకు ప్రధాన వనరు. ఆయన సాధించిన సైద్ధాంతిక పరిణితిని తెలుసుకోవడానికి అది చాలా ఉపయోగపడుతుంది. మిగతా రాజకీయ ఖైదీల్లా ఆయన జైలులో ఉండి ఆత్మకథలు రాసుకోలేదు. ఈ ప్రపంచాన్ని అధ్యయనం చేశాడు. గాయాలపాలైన ఈ నేల విముక్తికి మార్గాలను అన్వేషిం చాడు. మహామహులనేకమంది రచనలను, రాజకీయ సిద్ధాంతాలను లోతుగా పరిశీలించాడు. ఆ తరువాత మార్క్సిజం వెలుగులో భారతదేశ భవిష్యత్తును దర్శించాడు. నిస్తేజంగా పడివున్న ఈ నేలకు జవసత్వాలు కూడగట్టేందుకు అవసరమైన భావజాలాన్ని అభివృద్ధి చేశాడు. "దోపిడీ పీడనలు, అసమానతలు లేని సమాజ స్థాపన కోసం మన ప్రజలను సిద్ధం చేయాలి. ఈ విప్లవ బీజాలను నాటడానికి ఇప్పుడున్న పంటలన్నిటినీ ధ్వంసం చేయాలి. ముండ్లపొదలను పీకి తగల బెట్టాలి. బండరాళ్లను కంకరగా పగలగొట్టాలి. కిందపడిన వారిని పైకి లేవనెత్తాలి. అరాచకులకు మర్యాద నేర్పాలి. శ్రామిక ప్రజలను ఒక్కటి చేయాలి. ఇందుకు అడ్డుగా ఉన్న కులమతాల గోడల్ని కూలగొట్టాలి" అని నిర్దేశించాడు. ఈ లక్ష్య సాధనకు ఏంచేయాలో కూడా వివరించాడు. "ప్రజలు తమలో తాము పోట్లాడుకోకుండా వారిలో వర్గ ధృక్పథాన్ని కల్పించాలి. కార్మికులకు, రైతులకు వారి మొదటి శత్రువు పెట్టుబడిదారుడని చెప్పాలి. వారు సృష్టించే కులమతాల ఉచ్చుల్లో పడవద్దని వివరించాలి. మనుషులు ఏ కులం వారైనా, ఏ మతం వారైనా, ఏ జాతి వారైనా ఒకే విధమైన హక్కులు కలిగి ఉంటారని తెలియజేయాలి. ఆ హక్కులు వారి ఐక్యతలో ఉన్నాయని, వారి సంక్షేమం అధికారాన్ని తమ చేతుల్లోకి లాక్కోవడంలో ఉందని అర్థం చేయించాలి" అన్నాడు.

పెట్టుబడిదారీ ప్రభుత్వాలేవి ప్రజలను చైతన్యవంతులను చేసే కృషిని సమ్మతించవు. పైగా నిర్దయగా అణచివేస్తాయి. కనుక ఈ స్థితిని రూపుమాపాలంటే విప్లవం ద్వారా మనం అధికారాన్ని చేతుల్లోకి లాక్కోవాలంటాడు భగత్‌సింగ్. విప్లవమంటే రక్తపాతంతో కూడిన ఘర్షణలుకావు. అది బాంబులు, తుపాకుల పూజ కాదు. కొన్ని సందర్భాల్లో అవి కూడా లక్ష్యాన్ని సాధించే సాధనాలు కావొచ్చు. అంతే తప్ప అదే విప్లవమని చెప్పలేం. విప్లవమంటే నిజమైన అర్థం మెరుగైన మార్పు కోసం జరిగే పోరాటం. పాత నుండి కొత్తకు ప్రయాణించడం. మానవ చైతన్యం తిరోగమన శక్తుల్ని తొక్కుకుంటూ పురోగమించడం అంటూ విప్లవానికి నిర్వచనం చెప్పాడు భగత్‌సింగ్. "ఇప్పుడు ఈ తిరోగమన శక్తుల మూలంగా దేశం దయనీయ స్థితిని ఎదుర్కొంటోంది. ఒక మతస్తుడికి మరో మతస్తుడు శత్రువు అన్నట్టుగా ఉంది పరిస్థితి. ఎదుటి వ్యక్తి ముస్లిం అయితే చాలు.. అతడిని చంపడానికి హిందువులకు వేరే కారణం అక్కర్లేదు. ఎదుటివాడు హిందువైతే చాలు.. అతడిని చంపటానికి ముస్లింలకూ కారణమవసరం లేదు. అలాగే సిక్కులు కూడా. ఈ స్థితి మనుషులను ముక్కలు చేయడం తప్ప ఒక్కటిగా ముందుకు నడిపించగలదా? దీన్ని అడ్డుకోవడం, అధిగమించడం విప్లవకారుల కర్తవ్యం" అంటాడు భగత్‌సింగ్. నాడు లాహోర్‌లో చెలరేగిన మతకల్లోల నేపథ్యంలో ఆయన రాసిన "మతకల్లోలాలు - వాటి పరిష్కారాలు" అనే వ్యాసంలో ఈ విషయాలన్ని సమగ్రంగా వివరించాడు.

సరిగ్గా వందేళ్ల తర్వాత అవే పరిస్థితులు ఇప్పుడు దేశంలో కొనసాగుతున్నాయి. పైగా మతతత్వం అధికారంలోకి వచ్చి కూర్చుంది. దేశమంతటా విభజన, విద్వేష రాజకీయాలు మనుషుల్ని చీలికలు పేలికలు చేస్తున్నాయి. శాంతినీ సామరస్యాన్నీ ధ్వంసం చేస్తున్నాయి. మనువాదం మనిషిని తిరిగి మధ్యయుగాలకు మళ్లించజూస్తోంది. దారిలో ముండ్లు కనబడితే ఎత్తిపారేసే మనిషి, రాళ్లూ రప్పలూ ఎదురైతే తొలగించి నడిచే మనిషి ఇప్పుడు అచేతన జీవిలా మారిపోతున్నాడు. మనిషి మనిషిగా జీవించడానికి కావాల్సిన సహజమైన ఆవరణమే లేకుండాపోతోంది. ఈ ఆవరణాన్ని కమ్ముకుంటున్న చీకటిని ఛేదించే టార్చ్‌బేరర్ భగత్‌సింగ్. అందుకే మనకు భగత్‌సింగ్ కావాలిప్పుడు. ఈ స్థితిని అర్థం చేసుకోవడానికీ అధిగమించడానికీ కావాల్సినంత అవగాహననూ చేతననూ మనకందించి పోయాడు భగత్‌సింగ్. వాటిని అందిపుచ్చుకోవాలి. విద్వేషం వీధివీధినా పారుతున్న వేళ.. ప్రేమను గడపగడపకూ పంచిపెట్టాలి. రక్తసిక్తమైన హృదయాలకు లేపనాలు పూయాలి.. మతమౌఢ్యం మనకు వారసత్వంగా సంక్రమిస్తున్న ఓ పెద్ద అబద్ధమని కుండబద్ధలు కొట్టాలి. నీతికి మూలం మనిషే కావాలి తప్ప, మతం కాకూడదని నినదించాలి. భగత్‌సింగ్ ఇందుకు అవసరమైన చూపునిస్తాడు, పోరాడే బలమిస్తాడు. విధ్వంసమైన బతుకుల్ని విప్లవ కార్యాచరణకు నడిపించడమెలాగో వివరిస్తాడు. నిత్యం కాలం నుదిటిపై నిగనిగలాడే ఎర్రని సింధూరమతడు.

(మార్చి 23 భగత్‌సింగ్ 94వ వర్ధంతి)

విద్యారంగానికి ప్రాధాన్యతనివ్వని రాష్ట్ర బడ్జెట్



కె.వేణుగోపాల్
9866514577

ప్రభుత్వ బడులకు వసతుల కల్పనలో జాతీయస్థాయిలో 36 రాష్ట్రాల్లో తెలంగాణది 32వ స్థానమని, నాణ్యమైన విద్య, సమర్థంగా బడుల నిర్వహణలో 27వ స్థానంలో ఉందని తెలంగాణ విద్యా కమిషన్ తెలిపింది. కానీ, ఆ స్థితిని మెరుగు పరిచే విధంగా రాష్ట్ర ప్రభుత్వం ఈ రోజు ప్రవేశపెట్టిన రెండో బడ్జెట్‌లో విద్యకు తగిన ప్రాధాన్యతనివ్వలేదు. గతేడాది విద్యారంగానికి రూ.21,292 కోట్లు కేటాయించగా ఈ సారి 23,108 కోట్ల రూపాయలు (7.57 శాతం నిధులు) కేటాయించారు. అంటే గతేడాది కన్నా ఈసారి పెరిగిన నిధులు కేవలం 0.26 శాతం మాత్రమే. ఈ నిధులు ప్రభుత్వ విద్యాసంస్థల అభివృద్ధికి ఏ మూలకు సరిపోవు. గత సంవత్సరం కన్నా బడ్జెట్ పరిమాణం రూ.1816 కోట్లు మాత్రమే పెరిగినట్లు కనిపించినా , ఈ మొత్తం పెరిగిన ధరలు, ద్రవ్యోల్బణానికే సరిపోతుంది. ఉప ముఖ్యమంత్రి తన ప్రసంగంలో ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్స్ గురించి గొప్పగా చెప్పారు. 2023-24 ప్రభుత్వ విద్యా గణాంకాలను అనుసరించి తెలంగాణా రాష్ట్రంలో ప్రాథమిక పాఠశాలలు 19,734, మాధ్యమిక 3,237,ఉన్నత 4,843, రెసిడెన్షియల్ 1,023, ప్రభుత్వ ఎయిడెడ్ పాఠశాలలు మరో662 వెరసి తెలంగాణా రాష్ట్రంలో 30,684 పాఠశాలల గురించి ప్రస్తావన లేదు. ఈ బడ్జెట్‌ను పరిశీలించినప్పుడు కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ప్రణాళికలో వాగ్దానం చేసిన విధంగా విద్యరంగానికి పదిహేను శాతం నిధులకు ఈ రెండో బడ్జెట్ కూడా ఆమడ దూరంలోనే ఉంది.

రాష్ట్రంలో 1023 ప్రభుత్వ గురుకుల పాఠశాలలు ఉండగా వీటిలో 662 పాఠశాలలకు సొంత భవనాలు లేవు. అనేక గురుకులాలు అరకొర సౌకర్యాలున్న భవనాల్లో, వందలాదిమంది విద్యార్థులతో, సరైన టాయిలెట్ సదుపాయం లేకుండా నడుస్తున్నాయి. సామాజిక తరగతుల వారీగా ప్రత్యేక రెసిడెన్షియల్ స్కూల్స్ ఉన్నప్పటికీ వాటి మధ్య విద్యా ప్రమాణాల విషయంలో, మౌలిక వసతుల విషయంలో సారూ ప్యత లేదు. ప్రపంచవ్యాప్తంగా విద్యావ్యవస్థలో పెనుమార్పులు చోటు చేసుకున్నప్పటికీ, మన ప్రభుత్వ పాఠశాలలు దశాబ్దాల కాలం వెనుకబడి ఉన్నాయంటూ ఉప ముఖ్యమంత్రి మరియు ఆర్థిక మంత్రి తన ప్రసంగంలో వాపోయారు. కాని ఈ పరిస్థితుల్ని బాగు చేయడానికి, భవనాలు నిర్మాణం, వసతుల కల్పనకు నిర్దిష్టచర్యలు ప్రకటించలేదు. అయితే ఇందుకు పరిష్కారాన్ని నియోజకవర్గానికో ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్స్ స్థాపనలో చూపిస్తారు. ఈ ప్రభుత్వం కూడా గత ప్రభుత్వ మార్గంలోనే ప్రభుత్వ , జిల్లా పరిషత్ పాఠశాలలను, రెసిడెన్షియల్ స్కూల్స్‌ను అభివృద్ధి చేయకుండా కొత్త పాఠశాలల ప్రతిపాదనను ముందుకు తెచ్చింది. అంటే ప్రభుత్వం ఇరవై లక్షల మంది విద్యార్థులు చదివే ప్రభుత్వ, జిల్లా పరిషత్ పాఠశాలలు కునారిల్లడానికి సర్కారే మార్గాలు తెరిచింది.

ప్రభుత్వ పాఠశాలలలో నాణ్యమైన విద్య మిథ్యగానే ఉందని తెలంగాణ విద్యా కమిషన్ చెప్పింది. విద్యారంగానికి బడ్జెట్లో 15శాతం నిధులను కేటాయిస్తామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇటీవల హామీనిచ్చారు. కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా విడుదల చేసిన "అభయహస్తం" ఎన్నికల ప్రణాళికలో ప్రస్తుత ఉన్న ఆరు శాతం నుంచి 15శాతం నిధులను విద్యారంగానికి కేటాయిస్తామని తెలిపారు.డా.



బీఆర్.అంబేద్కర్ కలలుగన్న విద్యావ్యవస్థను సృష్టించినబోతున్నామని గొప్పలు చెబుతూ యంగ్ ఇండియా రెసిడెన్షియల్ స్కూల్స్ లో విద్యారంగ సంక్షోభానికి పరిష్కారం చూపుతున్నారు. 29 వేల ప్రభుత్వ, జిల్లా పరిషత్ పాఠశాలలు, 1023 గురుకుల పాఠశాలల అభివృద్ధి ఊసు లేకుండా బడ్జెట్ ప్రసంగం సాగింది. అంటే పాత ప్రభుత్వం గురుకులాల్లో విద్యాసంక్షోభ పరిష్కారం చూపితే, ఈ ప్రభుత్వం ఇంటర్నేషనల్ రెసిడెన్షియల్ స్కూల్స్‌తో "అరచేతిలో వైకుంఠం" చూపుతున్నదన్న మాట! 20 లక్షల మంది విద్యార్థులు చదివే ప్రభుత్వ జిల్లా పరిషత్ పాఠశాలలు, ఆరు లక్షల మంది చదివే గురుకులాలు ఈ ప్రభుత్వానికి అప్రస్తుత మయ్యాయి. కేవలం ఇంటిగ్రేటెడ్ పాఠశాలల ద్వారా సమాన విద్యా అవకాశాలు కల్పిస్తామని, ఇది సామాజిక ఐక్యతకు పునాది అవుతుందని ఎంత గొప్పగా చెప్పినా, విద్యారంగానికి కేటాయింపులు ఆ స్థాయిలో లేవు. ముఖ్యమంత్రి అంగన్వాడీ పాఠశాలల్లో పూర్వ ప్రాథమిక విద్యను ప్రారంభిస్తామని ప్రకటించి నప్పటికీ అందుకు సంబంధించిన నిర్దిష్ట ప్రతిపాదనలేవి బడ్జెట్ ప్రసంగంలో లేవు.

మహిళా విశ్వవిద్యాలయానికి ఐలమ్మ పేరు, తెలుగు విశ్వ విద్యాలయానికి సురవరం ప్రతాప రెడ్డి పేరు పెట్టగానే మొత్తం విశ్వవిద్యాలయ విద్య బాగుపడ్డ ట్టేనా? విశ్వవిద్యాలయాల అభివృ ద్ధికి, కొత్త విశ్వవిద్యాలయాల స్థాపనకు ఇతోదికంగా నిధులు కేటాయించాలి. జిల్లాకో విశ్వ విద్యాలయాన్ని విజ్ఞాన కేంద్రాలుగా, పరిశోధన హబ్‌గా తీర్చిదిద్దాల్సి ఉంది.విశ్వవిద్యాలయాల్లోని 2060 అధ్యాపకుల ఖాళీలను భర్తీ చేయాలి. మౌలిక వస్తువుల కల్పనకు యుద్ధ ప్రాతిపదికన చర్యలు తీసుకోవాలి. ఈ ఊసే లేకుండా బడ్జెట్ ప్రతిపాదనలుండటం బాధాకరం. యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ విశ్వవిద్యాలయాలకు ఇచ్చే గ్రాంట్లలో 61శాతం బడ్జెట్‌ను తగ్గించింది. వీటిని దృష్టిలో పెట్టుకుని విశ్వవిద్యాలయాలకు మరిన్ని నిధులను కేటాయించాల్సి ఉండగా ఆ ఊసే ఎత్తకుండా బడ్జెట్ ప్రతిపాదనలు చేశారు.


యంగ్ ఇండియా పత్రిక స్ఫూర్తితో యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీని ప్రయివేటు భాగస్వామ్యంతో ప్రయివేటు పారిశ్రామికవేత్త వైస్ ఛాన్సలర్‌గా ప్రారంభించారు. ఐదు కోర్సులతో ప్రారంభమైన ఈ యూనివర్సిటీలో మరికొన్ని టెక్నాలజీ కోర్సులను కూడా ప్రవేశపెడతారు. ఇవన్నీ కూడా ప్రయివేటు యాజమాన్యాల భాగస్వామ్యంతో జరుగుతున్నాయి. అంటే ప్రభుత్వ విశ్వవిద్యాలయాల్లో ప్రయివేటు వారి ఆధిపత్యం కొనసాగనున్నది. అయితే ఈ యూనివర్సిటీని గొప్పగా చెప్పుకునే ప్రభుత్వం పదకొండు సంప్రదాయ విశ్వవిద్యాలయాలు, సాంకేతిక విశ్వ విద్యాలయం, వైద్య విశ్వవిద్యాలయం వీటన్నిటి అభివృద్ధికి నిర్దిష్ట చర్యలు, ప్రతిపాదనలేవీ లేకపోవడంతో విశ్వవిద్యాలయ విద్య మొత్తంగా ప్రయివేటీకరణ అయ్యే ప్రమాదం ఉంది. విద్యాశాఖకు కేటాయించిన రూ.23,108కోట్లలో, 11,600కోట్లు ఇంటర్నేషనల్ రెసిడెన్షియల్ స్కూల్స్ కోసం, రూ.550 కోట్లు ఐలమ్మ విశ్వవిద్యాలయానికి పోగా మిగిలిన 10,858 కోట్లతో 26 వేల ప్రాథమిక, ఉన్నత పాఠశాలలు, విశ్వ విద్యాలయాలు ఎప్పటికీ అభివృద్ధి చెందేను? కొత్త ఉపాధ్యాయులు, అధ్యాపకుల నియామకాలు ఈ అరకొర నిధులతో జరిగే అవకాశం ఉంటుందా? కొత్త భవనాల నిర్మాణం సాధ్యమయ్యేనా? రాష్ట్రంలోని అన్ని పాఠశాలలను కేంద్రీయ విద్యాలయాల నమునాలో మౌలిక సదు పాయాల కల్పన, ఉపాధ్యాయులు, ఇతర సిబ్బంది నియామకాలు చేపట్టడం అవసరం.

రాష్ట్ర బడ్జెట్‌లో ముప్పై శాతం నిధులను కేటాయించాలని కొఠారి కమిషన్ సిఫారసులు చెప్పుతున్నాయి. కనీసం ఇరవై శాతం నిధు లను కేటాయించి ఖర్చు చేయాలని విద్యావేత్తలు, ఉపాధ్యాయ సంఘాల నేతలు రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరుతున్నారు. విద్యా కమిషన్ కూడా ఇరవై శాతం నిధులను కేటాయించాలని ఉప ముఖ్యమంత్రి, ఆర్థిక మంత్రి భట్టి విక్రమార్కను కలిసి విజ్ఞప్తి చేసింది. కాంగ్రెస్ ఇచ్చిన హామీ ప్రకారమైనా విద్యకు పదిహేను శాతం నిధులను కేటాయిస్తుందేమోనని తల్లిదండ్రులు కూడా ఆశగా ఎదురుచూశారు. కానీ అందరి నమ్మకాన్ని ఈ బడ్జెట్ కేటాయింపులు వమ్ముచేసింది. ఈవార్షిక సంవత్సర మొత్తం బడ్జెట్ రూ.3,04,965 కోట్లు. అందులో విద్యకు కేటాయించింది 23,108 కోట్లు. కాంగ్రెస్ మేనిఫెస్టోలో ఇచ్చిన హామీ 15శాతం ప్రకారం చూసినా రూ.45,700 కోట్లు కేటాయించాలి. కానీ ఆ విధంగా చేయలేదు. విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని సర్కార్ పునరాలోచించి అధిక నిధులు కేటాయించాలి. అప్పుడే ఈ సంక్షోభ స్థితి నుంచి విద్యారంగాన్ని బయట పడేయగలము. ■

యుద్ధవీరుడు ఠానునాయక్

చరిత్ర లిఖించిన పోరాట ఘట్టం ఏదైనా ఉందంటే, అది తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటం. ఆ మహత్తర పోరాటంలో అమరులైన వారెందరో. చరిత్ర లోతుల్లోకి వెళ్లి ఒక్కసారి ఆ ఉద్యమ పథాన్ని పరిశీలిస్తే అందులో నుంచి ఓ యుద్ధ వీరుడిలా ఉద్భవించే వ్యక్తి కామ్రేడ్ ఠానునాయక్. బ్రిటీష్ వలస పాలనకు వ్యతిరేకంగా గిరిజనులను ఏకం చేసిన ధైర్యశాలి. వారికి సాయుధ శిక్షణ ఇప్పించి మరీ పోరాటాన్ని నడిపిన నాయకుడు. నేడు ఆయన 75వ వర్ధంతి.

బ్రిటీష్ పాలనలో రైతులు, ప్రజల పరిస్థితులు ఎలా ఉండేవో ప్రత్యేకంగా చెప్పాల్సిన పనిలేదు. కానీ, ఈ పోరాటం జరిగిన నేపథ్యం తెలుసుకోవాల్సిందే. బంజారా, లంబాడీ, గిరిజనులకుజీవనాధారమైన భూములను కోల్పోతూ, బ్రిటిష్ అధికారుల అన్యాయమైన విధానాలకు బలైపోతుంటే సహించని ఠానునాయక్ వారి హక్కుల కోసం ఆత్మగౌరవ పోరాటాన్ని మొదలుపెట్టాడు. "భూమి రైతుదే" అన్న సిద్ధాంతాన్ని ముందుకు తీసుకొచ్చి పోరాటం సాగించాడు. బంజారా పోరాటంగా ప్రారంభమైనా, తర్వాతకాలంలో అణగారిన వర్గాల ప్రజల విప్లవంగా మారింది.



1944 నుంచి 1951 వరకు జరిగిన ఈ పోరాటంలో ఠానునాయక్ తెలంగాణ ప్రాంతంలోనే ఉద్యమజ్వాలగా ఉవ్వెత్తున ఎగిసాడు. జనగాం తాలూకాలో విసునూరు రామ చంద్రారెడ్డి, వుసుకూరు రాఘవరావు, కటారి నరసింహారావు, బాబూ దొర అనే భూస్వాములు నైజాం సర్కార్ అండతో ఆ ప్రాంత ప్రజల్ని నిత్యం పీడించేవారు.వీరు రజాకార్ల అండతో ప్రజల భూములను ఆక్రమించడం, నిర్దాక్షిణ్యంగా పన్నులు వసూలు చేయడం, ఎదురు తిరిగిన వారిని చంపడం, చిత్రహింసలు పెట్టడం, మహిళలపై లైంగికదాడులకు పాల్పడటం చేసేవారు. ఈ దౌర్జన్యాలను ఎదిరించేందుకు ఠానునాయక్ ఉద్యమించాడు.

దేవరుప్పల మండలం ధర్మాపురం గిరిజనులకు చెందిన 80 ఎకరాల మెట్ట, 25 ఎకరాల మాగాణి భూములను ఆక్రమించేందుకు విసునూరు రాఘవరావు అనే దొర గుండాలను పంపాడు. ఇది తెలుసుకున్న తండా పెద్దలైన లంబాడీ జాటోత్ హాము, జాటోత్ రామోజీ కుటుంబాల కొడుకులు వడిసెలు, గుదపలతో వారితో తలపడ్డారు. లంబాడీల పోరాట పటిమ ముందు నిలబడలేక పారిపోయారు. తండాలో లంబాడీలు సాగుచేసుకుంటున్న 30 ఎకరాల మాగాణి, 40 ఎకరాల బంజరు భూమిని కటారి నరసింహారావు వారి భూములను తన పేర రాయించుకున్నాడు. కోపోద్రిక్తులైన లంబాడీ గిరిజనులు చుట్టుపక్కల గ్రామాలు, తండాల ప్రజలను ఏకంచేసి దొరలతో తలపడటానికి సిద్ధమయ్యారు. జాటోత్ హాము కొడుకులైన ఠానూనాయక్, జోద్యా నాయక్, సోమ్లా నాయక్, సంకు నాయక్, ధర్యానాయక్, కిషన్ నాయక్‌లు ఈ పోరాటానికి నేతృత్వం వహించారు.(వీరిలో దర్యానాయక్ ఇటీవలే చనిపోయాడు) జనగామలో జరిగిన పదకొండవ ఆంధ్ర మహాసభలో వీరంతా కమ్యూనిస్టు పార్టీ సభ్యత్వం తీసుకున్నారు. తర్వాత కమ్యూనిస్టుల బాటలోనే ఉద్యమిస్తూ భూస్వాములు, రజకార్లను ఎదిరించారు.

కమ్యూనిస్టుల పోరాటంతో గ్రామాలు వదిలి పారిపోయిన దేశముఖ్‌లు, జమీందార్లు, దొరలు,రజాకార్లు భారత సైన్యాలు తెలంగాణాలో ప్రవేశించిన తర్వాత తిరిగొచ్చారు. సైన్యం అండతో గ్రామాలపై పడి వందల మంది దళనాయకులను కాల్చి చంపారు. 1949 ఫిబ్రవరి 26న ఠానూనాయక్ తమ్ముడు సంకును పట్టుకున్నారు. చిత్రహింసలు చేసి మరణదండన విధించారు. సంకును అరెస్టు చేసిన పదిరోజులకు 18 ఏండ్ల వయస్సు గల చివరి తమ్ముడు కిషన్ నాయక్‌ను పట్టుకుని జైల్లో పెట్టారు.ఠానూ నాయక్ ఆచూకీ కోసం సైన్యం అండతో దొరలు, వారి గూండాలు వెతుకుతున్నారు. ఠానూనాయక్ అత్యంత ధైర్యశాలి. పోరాటాల్లో నిప్పుకణికలాగా కదిలేవాడు. ప్రజలంటే అమితమైన ప్రేమ, అనతికాలంలోనే ప్రజలు, కమ్యూనిస్టు పార్టీ నాయకుల మన్ననలు పొందాడు. కామ్రేడ్ ఠానును సజీవంగా పట్టుకునేందుకు ఎంత ప్రయత్నించినా ఏడాదిపాటు సైన్యానికి, శత్రువులకు దొరకలేదు. చివరకు ఒక ద్రోహి ఇచ్చిన సమాచారం వల్ల 1950 మార్చి 20న ముంద్రాయి గ్రామంలో సైన్యం, దొరల చేతికి చిక్కారు. అతన్ని ఎంత హింసించినా పార్టీ రహస్యం ఒక్కటికూడా బయటపెట్టలేదు. అతని మొండితనం, తెగువను చూసి సైన్యాధికారులే ఆశ్చర్యపోయారు. వారు ఠానునాయక్‌ను చంపడానికి నిరాకరించారు. అక్కడే కాచుకుని కూర్చున్న రామవరం దేశ్‌ముఖ్ కటారు నర్సింగరావు ఠానూనాయక్‌ను బండి చక్రానికి కట్టించి శరీరం ముక్కలయ్యేవరకు చిత్ర హింసలు పెట్టి చంపాడు. ఠాను నాయక్ వీరమరణం పొందారు. చనిపోయే చివరి నిమిషంలో కూడా ఆయన పెద వులపై "కమ్యూనిస్టు పార్టీ వర్ధిల్లాలి" అన్న నినా దమే మారుమోగింది. తెలంగాణ ధీరత్వానికి నిలువెత్తు రూపమైన కామ్రేడ్ ఠానునాయక్‌కు విప్లవ జోహార్లు.

- ఆర్.శ్రీరామ్ నాయక్, 9440532410

విద్యారంగ ప్రగతి ప్రశ్నార్థకం...

15 శాతం నిధులు కేటాయిస్తామంటూ కాంగ్రెస్ హామీ

ఇంటిగ్రేటెడ్ గురుకులాలకు రూ.11,600 కోట్లు

ప్రభుత్వ విద్యను విస్మరించిన ప్రభుత్వం

7.57 శాతం నిధుల కేటాయింపు | గతం కంటే 0.26 శాతం పెంపు



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

విద్యారంగానికి బడ్జెట్‌లో 15 శాతం నిధులను కేటాయిస్తామని కాంగ్రెస్ మ్యానిఫెస్టోలో హామీ ఇచ్చింది. కానీ ఆచరణలో అందుకు విరుద్ధంగా కేటాయింపులు చేయడం గమనార్హం. రాష్ట్ర ప్రభుత్వం 2025-26 బడ్జెట్‌ను రూ.3,04,965 కోట్లతో ప్రవేశపెట్టింది. విద్యారంగానికి రూ.23,108 కోట్లు కేటాయించింది. అంటే 7.57 శాతం నిధులను ప్రతిపాదించింది. 2024-25లో బడ్జెట్‌లో విద్యారంగానికి రూ.21,292 (7.31 శాతం) కోట్లు కేటాయించింది. అంటే గత బడ్జెట్ కంటే ఇప్పుడు రూ.1,816 (0.26 శాతం) నిధులను అధికంగా ప్రతిపాదించడం గమనార్హం. కొఠారి కమిషన్ సిఫారసుల కేంద్ర బడ్జెట్‌లో పది శాతం, రాష్ట్ర బడ్జెట్‌లో 30 శాతం నిధులను కేటాయించాలి. ఈ సిఫారసులను అటు కేంద్ర ప్రభుత్వం, ఇటు రాష్ట్ర ప్రభుత్వం పట్టించుకోవడం లేదు. 2024-25 బడ్జెట్‌లో విద్యకు కేంద్రం 2.61 శాతం, రాష్ట్ర ప్రభుత్వం 7.31 శాతం కేటాయించాయి. 2025-26 కేంద్ర బడ్జెట్‌లో విద్యారంగానికి రూ.1,28,650 (2.54 శాతం) కోట్లు కేటాయించడం గమనార్హం. ఇంకోవైపు విద్యకు కేటాయించిన నిధుల్లో అధిక భాగం ఉపాధ్యాయులు, అధ్యాపకుల జీతభత్యాలు, పెన్షనర్లకు పెన్షన్‌కే సరిపోతున్నాయి. అరకొర నిధులతో ప్రభుత్వ విద్యారంగం ఎలా బలోపేతం అవుతుందన్నది ప్రశ్నార్థకంగా మారింది. తక్కువ నిధులతో విద్యాప్రగతి ఎలా సాధ్యమవుతుందనీ, విద్యా ప్రమాణాలు ఎలా మెరుగవుతాయన్నది పాలకులు ఆలోచించడం లేదు. నిధుల లేమితో ప్రభుత్వ విద్యాసంస్థల్లో సమస్యలతో సతమతమవుతున్నాయి. మౌలిక వసతుల కొరత తీవ్రంగా ఉన్నది.

బీఆర్ఎస్ దారిలోనే కాంగ్రెస్

బీఆర్ఎస్ దారిలోనే కాంగ్రెస్ ప్రభుత్వ వెళ్తున్నది. గత ప్రభుత్వం అనుసరించిన విధానాలనే ఈ ప్రభుత్వం అమలు చేస్తున్నది. పార్టీలు మారినా, పాలకులు మారినా విధానాలు మాత్రం అవే అమలవుతున్నాయి. బీఆర్ఎస్ అధికారంలో ఉన్నపుడు గురుకులాలకు ప్రాధాన్యత ఇచ్చింది. కేజీ టు పీజీ ఉచిత విద్యను అమలు చేస్తామంటూ హామీ ఇచ్చి గురుకులాలను ప్రారంభించింది. రాష్ట్రంలో 1023 గురుకుకులాలుంటే 662 అద్దె భవనాల్లో కొనసాగుతున్నాయి. అనేక గురుకులాలు అరకొర సౌకర్యాలున్న భవనాల్లో ఉన్నాయి. వందలాది మంది విద్యార్థులకు సరైన టాయిలెట్ సదుపాయం లేకుండా నడుస్తున్నాయి. ఈ పరిస్థితిని సరిదిద్దడానికి కాంగ్రెస్ ప్రభుత్వం యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ గురుకులాలను ప్రారంభించాలని నిర్ణయించింది. 58 ఇంటిగ్రేటెడ్ గురుకులాల నిర్మాణానికి రూ.11,600 కోట్లు ఈ బడ్జెట్‌లో కేటాయించింది. ప్రతి నియోజకవర్గంలో ఒక యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ గురుకుల పాఠశాలను ప్రారంభిస్తామని ప్రకటించింది. అవి 20 నుంచి 25 ఎకరాల విస్తీర్ణంలో ఉంటాయని తెలిపింది. ఐఐటీ, జేఈఈ, నీట్, ఇతర పోటీ పరీక్షలకు సన్నద్ధం చేయడానికి ప్రత్యేక శిక్షణ ఇస్తామని వివరించింది. కానీ ప్రభుత్వ పాఠశాలలు, కాలేజీలు, విశ్వవిద్యాలయాల అభివృద్ధి కోసం అవసరమైన నిధులను మాత్రం కేటాయించకపోవడం గమనార్హం. 2025-26 బడ్జెట్ రూ.3.04 లక్షల కోట్లలో కాంగ్రెస్ ఇచ్చిన హామీ ప్రకారం పది శాతం చొప్పున రూ.30,496 కోట్లు, 15 శాతం చొప్పున రూ.45,744 కోట్లు, 20 శాతం చొప్పున 60,993 కోట్లు కేటాయించాలి. ఇచ్చిన హామీ ప్రకారం కాంగ్రెస్ ప్రభుత్వం నిధులను కేటాయించలేదు. దీంతో విద్యారంగాన్ని విస్మరించిందన్న విమర్శలు వస్తున్నాయి.

మహిళా వర్సిటీకి రూ.550 కోట్లు

కోఠి మహిళా విశ్వవిద్యాలయానికి వీరనారి చాకలి ఐలమ్మ పేరును ప్రభుత్వం పెట్టింది. ఆ విశ్వవిద్యాలయ వారసత్వ కట్టడాన్ని సంరక్షిస్తూనే రూ.550 కోట్లతో అదనపు భవన నిర్మాణాలను చేపడుతున్నట్లు ప్రకటించింది. తెలుగు విశ్వవిద్యాలయానికి తెలంగాణ వైతాళికుడు సురవరం ప్రతాప్‌రెడ్డి పేరును, ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హ్యాండ్లూమ్ టెక్నాలజీ (ఐఐహెచ్‌టీ)కి కొండా లక్ష్మణ్ బాపూజీ పేరును పెట్టింది. రాష్ట్ర విద్యారంగంలో పలు సంస్కరణలను చేపట్టామని ప్రభుత్వం ప్రకటించింది. అంతర్జాతీయ ప్రమాణాలతో కూడిన విద్యను అందించే లక్ష్యంతో సమగ్ర విధాన రూపకల్పన కోసం విద్యా కమిషన్‌ను ఏర్పాటు చేశామని తెలిపింది.

2025-26 బడ్జెట్‌లో విద్యకు కేటాయింపులు (రూ.కోట్లలో...)

విభాగం	కేటాయింపు నిర్వహణ పద్దు	ప్రగతి పద్దు	మొత్తం
పాఠశాల విద్య	రూ.16,297.62	రూ.3,043.61	రూ.19,341.23
ఉన్నత విద్య	రూ.2,490.58	రూ.570.59	రూ.3,061.17
సాంకేతిక విద్య	రూ.518.18	రూ.64.11	రూ.582.29
మొత్తం	రూ.19,306.38	రూ.3,678.31	రూ.22,984.69

విద్యారంగానికి ఏటా బడ్జెట్ కేటాయింపులు (కోట్లలో...)

ఆర్థిక సంవత్సరం	మొత్తం బడ్జెట్	విద్యకు కేటాయింపు	శాతం
2025-26	రూ.3,04,965	రూ.23,108	7.57
2024-25	రూ.2,91,159	రూ.21,292	7.31
2023-24	రూ.2,90,296	రూ.19,051	6.56
2022-23	రూ.2,56,958	రూ.16,043	6.24
2021-22	రూ.2,30,825	రూ.13,564	5.88
2020-21	రూ.1,82,914	రూ.12,127	6.63
2019-20	రూ.1,46,492	రూ.9,899	6.76
2018-19	రూ.1,74,453	రూ.13,278	7.61
2017-18	రూ.1,49,646	రూ.12,705	8.49
2016-17	రూ.1,30,415	రూ.10,738	8.23
2015-16	రూ.1,15,689	రూ.11,216	9.69
2014-15	రూ.1,00,637	రూ.10,956	0.88

జిల్లాలో పెండింగ్ ప్రాజెక్టు నిధులు కేటాయించాలి

- ఇరిగేషన్ మంత్రిని కలిసిన సీపీఐ(ఎం) కొమరంభీం జిల్లా నాయకులు



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

కొమరంభీం జిల్లాను సస్యశ్యామలం చేసేందుకు సాగునీరు అందించలేకపోతున్న ప్రాజెక్టులకు రూ.302 కోట్లు కేటాయిస్తే 86 వేల ఎకరాలకు సాగునీరు అందించవచ్చనీ, వార్దా (ప్రాణహిత) ప్రాజెక్టుకు ఈ సంవత్సరమే శంకుస్థాపన చేసేలా నిధుల కేటాయించాలని సీపీఐ(ఎం) రాష్ట్ర, జిల్లా నాయకులు రాష్ట భారీ నీటి పారుదల శాఖ మంత్రి ఎస్.ఉత్తమ్ కుమార్ రెడ్డిని కోరారు. బుధవారం సీపీఐ(ఎం) మాజీ శాసనసభాపక్ష నేత జూలకంటి రంగారెడ్డి, రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు బండారు రవి కుమార్, రాష్ట్ర నాయకులు కే.సతీష్ కుమార్‌లు మంత్రిని కలిసి విజ్ఞప్తి చేశారు. దీని పై మంత్రి స్పందిస్తూ ఉమ్మడి అదిలాబాద్ ప్రాజెక్టులపై జలసౌధలో సమావేశం ఏర్పాటు చేస్తామనీ, నిధులను కేటాయిస్తామనీ, ప్రాణహిత ప్రాజెక్టుకు శంకుస్థాపన చేస్తామని హామీ ఇచ్చారు. ఆర్థికంగా, వ్యవసాయ పరంగా వెనకబడిన కుమురం భీం జిల్లాను అభివృద్ధి చేస్తామని హామీ ఇచ్చారు. వినతి పత్రాన్ని నీటి పారుదల శాఖ ప్రిన్సిపాల్ సెక్రటరీ రాహుల్ బొజ్జాకు పంపించారు. ప్రతినిధి బృందం కోరిన కోరికల పట్ల సానుకూలంగా స్పందించినందుకు మంత్రికి ఆ పార్టీ కొమరంభీం జిల్లా కమిటీ కృతజ్ఞతలు తెలిపింది. మంత్రిని కలిసిన వారిలో పార్టీ జిల్లా కార్యదర్శి కుశన రాజన్న, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు దుర్గం దినకర్, జిల్లా కమిటీ సభ్యులు ముంజం ఆనంద్ కుమార్, గోడిసెల కార్తీక్ లు ఉన్నారు.

అంతా భ్రాంతే!

- ఆర్టీసీకి 'మహాలక్ష్మి'తో సరి...
- 6,400 ఉద్యోగాలు ఎప్పుడు భర్తీ చేశారో తెలీని వైనం



నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

రాష్ట్ర బడ్జెట్‌లో ఆర్టీసీకి అదనంగా ఎలాంటి కేటాయింపులు జరగలేదు. ఆర్థిక మంత్రి భట్టి విక్రమార్క ఆర్టీసీకి 'మహాలక్ష్మి' మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం రీయింబర్స్‌మెంట్ సొమ్మును తప్ప, అదనంగా ఇచ్చిందేం లేదు. దీనితో వచ్చే ఏడాది కూడా కార్మికుల ఆర్థిక సమస్యలు పరిష్కారం అయ్యేలా కనిపించట్లేదు. మహాలక్ష్మి పథకంలో రాయితీల రీయింబర్స్‌మెంట్ కోసం రూ.3,082.53 కోట్లు మాత్రమే కేటాయించారు. దానితో పాటు వివిధ వర్గాల ప్రజలకు ఇచ్చే రాయితీల రీయింబర్స్‌మెంట్ కోసం మరో రూ.949.99 కోట్లు కేటాయించారు. ఈ సొమ్ము ఎస్సీఎస్టీ సబ్‌ప్లాన్ ప్రకారం వస్తుందని లెక్కల్లో పేర్కొన్నారు. మొత్తంగా ఆర్టీసీకి చేసిన కేటాయింపు రూ.4,032.52 కోట్లు. కొత్త బస్సుల కొనుగోళ్లకు నిధులు కేటాయించలేదు. మహిళా సమాఖ్యల నుంచి దశలవారీగా ఆర్టీసీలోకి వెయ్యి బస్సులు తెస్తామని ప్రభుత్వం ప్రకటించిన విషయం తెలిసిందే. అయితే అవన్నీ అద్దె బస్సులుగానే ఆర్టీసీలోకి రానున్నాయి. అందువల్లే ఆర్టీసీకి సొంతంగా బస్సుల కొనే ఆలోచనను రాష్ట్ర ప్రభుత్వం విరమించుకున్నట్టు తెలుస్తుంది. అలాగే ఆర్టీసీ కార్మికులకు సుదీర్ఘకాలంగా రావల్సిన ఆర్థిక ప్రయోజనాలు ఈ ఏడాది కూడా లభించేలా లేవు. వాటికోసం బడ్జెట్‌లో ఎలాంటి కేటాయింపులు చేయలేదు. రిటైర్ అయిన కార్మికులు తమకు రావల్సిన బకాయిల కోసం ఏండ్ల తరబడి బస్‌భవన్ చుట్టూ తిరుగుతున్న విషయం తెలిసిందే. ఆర్టీసీ వినియోగించే డీజిల్‌పై ప్రస్తుతం 18 శాతం పన్ను విధిస్తున్నారనీ, దాన్ని 4 శాతానికి పరిమితం చేయాలని కార్మిక సంఘాలు సుదీర్ఘకాలంగా డిమాండ్ చేస్తున్నాయి. ఆ ఊసే బడ్జెట్‌లో లేదు. ఇప్పుడున్న ఆర్టీసీని యథాతథంగా నడపడమే తప్ప, భవిష్యత్‌లో ఎలాంటి విస్తరణ ఉండబోదని ప్రభుత్వం బడ్జెట్ కేటాయింపుల ద్వారా స్పష్టంగా చెప్పేసింది. ఇక ఆర్టీసీలో 6,400 పోస్టుల భర్తీ చేశామని ఆర్థికమంత్రి చెప్పడం విస్మయం కలిగిస్తుంది. వాటికి ఎప్పుడు నోటిఫికేషన్లు ఇచ్చారు...ఎప్పుడు భర్తీ చేశారో వివరణే లేదు. అవన్నీ అబద్ధాలేనని కార్మిక సంఘాలు భగ్గుమంటున్నాయి.

ఆర్టీసీకి రూ.10వేల కోట్లు కేటాయించాలి

- టీజీఎస్‌ఆర్టీసీ ఎస్‌డబ్ల్యూఎఫ్ డిమాండ్

నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థకు బడ్జెట్‌లో రూ.10వేల కోట్లు కేటాయించాలని టీజీఎస్‌ఆర్టీసీ స్టాఫ్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ (ఎస్‌డబ్ల్యూఎఫ్) డిమాండ్ చేసింది. ఈ మేరకు ఆ సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు వీరాంజనేయులు, వీఎస్ రావు బుధవారంనాడొక పత్రికా ప్రకటన విడుదల చేశారు. బడ్జెట్‌లో ఆర్టీసీకి ప్రభుత్వం అదనంగా ఒక్క రూపాయి కూడా ఇవ్వకపోవడాన్ని వారు తప్పుపట్టారు. తక్షణం బడ్జెట్‌ను సవరించాలని డిమాండ్ చేశారు. మహాలక్ష్మి పథకం ద్వారా జీరో టిక్కెట్ విలువ ఏటా రూ.4,800 కోట్లు ఉండగా, ప్రభుత్వం కేవలం రూ.4.084 కోట్లు మాత్రమే కేటాయించిందని ఆక్షేపించారు. విద్యుత్ బస్సుల నిర్వహణలో ఆదాయానికి, ఖర్చుకు మధ్య ఉన్న వ్యత్యాసాన్ని రాష్ట్ర ప్రభుత్వమే చెల్లించాలని కోరారు. మండల మహిళా సమాఖ్యల నుంచి అద్దెకు తీసుకొనే బస్సులకు ఆరు శాతానికి మించి పడే అధిక వడ్డీ భారాన్ని కూడా ప్రభుత్వమే చెల్లించాలని పేర్కొన్నారు. రాష్ట్రంలో బస్సు ప్రయాణీకుల సంఖ్య గణనీయంగా పెరిగిందనీ, దానికి తగినట్టు కొత్త బస్సుల కొనుగోళ్ళు లేవనీ, వాటికోసం ఎలాంటి నిధులు కేటాయించలేదని విమర్శించారు. కార్మికులకు చెందిన పీఎఫ్, ఎస్‌ఆర్‌బీఎస్, ఎస్‌బీటీ, సీసీఎస్ సంస్థల సొమ్ము రూ. 3,200 కోట్లను ఆర్టీసీ యాజమాన్యం వాడుకున్నదనీ, 2022 ఏప్రిల్ నుంచి రిటైర్డ్ కార్మికులకు టెర్మినల్ లీవ్ ఎన్‌క్యాష్‌మెంట్ చెల్లించలేదనీ, 2017 పే స్కేల్ బకాయిలు, 179 నెలల కరువు భత్యం బకాయిలు, 2021, 2025 ఏప్రిల్ 1 నుంచి జరగాల్సిన వేతన సవరణల ఊసే లేదని పేర్కొన్నారు. ఆర్టీసీ అప్పులిన ప్రభుత్వ ఈక్విటీగా మార్చి, బడ్జెట్‌లో 3 శాతం నిధుల్ని మూడేండ్లు కేటాయింపులు చేయాలని సూచించారు. ఆర్టీసీలో బస్సుల సంఖ్య పెంచామనీ, 6,400 కొత్త ఉద్యోగాలు ఇచ్చామని చెప్పడం హాస్యాస్పదంగా ఉందన్నారు. ఏ ప్రాతిపదికన ఈ ప్రకటనలు చేశారో ప్రభుత్వం స్పష్టం చేయాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన 15 నెలల కాలంలో సంస్థలో 3,500 కార్మికులు రిటైర్ అయ్యారనీ, వారి స్థానంలో ఒక్కర్ని కూడా నియమించలేదని తేల్చిచెప్పారు. సర్వీసులో ఉండి చనిపోయిన కార్మికుల కుటుంబ సభ్యులు 500 మందికి కన్సాలిడేటెడ్ పద్ధతిలో నియమించారని గుర్తుచేశారు. చాలాకాలం నుంచి 3.040 మందిని రిక్రూట్ చేస్తామని ప్రకటించడమే తప్ప, కొత్తగా ఎవర్నీ తీసుకోలేదన్నారు.

వికలాంగులకు మొండి చెయ్యి

- బడ్జెట్‌ను సవరించి ఐదు శాతం నిధులు కేటాయించాలి
- ఎన్‌పీఆర్‌డీ ఆధ్వర్యంలో బడ్జెట్ పత్రాల దహనం



నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

రాష్ట్ర ప్రభుత్వం బడ్జెట్‌లో వికలాంగులకు మొండి చెయ్యి చూపిందని వికలాంగుల హక్కుల జాతీయ వేదిక(ఎన్‌పీఆర్‌డీ) ఆందోళన వ్యక్తం చేసింది. ఈ మేరకు బుధవారం హైదరాబాద్‌లోని ఆర్టీసీ క్రాస్ రోడ్స్‌లో బడ్జెట్ పత్రాలను దహనం చేసి తమ నిరసనను వ్యక్తం చేసింది. ఈ సందర్భంగా ఆ సంఘం రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కె వెంకట్, ఎం అడివయ్య మాట్లాడుతూ 2025-26 ఆర్థిక సంవత్సరానికి ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో వికలాంగుల సంక్షేమానికి నిధులు కేటాయించటంలో నిర్లక్ష్యాన్ని ప్రదర్శించిందని విమర్శించారు. వికలాంగుల వ్యతిరేక బడ్జెట్‌కు నిరసనగా నేడు రాష్ట్ర వ్యాప్తంగా బడ్జెట్ పత్రాలను దహనం చేయాలని పిలుపునిచ్చారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన రూ. 2,26,982 కోట్ల రెవెన్యూ వ్యయం బడ్జెట్‌లో 2016 ఆర్‌పీడీ చట్టం ప్రకారం ఐదు శాతం అంటే రూ.11,349.1కోట్ల నిధులు కేటాయించాలని గుర్తు చేశారు. కానీ రాష్ట్ర ప్రభుత్వం 12 శాతం జనాభా ఉన్న వికలాంగుల అభివృద్ధికి, సంక్షేమానికి పైసా కూడా కేటాయించలేదని ఆందోళన వ్యక్తం చేశారు. స్త్రీ, శిశుసంక్షేమ శాఖలో అంతర్భాగంగా వికలాంగుల సంక్షేమ శాఖను చూపి నిధులు కేటాయించటం లేదని తెలిపారు. 2023 అసెంబ్లీ ఎన్నికల్లో ఆసరా పింఛన్లు పెంచుతామని హామీ ఇచ్చి అధికారంలోకి వచ్చారని గుర్తు చేశారు. పంచాయతీ రాజ్, గ్రామీణ అభివృద్ధి శాఖకు రూ.31,605 కోట్లు కేటాయించారనీ, ఇందులోనే ఆసరా పింఛన్ల బడ్జెట్ ఉండడం అంటే రాబోయే రోజుల్లో ఆ పింఛన్ల లబ్ధిదారులకు కష్టాలు తప్పవని తెలిపారు. ఆర్థిక మంత్రి బడ్జెట్ ప్రసంగంలో 151 అంశాలను ప్రస్తావించారనీ, అందులో వికలాంగులకు సంబంధించిన ఒక్క అంశం కూడా లేదని ఆవేదన వ్యక్తం చేశారు. వికలాంగులకు స్వయం ఉపాధి రుణాలు, వివాహ ప్రోత్సాహకం, సహాయ పరికరాల కోసం నిధులు కేటాయించకుండా ఏవిధంగా న్యాయం జరుగుతుందని ప్రశ్నించారు. నిధుల కొరత వల్ల వికలాంగుల కార్పొరేషన్ నిర్వీర్యం అయ్యే పరిస్థితి ఏర్పడిందని తెలిపారు. తక్షణమే రాష్ట్ర ప్రభుత్వం బడ్జెట్‌ను సవరించి ప్రత్యేకంగా వికలాంగుల సంక్షేమానికి బడ్జెట్ కేటాయించాలనీ, ఆసరా పింఛన్ల పెంపునకు నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎన్‌పీఆర్‌డీ రాష్ట్ర కమిటీ సభ్యులు కె చంద్రమోహన్, జె మల్లేష్, సుల్తాన్ రమేష్, నాయకులు జానీ, రాజు, శివకుమార్, వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు

మెక్‌డొనాల్డ్‌తో సర్కార్ ఒప్పందం

- హైదరాబాద్‌లో గ్లోబల్ కార్యాలయం ఏర్పాటు
- 2వేల మందికి ఉపాది లభించే అవకాశం



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

అమెరికాకు చెందిన మల్టీ నేషనల్ కంపెనీ మెక్ డోనాల్డ్ తెలంగాణ ప్రభుత్వంతో కీలక ఒప్పందం చేసుకుంది. సంస్థ విస్తరణలో భాగంగా ఇండియా గ్లోబల్ కార్యాలయాన్ని హైదరాబాద్‌లో నెలకొల్పనునున్నట్టు ప్రకటించింది. ఫలితంగా రెండు వేల మందికి ఉపాది లభించనుంది. ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి బుధవారం అసెంబ్లీలోని తన ఛాంబర్లో మెక్ డొనాల్డ్ ఛైర్మెన్ క్రిస్ కెంప్కెజెన్స్కితో పాటు సంస్థ ప్రతినిధులతో చర్చలు జరిపారు. తమ రాష్ట్రంలోనే ఏర్పాటు చేయాలని పలు రాష్ట్రాలు పోటీ పడుతున్న నేపథ్యంలో మెక్ డొనాల్డ్ సంస్థ తెలంగాణను తమ పెట్టుబడులకు గమ్యస్థానంగా ఎంచుకోవటం గర్వంగా ఉందని ఈ సందర్భంగా సీఎం అన్నారు. ప్రభుత్వం వైపున అన్ని రకాల సహాయ, సహకారాలు అందిస్తామని హామీ ఇచ్చారు. గత 15 నెలల్లో రాష్ట్ర ప్రభుత్వం నైపుణ్యాబివృద్ధికి చేపట్టిన కార్యక్రమాలను కంపెనీ ప్రతినిధులకు సీఎం వివరించారు. సంస్థకు అవసరమైన ఉద్యోగులను నియమించుకునేందుకు యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీ సేవలు వినియోగించుకోవాలని సూచించారు. సంస్థకు అవసరమైన వ్యవసాయ ఉత్పత్తులను స్థానిక రైతులు సమకూర్చేలా అవకాశం కల్పించాలని సీఎం కోరారు. ఈ ఒప్పందంతో రైతుల ఆదాయం పెరడగంతో పాటు రాష్ట్ర వ్యవసాయ ఆర్థికాభివృద్ధికి తోడ్పడుతుందని అభిప్రాయపడ్డారు. ప్రస్తుతం రాష్ట్రంలో 38 మెక్‌డొనాల్డ్స్ అవుట్ లెట్లున్నాయనీ, వీటిని ప్రతి ఏడాది 3 నుంచి 4 కొత్త అవుట్ లెట్లకు విస్తరించనున్నట్టు వారు ప్రకటించారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి, పరిశ్రమల శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జయేష్ రంజన్, సీఎం ప్రత్యేక కార్యదర్శి అజిత్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అమిత్‌షా అహంకారి

- మహేష్‌కుమార్‌గౌడ్

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

రాజ్యాంగ నిర్మాత అంబేద్కర్‌పై కేంద్ర మంత్రి హోంశాఖ మంత్రి అమిత్‌షా చేసిన వ్యాఖ్యలు అహంకార పూరితమైనవని టీపీసీసీ అధ్యక్షులు బొమ్మ మహేష్‌కుమార్‌గౌడ్ విమర్శించారు. ఆయన చేసిన వ్యాఖ్యలను ప్రజలు క్షమించబోరని తెలిపారు. కుల, మతాలకతీతంగా అంబేద్కర్‌ను అభిమానించే ప్రజలు ఉన్నారని తెలిపారు. రాజ్యాంగాన్ని మార్చాలనే కుట్రలో భాగంగా బీజేపీ ఈ విధంగా ప్రవరిస్తున్నదని విమర్శించారు. రాజ్యాంగం స్థానంలో మనుస్మృతిని అమలు చేయాలని ఆ పార్టీ కుట్ర చేస్తున్నదని చెప్పారు. బుధవారం హైదరాబాద్‌లోని గాంధీభవన్‌లో 'జై బాపు..జై భీం...జై సంవిధాన్' అనే కార్యక్రమంపై మహేష్ అధ్యక్షతన సన్నాహక సమావేశాన్ని నిర్వహించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 'జై బాపు..జై భీం...జై సంవిధాన్' నినాదాన్ని ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లేందుకు కృషి చేయాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, ఏఐసీసీ సభ్యులు చల్లా వంశీచంద్‌రెడ్డి, కో ఆర్డినేషన్ కమిటీ సభ్యులు, కో ఆర్డినెటర్లు పాల్గొన్నారు.

ఆశా వర్కర్ల కలెక్టరేట్ ముట్టడి ఉద్రిక్తం

ఉదయం ఏడు గంటల నుంచే కలెక్టరేట్లకు చేరుకున్న ఆశాలు

కార్యాలయంలోకి వెళ్లకుండా అధికారుల అడ్డగింత

బయటికి వచ్చి వినతిపత్రం తీసుకున్న జిల్లా కలెక్టర్లు

బడ్జెట్ సమావేశాల్లోనే ఆశా వర్కర్లకు ఫిక్స్‌డ్ వేతనం ప్రకటించాలి

ఇన్సూరెన్స్ రూ.50లక్షలు, పీఎఫ్, ఈఎస్ఐ సౌకర్యాలు కల్పించాలని డిమాండ్



నవతెలంగాణ - విలేకరులు

ఆశా వర్కర్లు చేపట్టిన కలెక్టరేట్ ముట్టడి ఉద్రిక్తంగా మారింది. తెలంగాణ ఆశా వర్కర్స్ యూనియన్ (సీఐటీయూ) రాష్ట్ర వ్యాప్త పిలుపు మేరకు రాష్ట్రవ్యాప్తంగా కలెక్టరేట్ల ధర్నా ఆశావర్కర్లు ధర్నా నిర్వహించారు. ఉదయం ఏడు గంటల నుంచే కలెక్టరేట్లకు ఆశాలు చేరుకొని లోపలికి వాహనాలు వెళ్లకుండా అడ్డు కూర్చున్నారు. ఈ బడ్జెట్ సమావేశాల్లోనే సమస్యలు పరిష్కరించాలంటూ పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. పోలీసులు రంగంలోకి దిగి శాంతింప చేసే ప్రయత్నం చేశారు. అనంతరం పోలీసుల చొరవతో కలెక్టర్లు, సంబంధిత అధికారులు బయటికి వచ్చి వినతిపత్రాలు తీసుకున్న పరిస్థితి. వనపర్తి జిల్లా ఆశా వర్కర్లు ఉదయం తొమ్మిది గంటలకే కలెక్టరేట్ మెయిన్ గేటు వద్ద బైటాయించారు. సిబ్బందిని లోపలికి వెళ్లకుండా అడ్డుకున్నారు. అక్కడకు చేరుకున్న అధికారులు, పోలీసులు వారికి నచ్చజెప్పే ప్రయత్నం చేశారు. కలెక్టర్ బయటికి రావాలంటూ ఆశా వర్కర్లు అక్కడే భీష్మించుకుని కూర్చున్నారు. ఆశాలు పట్టుబట్టడంతో తప్పని పరిస్థితుల్లో కలెక్టర్ ఆదర్శ్ సురభి మెయిన్ గేటు దగ్గరకు వచ్చి వినతి పత్రాన్ని తీసుకున్నారు. త్వరలోనే లెప్రెసీ సర్వే డబ్బులు మీ అకౌంట్‌లో వేస్తానని చెప్పారు. స్థానికంగా ఉండే సమస్యలను వెంటనే పరిష్కారం చేస్తామని హామీ ఇవ్వడంతో ఆశా వర్కర్లు బయట ఉన్న సిబ్బందిని లోపలికి పంపించారు. ఈ సందర్భంగా ఆశా వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు పి. జయలక్ష్మి మాట్లాడుతూ.. బడ్జెట్ సమావేశాల్లోనే ఆశా వర్కర్లకు ఫిక్స్‌డ్ వేతనం రూ.18,000 ప్రకటించాలని డిమాండ్ చేశారు. ఇన్సూరెన్స్ రూ.50 లక్షలు వర్తింపచేయాలని, అదనపు పనులకు అదనపు వేతనం ఇవ్వాలని కోరారు. పీఎఫ్ - ఈఎస్ఐ సౌకర్యం కల్పించాలని, పండగ సెలవులు, వారాంతపు సెలవులకు సర్క్యులర్లు ఇవ్వాలని తెలిపారు. మహబూబ్‌నగర్ ఆర్ అండ్ బీ గెస్ట్ హౌస్ నుంచి ర్యాలీగా తెలంగాణ చౌరస్తా వరకు ర్యాలీ నిర్వహించి నిరసన తెలిపారు. జోగులాంబ గద్వాల కలెక్టరేట్‌ను ఉదయం 6గంటలకే ఆశా కార్యకర్తలు ముట్టడించారు. నాగర్‌కర్నూల్ కలెక్టర్ కార్యాలయాన్ని ముట్టడించారు.

ములుగు జిల్లా కలెక్టర్ కార్యాలయానికి ఉదయం 7 గంటలకే ఆశాలు చేరుకొని కలెక్టరేట్ లోపలికి వాహనాలు, అధికారులు, సిబ్బంది వెళ్లకుండా అడ్డు కూర్చున్నారు. దాంతో పోలీసులు ఆశా కార్యకర్తలను తాళ్లతో నిర్బంధించడంతో వారి మధ్య వాగ్వాదం జరిగింది. పోలీసుల చొరవతో ఆశా యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆర్ నీలాదేవి ఆధ్వర్యంలో కలెక్టర్ టీఎస్ దివాకరని కలిసి వినతిపత్రం అందించారు. హనుమకొండ జిల్లా కలెక్టరేట్ ఎదుట యూనియన్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కాసు మాధవి ఆధ్వర్యంలో ధర్నా చేపట్టారు. కలెక్టర్ కార్యాలయంలో ఈఆర్‌సీ బహిరంగ విచారణ జరుగుతున్న సందర్భంగా ఆశా కార్యకర్తలు గేట్లను నెట్టి లోపలికి వెళ్ళేందుకు ప్రయత్నించారు. సుబేదారి పోలీసులు వారిని అడ్డుకొని.. అధికారులను పిలిపించి వినతిపత్రం ఇప్పిస్తామని నచ్చజెప్పారు. జయశంకర్-భూపాలపల్లి జిల్లాలో సీఐటీయూ నాయకులు, ఆశ కార్యకర్తలను పోలీసులు అరెస్టు చేసి స్టేషన్‌కు తరలించారు. మహబూబాబాద్‌లో కలెక్టర్ అద్వైత్ కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. వరంగల్‌లో జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్యశారదకు వినతిపత్రం ఇచ్చారు. మేడ్చల్ మల్కాజిగిరి కలెక్టరేట్ ముట్టడికి యత్నించగా.. పోలీసులు ఆశా వర్కర్లను ఎక్కడికక్కడ అరెస్టులు చేసి స్టేషన్లకు తరలించారు. భద్రాద్రి కొత్తగూడెం కలెక్టరేట్ ప్రధాన ద్వారం వద్ద రెండు గేట్లను మూసేసి రెండు గంటలపాటు ఆశా కార్యకర్తలు బైటాయించారు. దాంతో పోలీసు అధికారుల చొరవతో జిల్లా వైద్య శాఖ అధికారులు బయటికి వచ్చి ఆశాలు, సీఐటీయూ నాయకులతో చర్చలు జరిపి హామీలు ఇచ్చారు. అధికారుల బృందం నుంచి డాక్టర్ బాలాజీ మాట్లాడుతూ.. లెప్రసీ సర్వే డబ్బులు రెండు రోజుల్లో బ్యాంక్ అకౌంట్‌లలో పడతాయని, ఇప్పటికే మెడికల్ ఆఫీసర్లకు పంపామన్నారు. ఖమ్మం కలెక్టర్ కార్యాలయం ఎదుట ఆశాలు ధర్నా నిర్వహించి. సమస్యలు పరిష్కరించాలంటూ రాష్ట్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. అనంతరం కలెక్టరేట్‌లో వినతి పత్రం అందజేశారు. నల్లగొండ కలెక్టరేట్ గేటు ముందు ఆశా కార్యకర్తలు బైటాయించి పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. అనంతరం అడిషనల్ కలెక్టర్ జె.శ్రీనివాస్‌కు వినతిపత్రం అందజేశారు. భువనగిరి కలెక్టర్ కార్యాలయం ఎదుట నిరసన తెలిపారు. సిద్దిపేట జిల్లా కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. సంగారెడ్డి జిల్లా కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. మెదక్‌లో మండుటెండలో భారీ ర్యాలీ నిర్వహించి కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. ఆదిలాబాద్ జిల్లా కలెక్టరేట్ ఎదుట ధర్నా చేపట్టి.. నినాదాలు చేస్తూ ఆందోళన కొనసాగించడంతో అదనపు కలెక్టర్ శ్యామలదేవి.. ఆందోళన చేస్తున్న ఆశాలకు వద్దకు వచ్చి వినతిపత్రం తీసుకున్నారు. ఆసిఫాబాద్ కలెక్టరేట్ ఎదుట ఆశా కార్యకర్తలు నిర్వహించిన ముట్టడి కార్యక్రమం ఉద్రిక్తతకు దారి తీసింది. ఆశ కార్యకర్తలను లోనికి వెళ్లనివ్వకుండా పోలీసులు అడ్డు కోవడంతో తోపులాట జరిగింది. అనంతరం కలెక్టరేట్ ఎదుట బైటాయించి పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. మంచిర్యాల కలెక్టర్‌రేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. కామారెడ్డికి చేరుకున్న ఆశాలను ఎక్కడికక్కడ అరెస్టు చేసి జిల్లా కేంద్రానికి దూరంగా ఉన్న వివిధ మండలాల పోలీస్ స్టేషన్లకు తరలించారు. అయినా నిర్బంధాన్ని తట్టుకొని వందలాది మంది ఆశాలు కలెక్టరేట్‌కు తరలివచ్చి ధర్నా చేపట్టారు. కలెక్టర్‌కు వినతిపత్రం ఇచ్చేందుకు వెళ్లగా.. పోలీసులు అడ్డుకోవడంతో కొద్దిసేపు ఉద్రిక్తత చోటుచేసుకుంది. కాగా పోలీసుల సూచనతో డీఎంఅండ్‌హెచ్‌వో ఆశాల వద్దకు రాగా.. వారికి వినతిపత్రం అందజేశారు. నిజామాబాద్‌లోని ధర్నా చౌక్‌లో ఆశాలు బైటాయించి ధర్నా చేశారు. డీఎంఅండ్‌హెచ్‌వో ధర్నాచౌక్‌కు వచ్చి ఆశాల వినతిపత్రం అందుకున్నారు. రంగారెడ్డి కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా చేపట్టారు. కరీంనగర్ జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్దకు ఉదయం 6 గంటలకే ఆశా కార్యకర్తలు చేరుకోగా.. వారిని పోలీసులు అరెస్ట్ చేసి ట్రైనింగ్ సెంటర్‌కు తరలించారు. జగిత్యాల జిల్లా కలెక్టరేట్ ఎదుట ఆశాలు ఆందోళన చేసి అనంతరం ఏవోకు వినతిపత్రం ఇచ్చారు. పెద్దపల్లిలో కలెక్టరేట్‌ను ముట్టడించి 3 గంటలపాటు ధర్నా చేశారు.





సాగర్‌ను ఎండబెట్టారు

- పంటలు ఎండిపోయే పరిస్థితి వచ్చింది : మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డి

నవతెలంగాణ-పెద్దవూర

నిండుకుండలా ఉన్న నాగార్జునసాగర్‌ను కాంగ్రెస్ ప్రభుత్వమే ఎండ బెట్టిందని, దాని వల్ల పంటలు ఎండిపోయే ప్రమాదం ఏర్పడిందని మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి అన్నారు. నల్లగొండ జిల్లా, పెద్దవూర మండలం, పర్వేదుల గ్రామానికి చెందిన కాంట్రాక్టర్స్ అసోసియేషన్ రాష్ట్ర మాజీ అధ్యక్షులు, బీఆర్ఎస్ జిల్లా సీనియర్ నాయకులు పల్లా మోహన్ రెడ్డి అనారోగ్యంతో మృతి చెందారు. బుధవారం ఆయన మృతదేహాన్ని సందర్శించి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం విలేకరుల సమావేశంలో జగదీశ్‌రెడ్డి మాట్లాడుతూ.. కృష్ణా జలాల పంపిణీపై ప్రభుత్వం అశ్రద్ధగా ఉందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం పట్టించుకోకపోవడం వల్లే ఇక్కడ పంటలు ఎండుతుంటే.. సాగర్ నీటితో ప్రకాశం బ్యారేజీ కింద మాత్రం పంటలు పండిస్తున్నారన్నారు. వరద కాల్వ నీటి సరఫరాలో జాప్యం వల్ల పంటలు ఎండే పరిస్థితి నెలకొందన్నారు. బీఆర్ఎస్ పాలనలో సాగర్ ఆయకట్టు టెలాండ్ అనే పదం వినపడకుండా చేశామన్నారు. సాగర్‌లో దాదాపు 350 టీఎంసీల కేటాయింపును కాంగ్రెస్ ప్రభుత్వం దక్కించుకోలేక పోయిందని విమర్శించారు. ఎడమ కాల్వ కింద పంటలు ఎండిపోయే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. ఉమ్మడి జిల్లా మంత్రులు, ఎమ్మెల్యేలు సరైన రీతిలో స్పందించకపోవడంతో సాగర్ నీళ్లు ఆంధ్రాకు తరలిపోతున్నాయని ఆరోపించారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం అక్రమంగా నీటిని వినియోగించుకుంటున్నా ఏమీ చేయలేని స్థితిలో మన ప్రభుత్వం ఉందని విమర్శించారు. ఈ కార్యక్రమంలో ఆయన వెంట ఎమ్మెల్సీ మంకెన కోటిరెడ్డి, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షులు రమవత్ రవీందర్‌కుమార్ నాయక్, మాజీ ఎమ్మెల్యేలు నల్లమోతు భాస్కరరావు, నోముల భగత్, మాజీ ఎంపీపీ చెన్ను అనురాధ సుందర్ రెడ్డి, అల్లి పెద్దిరాజు యాదవ్, సీనియర్ నాయకులు మేరెడ్డి జైపాల్‌రెడ్డి, దేవసాని శ్రీనివాస్ రెడ్డి తదితరులు ఉన్నారు.

'కేసీఆర్ కనిపించడం లేదు'

- యూత్ కాంగ్రెస్ ఆధ్వర్యంలో పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు
- 'వాంటెడ్ ఎమ్మెల్యే' అంటూ క్యాంప్ ఆఫీస్ ఎదుట బీజేపీ నిరసన



నవతెలంగాణ-గజ్వేల్/మర్కుక్

సిద్దిపేట జిల్లా గజ్వేల్ ఎమ్మెల్యే, మాజీ సీఎం కేసీఆర్ కనిపించడం లేదని యూత్ కాంగ్రెస్ గజ్వేల్ నియోజకవర్గం అధ్యక్షులు అజార్ ఆధ్వర్యంలో బుధవారం గజ్వేల్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా అజార్ మాట్లాడుతూ.. మాజీ సీఎం, గజ్వేల్ ఎమ్మెల్యే కేసీఆర్ ఎన్నికల్లో గెలిచిన తర్వాత నియోజకవర్గ ప్రజలకు అందుబాటులో లేకపోవడమే కాక, అసెంబ్లీ సమావేశాలకూ హాజరు కావడం లేదని తెలిపారు.

అదేవిధంగా కేసీఆర్ కనిపించడం లేదంటూ మర్కుక్ మండల యువజన కాంగ్రెస్ అధ్యక్షులు బైరగౌని శ్యాంప్రసాద్ గౌడ్ ప్రసాద్ ఆధ్వర్యంలో మర్కుక్ పోలీసు స్టేషన్‌లో కూడా ఫిర్యాదు చేశారు. ఇదిలా ఉండగా, బీజేపీ రాష్ట్ర నాయకులు జస్వంత్ రెడ్డి, గజ్వేల్ నియోజకవర్గ నాయకులు బండారి మహేశ్ ఆధ్వర్యంలో ఆ పార్టీ నాయకులు గజ్వేల్‌లో ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయం ఎదుట 'వాంటెడ్ ఎమ్మెల్యే' బోర్డును అతికించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. 119 నియోజకవర్గాల్లో అనాథ నియోజకవర్గం ఏదైనా ఉందంటే అది గజ్వేల్ నియోజకవర్గం మాత్రమేనన్నారు.



టన్నెల్‌లో టీబీఎం ప్లాట్ ఫాం కత్తిరింపు

- చివరి వరకు లోకోట్రైన్ ట్రాక్ పునరుద్ధరణకు చర్యలు
- నిరంతరాయంగా కొనసాగుతున్న ఊట నీటి తొడివేత

నవతెలంగాణ-మహబూబ్‌నగర్ ప్రాంతీయ ప్రతినిధి

ఎస్ఎల్‌బీసీ టన్నెల్ ప్రమాద స్థలంలోని డీ1, డీ2 ప్రదేశాల్లో తవ్వకాలకు అడ్డంకిగా ఉన్న టీబీఎం భాగాలను అల్ట్రా థర్మల్ కట్టర్ల ద్వారా తొలగిస్తూ ఎప్పటికప్పుడూ బయటకు పంపుతున్నారు. మట్టిని ఎస్కవేటర్ల ద్వారా కన్వేయర్ బెల్ట్ గుండా బయటకు తరలిస్తున్నారు. నాలుగు ఎస్కవేటర్లు, బాబ్ క్యాట్లు నిరంతరాయంగా మట్టి, స్టీల్‌ను తొలగిస్తున్నాయి. ఈ ప్రదేశాల వరకు లోకో ట్రైన్ ట్రాక్ పునరుద్ధరణ కార్యక్రమాన్ని కూడా వేగవంతం చేస్తున్నట్టు అధికారులు తెలియజేశారు.

డిజాస్టర్ అండ్ మేనేజ్‌మెంట్ స్పెషల్ చీఫ్ సెక్రెటరీ అరవింద్ కుమార్, నాగర్‌కర్నూల్ జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్, జిల్లా ఎస్పీ వైభవ్ గైక్వాడ్ రఘునాథ్ బుధవారం ఎస్ఎల్‌బీసీ టన్నెల్ ఆఫీస్ వద్ద సహాయక బృందాల ఉన్నతాధికారులు, ఆర్మీ అధికారి కల్నల్ పరీక్షిత్ మెహర, వికాస్ సింగ్, ఎన్‌డీఆర్ఎఫ్ అధికారులు డాక్టర్ హరీష్, సింగరేణి ఉన్నత అధికారి బైద్య, ఎస్‌డీఆర్ఎఫ్ అధికారి హరినాథ్ రెడ్డి, ర్యాట్ హోల్ మైనర్స్ ప్రతినిధి ఫిరోజ్ ఖురేషి, అన్వి రోబోటిక్ ప్రతినిధులు విజయ్, అక్షయ్, హైడ్రా, జియోలాజికల్ సర్వే ఆఫ్ ఇండియా, దక్షిణ మధ్య రైల్వే అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఇప్పటివరకు 800 టన్నుల స్టీల్‌ను లోకో ట్రైన్ ద్వారా, 800 టన్నుల మట్టిని, కన్వేయర్ బెల్ట్ ద్వారా బయటకు తరలించినట్టు అధికారులు తెలిపారు. బురద మట్టిని వాటర్ జెట్ సహాయంతో తొలగిస్తున్నట్టు, సహాయక బృందాల సమన్వయంతో రెట్టింపు వేగంతో డీ1, డీ2 ప్రాంతాల్లో సహాయక చర్యలను మరింత సమర్థవంతంగా అమలు చేస్తున్నామన్నారు.

ఆత్మహత్యకు పాల్పడిన బాలిక మృతి

- ప్రేమ పేరుతో వేధింపులే కారణం
- ఇద్దరు యువకులపై పోక్సో కేసు

నవతెలంగాణ - పెగడపల్లి

ప్రేమ పేరుతో వేధింపులకు గురిచేయడంతో ఓ బాలిక పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకుంది. ఈ ఘటన జగిత్యాల జిల్లా పెగడపల్లి మండలంలో బుధవారం జరిగింది. ఎస్ఐ రవి కిరణ్ తెలిపిన వివరాల ప్రకారం.. పెగడపల్లి మండలం రాంభద్రునిపల్లి గ్రామానికి చెందిన బాలిక మండల కేంద్రంలో ఇంటర్ మొదటి సంవత్సరం చదివేది. అదే గ్రామానికి చెందిన బాస రాము, గొల్లపల్లి మండలంలోని రంగదామునిపల్లి గ్రామానికి చెందిన మరొక యువకుడు ప్రేమ పేరుతో బాలికను వేధించారు. ఒప్పుకోకపోతే పరువు తీస్తామని బెదిరించారు. దీంతో తీవ్ర మనస్తాపంతో బాలిక ఈనెల 15న పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నం చేసింది. గమనించిన తల్లి జగిత్యాల జిల్లా కేంద్రంలోని ఆస్పత్రికి తరలించగా మెరుగైన వైద్యం కోసం కరీంనగర్ తీసుకెళ్లారు. అక్కడ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి బుధవారం బాలిక మృతిచెందింది. తల్లి ఫిర్యాదు మేరకు ఇద్దరు యువకులపై పోక్సో కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్టు ఎస్ఐ రవి కిరణ్ తెలిపారు.

నోటీసులు ఇవ్వకుండా భూసేకరణా?



రైతులకు న్యాయం చేయాలి : ఏఐకేఎస్ జాతీయ నాయకులు జూలకంటి రంగారెడ్డి, రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి.సాగర్

నవతెలంగాణ- నారాయణపేట

నారాయణపేట - కొడంగల్ ఎత్తిపోతల పథకం కింద రైతులకు ఎలాంటి నోటీసులూ ఇవ్వకుండా భూసేకరణ ఎలా చేస్తారని ఏఐకెఎస్ జాతీయ నాయకులు జూలకంటి రంగారెడ్డి, తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి.సాగర్ ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. భూములు కోల్పోతున్న రైతులకు 2013 భూసేకరణ చట్టం ప్రకారం పరిహారం ఇచ్చి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. భూ సంరక్షణ కమిటీ ఆధ్వర్యంలో బుధవారం నారాయణపేట జిల్లా కేంద్రంలోని ఎస్ఆర్ గార్డన్‌లో సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి జి.వెంకట్రామిరెడ్డి అధ్యక్షతన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రాజెక్ట్ కింద భూములు కోల్పోతున్న రైతులకు నోటీసులు ఇవ్వకుండానే దౌర్జన్యంగా పోలీసులను పెట్టి భూసేకరణ చేయడం సరైంది కాదన్నారు. ముఖ్యమంత్రి ప్రాతినిధ్యం వహిస్తున్న నియోజకవర్గం, సీఎం సొంత జిల్లా అయినందున రైతులు తమకు న్యాయం జరుగుతుందని ఆశగా ఉన్నారని చెప్పారు. ప్రభుత్వం రైతుల పొట్టకొడితే చూస్తూ ఊరుకోబోమని హెచ్చరించారు. న్యాయమైన పరిహారం 2013 చట్ట ప్రకారం బహిరంగ మార్కెట్ రేట్‌కు మూడింతలు కలిపి ఇవ్వాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం సేకరిస్తున్న భూములకు ఒక్కో ప్రాంతంలో ఒక్కో రేటు ఇస్తోందన్నారు.

రైతులు భయపడాల్సిన అవసరం లేదన్నారు. భూములు కోల్పోతున్న రైతాంగానికి ఎర్ర జెండా అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. మీకు న్యాయం జరిగే వరకు వెంట ఉంటామన్నారు. ఈ సదస్సులో మాజీ వైస్ ఎంపీపీ మహేష్ కుమార్, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి గోపాల్, రైతుసంఘం జిల్లా కార్యదర్శి అంజిలయ్య, నాయకులు రాజు, కేశవ్‌గౌడ్, నారాయణ, సాయికుమార్, నర్సిములు గౌడ్, లక్ష్మికాంత్, అరుణ్, రైతులు పాల్గొన్నారు.

14 బడ్జెట్ల రూప శిల్పి రామకృష్ణరావు

దేశంలోనే రికార్డు సృష్టించిన ఐఏఎస్



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్ర ఆర్థిక శాఖ ముఖ్య కార్యదర్శి రామకృష్ణరావు తెలంగాణ శాసన సభలో ప్రవేశ పెటిన 14 బడ్జెట్లను తయారు చేయడంలో ముఖ్య భూమిక పోషించారు. దేశంలోని ఏ ఐఏఎస్ అధికారి ఇన్ని సార్లు బడ్జెట్‌ను రూపొందించిన దాఖలాలు లేవని తెలుస్తోంది. 2016 బీఆర్ఎస్ ప్రభుత్వంలో అప్పటి సీనియర్ ఐఏఎస్ అధికారి డాక్టర్ ప్రదీప్ చంద్ర అనారోగ్యానికి గురి కావడంతో ఆయన స్థానంలో రామకృష్ణరావు బాధ్యతలు చేపట్టారు. అప్పటి నుంచి ఇప్పటి వరకు వరుసగా ఆయన నేతృత్వంలోనే బడ్జెట్లు రూపుదిద్దుకున్నాయి. ఇందులో 12 పూర్తి స్థాయి బడ్జెట్లు కాగా రెండు ఓటాన్ అకౌంట్ బడ్జెట్లు ఉన్నాయి. బీఆర్ఎస్ హయాంలో 11 సార్లు, కాంగ్రెస్ హయాంలో మూడు సార్లు బడ్జెట్‌ను రూపొందించారు. అయితే ఆయన బీఆర్ఎస్ హయాంలో రూపొందించిన బడ్జెట్లపై ఆయనే స్వయంగా శ్వేత పత్రాలు రూపొందించడం గమనార్హం.

ఆమె జీవితం అందరికీ ఆదర్శనీయం : సీఐ రాజశేఖర్ రెడ్డి

స్ఫూర్తిని కొనసాగించేందుకే సేవా కార్యక్రమాలు : డా.మల్లు అరుణ్‌రెడ్డి

మల్లు స్వరాజ్యం 3వ వర్ధంతి సందర్భంగా నివాళి

నవతెలంగాణ-నల్లగొండప్రాంతీయ ప్రతినిధి

తెలంగాణ సాయుధ పోరాట యోధురాలు, వీర వనిత మల్లు స్వరాజ్యం జీవితం అందరికీ ఆదర్శనీయమని, ఆమె అందించిన పోరాట స్ఫూర్తిని, మానవతా విలువలను భవిష్యత్ తరాలకు అందించాల్సిన అవసరం ఎంతైనా ఉందని నల్లగొండ వన్ టౌన్ సీఐ ఏ.రాజశేఖర్ రెడ్డి అన్నారు. మల్లు స్వరాజ్యం మూడో వర్ధంతి సందర్భంగా బుధవారం నల్లగొండ జిల్లా కేంద్రంలోని సత్యావతి ఆస్పత్రిలో ఆమె మనవడు, ప్రముఖ ఆర్థోపెడిక్ డాక్టర్ మల్లు అరుణ్ రెడ్డి ఆధ్వర్యంలో నిరుపేద మహిళకు ఉచితంగా మోకాలు చిప్ప మార్పిడి ఆపరేషన్ నిర్వహించారు. అంతకు ముందు మల్లు స్వరాజ్యం చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ.. మల్లు స్వరాజ్యం జీవితాంతం నిరుపేదల అభ్యున్నతి కోసం పరితపించారని గుర్తు చేశారు. ఆమె చరిత్రను మర్చిపోకుండా భవిష్యత్ తరాలకు అందించేందుకు ఆమె పేరుతో నిర్వహించే సేవా కార్యక్రమాలు ఎంతో దోహదం చేస్తాయన్నారు. ప్రతి యేటా వర్ధంతి సందర్భంగా నిర్వహిస్తున్న ఉచిత మోకాలు మార్పిడి ఆపరేషన్ అభినందనీయమన్నారు. డాక్టర్ మల్లు అరుణ్ రెడ్డి మాట్లాడుతూ.. మల్లు స్వరాజ్యం తన జీవితాన్ని అట్టడుగు వర్గాల కోసం ధారపోశారని, పేదల కోసం చివరి వరకూ జీవించారని గుర్తు చేశారు. సత్యావతి ఆస్పత్రి సహకారంతో మిర్యాలగూడకు చెందిన కార్మిక సంఘం నేత నకిరేకంటి అంజయ్య సతీమణి మరియమ్మకు విజయవంతంగా మోకాలు చిప్ప మార్పిడి ఆపరేషన్ చేసినట్టు వెల్లడించారు.

సత్యావతి ఆస్పత్రి ఎండి డాక్టర్ రాంమనోహర్ మాట్లాడుతూ.. స్వరాజ్యం స్ఫూర్తిగా ప్రతి సంవత్సరం ఎన్నో కార్యక్రమాలు చేయడం సంతోషకరమన్నారు. అందులో తమ ఆస్పత్రి భాగస్వామ్యం కావడం ఇంకా సంతోషంగా ఉన్నదని, తాము కూడా అనేక సేవా కార్యక్రమల్లో పాల్గొంటున్నామని చెప్పారు.



ఎంవీఎన్ విజ్ఞాన కేంద్రం కార్యనిర్వాహక కార్యదర్శి పి.నర్సిరెడ్డి మాట్లాడుతూ.. విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో ప్రతినెలా మెడికల్ క్యాంపులు నిర్వహిస్తున్నామన్నారు. వైద్య సేవలే కాకుండా విద్యార్థులకు కరాటే, ఉచిత కంప్యూటర్ శిక్షణ, మహిళలకు టైలరింగ్, క్రీడా పోటీలు నిర్వహిస్తున్నట్టు చెప్పారు. ఎంవీఎన్ విజ్ఞాన కేంద్రం నిర్వాహకులు పుచ్చకాయల నర్సిరెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో వన్ టౌన్ ఎస్ఐ శంకర్, డాక్టర్ చైతన్య, డాక్టర్ సంపద, సత్యావతి వైద్యశాల ఎండీ సత్యనారాయణ, కంప్యూటర్ శిక్షణా కేంద్రం ఫ్యాకల్టీ శంకర్ తదితరులు పాల్గొన్నారు.

బీసీ రిజర్వేషన్ల పెంపు అభినందనీయం

సీఎం రేవంత్ రెడ్డిని సన్మానించిన బీసీ ఉద్యోగుల సంఘం : ఆ సంఘం డైరీని ఆవిష్కరించిన ముఖ్యమంత్రి

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

బీసీలకు 42 శాతానికి రిజర్వేషన్లు పెంచడం పట్ల బీసీ ఉద్యోగ సంఘాల నేతలు హర్షం వ్యక్తం చేశారు. బుధవారం బీసీ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు యం.చంద్రశేఖర్ గౌడ్ ,ప్రధాన కార్యదర్శి రమాదేవి, వర్కింగ్ ప్రెసిడెంట్ శ్రీనివాస్, అసోసియేట్ ప్రెసిడెంట్ రామరాజు వర్మ, సలహాదారులు సుంకరి శ్రీనివాస్, ఉపాధ్యక్షులు నారాయణ, యాదగిరి, సుంకరి కృష్ణ, శేషాచారి, దొంతి ప్రసన్న కుమార్, సీతారాం ఆధ్వర్యంలో సీఎం రేవంత్ రెడ్డి, నీటిపారుదల, పౌర సరఫరాల శాఖామంత్రి కెప్టెన్ ఎన్.ఉత్తమ్ కుమార్ రెడ్డిలను కలసి కృతజ్ఞతలు తెలిపారు. ఇదొక చారిత్రాత్మకమైన ఘట్టంగా వారు వర్ణిస్తూ ఇదే నిర్ణయాన్ని దేశ వ్యాప్తంగా అమలు పరిచేలా ఒత్తిడి తేవాలని వారు కోరారు. ఇవే రిజర్వేషన్లను ఉద్యోగ, ఉపాధ్యాయ పదోన్నతుల్లో కుడా అమలు పరచాలని వారు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని కోరారు. ఈ సందర్భంగా బీసీ ఉద్యోగుల సంఘం రూపొందించిన 2025 డైరీని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో మంత్రులు కెప్టెన్ ఎన్.ఉత్తమ్ కుమార్ రెడ్డి, పొన్నం ప్రభాకర్, పొంగులేటి శ్రీనివాసరెడ్డి, కొండా సురేఖ, పీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, సీనియర్ కాంగ్రెస్ నేత వి.హనుమంతరావు తదితరులు పాల్గొన్నారు.

రసమయి వ్యాఖ్యలతో దుమారం

ఆయన ఫాంహౌస్ ముట్టడికి కాంగ్రెస్ యత్నం, ఉద్రిక్తత

ముట్టడిని అడ్డుకున్న పోలీసు బలగాలు



నవతెలంగాణ-బెజ్జంకి

మానకొండూర్ నియోజకవర్గ ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ అనుచరులు సీఎంఆర్ఎఫ్ చెక్కుల్లో అక్రమాలకు పాల్పడ్డారని మాజీ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ చేసిన వ్యాఖ్యలు తీవ్ర దుమారం లేపాయి. దాంతో నియోజకవర్గ కాంగ్రెస్ శ్రేణులు భగ్గుమన్నాయి. అక్రమాలపై కాంగ్రెస్ పక్షాన చర్చకు సిద్ధమని.. దమ్ముంటే చర్చకు రావాలని, లేనిపక్షంలో రసమయి ఫాంహౌస్‌ను ముట్టడిస్తామని జిల్లా కాంగ్రెస్ శ్రేణులు హెచ్చరించాయి. దాంతో ఒక్కసారిగా ఉద్రిక్త వాతావరణం నెలకొంది. బుధవారం సిద్దిపేట జిల్లా బెజ్జంకి మండల కేంద్రంలోని అంబేద్కర్ చౌరస్తా వద్ద ధర్నాకు పిలుపునివ్వడంతో నియోజకవర్గ కాంగ్రెస్ కార్యకర్తలు భారీగా చేరుకున్నారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా ఏసీపీ మధు ఆధ్వర్యంలో పోలీస్ బలగాలు మోహరించాయి. పలువురు రసమయి ఫాంహౌస్ ముట్టడికి యత్నించడంతో పోలీస్ బలగాలు కాంగ్రెస్ శ్రేణులను అడ్డుకునే ప్రయత్నం చేశారు. దాంతో పోలీసులు, కాంగ్రెస్ శ్రేణుల మధ్య స్వల్ప తోపులాట జరిగింది. పోలీసులు కాంగ్రెస్ శ్రేణులను అరెస్ట్ చేసి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. కాగా, ఈ ఘటనపై మాజీ మంత్రి,ఎమ్మెల్యే తన్నీరు హరీశ్ రావు 'ఎక్స్' వేదికగా స్పందించారు. రసమయి భద్రతకు రాష్ట్ర డీజీపీ, జిల్లా సీపీ పూర్తి బాధ్యత వహించాలని, ఇలాంటి సంఘటనలు పునరావృతమవ్వకుండా చర్యలు తీసుకోవాలని తెలిపారు.

తప్పులెత్తి చూపితే.. దాడికి పురమాయింపు: రసమయి బాలకిషన్

పేద ప్రజల వైద్య చికిత్స ఖర్చులకు అందించే సీఎంఆర్ఎఫ్ చెక్కుల అందజేతలో బాధితులకం దించకుండా ఎమ్మెల్యే అనుచరులు పాల్పడిన అక్రమాలను ఎత్తిచూపితే.. తన నివాసంపై దాడులకు ఎమ్మెల్యే పురమాయించడం.. తనను గృహ నిర్బంధం చేయించడం అప్రజాస్వామికమని మాజీ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ అన్నారు. ఇల్లంతకుంటకు చెందిన కూనబోయిన రవి రూ.60 వేల సీఎంఆర్ఎఫ్ చెక్కును రహీంఖాన్ పేటకు చెందిన కె.రవి, వల్లంపట్ల గ్రామానికి చెందిన లింగు శ్రీనివాస్ రూ.26 వేల సీఎంఆర్ఎఫ్ చెక్కును బెజ్జంకి మండలంలోని గుండారం గ్రామానికి ఎల్.శ్రీనివాస్ తమ ఖాతాలో వేసుకున్నారని ఈ ఘటనల వాస్తవాలన్నారు. సీఎంఆర్ఎఫ్ చెక్కులు స్వాహా చేసిన వారిపై చర్యలు చేపట్టి బాధితులకు న్యాయం చేయాలని సూచించారు.

పంజాబ్ పోలీసుల ఉక్కుపాదం

రైతు నాయకుల అరెస్టు, శిబిరాలపై జేసీబీతో జులుం

కేంద్రంతో చర్చలకు వెళ్లిన నేతలు అదుపులోకి..

చండీగఢ్ : రైతు నిరసనలపై పంజాబ్ పోలీసులు బుధవారం ఉక్కుపాదం మోపారు. శంభు, ఖనౌరీ సరిహద్దుల్లో నిరసనలు చేపడుతున్న రైతులను పోలీసులు బలవంతంగా అక్కడ నుంచి తరలించారు. నిరసన శిబిరాలను జేసీబీతో తొలగించారు. మరోవైపు.. కేంద్రమంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ ఆధ్వర్యంలోని కేంద్ర బృందంతో చర్చల అనంతరం తిరుగు పయనమైన శర్వణ్‌సింగ్ పంధేర్, జగ్జీత్‌సింగ్ ధల్లేవాల్ తదితర రైతు నాయకులను మొహాలీలో అదుపులోకి తీసుకున్నారు. ఈ నాయుకులు శంభు సరిహద్దుకు వెళ్తుండగా మార్గమధ్యంలో అదుపులోకి తీసుకున్నారని రైతు నేత గురమ్‌నీత్ సింగ్ మంగత్ వెల్లడించారు. సంబంధిత ప్రాంతాల్లో భారీ ఎత్తున భద్రతా బలగాలను మోహరించారు. నిరసన శిబిరాల నుంచి రైతుల తరలింపును పంజాబ్ ఆర్థికశాఖ మంత్రి హర్‌పాల్ సింగ్ చీమా సమర్థించుకున్నారు. రాష్ట్రానికి ప్రధానంగా ఉన్న రెండు హైవేలు ఏడాది కాలంగా మూసి ఉన్నాయని, దీంతో పరిశ్రమలు, వ్యాపారాలు తీవ్రంగా దెబ్బతిన్నాయని చెప్పారు.

మల్లు స్వరాజ్యం ఆశయ సాధనకు కృషి

సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు పోతినేని సుదర్శన్



నవతెలంగాణ-సూర్యాపేట

వీరనారి మల్లు స్వరాజ్యం ఆశయ సాధనకు అందరూ కృషి చేయాలని సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు పోతినేని సుదర్శన్ అన్నారు. మల్లు స్వరాజ్యం మూడో వర్థంతి కార్యక్రమాన్ని బుధవారం సూర్యాపేట జిల్లాలోని స్థానిక మల్లు వెంకట నరసింహారెడ్డి భవన్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా 'రైతాంగ సమస్యలు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల విధానాలు' అనే అంశంపై జరిగిన సెమినార్‌లో ఆమె చిత్రపటానికి పూలమాలలేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. తుపాకీ పట్టి నిజాంను గడగడలాడించిన వీరవనిత మల్లు స్వరాజ్యం అని కొనియాడారు. ఆమె ఆశయ సాధనకు మనమంతా కృషి చేయాలని పిలుపునిచ్చారు. సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి మల్లు నాగార్జున రెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ సభలో రాష్ట్ర కమిటీ సభ్యులు నెమ్మాది వెంకటేశ్వర్లు, కోలిశెట్టి యాదగిరి రావు, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ములకలపల్లి రాములు, మట్టిపల్లి సైదులు, కోట గోపి, చెరుకు ఏకలక్ష్మి, జిల్లా కమిటీ సభ్యులు వేల్పుల వెంకన్న ఉన్నారు.

పాఠాలు నేర్వని ప్రభుత్వం

(మొదటిపేజీ తరువాయి)

నడుస్తోందన్నమాట. వాస్తవాలు ఈ విధంగా ఉంటే, వాటిని మరిచి గత బడ్జెట్ (రూ.2.91 లక్షల కోట్లు)కు అదనంగా ఇప్పుడు రూ.13 వేల కోట్లు కలిపి రూ.3.04 లక్షల కోట్లతో బడ్జెట్‌ను ప్రవేశపెట్టటమేంటనే ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి. మరో ముఖ్యమైన విషయమేమంటే ఇటీవల కేంద్రం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో నిబంధనలకు అనుగుణంగా రావాల్సినవి తప్ప అదనంగా తెలంగాణకు మోడీ సర్కారు ఒక్క పైసా కేటాయించలేదు. కానీ రాష్ట్ర ప్రభుత్వం మాత్రం వచ్చే ఏడాదిలో కేంద్రం నుంచి తమకు రూ.22 వేల కోట్ల మేర గ్రాంట్లు, నిధులు వస్తాయంటూ లెక్కలేసుకుంది. ఇది నిజంగా అత్యాశే. దీంతోపాటు ప్రభుత్వ భూములు, ప్లాట్లు (ఓపెన్ ల్యాండ్), ఫ్లాట్లు (అపార్టుమెంట్లు) అమ్మకాల ద్వారా మరో రూ.20 వేల కోట్లు వస్తాయని సర్కారు అంచనాలేసుకుంది. కానీ తెలంగాణ వచ్చినప్పటి నుంచి ఇప్పటిదాకా ప్రవేశపెట్టిన బడ్జెట్లను చూస్తే ప్రభుత్వం 'నేల విడిచి సాము' చేస్తోన్నట్టుగా కనబడుతోంది. మార్చితో ముగియనున్న 2024-25 బడ్జెట్‌లో ఈ రూపంలో రూ.10 కోట్ల లోపే ఆదాయం రావటం గమనార్హం. అలాంటప్పుడు వచ్చే ఏడాది రూ.20 వేల కోట్లు ఎలా వస్తాయనేది ప్రశ్నార్థకంగా మారింది.

గట్టెక్కించేది ఆ నాలుగే..

(మొదటిపేజీ తరువాయి)

వాటి సైజును క్రమక్రమంగా తగ్గిస్తూ వస్తున్నామని ఒక ఉన్నతాధికారి తెలిపారు. అందుకే గతేడాదితో పోలిస్తే ఇప్పటి బడ్జెట్‌లో కేవలం రూ.13 వేల కోట్లనే పెంచి పద్దును ప్రవేశపెట్టామని ఆయన తెలిపారు. ముున్ముందు ఈ పెంపుదల ఇంకా తగ్గుతుందనీ, అప్పుడు బడ్జెట్ వాస్తవాలకు మరింత దగ్గరగా ఉంటుందని ఆయన అభిప్రాయపడ్డారు.

అసమానతలు లేని వ్యవస్థే లక్ష్యం

(మొదటిపేజీ తరువాయి)

సమయంలో దేశ జీడీపీ 3,31,03,215 కోట్లుకాగా వృద్ధిరేటు 9.9 శాతం ఉందని తెలిపారు. రాష్ట్ర తలసరి ఆదాయం రూ.3,79,751 కోట్లు అనీ, వృద్ధి రేటు 9.6 అని చెప్పారు. దేశ తలసరి ఆదాయంతో పోలిస్తే తెలంగాణ తలసరి ఆదాయం 1.8 రెట్లు ఎక్కువ అని వివరించారు. జీఎస్‌వీఏలో సేవారంగం వాటా 66.3 శాతం, పారిశ్రామిక రంగం వాటా 16.4 శాతం, వ్యవసాయ, అనుబంధ రంగాల వాటా 17.3 శాతమని చెప్పారు. జీఎస్‌డీపీలో వ్యవసాయ, దాని అనుబంధ రంగాల వాటా తక్కువగా ఉన్నప్పటికీ 42.7 శాతం మందికి అదే ఉపాధి కల్పిస్తున్నదని గుర్తుచేశారు.

రాష్ట్రాలకిచ్చే పన్నుల వాటాను 50 శాతానికి పెంచాలి

కేంద్రం పన్నుల పంపిణీలో భాగంగా రాష్ట్రాలకు ఇస్తున్న 41 శాతం వాటాను 50 శాతానికి పెంచాలని 16వ ఆర్థిక సంఘానికి ప్రతిపాదించామని భట్టి విక్రమార్క చెప్పారు. దక్షిణాది రాష్ట్రాలకు తగ్గుతున్న పన్నుల వాటాపై ఆందోళన వెలిబుచ్చారు. 14వ ఆర్థిక సంఘం ద్వారా తెలంగాణకు 2.437 శాతం నిధుల పంపిణీ జరిగితే..15వ ఆర్థిక సంఘం కాలంలో ఇది 2.102 శాతానికి తగ్గిన విషయాన్ని ప్రస్తావించారు.

ప్రజల కష్టాల నుంచి పుట్టుకొచ్చిందే 'అభయహస్తం'

ప్రజల కష్టాలను తీర్చాలనే సంకల్పం నుంచే 'అభయహస్తం' పుట్టుకొచ్చిందని డిప్యూటీ సీఎం చెప్పారు. ఉచిత బస్సు ప్రయాణం ద్వారా మహిళలకు ఇప్పటిదాకా రూ.5005.95 కోట్లు ఆదా కాగా, ఆర్టీసీ ఆర్థికంగా నిలబడిందనీ, కొత్తగా 6,400 మంది ఉద్యోగులను చేర్చుకున్నదని తెలిపారు. గత ప్రభుత్వ హయాంలో అసంపూర్తిగా నిలిచిన 34,545 నిర్మాణాలకు రూ.305.03 కోట్లు కేటాయించి వాటిని అందుబాటులోకి తీసుకొస్తున్నామన్నారు. హైదరాబాద్‌కు నలువైపులా పేద, మధ్యతరగతి ప్రజల కోసం శాటిలైట్ టౌన్‌షిప్‌లను ఏర్పాటు చేసి గృహ సముదాయాలను నిర్మించే ప్రణాళిక రూపొందిస్తున్నామన్నారు.

వ్యవసాయ శాఖకు రూ.24,439 కోట్లు...పశుసంవర్థక శాఖకు రూ.1,674 కోట్లు

వ్యవసాయ శాఖకు రూ.24,439 కోట్లను ప్రతిపాదిస్తున్నామని భట్టి విక్రమార్క తెలిపారు. రైతు భరోసా పథకానికి ప్రస్తుత బడ్జెట్‌లో రూ.18 వేల కోట్లు ప్రతిపాదిస్తున్నట్టు తెలిపారు. అదే విధంగా పశుసంవర్థక శాఖకు రూ.1,674 కోట్లు ప్రతిపాదించారు.

పౌరసరఫరాల శాఖకు రూ.5,734 కోట్లు

పౌరసరఫరాల శాఖకు రూ.5,734 కోట్లను భట్టి ప్రతిపాదించారు. అర్హులందరికీ కొత్త రేషన్‌కార్డులు ఇస్తామనీ, త్వరలో సన్నబియ్యం పంపిణీ చేస్తామని చెప్పారు.

విద్యకు ప్రాధాన్యమిస్తున్నాం...

రాష్ట్రంలో విద్యాశాఖకు రూ.23,108 కోట్లను బడ్జెట్‌లో భట్టి ప్రతిపాదించారు. 1023 ప్రభుత్వ రెసిడెన్షియల్ పాఠశాలల్లో సొంతభవనాలు లేనివి 662 ఉన్నాయన్నారు. 20 నుంచి 25 ఎకరాల్లో 58 యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాలల నిర్మాణాలకు రూ.11,600 కోట్లు కేటాయించామన్నారు. ఫ్యూచర్ సిటీలో 200 ఎకరాల్లో ఏఐ సిటీని నెలకొల్పబోతున్నట్టు ప్రకటించారు. 2023లో రాష్ట్రంలో నిరుద్యోగం 22.9 శాతం ఉంటే..2024 నాటికి అది 18.1 శాతానికి తగ్గిందని తెలిపారు. త్వరలో గ్రూపు-1,2 అభ్యర్థులకు నియామక పత్రాలు ఇస్తామనీ, 14,236 అంగన్‌వాడీ పోస్టులను భర్తీ చేస్తామని తెలిపారు. రాష్ట్రంలో 119 నియోజకవర్గాల్లో అంబేద్కర్ స్టడీ సెంటర్ల ద్వారా పోటీపరీక్షలకు శిక్షణ అందిస్తామని ప్రకటించారు. కార్మిక, ఉపాధి కల్పన శాఖకు రూ.900 కోట్లు ప్రతిపాదిస్తున్నట్టు తెలిపారు.

పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖకు రూ.31,605 కోట్లు

పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖకు రూ.31,605 కోట్లను ఆర్థిక శాఖ మంత్రి భట్టి ప్రతిపాదించారు. 22 ఇందిరా మహిళా శక్తి భవనాలను ఏర్పాటుకు ప్రభుత్వం రూ.110 కోట్లు కేటాయించిందనీ, అవి మహిళా సంఘాలకు వ్యాపార కేంద్రాలుగా ఉపయోగడతాయని ఆశాభాశం వ్యక్తం చేశారు. అమ్మఆదర్శ పాఠశాల కార్యక్రమం కింద 23,701 మౌలిక సదుపాయాల ప్రాజెక్టు కోసం రూ.634 కోట్ల పనులను మహిళా సంఘాలకు అప్పగించామని తెలిపారు. మహిళా శిశు సంక్షేమానికి రూ.2,862 కోట్లు ప్రతిపాదించారు.

ఎస్సీ వర్గీకరణ చారిత్రాత్మక మైలురాయి

తెలంగాణలో ఎస్సీవర్గీకరణ చట్టం చారిత్రాత్మక మైలురాయిగా నిలిచిపోతుందని భట్టి నొక్కి చెప్పారు. ఎస్సీ వర్గీకరణ అమలు చేయబోతున్న తొలి రాష్ట్రంగా తెలంగాణ నిలవబోతున్నదన్నారు. గిరిజన అభివృద్ధి కార్యాచరణ ప్రణాళిక ద్వారా గిరిజన, ఆదివాసీ ప్రాంతాల్లో వైద్యం, విద్య, ఉపాధి వంటి కీలక రంగాలకు నిధులు కేటాయిస్తున్న తీరును వివరించారు. ఎస్సీ సంక్షేమానికి రూ.40,232 కోట్లు, ఎస్టీ సంక్షేమానికి రూ.17,169 కోట్లు ప్రతిపాదిస్తున్నట్టు తెలిపారు.

మెగా మాస్టర్ ప్లాన్-2050 మా లక్ష్యం

తెలంగాణలో రాబోయే ఐదేండ్లలో రూ.4 వేల కోట్లతో 25వేలకు పైచిలుకు ఎమ్ఎస్ఎమ్ఈ పరిశ్రమలను స్థాపించడమే లక్ష్యంగా ముందుకెళ్తున్నామని భట్టి ప్రకటించారు. నూతన పారిశ్రామిక పార్కుల్లో మహిళా పారిశ్రామిక వేత్తలకు ఐదు శాతం, ఎస్సీ, ఎస్టీ పారిశ్రామికవేత్తలకు 15 శాతం కేటాయించాలని నిర్ణయించామన్నారు. ఎస్సీ, ఎస్టీ పారిశ్రామికవేత్తలకు రూ.50 లక్షల పరిమితికి లోబడి 50 శాతం వరకు భూమి ధరలో రాయితీ ఇస్తామని ప్రకటించారు. హైదరాబాద్-వరంగల్ పారిశ్రామిక కారిడార్‌ను ఎన్‌హెచ్ 163కి ఇరువైపులా విస్తరిస్తామని వెల్లడించారు. రంగారెడ్డి, మహబూబ్‌నగర్ జిల్లాల పరిధిలో గ్రీన్‌ఫీల్డ్ ఫార్మా క్లస్టర్లు ఏర్పాటు చేస్తామని ప్రకటించారు.

గరిష్ట విద్యుత్ డిమాండ్ 16,918 మెగావాట్లు

తెలంగాణలో గరిష్ట విద్యుత్ డిమాండ్ 16,918 మెగావాట్లకు చేరుకున్నా ప్రజలకు నిరంతరాయంగా కరెంటు అందించగలుగుతున్నామని డిప్యూటీ సీఎం భట్టి తెలిపారు. సరఫరాలో తక్కువ నష్టాలతో ట్రాన్స్‌కో దేశంలోనే అగ్రగామి సంస్థల్లో ఒకటిగా ఉందన్నారు. పునరుత్పాదక విద్యుత్ ఆవశ్యకతను గుర్తించి క్లీన్, గ్రీన్ ఎనర్జీ పాలసీ -2025 రూపొందించామని తెలిపారు. శంకర్‌పల్లి వద్ద 250 మెగావాట్లు/500మెగా హెడ్జ్ బ్యాటరీ ఎనర్జీ స్టోరేజ్ సిస్టమ్ ఏర్పాటుకు నిర్ణయం తీసుకున్నామ న్నారు. 2025 మే నాటికి యాదాద్రి పవర్‌ప్లాంట్ ఐదు యూనిట్లలో విద్యుత్ ఉత్పత్తికి అవసరమైన చర్యలు తీసుకుంటామని చెప్పారు. విద్యుత్ శాఖకు రూ.21,221 కోట్లు ప్రతిపాదించామని వెల్లడించారు.

వైద్యారోగ్య శాఖకు రూ.12,393 కోట్లు

వైద్యారోగ్య శాఖకు ప్రస్తుత బడ్జెట్‌లో రూ.12,393 కోట్లు ప్రతిపాదించామని తెలిపారు. ఆరోగ్యశ్రీ పథకం కింద రూ.1,215 కోట్లు విడుదల చేశామన్నారు. జాతీయ ఆరోగ్య మిషన్ కింద మన రాష్ట్రానికి అధిక నిధులు రాబట్టుకునే ప్రయత్నం చేస్తున్నామని చెప్పారు.



ట్రాఫిక్ రద్దీ నియంత్రణకు హెచ్-సిటీ ప్రణాళిక

హైదరాబాద్‌తో పాటు ఆ తర్వాతి స్థాయి నగరాలైన వరంగల్, కరీంనగర్, ఖమ్మం, నిజామాబాద్‌లను అభివృద్ధి పరుస్తున్నామని భట్టి తెలిపారు. వరంగల్‌ను విద్యావైద్య, ఐటీ కేంద్రంగా, నిజామాబాద్, ఖమ్మంలను వ్యవసాయాధారిత, తయారీ రంగ పరిశ్రమల కేంద్రంగా తీర్చిదిద్దుతామని ప్రకటించారు. హైదరాబాద్‌లో ట్రాఫిక్ రద్దీ నియంత్రణకు హెచ్-సిటీ ప్రణాళిక అమలు చేస్తున్నామని తెలిపారు. మూసీ ప్రక్షాళనలో భాగంగా గోదావరి డ్రింకింగ్ వాటర్ సప్లయ్ పథకం కింద గోదావరి జలాలతో ఉస్మాన్‌సాగర్, హిమాయత్‌సాగర్ జలాశయాలను నింపి పునర్జీవింపజేసే పనులు చేయబోతున్నామన్నారు. కొత్త మున్సిపాలిటీల్లో మౌలిక సదుపాయాల కల్పన, అభివృద్ధి కోసం రూ.4,500 కోట్లతో ప్రణాళికలు సిద్ధం చేశామనీ, ఆ మొత్తాన్ని వచ్చే మూడేండ్లలో ఖర్చుచేస్తామని ప్రకటించారు. ఫ్యూచర్‌సిటీలో ఏఐసిటీ, ఫార్మాహబ్, స్పోర్ట్స్‌సిటీ, క్లీన్ ఎనర్జీ ఇన్నోవేషన్ జోన్‌లు ఉంటాయన్నారు. మున్సిపల్ శాఖకు రూ.17,677 కోట్లను ప్రతిపాదించారు.

19 ప్రాజెక్టుల కోసం 'స్పీడ్'

19 ప్రాజెక్టులను నిర్ణీత వ్యవధిలో పూర్తిచేయడానికి స్మార్ట్ ప్రోయాక్టివ్, ఎఫిషియెంట్ అండ్ ఎఫెక్టివ్ డెలివరీ(స్పీడ్) పేరుతో సరికొత్త కార్యాచరణకు శ్రీకారం చుట్టినట్టు ప్రకటించారు.

ఏ,బీ కేటగిరీలుగా పెండింగ్ ప్రాజెక్టులు

రాష్ట్రంలోని పెండింగ్‌లో ఉన్న సాగునీటి ప్రాజెక్టులను ఏ, బీ కేటగిరీలుగా విభజించి ప్రాధాన్యతా క్రమంలో పూర్తిచేసేలా ప్రణాళికలు రూపొందిస్తున్నామని మంత్రి భట్టి ప్రకటించారు. నీటిపారుదల శాఖకు ఈ బడ్జెట్‌లో 23,373 కోట్లు ప్రతిపాదించారు. నల్లగొండ, యాదాద్రి భువనగిరి జిల్లాలో ఉదయ సముద్రం, బ్రాహ్మణ వెల్లెంల లిఫ్టు ఇరిగేషన్ ప్రాజెక్టులు అందుబాటులోకి వస్తే 94 గ్రామాల్లో లక్ష ఎకరాలకు సాగు నీరు అందుతుందనీ, 107 గ్రామాలకు తాగు నీరు ఇవ్వొచ్చని చెప్పారు.

ప్రణాళికల రూపకల్పనకు కులగణన సర్వే మొదటి మెట్టు

సమగ్ర, సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ, కుల సర్వే (ఎస్ఈఈఈపీసీ) సామాజిక ప్రజాస్వామ్యానికి, సంక్షేమ పథకాలు, రిజర్వేషన్లు, సమగ్ర ఆర్థిక విధానాల ప్రణాళికల రూపకల్పనకు మొదటిమెట్టు అని భట్టి చెప్పారు. ఈ సర్వే 1.12 కోట్ల కుటుంబాల వివరాలను శాస్త్రీయ, పారదర్శకంగా సేకరించిందనీ, 96 శాతం కవరేజీతో విజయవంతంగా సామాజిక-ఆర్థిక డేటా సేకరణగా నిలిచిందని కొనియాడారు. బీసీ సంక్షేమం కోసం బడ్జెట్‌లో రూ.11,405 కోట్లు ప్రతిపాదించినట్టు తెలిపారు. రాజీవ్ యువ వికాసంలో భాగంగా మైనార్టీలకు రూ.840 కోట్లతో స్వయం ఉపాధి పథకాలు చేపడతామని చెప్పారు.

60 శాతం ప్రయివేటు డెవలపర్ల పెట్టుబడితో రోడ్లు

రోడ్లు, భవనాల శాఖకు బడ్జెట్‌లో రూ.5,907 కోట్లను మంత్రి భట్టి ప్రతిపాదించారు. రాష్ట్రంలో హైబ్రిడ్ అన్యూటీ మోడల్ (హెచ్ఏఎమ్)లో 40 శాతం ప్రభుత్వ, 60 శాతం ప్రయివేటు డెవలపర్ల నిధులతో 2028 వరకల్లా 17 వేల కిలోమీటర్ల గ్రామీణ రోడ్లను రూ.28 వేల కోట్ల అంచనాతో వేయించాలని లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. 12 జిల్లా కేంద్రాల్లో కోర్టు భవనాలు కట్టిస్తున్నామన్నారు. ఆర్ఆర్ఆర్‌ను భవిష్యత్తులో 88 లేన్లకు విస్తరిస్తామని ప్రకటించారు.

పర్యాటకం ద్వారా 3 లక్షల ఉద్యోగాలు సృష్టిస్తాం

జీఎస్‌డీపీలో పర్యాటక రంగం వాటాను పది శాతానికి పెంచుతామనీ, రూ.15 వేల కోట్లను ఆకర్షించి మూడు లక్షల ఉద్యోగాలను సృష్టిస్తామని మంత్రి భట్టి నొక్కి చెప్పారు. పర్యాటక శాఖకు రూ.775 కోట్లు ప్రకటించారు.టూరిజం పాలసీలో భాగంగా 27 ప్రత్యేక పర్యాటక ప్రాంతాలను అభివృద్ధి చేస్తామని వెల్లడించారు. క్రీడా శాఖకు బడ్జెట్‌లో రూ.465 కోట్లను మంత్రి భట్టి ప్రతిపాదించారు. సమగ్ర క్రీడా విధానంలో భాగంగా 12 క్రీడల అకాడమీలతో యంగ్ ఇండియా స్పోర్ట్స్ యూనివర్సిటీనీ, ఫ్యూచర్‌సిటీలో అంతర్జాతీయ ప్రమాణాలతో స్పోర్ట్స్ హబ్‌ను ఏర్పాటు చేయబోతున్నట్టు ప్రకటించారు. ప్రస్తుమున్న 24.05 అటవీ శాతాన్ని 33 శాతానికి పెంచుతామని చెప్పారు. దేవాదాయ శాఖకు రూ.190 కోట్లు ప్రతిపాదించారు.

మంచిరేవులలో యంగ్ ఇండియా పోలీస్ రెసిడెన్షియల్ పాఠశాల

సైనిక స్కూళ్ల మాదిరిగా రంగారెడ్డి జిల్లా మంచిరేవులలో యంగ్ ఇండియా పోలీస్ రెసిడెన్షియల్ పాఠశాలను అంతర్జాతీయ ప్రమాణాలతో ఏర్పాటు చేయబోతున్నట్టు ప్రకటించారు. మాదక ద్రవ్యాల వాడకాన్ని అరికట్టేందుకు తమ ప్రభుత్వం ఏడాది కాలంలో రూ.148 కోట్ల విలువైన మాదకద్రవ్యాలను పట్టుకుందని వివరించారు. హోంశాఖకు బడ్జెట్‌లో రూ.10,188 కోట్లు ప్రతిపాదించారు. తెలంగాణ బడ్జెట్‌లో ప్రస్తావించిన ప్రణాళికలు కేవలం ఆర్థిక ప్రతిపాదనలు మాత్రమే కాదని ఈ సందర్భంగా డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క వ్యాఖ్యానించారు. సమాన అభివృద్ధికి, ఆర్థిక స్థిరత్వానికి, సామాజిక న్యాయానికి మార్గదర్శికలు అని నొక్కి చెప్పారు. తెలంగాణ భవిష్యత్తును తీర్చిదిద్దాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపైనా ఉందన్నారు. అంతిమంగా అసమానతలు లేని వ్యవస్థ స్థాపనే లక్ష్యంగా ఈ బడ్జెట్‌ను రూపొందించామని ఆయన తెలిపాం

నవచిత్రం

అలరించే 'ఓ అందాల రాక్షసి'



దర్శకుడిగా, హీరోగా, సంగీత దర్శకుడిగా, కథకుడిగా షెరాజ్ మెహదీ ఇటు తెలుగు, అటు తమిళ ఆడియెన్స్‌ను ఆకట్టుకుంటూ వస్తున్నారు. షెరాజ్ మెహదీ ప్రస్తుతం తెలుగు ఆడియెన్స్ ముందుకు 'ఓ అందాల రాక్షసి' అనే చిత్రంతో హీరోగా, దర్శకుడిగా మరోసారి రాబోతున్నారు. ఈ చిత్రంలో విహాన్షి హెగ్డే, కృతి వర్మలు హీరోయిన్లుగా నటించారు.

స్కై ఈజ్ ది లిమిట్ బ్యానర్ మీద సురీందర్ కౌర్ నిర్మాతగా, తేజిందర్ కౌర్ సహ నిర్మాతగా షేర్ సమర్పణలో ఈ చిత్రం రాబోతోంది. ఈనెల 21న ఈ చిత్రం రిలీజ్ అవుతుంది. ఈ క్రమంలో వైభవంగా ప్రీ రిలీజ్ ఈవెంట్ నిర్వహించారు.

తమ్మారెడ్డి భరద్వాజ్ మాట్లాడుతూ, 'ఉమెన్ సెంట్రిక్‌గా సాగే ఈ సినిమా కథ చాలా బాగుంది. స్క్రిప్ట్ కూడా చాలా నచ్చింది. ఇలాంటి చిన్న సినిమాలు పెద్ద విజయాన్ని సాధించాలి. భాష్యశ్రీ కథ, షెరాజ్ టేకింగ్ బావుంది. ఈనెల 21న రాబోతున్న ఈ చిత్రం పెద్ద విజయాన్ని సాధించాలని కోరుకుంటున్నాను' అని అన్నారు. 'చిన్న చిత్రాల్లో నటించి మాలాంటి వాళ్లకు సపోర్ట్ ఇచ్చిన తమ్మారెడ్డికి థ్యాంక్స్. ఈ సినిమా థియేటర్లోకి రానంతవరకే చిన్న సినిమా. ఒకసారి మా సినిమా థియేటర్‌లోకి వచ్చాక దాని రేంజ్ ఏంటో ఆడియన్స్‌కి తెలుస్తుంది. ఓ మంచి సినిమాతో ప్రేక్షకుల ముందుకు రాబోతున్నందుకు చాలా ఆనందంగా ఉంది. ఈ సినిమా తప్పకుండా మంచి విజయం సాధిస్తుందని ఆశిస్తున్నా' అని హీరో షెరాజ్ మెహదీ చెప్పారు.

ఆద్యంతం నవ్విస్తాం



సప్తగిరి

సప్తగిరి నటించిన చిత్రం 'పెళ్లి కాని ప్రసాద్'. అభిలాష్ రెడ్డి గోపిడి దర్శకత్వం వహించిన ఈ చిత్రాన్ని థామ మీడియా ఎంటర్టైన్మెంట్స్ బ్యానర్‌పై విజన్ గ్రూప్ కె.వై. బాబు, భాను ప్రకాష్ గౌడ్, సుక్కా వెంకటేశ్వర్ గౌడ్, వైభవ్ రెడ్డి ముత్యాల కలిసి నిర్మించారు. చాగంటి సినిమాటిక్ వరల్డ్ సమర్పిస్తోంది. దిల్ రాజు నేతృత్వంలోని శ్రీ వెంకటేశ్వర క్రియేషన్స్ ఈ చిత్రాన్ని రిలీజ్ చేస్తోంది. ఈ సినిమా ఈనెల 21న థియేటర్లలోకి రానుంది. ఈ సందర్భంగా హీరో సప్తగిరి మీడియాతో పలు విశేషాలను షేర్ చేసుకున్నారు.

- సప్తగిరి ఎక్స్‌ప్రెస్, సప్తగిరి ఎల్.ఎల్.బి, వజ్ర మకుట దర గోవిందా.. ఈ మూడు సినిమాలు కమర్షియల్ జోనర్‌లో మెప్పించే చిత్రాలు చేశాను. ప్రజలు 100% ఆదరించారు. ఫన్ జోనర్‌లో కామెడీకి మంచి స్కోప్ ఉండే ఒక క్యారెక్టర్ చేయాలనుకున్నాను. అలాంటి సమయంలో ఈ 'పెళ్లి కాని ప్రసాద్' కథ వచ్చింది. స్క్రిప్ట్ విన్నాను చాలా నచ్చింది.
- డైరెక్టర్ అభిలాష్ ఈ కథ చెప్పినప్పుడు చాలా నవ్వించాడు. అప్పుడే సినిమా డెఫినెట్‌గా వర్కౌట్ అవుతుందని నమ్మకం వచ్చింది. చిన్నచిన్న డౌట్స్ ఉంటే మారుతి వద్దకి, తీసుకువెళ్లి వినిపించాం. ఆయన విని చాలా బాగుందని చెప్పి, ఫస్ట్ కాపీతో రమ్మని చెప్పారు. ఫస్ట్ కాపీ తీసుకెళ్లి ఆయనకి చూపించాం. సినిమా చూసి చాలా అప్రిషియేట్ చేశారు. సరైన దారిలో సినిమాని తీసుకెళ్లారని అభినందించారు.
- టైటిల్ సెలక్షన్ డైరెక్టర్‌దే. వెంకటేష్ కెరీర్‌లో ఐకానిక్ క్యారెక్టర్ 'పెళ్లి కాని ప్రసాదు'. ఈ కథకి ఈ టైటిల్ పర్ఫెక్ట్. ఆ టైటిల్ వెయిట్‌ని కాపాడేలా ఉంటుంది సినిమా. ఎంటర్టైన్మెంట్ చాలా అద్భుతంగా వర్కౌట్ అయింది. అనిల్‌కి థాంక్స్ చెప్తున్నాను. శిరీష్ ఈ సినిమా చూసి మమ్మల్ని అభినందించారు. ఈ సినిమాని ఎస్వీసిలో రిలీజ్ చేయడం మా అదృష్టంగా భావిస్తున్నాం. నా కెరీర్ అసిస్టెంట్ డైరెక్టర్‌గా, యాక్టర్‌గా దిల్ రాజు బ్యానర్‌లోనే మొదలైంది. వాళ్ళు కంటెంట్ నచ్చితేనే సినిమాని రిలీజ్ చేస్తారు. మా సినిమాని రిలీజ్ చేయడం చాలా సంతోషంగా ఉంది.
- ప్రభాస్, వెంకటేష్, దిల్ రాజు, శిరీష్, మారుతి, అనిల్ రావిపూడి అందరూ చాలా హెల్ప్ చేశారు. వారికి ప్రత్యేక ధన్యవాదాలు తెలుపుతున్నాను. ఈ సినిమాతో ఆద్యంతం నవిస్తాం.

స్వచ్ఛమైన ప్రేమకథా చిత్రం




వినయ్ కుమార్, శ్రావణి మజ్జరి, అరవింద్ ముదిగొండ, నోమిన తార ప్రధాన పాత్రల్లో నటించిన సినిమా 'కాలమేగా కరిగింది'. ఈ సినిమాను శింగర క్రియేటివ్ వర్క్స్ బ్యానర్ పై మరే శివశంకర్ నిర్మించారు. శింగర మోహన్ దర్శకత్వం వహిస్తున్నారు. పొయెటిక్ లవ్‌స్టోరీగా తెరకెక్కిన ఈ సినిమా ప్రపంచ కవితా దినోత్సవం సందర్భంగా ఈ నెల 21న గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్‌కు రెడీ అవుతోంది. ఈ నేపథ్యంలో సినిమా ప్రీ రిలీజ్ ఈవెంట్‌ను మేకర్స్ ఘనంగా నిర్వహించారు.

ప్రొడ్యూసర్ మరే శివశంకర్ మాట్లాడుతూ, 'ఈ సినిమాకు సపోర్ట్ చేసిన డైరెక్టర్ గౌతమ్ వాసుదేవ్ మీనన్‌కి, ఆనంద్ దేవరకొండకు థ్యాంక్స్. ఆదిత్య మ్యూజిక్ మా పాటలు బాగా రీచ్ అయ్యేలా సపోర్ట్ చేసింది. అచ్చ తెలుగులో చేసిన స్వచ్ఛమైన ప్రేమ కథ ఇది. మీరంతా మా మూవీని ఈ నెల 21న థియేటర్స్‌లో చూసి ఆదరిస్తారని ఆశిస్తున్నాం' అని అన్నారు.

'మోస్ట్ పొయెటిక్ లవ్ స్టోరీ మా సినిమా అని చెప్పేందుకు గర్వంగా ఉంది. మా మూవీ ట్రైలర్ లాంచ్ చేసిన డైరెక్టర్ గౌతమ్ వాసుదేవ్ మీనన్‌కి థ్యాంక్స్. ఆయన ప్రశంసలు మా సినిమాకు దక్కడం సంతోషంగా ఉంది. మా సినిమా పొయెటిక్‌గా ఉంటుంది. ఈ కథను తన మ్యూజిక్‌తో మరింత బ్యూటీఫుల్‌గా తయారు చేశారు మ్యూజిక్ డైరెక్టర్ గుడప్పన్. ఈ సినిమా నుంచి రిలీజ్ చేసిన సాంగ్స్, టీజర్, ట్రైలర్ బాగున్నాయి అంటే అందుకు గుడప్పన్ మ్యూజిక్ వన్ ఆఫ్ ది రీజన్. డీవోపీ వినీత్ మా సినిమాకు కళ్లలా పనిచేశాడు. తన కెమెరాతో సినిమాను అందంగా చూపించాడు. ఎడిటర్ యోగేష్ ఎన్ని వెర్షన్స్ అయినా చేసి ఇచ్చాడు' అని డైరెక్టర్ శింగర మోహన్ తెలిపారు.

ఆటలు



శ్రీకాంత్ శుభారంభం

స్విస్ ఓపెన్ బ్యాడ్మింటన్

బసెల్ : స్విస్ ఓపెన్‌లో భారత అగ్రశ్రేణి షట్లర్ కిదాంబి శ్రీకాంత్ శుభారంభం చేశాడు. పురుషుల సింగిల్స్ తొలి రౌండ్లో హెచ్.ఎస్ ప్రణయ్‌పై 23-21, 23-21తో ఉత్కంఠ విజయం సాధించాడు. సూపర్ టైబ్రేకర్లకు దారితీసిన రెండు గేముల్లోనూ పైచేయి సాధించిన శ్రీకాంత్ సహచర షట్లర్‌పై గెలుపొందాడు. శంకర్ ముతుస్వామి 21-5, 21-16తో మాగ్నస్‌పై మెరుపు విజయంతో ముందంజ వేశాడు. ఆయుశ్ శెట్టి 2-15, 21-19తో వరుస గేముల్లో నిషిమోటో చేతిలో భంగపడ్డాడు. మహిళల సింగిల్స్‌లో ఇషారాణి 18-21, 21-17, 22-20తో సహచర షట్లర్ ఆకర్షి కశ్యప్‌పై పైచేయి సాధించగా.. అన్మోల్‌పై అనుపమ 2-14, 21-13తో వరుస గేముల్లో గెలుపొందింది. మహిళల డబుల్స్‌లో ట్రెసా జాలి, పుల్లెల గాయత్రి జోడీ 21-16, 21-17తో తొలి రౌండ్లో విజయం సాధించింది. ప్రియ, శృతిలు 11-21, 19-21తో.. ఆర్తి, వర్షిణీలు 13-21, 3-21తో పరాజయం పాలయ్యారు.

ముంబయి కెప్టెన్‌గా సూర్య

చెన్నైతో మ్యాచ్‌కు హార్దిక్ దూరం



ముంబయి : ఐపీఎల్18లో ముంబయి ఇండియన్స్ తొలి మ్యాచ్‌కు సూర్యకుమార్ యాదవ్ కెప్టెన్సీ వహించనున్నాడు. గత సీజన్‌లో స్లో ఓవర్ రేట్ కారణంగా హార్దిక్ పాండ్యపై ఓ మ్యాచ్ నిషేధం పడింది. దీంతో సీజన్‌లో తొలి మ్యాచ్‌కు హార్దిక్ బెంచ్‌కు పరిమితం కానున్నాడు. ఈ నెల 23న చెపాక్‌లో చెన్నై సూపర్‌కింగ్స్‌తో ముంబయి ఇండియన్స్ తొలి మ్యాచ్ ఆడనుంది. గుజరాత్ టైటాన్స్‌తో (మార్చి 29) మ్యాచ్‌కు హార్దిక్ తిరిగి కెప్టెన్సీ పగ్గాలు చేపట్టనున్నట్టు ముంబయి ఇండియన్స్ ఫ్రాంచైజీ వెల్లడించింది. గాయం కారణంగా స్టార్ పేసర్ జస్‌ప్రీత్ బుమ్రా తొలి దశ మ్యాచులకు దూరం కావటం సైతం ముంబయి ఇండియన్స్‌కు ప్రతికూలంగా మారనుంది.



క్రీడలకు రూ.465 కోట్లు

- రాష్ట్ర బడ్జెట్‌లో క్రీడారంగానికి భారీగా కేటాయింపులు
- హర్షం వ్యక్తం చేసిన శాట్ చైర్మెన్ శివసేనా రెడ్డి



నవతెలంగాణ-హైదరాబాద్ : తెలంగాణ రాష్ట్ర బడ్జెట్‌లో క్రీడా రంగానికి రూ.465 కోట్లు కేటాయించారు. గత ఏడాది బడ్జెట్‌తో పోల్చితే రూ. 100 కోట్లు అదనంగా కేటాయింపులు చేశారు. తెలంగాణను స్పోర్ట్స్ హబ్‌గా తీర్చిదిద్దేందుకు హకీంపేట్‌లోని క్రీడా పాఠశాలలోని సుమారు 200 ఎకరాల సువిశాల క్యాంపస్‌లో యంగ్ ఇండియా స్పోర్ట్స్ యూనివర్శిటిని ఏర్పాటు చేస్తామని, ఫోర్త్ సిటీలో స్పోర్ట్స్ హబ్ సహా ప్రపంచ స్థాయి ప్రమాణాలతో క్రీడా సదుపాయాలు కల్పిస్తామని బడ్జెట్ ప్రసంగంలో డిప్యూటీ ముఖ్యమంత్రి, ఆర్థిక శాఖ మంత్రి మల్లు భట్టివిక్రమార్క పేర్కొన్నారు. రాష్ట్రంలో ఏర్పాటు చేయనున్న యంగ్ ఇండియా స్పోర్ట్స్ యూనివర్శిటీలో 12 క్రీడా అకాడమీలు నెలకొల్పనున్నారు. అంతర్జాతీయ స్థాయిలో సత్తా చాటి తెలంగాణ ఖ్యాతిని పెంచిన మహ్మద్ సిరాజ్, నిఖత్ జరీన్, దీప్తి జీవాంజిలను బడ్జెట్ ప్రసంగంలో ఉప ముఖ్యమంత్రి ప్రత్యేకంగా ప్రస్తావించారు. బడ్జెట్‌లో క్రీడలకు భారీ కేటాయింపులు చేయటం పట్ల క్రీడాకారులు, కోచ్‌లు, శాట్ సిబ్బంది ఎల్బీ స్టేడియంలో హర్షం వ్యక్తం చేశారు. బాణాసంచా కాలుస్తూ, మిఠాయిలు పంచుతూ... ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టివిక్రమార్క చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు.

క్రీడలకు పెద్ద పీట : శాట్ చైర్మెన్ శివసేనా రెడ్డి

తెలంగాణను స్పోర్ట్స్ హబ్‌గా తీర్చిదిద్దేందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పట్టుదలగా ఉన్నారు. అందుకు అనుగుణంగా రాష్ట్ర వ్యాప్తంగా మౌలిక సదుపాయాల కల్పన, నూతన స్టేడియాల నిర్మాణం, స్టేడియాల ఆధునీకరణపై క్రీడా ప్రాధికార సంస్థ (శాట్) దష్టి పెట్టనుంది. ఈ ఏడాది కొత్త స్టేడియాల నిర్మాణం కోసం రూ.81.81 కోట్లు, రాష్ట్ర క్రీడా సంఘాల గ్రాంట్ సహా ప్రతిభావంతులైన క్రీడాకారుల నగదు ప్రోత్సాహకాలకు రూ.16.6 కోట్లు, స్పోర్ట్స్ స్కూల్స్ అభివద్ధికి రూ.51.68 కోట్లు సహా శాట్స్ నూతనంగా చేపట్టబోతున్న క్రీడాభివద్ధి కార్యక్రమాలకు రూ.275 కోట్లు కేటాయించటం హర్షనీయనీయం. బీఆర్ఎస్ ప్రభుత్వం చివరి బడ్జెట్‌లో క్రీడలకు రూ.134.80 కోట్లు కేటాయించగా... కాంగ్రెస్ ప్రభుత్వం ఏకంగా రూ.331 కోట్లు అదనంగా కేటాయించటం క్రీడాభివద్ధి పట్ల సర్కార్ చిత్తశుద్ధికి నిదర్శమని శాట్ చైర్మెన్ కే. శివసేనారెడ్డి అన్నారు.

ఆ రూల్స్ కొనసాగుతాయి!

బీసీసీఐ కార్యదర్శి దేవజిత్ సైకియా



ముంబయి : భారత జట్టు విదేశీ పర్యటనల్లో క్రికెటర్ల కుటుంబ సభ్యులను అనుమతించే అంశంలో బీసీసీఐ మార్గదర్శకాల్లో ఎటువంటి మార్పు ఉండోదని బోర్డు కార్యదర్శి దేవజిత్ సైకియా తెలిపారు. ఇటీవల ఆస్ట్రేలియా పర్యటన అనంతరం బీసీసీఐ పది పాయింట్ల స్టాండర్డ్ ఆపరేటింగ్ ప్రొసీజర్ (ఎస్ఓపి) రూపొందించిన సంగతి తెలిసిందే. కొత్త రూల్స్‌పై స్టార్ క్రికెటర్ విరాట్ కోహ్లి అసంతృప్తి వ్యక్తం చేశాడు. మ్యాచ్ అనంతరం హోటల్ గదిలో ఒంటరిగా కూర్చోవాలా? అంటూ ప్రశ్నించాడు. ఈ నేపథ్యంలో దేవజిత సైకియా స్పందించాడు. బీసీసీఐ సుదీర్ఘ సంప్రదింపులు, చర్చల అనంతరం రూల్స్‌ను తీసుకొచ్చింది. ఐసీసీ చాంపియన్స్ ట్రోఫీలో కొత్త రూల్స్ అమలు చేశాం. రానున్న విదేశీ పర్యటనల్లోనూ ఈ రూల్స్ కొనసాగుతాయని, ఎటువంటి మార్పులు ఉండవని సైకియా స్పష్టం చేశారు.



వైద్యారోగ్యానికి రూ.12,393 కోట్లు కేటాయింపు

గతేడాది కన్నా రూ.800 కోట్లు అధికం | రాష్ట్ర బడ్జెట్‌లో 4.06 శాతం



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

వైద్యారోగ్య రంగానికి రాష్ట్ర ప్రభుత్వం 2025-26 వార్షిక బడ్జెట్‌లో రూ.12,393 కోట్లు కేటాయించింది. గతేడాది కన్నా రూ.800 కోట్లు అధికంగా ప్రస్తుత రాష్ట్ర బడ్జెట్ రూ.3,04,965 లక్షల కోట్లలో 4.06 శాతంగా ఉంది. ప్రజారోగ్యరంగం బలోపేతానికి కనీసం 8 నుంచి 10 శాతం నిధులు కేటాయించాలని డిమాండ్ ఉన్నా గత కొన్ని సంవత్సరాలుగా వైద్యారోగ్య బడ్జెట్ 4 శాతానికి అటు, ఇటుగా ఉంటుందే తప్ప పెరగడం లేదు. గతేడాది బడ్జెట్ అంచనాలు రూ.11,468 కాగా అందులో, సవరించిన బడ్జెట్ రూ.11,043కు తగ్గింది. ఇది 2024-25 బడ్జెట్ రూ.2,91,159 కోట్లలో 3.9 శాతంగా ఉంది. కోవిడ్-19 మహమ్మారి వణికించిన ఏడాది 2020-21లో మాత్రమే అప్పటి రాష్ట్ర బడ్జెట్‌లో 4.3 శాతం కేటాయించారు. ఆ తర్వాత 2021-22లో అది 3.3 శాతానికి తగ్గింది. 2022-23లో దాదాపు ఐదు శాతానికి పెరిగి, ఆ తర్వాత తగ్గుతూ వస్తున్నది. గతేడాదితో పోలిస్తే స్వల్పంగా పెరిగిన బడ్జెట్‌లో కొన్ని అంశాలకు ప్రాధాన్యత ఇచ్చారు. ఆరోగ్య సదుపాయాల నిర్వహణకు గతేడాది రూ.5,181 కోట్లు ఉండగా ఈ ఏడాది రూ.485.80 కోట్లు అదనంగా రూ.5,666.86 కోట్లు కేటాయించారు. ఆరోగ్య పథకాల బడ్జెట్‌ను రూ.5,216.66 కోట్ల నుంచి రూ.6,070.27 కోట్ల పెంచారు. గతేడాది కన్నా ఇది రూ.853.61 కోట్లు అదనం. రాజీవ్ ఆరోగ్యశ్రీ పథకానికి అధిక ప్రాధాన్యతనిచ్చారు. 2023 డిసెంబర్ నుంచి ప్రభుత్వం వివిధ ఆస్పత్రులకు ఆరోగ్యశ్రీ పథకం కింద రూ.1,215 కోట్లు (గత సంవత్సరాల కన్నా 50 శాతం అధికం) విడుదల చేసినట్టు తెలిపింది. నిర్వహణ కింద డీఎంఈకి రూ.2,293 కోట్లు, డీహెచ్ కు రూ.1,252 కోట్లు, ఈహెచ్ఎస్ కు రూ.150 కోట్లు, ఆయుష్మాన్ భారత్‌కు రూ.81 కోట్లు ఇచ్చారు. గతేడాది జీరోగా ఉన్న ఎంసీహెచ్ కిట్ కు రూ.16 కోట్లు కేటాయించారు. రూ.2,700 కోట్లతో 27 ఎకరాల్లో ఉస్మానియా ఆస్పత్రిని పునర్నిర్మిస్తున్నట్టు ప్రకటించింది.

ఆ ఆస్పత్రులపై ప్రత్యేక శ్రద్ధ అవసరం -డాక్టర్ కిరణ్ మాదాల

హైదరాబాద్ నగర జనాభా పెరుగుతున్న దృష్ట్యా ఉస్మానియా, గాంధీ ఆస్పత్రులపై ప్రత్యేక శ్రద్ధ కనబరచాలని తెలంగాణ ప్రభుత్వ బోధనా వైద్యుల సంఘం సెక్రెటరీ జనరల్ డాక్టర్ కిరణ్ మాదాల తెలిపారు. వీటితో పాటు కాకతీయ మెడికల్ కాలేజీకి పునర్వైభవం తేవాల్సిన అవసరముందని చెప్పారు. ఒకప్పుడు ప్రయివేటు రంగంతో పోటీ పడిన ఈ ఆస్పత్రులు గత 20 ఏండ్లుగా పోటీని తట్టుకోలేకపోతున్నాయని వివరించారు. వచ్చే పదేండ్లలో హైదరాబాద్ జనాభా రాష్ట్ర జనాభాలో 40 శాతం కానున్న నేపథ్యంలో ఇక్కడి పేదలకు మెరుగైన వైద్యం, విద్యార్థులకు మెరుగైన వైద్యవిద్య కోసం వీటిని మరింత బలోపేతం చేయాలని సూచించారు.

ఉద్యోగుల సమస్యల ప్రస్తావనేది? :భూపాల్

వైద్యారోగ్య రంగం కీలకమంటూనే ఆ శాఖలో పని చేసే ఉద్యోగుల సమస్యలను ప్రస్తావించలేదని తెలంగాణ యునైటెడ్ మెడికల్ అండ్ హెల్త్ ఎంప్లాయిస్ యూనియన్ గౌరవాధ్యక్షులు భూపాల్ తెలిపారు. కాంగ్రెస్ సర్కారు ఉద్యోగుల పట్ల వివక్ష చూపించిందని విమర్శించారు. కేటాయింపులు ఉద్యోగుల జీతభత్యాలు, నిర్వహణకే సరిపోయేలా ఉన్నాయ చెప్పారు. కాంట్రాక్ట్ ఉద్యోగుల రెగ్యులరైజేషన్ అంటూ కాంగ్రెస్ ఇచ్చిన హామీపై ప్రకటన లేదన్నారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను బలోపేతం చేస్తే తప్ప ఆరోగ్యరంగం బలోపేతం కాదని స్పష్టం చేశారు.

40 శాతం సర్కారీ నిధులతో 'హ్యామ్'

- రోడ్ల అభివృద్ధికి సరికొత్త పథకం
- బడ్జెట్‌లో ఆర్అండ్‌బీకి రూ.5,907 కోట్ల ప్రతిపాదన
- ఆర్ఆర్ఆర్‌కు ప్రణాళిక




నవతెలంగాణ ప్రత్యేక ప్రతినిధి-హైదరాబాద్

రాష్ట్రంలోని రోడ్ల అభివృద్ధికి సర్కారు కొత్త ప్రయోగానికి శ్రీకారం చుట్టింది. 2025-26 ఆర్థిక సంవత్సరం బడ్జెట్‌లో ఈ సంగతిని ప్రకటించింది. హైబ్రిడ్ అన్యూటీ మోడల్(హ్యామ్) పథకం ద్వారా రహదారులను అభివృద్ధి చేయాలని నిర్ణయించింది. ఈ మోడల్‌లో 40 శాతం ప్రభుత్వ నిధులు, 60 శాతం ప్రయివేటు డెవలపర్ల పెట్టుబడితో రోడ్లను నిర్మిస్తారు. తాజా 2025-25 బడ్జెట్‌లో రూ.5,907 కోట్లను ప్రతిపాదించింది. హ్యామ్ మోడల్ ద్వారా 2028 వరకు 17 వేల కిలోమీటర్ల మేర గ్రామీణ రహదారులను సుమారు రూ. 28 వేల కోట్ల అంచనా వ్యయంతో అభివృద్ధి చేయాలని లక్ష్యంగా పెట్టుకుంది. కొత్తగా 769.35 కిలో మీటర్ల పొడవు కలిగిన రహదారుల నిర్మాణానికి రూ.3,725.22 మేరకు పరిపాలనా అనుమతులు మంజూరు చేసింది. వీటిలో 55 కిలోమీటర్ల పొడవు కలిగిన రహదారులు, తొమ్మిది బ్రిడ్జిల నిర్మాణం ఇప్పటికే పూర్తయినట్టు బడ్జెట్‌లో సర్కారు ప్రకటించింది. గ్రామీణ ప్రాంతాల్లో రోడ్లను మరమ్మతులు చేసినట్టు తెలియజేసింది. ఇకపోతే హైదరాబాద్ నగరానికి నలువైపులా జాతీయ రహదారి నెట్‌వర్క్‌లో ఉన్న లోటును పూడ్చడానికి రీజినల్ రింగు రోడ్డు(ఆర్ఆర్ఆర్) రూపొందించబడింది. ఈ రహదారిని ఎక్స్‌ప్రెస్‌వే ప్రమాణాలతో అభివృద్ధి చేయాలనీ, తొలుత నాలుగు లేన్లుగా నిర్మించి భవిష్యత్తులో ట్రాఫిక్‌కు అనుగుణంగా ఎనిమిది లేన్లకు విస్తరించాలని సర్కారు ప్రణాళిక. ఈ ప్రాజెక్టు నిర్మాణంలో ఉత్తర భాగ భూసేకరణ ప్రక్రియ ఇప్పటికే ప్రారంభమైంది. దక్షిణ భాగానికి సమగ్ర ప్రాజెక్టు రిపోర్టు తయారీకి ఎన్‌హెచ్ఏఐ కన్సల్టెంట్‌లను నియమించింది. ఈ ప్రాజెక్టు తెలంగాణ అభివృద్ధికి గేమ్‌చేంజర్‌గా ప్రభుత్వం పరిగణిస్తున్నది. ఈనేపథ్యంలో నిధులను సమకూర్చుకోవడం సర్కారుకు సవాల్ కానుంది. రాజకీయ కారణాలతో కేంద్రం నుంచి నిధులు రావడం లేదు. సౌత్ వింగ్‌కు కేంద్రం నిధులు ఇస్తామనీ చెప్పింది. అలాగే నార్త్ వింగ్‌కు తొలుత రాష్ట్ర ప్రభుత్వం భరించాలని భావించింది. ఆర్థిక పరిస్థితులు క్లిష్టంగా ఉండటంతో కేంద్రంపైనే భారం వేయాలని నిర్ణయించింది. అయితే మోడీ సర్కారు నుంచి సహకారం అంతంతగానే ఉండటంతో సర్కారు తలపట్టుకుంటున్నది.

బడ్జెట్‌లో పర్యాటకానికి రూ.775 కోట్లు

- రూ.15వేల కోట్ల ప్రయివేట్ పెట్టుబడులు లక్ష్యం
- పీపీపీ పద్ధతిలో 27 ప్రాంతాల అభివృద్ధి



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

పర్యాటక రంగానికి రాష్ట్ర ప్రభుత్వం 2025-26 బడ్జెట్లో రూ.775 కోట్లు కేటాయించింది. తెలంగాణ పర్యాటక పాలసీ లక్ష్యాలను బడ్జెట్లో ఆవిష్కరించింది. జీఎస్‌డీపీలో పర్యాటక రంగం వాటాను 10 శాతానికి పెంచడం, రూ.15,000 కోట్ల పెట్టుబడులను ఆకర్షించి 3 లక్షల ఉద్యోగాలను సృష్టించాలని లక్ష్యంగా నిర్ణయించారు. రాబోయే ఐదేండ్ల కాలం (2030 నాటికి) 10 కోట్ల దేశీయ పర్యాటకులతో పాటు 5 లక్షల అంతర్జాతీయ పర్యాటకులను ఆకర్షించడం ఈ పాలసీ ప్రధాన ఉద్దేశం. రాష్ట్రంలో 27 ప్రత్యేక పర్యాటక ప్రాంతాలను పీపీపీ పద్ధతిలో అభివృద్ధి చేయడంతో పాటు, రాజీవ్ గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయం, రీజనల్ రింగ్ రోడ్ సమీపంలో మౌలిక వసతులు అభివృద్ధి చేయనున్నట్టు ఆర్థిక శాఖ మంత్రి భట్టి విక్రమార్క తన బడ్జెట్ ప్రసంగంలో పేర్కొన్నారు. గోదావరి, కృష్ణా నదులపై జెట్టీలు, లాంచి స్టేషన్లు, వాటర్ స్పోర్ట్స్, హౌస్ బోట్లు, నదీ ఉత్సవాలను ప్రోత్సహిస్తూ, పెట్టుబడులకు మూలధన సబ్సిడీలు, భూమి వినియోగ మార్పిడికి సంబంధించిన రాయితీలు అందిస్తామని ప్రభుత్వం ప్రకటించింది. ప్రత్యేక కేటాయింపులు కాకుండా ప్రయివేట్ పెట్టుబడులు సమీకరించడం ద్వారా ఈ రంగాన్ని అభివృద్ధి చేయాలనే లక్ష్యంతో సర్కార్ ఉంది. ఈ విధానం వల్ల భవిష్యత్‌లో పర్యాటకం తెలంగాణలో ఖరీదుగా మారే ఆవకాశం ఉందని సర్వత్రా ఆందోళన వ్యక్తమవుతోంది.

విద్యారంగ కేటాయింపుల్లో తీవ్ర అన్యాయం

ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర సమితి



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన 2025-26 బడ్జెట్‌లో విద్యారంగానికి నిధుల కేటాయింపులో తీవ్ర అన్యాయం జరిగిందని ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు కసిరెడ్డి మణికంఠరెడ్డి, కార్యదర్శి పుట్ట లక్ష్మణ్ బుధవారం ఒక ప్రకటనలో విమర్శించారు. ప్రజాప్రభుత్వంలో విద్యారంగం అభివృద్ధికి నోచుకోదా?అని ప్రశ్నించారు. రూ.3,04,965 కోట్ల బడ్జెట్‌లో విద్యారంగానికి రూ.23,108 (7.57 శాతం) కోట్లు కేటాయించిందని తెలిపారు. గతం కంటే ఇప్పుడు 1,816 (0.2 శాతం) కోట్లు పెంచిందని పేర్కొన్నారు. మ్యానిఫెస్టోలో విద్యకు 15 శాతం నిధులను కేటాయిస్తామంటూ కాంగ్రెస్ హామీ ఇచ్చిందని గుర్తు చేశారు. తక్కువ నిధులతో ప్రభు త్వ విద్యాసంస్థలు ఎలా బలోపేతం అవుతాయని ప్రశ్నించారు. ఫీజు బకాయిలు రూ.ఎనిమిది వేల కోట్లు పెండింగ్‌లో ఉన్నాయని తెలిపారు. వాటి ఊసేలేదని పేర్కొన్నారు. విద్యారంగానికి కేటాయించిన నిధులను సవరించి పెంచాలని కోరారు.

విద్యారంగాన్ని నిర్లక్ష్యం చేసిన ప్రభుత్వం : పీడీఎస్‌యూ

రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో విద్యారంగాన్ని తీవ్రంగా నిర్లక్ష్యం చేసిందని పీడీఎస్‌యూ రాష్ట్ర అధ్యక్షులు కాంపాటి పృథ్వీ, ప్రధాన కార్యదర్శి అనిల్ సాయిబోలా ఒక ప్రకటనలో తెలిపారు. విద్యకు అంతంత మాత్రంగానే నిధులను కేటాయించిందని పేర్కొన్నారు. ఎన్నికల మ్యానిఫెస్టోలో 15 నిధులను కేటాయిస్తామంటూ కాంగ్రెస్ హామీ ఇచ్చిందని తెలిపారు. అందులో సగం మాత్రమే కేటాయించిందని వివరించారు. ప్రభుత్వ విద్యారంగాన్ని బలోపేతం చేయడం పట్ల ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేదని తెలిపారు. ప్రజాస్వామికవాదులు, మేధావులు, విద్యార్థి సంఘాలతో చర్చించి విద్యారంగానికి అవసరమైన నిధులను పెంచాలని డిమాండ్ చేశారు.

ప్రవచనాలెక్కువ...పైసలు తక్కువ

బడ్జెట్ పై బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్ర ప్రభుత్వం 2025-26 వార్షిక బడ్జెట్ ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో ప్రవచాలను ఎక్కువ, పైసలు తక్కువ అన్నట్టుగా ఉందని బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత ఎద్దేవా చేశారు. బుధవారం శాసనమండలి మీడియా పాయింట్ వద్ద బడ్జెట్ అనంతరం ఆమె మాట్లాడారు. బడ్జెట్ ప్రసంగంలో కొత్తదేమీ లేదనీ, ప్రతిసారి చెప్పినవే చెప్పడం తప్ప అందులో ఒక్క మాట నిజం లేదని తెలిపారు. ముఖ్యమంత్రి ఏ.రేవంత్ రెడ్డి ప్రతిసారి ఏడాదికి రూ.లక్ష కోట్లు అప్పులు కడుతున్నామనీ, అప్పుల కారణంగానే అభివృద్ధి చేయలేకపోతున్నామని చెబుతున్న మాటలు అబద్ధమని స్పష్టమైందన్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం చేసిన అప్పులపై తప్పుడు ప్రచారం చేశారని మండిపడ్డారు. రూ.7 లక్షల కోట్ల అప్పులు చేశారని ప్రజలను తప్పుదోవ పట్టించారని ఆగ్రహం వ్యక్తం చేశారు. బడ్జెట్ బుక్‌లో మాత్రం తెలంగాణ అప్పులను రూ. 4.37 లక్షల కోట్లుగా చూపించారనీ, ఇందులో రూ.లక్షా 58 వేల కోట్లు కాంగ్రెస్ ప్రభుత్వం చేసిన అప్పులు కూడా ఉన్నాయని తెలిపారు. దీన్ని బట్టి చూస్తే.. కాంగ్రెస్ నేతలు బీఆర్ఎస్ ప్రభుత్వం అప్పులపై ఏ విధంగా తప్పుడు ప్రచారం చేశారో ప్రజలు గమనించాలని ఈ సందర్భంగా ఎమ్మెల్సీ కవిత రాష్ట్ర ప్రజలను కోరారు.

కాంగ్రెస్ అసమర్థతోనే రాష్ట్రంలో కరువు

ఎండల వల్లే రాష్ట్రంలో పంటలు ఎండుతున్నాయని కాంగ్రెస్ నాయకులు మాట్లాడటం సిగ్గుచేటని బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవిత విమర్శించారు. గతేడాది వర్షాలు సమృద్ధిగా పండాయని, ప్రాజెక్టుల్లో నీళ్లు ఉన్నాయని ఆమె గుర్తుచేశారు. బుధవారం ఎండిన పంటలతో బీఆర్ఎస్ ఎమ్మెల్సీలు శాసనమండలికి వచ్చి ఆవరణలో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా కవిత మాట్లాడుతూ నీటి నిర్వహణలో కాంగ్రెస్ సర్కారు విఫలమైందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఏప్రిల్, మే నెలలో రైతుల పరిస్థితి మరింత దయనీయంగా ఉంటుందని ఆందోళన వ్యక్తం చేశారు. ఏపీ సీఎం చంద్రబాబు నాయుడు కృష్ణా నది నుంచి 10 వేల క్యూసెక్కుల నీటిని ఎత్తుకుపోతుంటే చూస్తూ కాంగ్రెస్ సర్కారు ఏం చేస్తున్నదని ప్రశ్నించారు. కేసీఆర్ నిర్మించారనే కోపంతో కాళేశ్వరం నీటిని వాడుకోకపోవడం సరికాదని హితవు పలికారు. ఇప్పటికైనా ఉన్న నీటి వనరులు వాడుకుని రైతులకు నీళ్లు ఇవ్వాలని సూచించారు. రైతుల పక్షాన బీఆర్ఎస్ పార్టీ పోరాటం చేస్తూనే ఉంటుందని స్పష్టం చేశారు.



తెలంగాణ వృద్ధి రేటు భేష్

- అన్ని రంగాల్లోనూ రైజింగే
- రూ.3,46,457 నుంచి రూ. 3,79,751కి పెరిగిన తలసరి ఆదాయం
- తెలంగాణ సామాజిక ఆర్థిక సర్వే-2025 నివేదిక వెల్లడి

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

'తెలంగాణ వృద్ధి రేటు భేష్. జాతీయ సగటుతో పోల్చితే అన్ని రంగాల్లో దూసుకుపోతోంది. 2024లో రాష్ట్ర తలసరి ఆదాయం రూ.3,46,457 కాగా, 2025లో రూ.3,79,751కి పెరిగింది' అని రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి మల్లు భట్టి విక్రమార్క బుధవారం శాసన సభలో ప్రవేశ పెట్టిన తెలంగాణ సామాజిక ఆర్థిక సర్వే-2025 నివేదిక వెల్లడించింది. దేశ తలసరి సగటు ఆదాయం కన్నా .8 శాతం అధికంగా ఉందని పేర్కొంది. గ్రాస్ స్టేట్ డొమెస్టిక్ ప్రొడక్ట్ ప్రస్తుత ధరల ప్రకారం 16,12,751 గా ఉందని వెల్లడించింది. ఇది దేశీయ సగటుతో పోల్చితే .2 శాతం అదికమని పేర్కొంది. అప్పులను ఆదాయాన్ని సమన్వయం చేసుకుంటూ గణనీమైన వృద్ధిని రాష్ట్రం నమోదు చేస్తోందని తెలిపింది. ఆర్థిక క్రమశిక్షణను పాటిస్తూ కఠినమైన నిర్ణయాలు తీసుకోని దీర్ఘకాలిక ఆర్థిక స్థిరత్వాన్ని సాధించే దిశగా చర్యలు చేపడుతున్నట్టు వెల్లడించింది. వ్యవసాయం, తయారీ, సమాచార సాంకేతిక, ఫార్మా మొదలగు రంగాలు తెలంగాణ ప్రధాన ఆర్థిక వనరులుగా ఉన్నాయని తెలిపింది. ఈ రంగాల్లో భారీగా పెట్టుబడులను ఆకర్షించి ఆర్థిక వృద్ధి, ఉపాధి అవకాశాలను పెంపొందించుకోవాలని సూచించింది. సంక్షేమ పథకాలను సవాలుగా తీసుకుని అమలు చేస్తున్నామనీ, ఈ పథకాల పట్ల ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారని నివేదికలో ప్రభుత్వం పేర్కొంది. విద్య, వైద్యం, పరిశ్రమలు, మహిళాభివృద్ధికి అధిక నిధులు వెచ్చిస్తున్నామనీ, ఫలితంగా ఈ రంగాల్లో గణనీయమైన వృద్ధి రేట్ నమోదైందని నివేదికలో పేర్కొంది. గతంలో పోలిస్తే అన్ని రంగాల్లో అభివృద్ధి వేగంగా జరగుతోందని సామాజిక ఆర్థిక సర్వే-2025 గణాంకాలు చెబుతున్నాయి. రాష్ట్ర ప్రభుత్వం స్థిరమైన, పారదర్శకమైన పాలనను అందిస్తూ ప్రజలకు భరోసా కల్పిస్తున్నట్టు నివేదిక వెల్లడించింది. గత ప్రభుత్వ తప్పిదాలను సవరించుకుంటూ రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి బాటలో నడిపించేందుకు ప్రణాళికాబద్దంగా ముందుకు వెలుతున్నట్టు నివేదికలో సర్కార్ తెలిపింది.

బ్యాంక్‌ల బలోపేతం కోసమే సమ్మె

బిజినెస్

కొత్త ఉద్యోగాలను భర్తీ చేయాలి ● పని భారాన్ని తగ్గించాలి ● 24, 25న దేశ వ్యాప్త ఆందోళనలకు యూఎఫ్‌బీయూ పిలుపు

- ఐదు రోజుల పనితో అధిక ఉత్పాదకత
- బ్యాంకింగ్ సంఘాల ప్రతినిధుల వెల్లడి



నవ తెలంగాణ - బిజినెస్ బ్యూరో

ప్రభుత్వ రంగ బ్యాంక్‌ల బలోపేతం, కొత్త ఉద్యోగాలను భర్తీ చేయాలని తొమ్మిది బ్యాంక్ యూనియన్లు డిమాండ్ చేస్తోన్నాయి. పలు సంస్థల్లో అమలు చేస్తోన్న ఐదు రోజుల పని విధానాన్ని తమకు వర్తింప చేయాలని కోరుతున్నాయి. ఈ సమ్మె తమ వేతనాల పెంపు కోసమో లేక పదోన్నతుల కోసమో కాదని స్పష్టం చేశాయి. ప్రభుత్వ బ్యాంక్‌ల పటిష్టత, కొత్త ఉద్యోగాల కోసం చేస్తోన్న ఆందోళన అని తెలిపాయి. కార్పొరేట్ల ప్రయివేటు రంగ బ్యాంక్‌లను ప్రోత్సహిస్తూ.. ప్రభుత్వ రంగ బ్యాంక్‌లను నిర్వీర్యం చేసే చర్యలను ప్రభుత్వం నిలిపివేయాలని డిమాండ్ చేస్తోన్నాయి. ఇందుకోసం మార్చి 24, 25 తేదిల్లో దేశ వ్యాప్తంగా బ్యాంక్‌ల సమ్మెను చేపడుతున్నట్లు యునైటెడ్ ఫోరమ్ ఆఫ్ బ్యాంక్ యూనియన్స్ (యూఎఫ్‌బీయూ) ప్రతినిధులు వెల్లడించారు. ఈ ఆందోళనలో ఆల్ ఇండియా బ్యాంక్ ఎంప్లాయిస్ అసోసియేషన్ (ఎఐబీఈఏ), ఆల్ ఇండియా బ్యాంక్ ఆఫీసర్స్ కాన్ఫిడరేషన్ (ఎఐబీఓసీ), నేషనల్ కాన్ఫిడరేషన్ ఆఫ్ బ్యాంక్ ఎంప్లాయిస్ (ఎఐబీఓఏ), బ్యాంక్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా (బెఫీ), ఇండియన్ నేషనల్ బ్యాంక్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ (ఐఎన్‌బిఈసి), ఇండియన్ నేషనల్ బ్యాంక్ ఆఫీసర్స్ కాంగ్రెస్ (ఐఎన్‌బిఒసి), నేషనల్ ఆర్గనైజేషన్ ఆఫ్ బ్యాంక్ వర్కర్స్ (ఎన్ఒబిడబ్ల్యు), నేషనల్ ఆర్గనైజేషన్ ఆఫ్ బ్యాంక్ ఆఫీసర్స్ (ఎన్ఒబిఒ) భాగస్వామ్యం అవుతున్నాయని తెలిపారు. బుధవారం హైదరాబాద్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయా సంఘాల ప్రతినిధులు మాట్లాడుతూ.. ఈ ఆందోళనలో దాదాపుగా 8 లక్షల మంది ఉద్యోగులు, అధికారులు పాల్గొననున్నారని వెల్లడించారు. ప్రధానంగా ఖాళీగా ఉన్న పోస్టుల భర్తీ, ఐదు రోజుల పని విధానం, తాత్కాలిక ఉద్యోగులను పర్మినెంట్ చేయాలని తదితర డిమాండ్‌లతో సమ్మెకు దిగుతున్నట్లు యుఎఫ్‌బియు ప్రతినిదులు తెలిపారు. ఆ వివరాలు..

ఖాతాదారుల కోసమే : రాంబాబు

ఖాతాదారులు, ప్రజల ప్రయోజనాల కోసమే ఈ సమ్మె చేపడుతున్నాము. ప్రభుత్వ రంగ బ్యాంక్‌లు మరింత మెరుగైన సేవలు అందించడానికి వీలుగా కొత్త ఉద్యోగులను తీసుకోవాలని నాలుగైదు ఏళ్లుగా డిమాండ్ చేస్తోన్నాము. ప్రయివేటు బ్యాంకింగ్ రంగంలో ఉద్యోగుల సంఖ్య పెరుగుతుంటే.. ప్రభుత్వ రంగంలో తగ్గిపోతోంది. గడిచిన పదేళ్లలో దాదాపు 1.39 లక్షల ఉద్యోగాల సంఖ్య తగ్గింది. ఉన్న ఉద్యోగులపై తీవ్ర పని భారం పడుతోంది. సిబ్బందిని పెంచడం ద్వారా ప్రభుత్వ బ్యాంక్‌ల కార్యకలాపాలను విస్తరించవచ్చు. దీని వల్ల పేద, సామాన్య ప్రజలకు బ్యాంకింగ్ సాధికారతను పెంచవచ్చు. అనేక ప్రపంచ దేశాలు ఐదు రోజుల బ్యాంకింగ్ పని విధానాన్ని అమలు చేస్తోన్నాయి. భారత్‌లో కూడా ఆ విధానాన్ని అవలంబించడం ద్వారా ఉద్యోగులపై ఒత్తిడి తగ్గుతుంది. ఉత్పాదకత పెరుగుతుంది. మా డిమాండ్లపై ఈ నెల 21న మరోసారి ఆర్థిక శాఖ అధికారులతో మరోసారి చర్చలు జరగనున్నాయి. మళ్లీ చర్చలు విఫలమయితే మరిన్ని ఆందోళనలతో భవిష్యత్తు కార్యచరణ ప్రకటించనున్నాము.

పీఎస్‌బీలకు ప్రభుత్వమే వ్యతిరేకం : వెంకట రామయ్య

ప్రభుత్వ రంగ బ్యాంక్ (పీఎస్‌బీ)లకు కేంద్రమే వ్యతిరేకంగా పని చేస్తోంది. కొత్త నియామకాలు చేపట్టకుండా.. బ్యాంకింగ్ శాఖలను విస్తరించకుండా అడ్డుకుంటుంది. దీంతో నిరుద్యోగాన్ని పెంచుతోంది. పలు బ్యాంక్‌లు మూడేళ్లుగా ఒక్క పోస్టును భార్తీ చేయలేదు. ఒక్క తెలంగాణ రాష్ట్రంలోనే 85వేల మంది బిజినెస్ కరస్పాండెంట్లు పని చేస్తోన్నారు. ఈ అవుట్‌సోర్సింగ్ సిబ్బందికి చాలిచాలని నెలకు సగటున రూ.2వేలు వస్తోంది. ఈ విధానాలు నిరుద్యోగాన్ని పెంచుతున్నాయి. ఆర్‌బిఐ సర్వే ప్రకారం.. ప్రయివేటు రంగంలో 500 మంది ఖాతాదారులకు ఒక ఉద్యోగి ఉంటే.. ప్రభుత్వ రంగ బ్యాంక్‌ల్లో 2,000 మంది ఖాతాదారులకు ఒక ఉద్యోగి ఉన్నారంటే పని భారం ఎంత ఉంటుందో అర్థం అవుతోంది. తక్షణమే కొత్త నియామకాలు చేపట్టాల్సిన అవసరం ఉంది. మార్కెట్ రెగ్యూలేటర్ సెబీ, ఆర్‌బిఐ, ఎల్ఐసి లాంటి సంస్థల్లో ఐదు రోజుల పని విధానాన్ని అమలు చేస్తోన్నారు. అదే విధానాన్ని వాణిజ్య బ్యాంక్‌లకు వర్తింపజేయాలి.

పని భారంతో ఆత్మహత్యలు..

ఓ దశలో తమ డిమాండ్లను అంగీకరించిన ఇండియన్ బ్యాంకర్స్ అసోసియేషన్ (ఐబీఏ) తిరిగి అమలు చేయడంలో వెనక్కి తగ్గిందని కె అంజనేయ ప్రసాద్ అన్నారు. ఇందుకు కేంద్ర ప్రభుత్వమే ప్రధాన కారణమన్నారు. అన్ని బ్యాంక్‌ల్లో నియామకాలు చేపట్టాలని డిమాండ్ చేస్తోన్నామన్నారు. పని భారంతో బ్యాంక్ ఉద్యోగులు ఆత్మహత్యలకు పాల్పడుతోన్న ఘటనలు పెరుగుతున్నాయని ఫణికుమార్ ఆందోళన వ్యక్తం చేశారు. గడిచిన పదేళ్లలో 5వేల మంది పైగా తమ ప్రాణాలను కోల్పోయారని గుర్తు చేశారు. నోట్ల రద్దు సమయంలో పగలు, రాత్రి పని చేశామన్నారు. ప్రపంచ దేశాలు ఐదు, నాలుగు రోజుల బ్యాంకింగ్ విధానం వైపు మొగ్గు చూపుతుంటే.. భారత్‌లో మరిన్ని పని గంటలు పెంచే ప్రయత్నం జరుగుతోందని శ్రీనివాస్ అన్నారు. ఎన్‌డీఏ ప్రభుత్వం కొత్త నియామకాలు చేపట్టకుండా ప్రభుత్వ బ్యాంక్‌లను నిర్వీర్యం చేసే పెద్ద కుట్ర చేస్తుందని నాగేశ్వరరావు ఆందోళన వ్యక్తం చేశారు. ప్రభుత్వ బ్యాంక్‌లను నీరుకార్చడమంటే పేద, సామాన్యుల ఆర్థిక సాధికారతపై దాడి లాంటిదని వెంకట రమణ అన్నారు.

శంషాబాద్‌లో ఎక్యూఐ మానిటరింగ్ స్టేషన్

ప్రారంభించిన స్టోన్‌క్రాఫ్ట్ గ్రూప్

హైదరాబాద్ : ప్రీమియం రియల్ ఎస్టేట్ కంపెనీ స్టోన్‌క్రాఫ్ట్ గ్రూప్స్ బుధవారం శంషాబాద్‌లో ఎయిర్ క్వాలిటీ ఇండెక్స్ (ఎక్యూఐ)ని ప్రారంభించింది. ఈ కార్యక్రమంలో స్లోవేనియా రిపబ్లిక్ రాయబారి మాటేజా వోడెజా వోడెబ్ ఘోష్, జిహెచ్ఎంసి అధికారి వివిఎల్ సుభద్రా దేవి పాల్గొన్నారు. ఈ ప్రాజెక్టు సమాజ ప్రయోజనం కోసం గాలి నాణ్యతను పర్యవేక్షించే అంకితభావానికి నిదర్శనమని స్టోన్‌క్రాఫ్ట్ గ్రూప్ వ్యవస్థాపకులు, ఎండి కీర్తి చిలుకూరి పేర్కొన్నారు. శంషాబాద్‌లోని ఉడ్స్‌లోని ఎక్యూఐ మానిటరింగ్ స్టేషన్ పర్యావరణ బాధ్యతను ప్రోత్సహించడానికి తాము తీసుకుంటున్న అనేక చర్యలలో ఒకటన్నారు.

భారత వృద్ధి 6.5 శాతమే..! : ఫిచ్ అంచనా



న్యూఢిల్లీ : వచ్చే ఆర్థిక సంవత్సరం (2025-26)లో భారత వృద్ధి రేటు 6.5 శాతానికే పరిమితం కావొచ్చని ప్రముఖ రేటింగ్ ఎజెన్సీ ఫిచ్ అంచనా వేసింది. ప్రస్తుత 2024-25లో 6.3 శాతంగా ఉండొచ్చని పేర్కొంది. 2026-27లో 6.3 శాతానికి తగ్గొచ్చని విశ్లేషించింది. అమెరికా వాణిజ్య విధానాలు ప్రధాన సవాళ్లుగా నిలువనున్నాయని పేర్కొంది. వినియోగదా రుల విశ్వాసం తగ్గిందని పేర్కొంది. దీంతో వాహన అమ్మకాల్లో తగ్గుదల చోటు చేసుకుంటున్న విషయాన్ని ఫిచ్ గుర్తు చేసింది. 2024-25లో భారత జిడిపి 6.4 శాతానికి పరిమితం కావొచ్చని ఇటీవల ఎన్ఎస్ఒ అంచనా వేసింది. ఇది నాలుగేళ్లలోనే అత్యంత కనిష్ఠ స్థాయి. ఇంతక్రితం 2023-24లో జీడీపీ8.2 శాతం పెరిగింది. 2024-25లో 6.6 శాతం వృద్ధి ఉండొచ్చని ఆర్‌బీఐ ఇటీవల అంచనా వేసింది. దీంతో పోల్చితే ఫిచ్ తాజా అంచనాలు మరింత ఆందోళన కలిగించే అంశం. ఆర్థిక వ్యవస్థలోని మందగమనం ఆర్థిక కార్యకలాపాలను దెబ్బతీయనుందని స్పష్టమవుతోంది.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
ఎల్బీనగర్ -మహేశ్వరం
గురువారం | మార్చి 20, 2025 | www.navatelangana.com

బృందావన్ కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడిగా పృథ్వి రాథోడ్



నవతెలంగాణ-బడంగ్‌పేట్

మహేశ్వరం నియోజకవర్గం బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో ఉన్న అల్మాస్‌గూడలోని 26వ డివిజన్ బృందావన్ కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ నూతన కమిటీని బుధవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా నూతన కమిటీ అధ్యక్షుడు పృథ్వి రాథోడ్, వైస్ ప్రెసిడెంట్ బాల్ రాజ్ చారి, జనరల్ సెక్రెటరీ రమేష్ గౌడ కమిటీ సభ్యులు బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు రామిడి రాంరెడ్డిని మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా కమిటీ అధ్యక్షులు పృథ్వి రాథోడ్ మాట్లాడుతూ కాలనీ సమస్యల పరిష్కారం కోసం తన వంతు కృషి చేస్తామని తెలిపారు. తమపై నమ్మకం ఉంచి అధ్యక్షులుగా ఎన్నుకున్న కాలనీ వాసులు ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు.

పరిశుభ్రతలో ప్రభుత్వ ఆస్పత్రి భేష్ : కాయకల్ప్ శాఖ



నవతెలంగాణ-హయత్ నగర్

హయత్‌నగర్‌లోని కేంద్ర ఆరోగ్య కేంద్రానికి బుధవారం కాయకల్ప్ అధికారులు విచ్చేశారు. పరిశుభ్రత విషయంలో ప్రభుత్వ ఆస్పత్రి భేష్‌గా ఉందని, ఆస్పత్రి నిర్వాహకులను మెచ్చుకుని అభినందించారు. తర్వాత ఆస్పత్రిలో వసతులు, సేవలపై ఆరా తీశారు. ఆస్పత్రి మెయింటెనెన్స్, శానిటేషన్, లైట్, కేర్, ల్యాబ్, చికిత్స విధానాలపై కాయకల్ప్ అధికారి, సివిల్ అసిస్టెంట్ సర్జన్ కే. శోభ, హతీరం, నాగలక్ష్మి బృందం పరిశీలించారు. ఆస్పత్రిలో సౌకర్యాల కోసం కాయకల్ప్ నిధులతో ప్రభుత్వ వైద్యాన్ని మెరుగుపరచడంలో భాగంగా ఈ తనిఖీలు నిర్వహించామన్నారు. ఆయా విభాగాల్లో మంచి ర్యాంకు వస్తే హయత్ నగర్ సి ఎస్ సి ని నియమిస్తారని సూపరింటెండెంట్ తెలిపారు. వారి వెంట ఆస్పత్రి సూపరిటెండెంట్ , గైనకాలజిస్టు ఉమా దేవి ఉన్నారు.

గ్లోబల్ ఎడ్యుకేషన్ సమ్మిట్ విజయవంతం



నవతెలంగాణ-సిటీబ్యూరో

శ్రీదేవి మహిళా ఇంజనీరింగ్ కళాశాల (ఎస్‌డబ్ల్యూఈసీ), సైన్ ఎడ్యుకేషనల్ సర్వీసెస్ ప్రయివేటు లిమిటెడ్ సహకారంతో విజయవంతమైన గ్లోబల్ ఎడ్యుకేషన్ సమ్మిట్‌ను నిర్వహించింది. ఈ సమ్మిట్ యూఎస్ఏ, యూకే, యూరప్, ఆస్ట్రేలియా నుంచి దాదాపు 20 ప్రతిష్టాత్మక విశ్వవిద్యాలయాల ప్రతినిధులను ఒకచోట చేర్చింది. ఈ శిఖరాగ్ర సమావేశంలో ఎకోల్ డి కామర్స్ డి లియోన్ విశ్వవిద్యాలయం, ఎస్‌డబ్ల్యూఈసీ మధ్య అవగాహన ఒప్పందం.. పరిశోధన, అభివృద్ధి, విద్యార్థుల మార్పిడి, జ్ఞాన భాగస్వామ్యంలో సహకారానికి మార్గం సుగమం చేసింది. పాల్గొన్న విశ్వవిద్యాలయాలలో సెంట్రల్ మిచిగాన్ విశ్వవిద్యాలయం (యూఎస్ఏ), అక్రోన్ విశ్వవిద్యాలయం (యూఎస్ఏ), ముర్డోక్ విశ్వవిద్యాలయం (ఆస్ట్రేలియా), యూనివర్శిటీ కాలేజ్ బర్మింగ్‌హామ్ (యూకే) ఉన్నాయి. ప్రారంభోత్సవ కార్యక్రమానికి ప్రిన్సిపాల్ డాక్టర్ ఎ. నర్మద, డీన్ అకాడమిక్స్ డాక్టర్ శివనాగి రెడ్డి, డీన్ అడ్మిషన్స్ డాక్టర్ ఎస్ జగదీష్, డీన్ పూర్వ విద్యార్థులు డాక్టర్ కె. సి. రవికుమార్, డీన్ మీడియా అండ్ పీఆర్ డాక్టర్ నరేంద్ర కుమార్ అధ్యక్షత వహించారు. సైన్ ఎడ్యుకేషనల్ సర్వీసెస్ ప్రయివేటు లిమిటెడ్ డైరెక్టర్ డాక్టర్ ఎస్ శ్రీనివాస్, ఈ విశ్వవిద్యాలయాలను ఎస్‌డబ్ల్యూఈసీ క్యాంపస్‌కు తీసుకురావడంలో కీలక పాత్ర పోషించారు. రోజంతా జరిగిన ఈ కార్యక్రమం చివరి సంవత్సరం, మూడవ సంవత్సరం, ఎంబీఏ విద్యార్థులకు ప్రపంచవ్యాప్తంగా పాల్గొనే విశ్వవిద్యాలయాల నుంచి సమాచారాన్ని సేకరించడానికి, అవకాశాలను అన్వేషించడానికి ఒక విలువైన వేదికను అందించింది.

మామిడిపల్లిలో
అన్యాక్రాంతమవుతున్న ప్రభుత్వ భూములు



- రూ.కోట్లు విలువ చేసే ప్రభుత్వ భూములను కాపాడాలని రంగారెడ్డి జిల్లా కలెక్టర్‌కు వినతి





నవతెలంగాణ-బడంగ్‌పేట్

మహేశ్వరం నియోజకవర్గం బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో ఉన్న మామిడిపల్లి గ్రామ రెవెన్యూ పరిధిలో కోట్లాది రూపాయల విలువ చేసే ప్రభుత్వ భూములు(కబ్జా) అన్యాక్రాంతమవుతున్నాయని, ఆ ప్రభుత్వ భూములను కాపాడాలని కోరుతూ మాజీ కార్పొరేటర్ మద్ది సబితా రాజశేఖర్ రెడ్డి దంపతులు బుధవారం రంగారెడ్డి జిల్లా కలెక్టర్ కార్యాలయంలో వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా మాజీ కార్పొరేటర్ మాట్లాడుతూ మామిడిపల్లి రెవెన్యూ పరిధిలో రూ.కోట్లు విలువ చేసే ప్రభుత్వ భూములను కొందరు ఆక్రమించుకొని రూ. కోట్లు గడిస్తున్నారని ఆరోపించారు. అందులో భాగంగా సర్వే నెంబర్ 10లో ఉన్న స్మశాన వాటిక భూమిని కబ్జా చేసి చుట్టూ ప్రహారీ గోడ నిర్మాణం చేశారని, అంతేకాదు స్మశాన వాటికలో ఉన్న బొందలను సైతం తొలగించి ..భూమిని కబ్జా చేస్తున్నారని ఆరోపించారు. మా గ్రామ సమీపం నుండి వెళ్తున్న నల్లవాగు కాల్వను సైతం కబ్జా చేయడానికి కొందరు ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు. ఆ కాల్వను కబ్జా చేసినట్లు అయితే వర్షాకాలంలో జోరుగా ప్రవహించే నీళ్లలో మామిడిపల్లితో పాటు రాజీవ్ గాంధీ ఇంటర్నేషనల్ ఎయిర్ పోర్టు నీటిలో మునిగిపోయే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. అదే విధంగా సర్వే నెంబర్ 32 దేవాలయానికి సంబంధించిన ప్రభుత్వ భూములను కొందరు కబ్జా చేసి చుట్టూ ప్రహారీ గోడ నిర్మాణం చేశారని పేర్కొన్నారు. ఆ భూమిలో అక్రమ లే అవుట్ తయారు చేసి ప్లాటను విక్రయిస్తున్నారని ఆరోపించారు. అంతేకాకుండా సర్వే నెంబర్ 141లోని 5ఎకరాల ప్రభుత్వ భూమిని గ్రామ సమీపంలో ఉన్న ప్రెస్టేజ్, సిగ్నేచర్ ప్రైవేటు కంపెనీల యజమానులు అక్రమించుకోవడం జరిగిందని ఆరోపించారు. గ్రామానికి చెందిన దళితుల ఇనాం(మాన్యం) భూములను, నాళ్లవాగు చెరువు భూములను జిల్లా కలెక్టర్‌తో పాటు రెవెన్యూ అధికారులకు కాపాడాల్సిన బాధ్యత ఉందన్నారు. ఆ భూములను కాపాడడం కోసం గ్రామానికి చెందిన మాజీ ప్రజా ప్రతినిధిగా పోరాటం చేయడం కోసం సిద్ధంగా ఉన్నట్లు తెలిపారు. దీనికి సంబంధించిన వినతి పత్రాలను కందుకూరు ఆర్‌డీఓ కార్యాలయం, బాలాపూర్ మండల తహశీల్దార్ ఇందిరా దేవికి కార్యాలయంలో వినతి పత్రాలు అందచేసినట్లు తెలిపారు. ఈ ప్రభుత్వ భూములను రెవెన్యూ అధికారులు కాపాడని పక్షంలో ఆందోళన ఉద్రిక్తం చేస్తామని హెచ్చరించారు.

పోస్టర్ కాలనీ సమస్యలు పరిష్కరించాలని వినతి



నవతెలంగాణ-బడంగ్‌పేట్

మహేశ్వరం నియోజకవర్గం బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో ఉన్న 26వ డివిజన్ పరిధిలోని పోస్టర్ కాలనీ సమస్యలను పరిష్కరించాలని మాజీ కార్పొరేటర్, బడంగ్ పేట్ మున్సిపల్ కార్పొరేషన్ బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు రామిడి రాంరెడ్డి కోరారు. ఈ మేరకు కాలనీ అసోసియేషన్ నూతన అధ్యక్షులు నర్సింగ్ రావు ఆధ్వర్యంలో మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ సరస్వతిని కార్యాలయంలో కలసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎన్నో సంవత్సరాలుగా కాలనీలో నివాసముంటున్న ప్రజలు అనేక సమస్యలతో ఇబ్బందులకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ముఖ్యంగా కాలనీలో రోడ్లు, డ్రైనేజీలు, మిషన్ భగీరథ పథకంలో ఇంటింటికీ తాగునీరు సౌకర్యం, వీధి దీపాలు లేక కాలనీ వాసులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని తెలిపారు. అనంతరం స్పందించిన కమిషనర్ సరస్వతి మాట్లాడుతూ మీ కాలనీ సమస్యలు తమ దృష్టికి ఎవరు తీసుకురాలేదన్నారు. త్వరలోనే సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ముఖ్యంగా సీసీ రోడ్లు, డ్వాక్రా భవనం పున నిర్మాణం, పార్కును అభివృద్ధి చేయడం కోసం కృషి చేస్తానని హామీ ఇచ్చారు. వినతి అందజేసిన వారిలో కాలనీ ఉపాధ్యక్షులు పర్వతాలు గౌడ్, కార్యదర్శి చంద్రయ్య గౌడ్, రాము, కే.దినేష్ తదితరులు పాల్గొన్నారు.

'తక్కువ వినియోగించినా ఎక్కువ వస్తున్న కరెంట్ బిల్లులు'



నవతెలంగాణ-చంపాపేట్

జంగంమెట్ డివిజన్‌లోని రవీందర్ నాయక్‌నగర్ బస్తీలో చాలామంది కరెంటును తక్కువగా వినియోగించిన ఎక్కువ మోతాదులో బిల్లులు వస్తున్నాయని సీపీఐ(ఎం) చంద్రాయణగుట్ట జోన్ కార్యదర్శి ఎస్. కిషన్, ఏ. కృష్ణ వీరాంకుమార్ నాయక్ ఆవేదన వ్యక్తం చేశారు. సీపీఐ(ఎం) చంద్రాయణగుట్ట జోన్ కమిటీ ఆధ్వర్యంలో రవీందర్ నాయక్ నగర్ కాలనీలో కరెంట్ బిల్లులు తగ్గించాలని కోరుతూ బుధవారం ఫలక్‌నూమ ఏడీఈకి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజలకు ప్రమాదం జరగకుండా ఇనుప స్తంభాల స్థానంలో సిమెంట్ స్తంభాలు వేయాలని కోరారు. రవీందర్ నాయక్‌నగర్ బస్తీలో చాలామంది కరెంట్‌ను తక్కువగా వినియోగించినా ఎక్కువ మోతాదులో బిల్లులు రావడం ద్వారా ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. బిల్ కలెక్టర్లకు ఎన్నో దఫాలుగా విన్నవించుకున్నా మీరు ఎంత యూనిట్ కలిస్తే అంతే బిల్లు వస్తదని అంటున్నారని తెలిపారు. ఇప్పటికైనా ఎలక్ట్రిసిటీ అధికారులు వెంటనే స్పందించి మీటర్ బిల్లులు తగ్గించడం ద్వారా పేద ప్రజలకు ఇబ్బంది లేకుండా చూడాలని కోరారు. ఫలక్‌నూమ స్టేషన్ రోడ్డు దేనా బాపు బస్తీలో మూడు ఇనుప స్తంభాలు, స్టేషన్ రోడ్డు గల్లీలో ఒక ఇనుప స్తంభం ప్రమాదకర స్థితిలో ఉన్నాయని.. వెంటనే మార్చాలని ఎన్నోసార్లు ఫిర్యాదు చేసినా అధికారులు పట్టించుకోవడం లేదని ఆరోపించారు. వెంటనే సిమెంట్ స్తంభాలు వేయాలని డిమాండ్ చేశారు. వినతి అందజేసిన వారిలో ఆంజనేయులు, దర్జీ రాజా రాములు మజార్ తదితరులు ఉన్నారు.

నిబంధనలకు తూట్లు.. నిర్మాణాల జోరు

- నెలల కొద్దీ అక్రమ నిర్మాణాలు కండ్లముందే జరుగుతున్నా పట్టించుకోని అధికారులు
- ఫిర్యాదు చేస్తేగానీ నోటీసులు ఇవ్వని వైనం
- ఇదీ పెద్ద అంబర్ మున్సిపల్ దుస్థితి
- మత్తుగూడలోని అక్రమ షెడ్డును తక్షణమే కూల్చివేయాలి : సీపీఐ(ఎం)



నవతెలంగాణ అబ్దుల్లాపూర్ మెట్

రంగారెడ్డి జిల్లా పెద్ద అంబర్‌పేట మున్సిపాలిటీలోని తట్టి అన్నారం మత్తుగూడ గ్రామ రెవిన్యూ సర్వే నెం. 122, 126 లో పర్మిషన్ లేకుండా నిర్మించిన షెడ్డును తొలగించి, నిర్మాణదారులపై చట్టరీత్యా చర్యలు తీసుకోవాలి సీపీఐ(ఎం) ఆధ్వర్యంలో మున్సిపల్ కమిషనర్ రవీందర్ రెడ్డికి బుధవారం ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా సీపీఐ(ఎం) పార్టీ మండలం కార్యదర్శి నరసింహ, తట్టి అన్నారం, మాజీ ఎంపీటీసీ నల్ల ప్రభాకర్ మాట్లాడుతూ పెద్ద అంబర్ పేట మున్సిపాలిటీలో నిబంధనకు విరుద్ధంగా అనేక అక్రమ నిర్మాణాలు జరుగుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదని ఆరోపించారు. మున్సిపాలిటీలకు ప్రత్యేక అధికారులు ఉన్నా ఫలితం లేదన్నారు. అధికారులకు నిర్మాణదారులు నయానో బయనో సమర్పించడం వలన అక్రమ నిర్మాణాలు పుట్టగొడుగులా పుట్టుకోస్తున్నాయని ఆరోపించారు. చేతి వాటాకు అలవాటు పడిన కొందరు అధికారుల వలన ప్రభుత్వ ఆదాయానికి భారీగా గండి పడుతుందన్నారు. అక్రమదారులకు పరోక్షంగా తమ సహకారాన్ని అందిస్తూ, నోటీసుల పేరుతో కాలం వెల్లదీస్తున్న అధికారులు తమ చేతికి మట్టి అంటకుండా పనిని పూర్తి చేసుకుంటూరన్న ఆరోపణలు ఉన్నాయన్నారు. ప్రత్యేక అధికారుల పాలనా కావడంతో మున్సిపాలిటీలో అధికారులు ఆడిందే ఆటా, పాడిందే పాట అన్న చందంగా తయారైందన్నారు. నిబంధనలు అతిక్రమిస్తూ అక్రమంగా కమర్షియల్ షెడ్లు, షాపింగ్ కాంప్లెక్సు పుట్టుకొస్తున్న మున్సిపల్ అధికారులు నిమ్మకు నీరెత్తినట్లుగా వ్యవరించడం విడ్డురంగా ఉందన్నారు. నెలల కొద్దీ జరిగే భారీ నిర్మాణాలు, అధికారుల కళ్లకు కనిపించడం లేదా అని ప్రశ్నించారు. మత్తుగూడలో జరిగే భారీ నిర్మాణాలపై చర్యలు తీసుకోవడంలో అధికారులు మత్తును వీడాలని సూచించారు. ఫిర్యాదు చేసినప్పుడు పనులు నిలిపి వేస్తున్నట్లు, నోటీసులు ఇచ్చామని చెప్పే విధానాన్ని మానుకోవాలని హితవు పలికారు. అక్రమ నిర్మాణాలపై ఫిర్యాదు చేస్తే గానీ అధికారుల్లో చలనం లేదన్నారు. ప్రభుత్వ ఆదాయానికి గండికొడుతూ బాధ్యరాహిత్యంగా వ్యవరించే అధికారులపై ఉన్నత అధికారులు దృష్టి సారించాలన్నారు. అందుకు బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. మున్సిపాలిటీలో జరిగిన/జరుగుతున్న అక్రమ నిర్మాణాలను గుర్తించి తక్షణమే కూల్చివేయాలని డిమాండ్ చేశారు. లేనిచో సీపీఐ(ఎం) ఆధ్వర్యంలో మున్సిపల్ కార్యాలయాన్ని ముట్టడిస్తామని హెచ్చరించారు. వినతిపత్రం అందజేసిన వారిలో స్థానిక నాయకులు సుక్క రవికుమార్, ఎం.డి యాకూబ్ తదితరులు ఉన్నారు.

అభివృద్ధి పనులు పూర్తి చేయాలి : కార్పొరేటర్



నవతెలంగాణ-దిల్‌సుఖ్‌నగర్

ఆర్కేపురం డివిజన్ పరిధిలో అసంపూర్తిగా మిగిలిన పనులను పూర్తి చేయాలని కార్పొరేటర్ రాధా ధీరజ్ రెడ్డి కోరారు. జోనల్ కమిషనర్ కార్యాలయంలో జడ్ సి హేమంత్ కేశవ్ పాటిల్‌ను బుధవారం కార్పొరేటర్ మర్యాదపూర్వకంగా కలిసి, డివిజన్ సమస్యలను వివరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆర్కేపురం డివిజన్‌లో చేపట్టిన అభివృద్ధి పనులు అసంపూర్తిగా ఉన్నాయని, వాటిని వెంటనే పూర్తి చేయాలని జోనల్ కమిషనర్‌కు వినతి పత్రం అందజేసినట్టు తెలిపారు. రోడ్లు, భూగర్భ డ్రైనేజీ, వీధి దీపాలు ఏర్పాటు, పారిశుధ్య నిర్వహణ, పార్కుల అభివృద్ధి తదితర పనులు పెండింగ్‌లో ఉన్న కారణంగా స్థానికులు అసౌకర్యానికి గురి అవుతున్నారని వివరించారు. రాజకీయాలకు అతీతంగా ఆర్కేపురం డివిజన్‌లో అభివృద్ధి పనులు పూర్తి చేయడానికి సహకరించాలని కమిషనర్ కోరారు. డివిజన్‌లో చేపట్టిన అభివృద్ధి పనులకు నిధులు మంజూరు చేయాలన్నారు. ఆర్కేపురం డివిజన్‌లో ప్రధానంగా ఎన్టీఆర్ నగర్‌లో చేపట్టిన భూగర్భ డ్రైనేజీ పనులు నేటికీ కొనసాగుతూనే ఉన్నాయని తెలిపారు. సమస్యలను పరిష్కరించేందుకు జోనల్ కమిషనర్ సానుకూలంగా స్పందించారని ఆమె తెలిపారు.

ట్రాన్స్‌పోర్ట్ రంగ సమస్యలు పరిష్కరించాలి



- 24న నిర్వహించే చలో పార్లమెంట్‌ను జయప్రదం చేయండి : సీఐటీయూ

నవతెలంగాణ-హయత్‌నగర్

రవాణా రంగాన్ని రక్షించుకోవడానికి, కార్మికుల సమస్యల పరిష్కారం కోసం ఈ నెల 24న నిర్వహించనున్న చలో పార్లమెంటును జయప్రదం చేయాలని రోడ్ ట్రాన్స్‌పోర్టు వర్కర్స్ ఫెడరేషన్ కేంద్ర కమిటీ పిలుపునిచ్చింది. రవాణా రంగ కార్మికులు ఆటో, కారు, డీసీఎం, టాటా ఏసీ అన్ని రకాల ట్రాన్స్‌పోర్టు కార్మికులు చలో ఢిల్లీని జయప్రదం చేయాలని కోరుతూ బుధవారం హయత్‌నగర్ కుంట్లూర్ రోడ్‌లో సీఐటీయూ ఆధ్వర్యంలో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ రంగారెడ్డి జిల్లా ఉపాధ్యక్షులు కీసర నర్సిరెడ్డి, రోడ్ ట్రాన్స్‌పోర్టు వర్కర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి కే. రాములు మాట్లాడుతూ.. డీజిల్ ధరలు బీమా ప్రీమియం, టోల్ చార్జీలను తగ్గించాలని వెహికల్ స్క్రాపింగ్ పాలసీ తప్పనిసరి కాకూడదన్నారు. వాహన తనిఖీ రవాణా శాఖ ఆధ్వర్యంలో జరగాలి, ఇందులో ఏఎస్ఆర్ టీయూ, సీఐఆర్‌టీఏలను భాగస్వాములను చేయాలన్నారు. వాహనాల స్క్రాప్ చేయాలని నిర్ణయిస్తే మొత్తం ధరలో ఒకటి బై మూడు వంతు భారత ప్రభుత్వం, వాహన తయారీ కంపెనీ సబ్సిడీగా ఇవ్వాలన్నారు.

రవాణా రంగం చిన్న యజమానులను రక్షించడానికి మోటార్ వాహనాల సవరణ చట్టాన్ని 2019ని తగిన విధంగా సవరించాలని అన్నారు. ప్రైవేట్ ఫైనాన్స్ కంపెనీ నుండి ఉపశమనం పొందేందుకు జాతీయం చేయబడిన ఆర్థిక సంస్థల ద్వారా చిన్న యజమానులకు రుణాలు ఏర్పాటు చేయాలని కోరారు. రోడ్ రవాణా కార్మికుల కోసం సామాజిక భద్రత చట్టం చేయాని కోరారు. బీఎన్ ఎస్ 2023 లోని సెక్షన్ 16 1 అండ్ 2 ఉపసంహరించుకోవాలన్నారు. తదనుగుణంగా చట్టంలో సవరణలు చేయాలన్నారు.

ఉబర్, ఓలా, రాపిడో పోర్టల్ మొదలైన వాటికి ప్రత్యామ్నాయంగా భారత ప్రభుత్వం ఒక యాప్‌ను అభివృద్ధి చేసి కంపెనీల దోపిడీ నుండి డ్రైవర్లను, వినియోగదారులను రక్షించాలని, ప్రమాదాలను తగ్గించేందుకు అన్ని జాతీయ రహదారులపై వాహనాల వేగానికి అనుగుణంగా విభజనను అమలు చేయాలని కోరారు. లోప భూయిష్టంగా ప్రమాదకరంగా ఉన్న రోడ్ల నిర్మాణం చేసిన కాంట్రాక్టర్లపై కఠిన చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఆర్టీసీ చట్టం 1950 ప్రకారం ఎస్టీయులకు క్యాపిటల్ కంట్రిబ్యూషన్ పునరుద్ధరించాలన్నారు. ఎలక్ట్రిసిటీ బస్సుల సేకరణ నిర్వహణ ఆపరేషన్లను ఎస్టీయులకు అప్పగించాలని అన్నారు. సబ్సిడీ వయోబిలిటీగా గ్యాప్ పండుగ ఎస్టీఎంలకు చెల్లించాలని అన్నారు. నాలుగు లేబర్ కోడులను ఉపసంహరించుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో యూనియన్ ఆటో యూనియన్ నాయకులు నక్క అశోక్, కార్యదర్శి జూపల్లి కృష్ణ, గౌని ప్రవీణ్, శ్రీహరి, బసవరాజు గంగాదేవి, నగేష్, రగడపల్లి, యాదయ్య, చంద్రకాంత్, సహదేవ్, కర్ణాకర్ తదితరులు పాల్గొన్నారు.


'బడ్జెట్‌లో బీసీలకు అన్యాయం'



బడ్జెట్‌లో బీసీలకు అన్యాయం
- బీసీ హక్కుల సాధన సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ధనుంజయ నాయుడు

నవతెలంగాణ-నాగోల్

అసెంబ్లీలో బీసీల రిజర్వేషన్ బిల్లు ఆమోదించి 24 గంటలు గడవకముందే బడ్జెట్‌లో బీసీలకు కేటాయింపు అన్యాయంగా ఉందని బీసీ హక్కుల సాధన సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ధనుంజయ నాయుడు ఆవేదన వ్యక్తం చేశారు. హైదరా బాదులోని బీసీ హక్కుల సాధన సమితి రాష్ట్ర కార్యాలయంలో రాష్ట్ర సహాయ కార్యదర్శులు బొడ్డుపల్లి కృష్ణ, చింతకింది కుమారస్వామిలతో కలిసి ఆయన బుధవారం మాట్లాడారు. కామారెడ్డి బీసీ డిక్లరే షన్‌లో ప్రతి బడ్జెట్‌లో 20వేల కోట్ల రూపాయలు కేటాయిస్తామని, ఐదు సంవత్సరాలలో బీసీల సంక్షే మానికి లక్ష కోట్లు ఖర్చు చేస్తామని కాంగ్రెస్ పార్టీ నాడు ప్రకటించినదని, గత బడ్జెట్లో 9,000 కోట్లు మాత్రమే కేటాయించారని, ఈ బడ్జెట్లో 11,405 కోట్లు మాత్రమే కేటాయించారని, రెండు సంవత్సరాల బడ్జెట్‌లు కలిపితే 20 వేల కోట్లు అయిందని, రెండు సంవత్సరాలకు కలిపి 40 వేల కోట్లు కేటాయించాల్సి ఉండగా.. రెండు బడ్జెట్లు కలిపి కేవలం రూ.20వేల కోట్లు మాత్రమే కేటాయి ంచి 50% అన్యాయానికి గురి చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. 15% జనాభా కలిగిన ఎస్సీలకు 40,000 కోట్లు కేటాయించడాన్ని స్వాగతిస్తున్నామని, ఏడు శాతం జనాభా ఉన్న ఎస్టీలకు 17వేల కోట్లు కేటాయించడాన్ని కూడా హర్షిస్తున్నామని, 56% బీసీలకు 11వేల కోట్లు మాత్రమే కేటాయిం చడాన్ని తీవ్రంగా ఆక్షేపిస్తున్నామని అన్నారు. 48 గంటల కిందట బీసీ రిజర్వేషన్ బిల్లుకు శాసనసభలో ఆమోద ముద్ర వేసిన కాంగ్రెస్ ప్రభుత్వం.. 48 గంటలు గడవక ముందే బీసీలను తీవ్ర నిరాశ పరచిందని అన్నారు.



రాష్ట్ర బడ్జెట్‌లో పేద, మధ్యతరగతి వారికి అంతంత మాత్రమే
- సీపీఐ మేడ్చల్ జిల్లా కార్యవర్గ సమితి సభ్యులు కృష్ణ

నవతెలంగాణ- నాగోల్

రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ పేద, మధ్యతరగతి ప్రధానంగా బీసీ వర్గాలకు తీవ్ర అన్యాయంగా ఉందని మేడ్చల్ జిల్లా సీపీఐ కార్యవర్గ సభ్యులు బొడ్డుపల్లి కృష్ణ ఆవేదన వ్యక్తం చేశారు.. కాంగ్రెస్ ప్రభుత్వం బీసీ రిజర్వేషన్ బిల్లును ఆమోదించి 24 గంటలు గడవకముందే కేటాయించిన బడ్జెట్‌లో.. బీసీలకు కేటాయింపు అంతంత మాత్రంగానే ఉందన్నారు.

చేనేతకు హామీలు ఫుల్.. నిధులు నిల్..

నవతెలంగాణ-హయత్‌నగర్

చేనేత, పవర్లూమ్ పరిశ్రమకు, కార్మికుల అభివృద్ధి కోసం 2025-26 ఆర్థిక సంవత్సరానికి రాష్ట్ర ప్రభుత్వం బడ్జెట్‌లో నిధులు కేవలం రూ.371 కోట్లు కేటాయించి చేనేతకు కాంగ్రెస్ ప్రభుత్వం మొండిచేయి చూపించిందని చేనేత కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వనం శాంతి కుమార్ మండి పడ్డారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాకముందు కార్మికులకు ఉపాధి కల్పిస్తామని, సంక్షేమ పథకా లను ప్రవేశపెట్టి నేత కుటుంబాలను అభివృద్ధి చేస్తామని అనేక హామీలు ఇస్తూ కాంగ్రెస్ పార్టీ ఎన్ని కల మేనిఫెస్టోలో ప్రకటించిందని గుర్తుచేశారు. చేనేత, పవర్లూమ్ కార్పొరేషన్లను ఏర్పాటు చేసి వాటి కి నిధులను కేటాయిస్తామని, రాష్ట్రంలో ఇప్పటికే ఉన్న సిరిసిల్ల, వరంగల్, మల్కాపూర్, గుండ్ల పోచ ంపల్లి టెక్స్టైల్ పార్కుల అభివృద్ధితోపాటు కొత్తగా జగిత్యాల, నారాయణపేట, భువనగిరిలో మెగా పవర్లూమ్ క్లస్టర్ ఏర్పాటు, ప్రభుత్వ రంగ సంస్థలకు కావాల్సిన వస్త్రాలను మన రాష్ట్రంలోని కార్మి కుల ద్వారా ఉత్పత్తి చేయిస్తామని చెప్పారని అన్నారు. చేనేత, పవర్‌లూమ్ పరికరాలను 90 శాతం సబ్సిడీపై అందిస్తామని, చేనేత ఉత్పత్తులను ఈ కామర్స్‌లతో అనుసంధానం చేస్తామని కాంగ్రెస్ పార్టీ మేనిఫెస్టోలో చేర్చి నేతన్నలకు హామీ ఇచ్చిందని అన్నారు. చేనేత కార్మికులకు రెండు లక్షల ఋణ మాఫీ ఇవ్వకుండా లక్ష రూపాయల వరకు రుణాలను మాఫీ చేస్తామని ప్రకటించిందన్నారు.

పేదల బడ్జెట్ :చిలుక ఉపేందర్ రెడ్డి



నవతెలంగాణ-దిల్‌సుఖ్‌నగర్

తెలంగాణ ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ పేదల సంక్షేమం కోసం పెట్టిందని యువజన కాంగ్రెస్ నేత చిలుక ఉపేందర్ రెడ్డి అన్నారు. తెలంగాణ అభివృద్ధి సంక్షేమం లక్ష్యంగా చేపట్టిన బడ్జెట్ అన్ని వర్గాల వారికి లబ్ధి చేకూరుతుందని ఆయన అభిప్రాయపడ్డారు. జీహెచ్ఎంసీకి పదివేల కోట్ల రూపాయలు కేటాయించడంతో డివిజన్లలో సమగ్రాభివృద్ధి జరగడానికి అవకాశం ఉందన్నారు. మౌలిక సదుపాయాలు ఏర్పాటు చేసుకోవడానికి కేటాయించిన పదివేల కోట్ల రూపాయలతో దోహదపడుతుందన్నారు.

అంకెల గారడీ బడ్జెట్..
బీఆర్ఎస్ నేత అరవింద్ శర్మ

నవతెలంగాణ-దిల్‌సుఖ్‌నగర్

కాంగ్రెస్ ప్రభుత్వం అసెంబ్లీలో ప్రవేశ పెట్టిన బడ్జెట్ అంతా అంకెల గారడీ బడ్జెట్ అని బీఆర్ఎస్ నేత అరవింద్ శర్మ అభిప్రాయ పడ్డారు. జీహెచ్ఎంసీకి పదివేల కోట్ల రూపాయలను కేటాయించిన ప్రభుత్వానికి స్వాగతిస్తు న్నామని ఆయన అన్నారు.అయితే ప్రకటించిన పది వేల కోట్ల రూపాయల నిధులు అధిక శాతం అవుటర్ రింగ్ రోడ్డు ఆవలి వైపు అభివృ ద్ధికి ఎక్కువ నిధులు కేటాయించారని ఆయన పేర్కొన్నారు. జీహెచ్ఎంసీ పరిధిలోని డివిజన్ల లో మౌలిక సదుపాయాల ఏర్పాటుకు పూర్తి స్థాయిలో నిధులు కేటాయించలేదని ఆరోపించారు.

ఏకగ్రతతో చదివి పరీక్షల్లో ఉత్తీర్ణులు కావాలి



నవతెలంగాణ-కీసర

చీర్యాల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పదో తరగతి విద్యార్థులు ఏకగ్రతతో చదివి పరీక్షలలో ఉత్తమ శ్రేణిలో ఉత్తీర్ణులు కావాలని న్యాయవాది, పాఠశాల కో ఆప్షన్ సభ్యులు బోడ శ్రీనివాస రావు అన్నారు. బుధవారం చీర్యాల గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో హెచ్ఎం రవీందర్ అధ్యక్షతన వీడ్కోలు సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి బోడ శ్రీనివాస రావు హాజరై మాట్లాడుతూ విద్యార్థులు భయందోళన పడకుండా ఉపాధ్యాయుల సూచనలు పాటించాలన్నారు. కీసర మండలంలో అత్యధిక ఉత్తీర్ణత శాతం సాధించిన పాఠశాలకు రూ.11వేలు, ఎస్ఎస్సి ఛాలెంజీ ట్రోఫిని గతేడాదిలాగే అందిస్తానన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయ బృందం, విద్యార్థులున్నారు.

శామీర్‌పేట్ ఎంఈఓగా కమలాకర్



నవతెలంగాణ -శామీర్‌పేట

బొమ్మరాసిపేట హెచ్ఎం, మండల నోడల్ ఆఫీసర్ కమలాకర్ బుధవారం శామీర్ పేట మండల విద్యా వనరులు కేంద్రంలో మండల విద్యాధికారిగా బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయనను మండల ఉపాధ్యాయ సంఘాల నాయకులు, మాజీ మండల విద్యాధికారి వసంత కుమారి తదితరులు శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో టీఎస్‌యూటీఎఫ్ అధ్యక్షులు తిరుమలేష్ ,ప్రధాన కార్యదర్శి కుమార్, పీఆర్‌టీయూ టీఎస్ అధ్యక్షులు మహేష్, ప్రధాన కార్యదర్శి గోపాల్, అసోసియేట్ అధ్యక్షులు రవీంద్ర చారి, టీపీఆర్‌టీయూ అధ్యక్షులు వెంకటరామిరెడ్డి , టీయూటీఎఫ్ అధ్యక్షులు రాజు, శామీర్‌పేట కాంప్లెక్స్ ప్రధాన ఉపాధ్యాయులు శ్రీవేణు, ఉపాధ్యాయులు రాజు, శంకర్ నాయక్, వెంకటేష్, చంద్రశేఖర్, సత్యం తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌తోనే ఎస్సీ, ఎస్టీ, బీసీల అభివృద్ధి



- బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు, ఎస్సీ వర్గీకరణ బిల్లుల ఆమోదం చరిత్రాత్మకం
- కాంగ్రెస్ జవహర్‌నగర్ అధ్యక్షులు శ్రీకాంత్ యాదవ్
- రేవంత్, భట్టి, శ్రీధర్ బాబు, చిత్రపటాలకు క్షీరాభిషేకం

నవతెలంగాణ - జవహర్ నగర్

కాంగ్రెస్ పార్టీతోనే ఎస్సీ, ఎస్టీ, బీసీల అభివృద్ధి జరుగుతుందని జవహర్ నగర్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మల్లెపూల శ్రీకాంత్ యాదవ్ అన్నారు. అసెంబ్లీలో బీసీలకు 42 శాతం రిజర్వేషన్, ఎస్సీ వర్గీకరణ బిల్లులు ఆమోదం పొందడంతో పాటు రూ.3.04 లక్షల కోట్ల బడ్జెట్‌ను ప్రవేశపెట్టిన సందర్భంగా బుధవారం మల్లెపూల శ్రీకాంత్ యాదవ్ ఆధ్వర్యంలో కార్పొరేషన్ పరిధిలోని బాలాజీ నగర్‌లో డాక్టర్ బీఆర్ అంబేద్కర్, బాబు జగ్జీవన్ రావ్, విగ్రహాలకు పూల మాలలు వేశారు. అనంతరం సీఎం రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రి శ్రీధర్ బాబు చిత్రపటాలకు క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాహుల్ గాంధీ కామారెడ్డి సభలో ఇచ్చిన డిక్లరేషన్ మేరకు తెలంగాణ ప్రభుత్వం కుల గణన చేపట్టి బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించేందుకు బిల్లు ఆమోదం పొందడం అభినందనీయమన్నారు. కుల గణన చేసిన ఏకైక రాష్ట్రంగా తెలంగాణ నిలిచిందన్నారు. ఎస్సీ వర్గీకరణ అమలుకు ముందడుగు పడడం సంతోషకరం పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ మేయర్ శాంతి కోటేష్ గౌడ్, మాజీ సర్పంచ్ శంకర్ గౌడ్, మాజీ కార్పొరేటర్లు గొడుగు వేణు, ఎడ్ల శ్రీనివాస్ రెడ్డి, మహిళా కాంగ్రెస్ రాష్ట్ర కార్యదర్శి అనంతలక్ష్మి, ఎస్సీ సెల్ జిల్లా మహిళా కన్వీనర్ సునీత, బ్లాక్ కాంగ్రెస్ నాయకులు రజిత గోపాల్, లత, యువజన కాంగ్రెస్ అధ్యక్షులు మాట్ల వినయ్, మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు విజయ, తదితరులున్నారు.

సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం



నవతెలంగాణ-కాప్రా

ఎస్సీ వర్గీకరణ చట్టానికి శాసనసభ, మండలిలో ఆమోదం కల్పించినందుకు కాంగ్రెస్ నాయకులు జి. సత్యనారాయణ ఆధ్వర్యంలో కాప్రా గాంధీనగర్ వాసులు, కాంగ్రెస్ కార్యకర్తలు సీఎం రేవంత్ రెడ్డి చిత్రపటానికి బుధవారం క్షీరాభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా సత్యనారాయణ మాట్లాడుతూ.. 30 దశాబ్దాల ఎస్సీ వర్గీకరణ పోరాటానికి సుప్రీం కోర్టులో సానుకూలత తీర్పు ఇచ్చిన గంటలోపే ఎస్సీ వర్గీకరణకు తమ ప్రభుత్వం అనుకూలమని ప్రకటించి ఏడునెలల్లోనే ప్రక్రియ పూర్తి చేయడం దేశ చరిత్రలోనే చారిత్రాత్మకం అన్నారు. ఎస్సీల్లో 59 ఉపకులాను మూడు గ్రూపులుగా విభజించి 15శాతం రిజర్వేషన్లు కల్పించడం, బీసీలకు 42శాతం రిజర్వేషన్ బిల్లుతో సామాజిక న్యాయానికి పునాదివేశారని తెలిపారు. ఎస్సీ వర్గీకరణకు మద్దతు తెలిపిన సోనియా గాంధీ , రాహుల్ గాంధీ, మల్లికార్జున్ ఖర్గేలకు ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో గాంధీనగర్ వాసులు, కాంగ్రెస్ నాయకులు శ్రీహరి, కాప్రా డివిజన్ యూత్ కాంగ్రెస్ వైస్ ప్రెసిడెంట్ అరుణ్ కిరణ్, నాయకులు బాలయ్య ,హరి ,మనోజ్ , రామ్ చందర్, రవి, సురేష్, మహేష్, మధు, లక్ష్మి, మణెమ్మ , స్వరూప, అరుణ, శైలజ తదితరులు సీఎం రేవంత్ రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు.

మున్సిపల్ కార్మికులకు వేతనాలు ఇవ్వాలి




నవతెలంగాణ-కాప్రా/చర్లపల్లి

జీహెచ్ఎంసీ కాప్రా సర్కిల్ పరిధిలో పనిచేస్తున్న మున్సిపల్ కాంట్రాక్టు కార్మికులకు ఫిబ్రవరి నెల వేతనం ఇవ్వకపోవడంతో కార్మికులు ఆర్థిక ఇబ్బందులను ఎదుర్కొంటున్నారనీ, వారికి తక్షణమే ఫిబ్రవరి నెల వేతనాలు ఇచ్చి ఆదుకోవాలని సీఐటీయూ మేడ్చల్ జిల్లా సహాయ కార్యదర్శి జి. శ్రీనివాసులు అన్నారు. బుధవారం ఆయన మాట్లాడుతూ..ప్రతి నెలా 5, 6 తేదీలలో వేతనాలు చెల్లించేవారని, ఈ సారి 20వ తేదీ వచ్చినా వేతనాలు చెల్లించలేదన్నారు. మరో వారం గడిస్తే మార్చి నెల కూడా పూర్తవుతుందని, రెండు నెలల వేనతాలు పెండింగ్‌లో ఉండే పరిస్థితి ఉన్నదని తెలిపారు. రెండు నెలల వేతనాలు ఇవ్వకుంటే ఏం తిని డ్యూటీ చేస్తారని ప్రశ్నించారు. కేవైసీ పేరుతో కాలయాపన చేస్తూ వేతనాలు చెల్లించకుండా కార్మికులను ఇబ్బందులకు గురిచేయడం సరియైనది కాదన్నారు. సంబంధిత అధికారులు కేవైసీ సమస్యను పరిష్కరించి వెంటనే వేతనాలు చెల్లించాలన్నారు. అంతకుముందు సంబంధిత అధికారులకు వేతనాలు చెల్లించాలని వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ నాయకుడు ఎన్. దశరథ్, సీఐటీయూ నాయకులు పి.వెంకట్ పాల్గొన్నారు.

జవహర్ నగర్ తై బజార్ వేలం పాట

రూ.10 లక్షలకు కైవసం చేసుకున్న కొత్తకొండ వేణు



నవతెలంగాణ - జవహర్ నగర్

జవహర్ నగర్ మున్సిపల్ కార్యాలయంలో కమిషనర్ ఎస్. వసంత అధ్యక్షతన తై బజార్ వేలం పాట నిర్వహించారు. 2025-26 ఆర్థిక సంవత్సరానికి 01-04-2025 నుండి 31-03-2026 కాలపరిమితితో నిర్వహించిన వేలం పాటలో కొత్త కొండ వేణు రూ.10 లక్షలకు దక్కించుకున్నారు. ఈ సందర్భంగా మాజీ మేయర్ శాంతి కోటేష్ గౌడ్, కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి శ్రవణ్ కుమార్, శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ మేనేజర్ నగేష్ బాబు, ఆర్ఓ వెంకటేశం, ఆర్ఐ కృష్ణా రెడ్డి, మునిసిపల్ సిబ్బంది పాల్గొన్నారు.



మేడ్చల్ శాసనసభ్యులు చామకూర మల్లారెడ్డి కల్పనారెడ్డి దంపతుల 49వ వివాహ వార్షికోత్సవం సందర్భంగా బోయినపల్లి క్యాంపు కార్యాలయంలో శుభాకాంక్షలు తెలిపిన జవహర్ నగర్ మాజీ మేయర్ మేకల కావ్య, నాయకులు అయ్యప్ప, కొండల్ ముదిరాజ్, ప్రసాద్ గౌడ్, మహేష్ గుప్తా, బోయినపల్లి నర్సింహా, సుధాకర్ చారి తదితరులు ఉన్నారు. -నవతెలంగాణ - జవహర్ నగర్

కేటాయింపులేవి..?

- మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాకు మొండి చేయి
- ఉద్యానవన హబ్ ఊసే లేదు
- ఘట్‌కేసర్ ఫ్లైఓవర్ పనులకు నిధులేవీ..?

నవతెలంగాణ-సిటీబ్యూరో

రాష్ట్ర ప్రభుత్వం బుధవారం అసెంబ్లీలో ప్రవేశ పెట్టిన బడ్జెట్‌పై మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా ప్రజల ఆశలు అడియాశలే అయ్యాయి. ఉప ముఖ్యమంత్రి, ఆర్థికశాఖ మంత్రి భట్టి విక్రమార్క ఈసారి ప్రవేశపెట్టే బడ్జెట్‌లోనైనా జిల్లాకు ప్రాధాన్యమిస్తారని ప్రజలు పెట్టుకున్న ఆశలు నిరాశగా మిగిలాయి. ఎన్నో హామీలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ మొదటి ఏడాది పాలనలో అన్ని హామీలను నెరవేర్చని విషయం తెలిసిందే. ఆర్థిక ఇబ్బందుల కారణంగా దశల వారీగా హామీలను నెరవేరుస్తున్నామనీ, ఈ ఏడాది బడ్జెట్‌లో మిగతా హామీలన్నింటికీ కేటాయింపులు చేస్తామని ప్రభుత్వం చెబుతూ వస్తోంది. కానీ జిల్లాకు ఆశించిన స్థాయిలో నిధుల కేటాయింపులు జరగలేదు.

మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలో ఏండ్లుగా అనేక సమస్యలు పెండింగ్‌లో ఉన్నాయి. గత బీఆర్ఎస్ ప్రభుత్వంతో పాటు ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం పలు పెండింగ్ సమస్యల విషయంలో అరకొర నిధులే కేటాయిస్తూ వస్తున్నాయి. దీంతో అనేక పనులు ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్నట్టుగా ఉన్నాయి. రాష్ట్రానికి వచ్చే ఆదాయంలో రంగారెడ్డి తర్వాత సింహభాగం మేడ్చల్-మల్కాజిగిరి నుంచే వస్తున్నప్పటికీ ఈ ప్రాంత అభివృద్ధికి నిధుల కేటాయింపులో ప్రభుత్వాలు చిన్నచూపే చూస్తున్నాయి.



అలాగే పేదలకు అందిస్తున్న పెన్షన్లు రూ.4వేలకు మించి పెంచుతామని ఎన్నికల్లో కాంగ్రెస్ హామీ ఇచ్చింది. గతంలో పెన్షన్లు పెంచలేదు. ఈ సారి సైతం అదే పరిస్థితి నెలకొంది.

శాటిలైట్ టౌన్షిప్‌ల ఊసే లేదు

నగర శివార్లలో అన్ని వర్గాల వారికి అందుబాటులో ఉండేలా శాటిలైట్ టౌన్‌షిప్‌లను నిర్మిస్తామని గత బడ్జెట్‌లో పేర్కొన్నారు. తక్కువ ధరలకే పేద, మధ్య తరగతి వర్గాలకు నివాస గృహాలు నగరం చుట్టూ నిర్మిస్తామని తెలిపారు. కానీ ఇంత వరకు పెద్దగా అడుగులు పడలేదు. ఈ బడ్జెట్‌లోనూ ఈ ఊసే ఎత్తలేదు.

నగర శివారు విస్మయం

నగర శివారు ప్రాంతాలను మూడు జోన్లుగా విభజించి అభివృద్ధి చేస్తామన్నారు. రింగురోడ్డు లోపలి భాగాన్ని అర్బన్ జోన్, రింగు రోడ్డు, రీజినల్ రింగురోడ్డు మధ్య భాగాన్ని పెరి అర్బన్‌గా, రీజినల్ రింగురోడ్డు బయట రూరల్ జోన్‌గా విభజిస్తామన్నారు. దీంతో మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా పరిధిలోని పలు గ్రామాలు పెరి అర్బన్ పరిధిలోకి వస్తాయి. దీంతో ఈ ప్రాంతాలు అభివృద్ధి చెందుతాయి. వీటికి సరిపడా కేటాయింపులేవు. ఇందిరమ్మ ఇండ్ల పథకం కింద పేదల ఇండ్ల నిర్మాణానికి రూ.5 లక్షల చొప్పున ఇస్తామని ప్రభుత్వం ప్రకటించింది. ఎస్సీ, ఎస్టీలకు రూ.6లక్షల చొప్పున ఇస్తామని తెలిపింది. ఈ ఏడాది ఒక్కో నియోజకవర్గానికి 3,500 ఇండ్లు కేటాయిస్తామని గతంలో వెల్లడించింది. పేదల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. కానీ ఇప్పటి వరకు ఇండ్లు మంజూరు కాలేదు. పూర్తయిన డబుల్ బెడ్‌రూం ఇండ్లను అర్హులకు పంపిణీ చేస్తామనీ, అసంపూర్తి నిర్మాణాలు పూర్తి చేసేందుకు నిధులు కేటాయిస్తామని ప్రభుత్వం తెలిపింది. డబుల్ ఇండ్లు పంపిణీ చేసినా ఇంకా కొన్ని పెండింగ్‌లోనే ఉన్నాయి. ఇందిరమ్మ ఇండ్లకు బడ్జెట్‌లో రూ.12,571 కోట్లు కేటాయించారు.

జిల్లాలో పెండింగ్ సమస్యలెన్నో..?

మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలో 10 వేల ఎకరాల్లో రూ.150 కోట్లతో ఉద్యాన పంటల హబ్ ఏర్పాటు చేస్తామని హామీనిచ్చారు. దీనిపై కదలిక లేదు. ఈ బడ్జెట్‌లోనూ నిధులు కేటాయించలేదు. డబుల్ బెడ్ రూం ఇండ్ల నిర్మాణాలకు నిధులు విడుదల చేయక పనులు నిలిచిపోయాయి. జిల్లాలో 2,350 ఇండ్లు మంజూరు కాగా, 680 పూర్తయ్యాయి. నిధుల్లేకే నిలిచాయి. జిల్లాలోని 13 మున్సిపాల్టీల పరిధిలో 13 సమీకత మార్కెట్ల నిర్మాణానికి రూ.200 కోట్లకు పైగా మంజూరు చేశారు. నిధులు పూర్తిగా విడుదల చేయక పనులు కాలేదు. ఈ బడ్జెట్‌లో మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్‌కు రూ.17,677 కోట్లు కేటాయించారు. పదేండ్ల కింద ప్రారంభించిన ఘటకేసర్ ఫ్లైఓవర్ పనులు నిలిచిపోయాయి. ఘట్‌కేసర్‌లో రోడ్లు దెబ్బతిని వాహనదారులు ఇబ్బంది పడుతున్నారు. మేడ్చల్ కమ్యూనిటీ హెల్త్ సెంటర్, ప్రభుత్వ ఆస్పత్రుల స్థాయి పెంపుపై పాలకులు ఇచ్చిన హామీలు ఇంత వరకు నెరవేరలేదు. బడ్జెట్‌లో వైద్య, ఆరోగ్యశాఖకు రూ.12,393 కోట్లు మాత్రమే కేటాయించారు. ఈ సారైనా నిధులను విడుదల చేస్తారో..? లేదో..? చూడాలి.

ఈఎంఎస్ నంబూద్రిపాద్, మల్లు స్వరాజ్యం వర్ధంతి

నవతెలంగాణ-కాప్రా

తెలంగాణ ప్రజా సాంస్కృతిక కేంద్రం స్ఫూర్తి గ్రూప్, మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా ఐద్వా ఆధ్వర్యంలో కమలానగర్ ఆఫీసులో కమ్యూనిస్టు యోధుడు ఈఎంఎస్ నంబూద్రిపాద్, తెలంగాణ సాయుధ పోరాట యోధురాలు మల్లు స్వరాజ్యం వర్ధంతి సందర్భంగా బుధవారం నివాళి కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి స్ఫూర్తి గ్రూప్ బాధ్యులు గొడుగు యాదగిరిరావు అధ్యక్షత వహించారు. మల్లు స్వరాజ్యం చిత్రపటానికి ఐద్వా జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.వినోద, స్ఫూర్తి గ్రూప్ నాయకురాలు శారద పూలమాలలు వేసి నివాళులర్పించారు. నంబూద్రిపాద్ చిత్రపటానికి శ్రీమన్నారాయణ, వీబీ ఆచార్యులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఎం. వినోద మాటాడుతూ మల్లు స్వరాజ్యం అతి పిన్న వయసులోనే నిజాం సర్కార్‌కు వ్యతిరేకంగా ప్రజా పోరాటంలో పాల్గొన్నారని చెప్పారు. భూస్వామ్య కుటుంబంలో జన్మించినప్పటికీ పేదల పక్షాన నిలబడి భూస్వాములు దేశముఖులు, నిజాం సర్కార్లకు వ్యతిరేకంగా బంధూకులు చేతపట్టి పోరాడిన ధీర వనిత మల్లు స్వరాజ్యం అని కొనియాడారు. తెలంగాణ సాయుధ పోరాటం జరుగుతున్న కాలంలోనే, ఆంధ్ర, కోస్తా ప్రాంతాలలో ప్రజలను



చైతన్యపరిచి పోరాటానికి మద్దతు ఇప్పించేందుకు అనేక సభలను నిర్వహించారని చెప్పారు. ఈ పోరాటకాలంలోనే లక్షలాది ఎకరాల భూమిని పేదలకు పంచిందన్నారు. అదంతా తెలంగాణ సాయుధ పోరాట విజయమని, అందులో మల్లు స్వరాజ్యం ప్రధాన భూమిక పోషించడం గర్వకారణం అని చెప్పారు. ఆ తర్వాత కాలంలో రెండు పర్యాయాలు అసెంబ్లీకి ఎన్నుకోబడి ఎన్నో ప్రజా పోరాటాలకు వెన్నుదన్నుగా నిలిచారని చెప్పారు. శ్రీమన్నారాయణ మాట్లాడుతూ ఈఎంఎస్ నంబూద్రిపాద్ ఉన్నత నంబూద్రి కుటుంబంలో జన్మించినప్పటికీ స్వాతంత్ర పోరాటంలో పాల్గొని కాంగ్రెస్‌లో క్రియాశీలకంగా వ్యవహరించారిని చెప్పారు. ఆ తర్వాత కాలంలో సుందరయ్య ప్రేరణతో కమ్యూనిస్టుగా మారాడని చెప్పారు. మార్క్సిజాన్ని కేరళకు అన్వయించి పోరాట రూపాలను రూపొందించారని చెప్పారు. 1957లో మొట్టమొదటి ఎన్నికల ద్వారా రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఘనత వారికే దక్కిందన్నారు. భూ సంస్కరణలు గట్టిగా అమలుపరిచి పేదలకు ఎంతో మేలు చేశారని తెలిపారు. విద్య, వైద్యాన్ని ప్రజలకు దగ్గరగా తీసుకొచ్చారని చెప్పారు. పార్టీ చీలినప్పుడు సీపీఐ(ఎం) పక్షాన నిలబడి 9 మంది పొలిట్ బ్యూరో సభ్యులలో ఒకరిగా ఉన్నారని చెప్పారు. వారు అనేక పుస్తకాలు రాశారని వాటిని అధ్యయనం చేసి ఆచరణలో పెట్టడం ద్వారానే వారికి నిజమైన నివాళి అని చెప్పారు. ఈ సందర్భంగా ఐద్వా నాయకురాలు మన్మోహిని మల్లు స్వరాజ్యం జీవితంపై రాసిన పలుకులను వారి కుమార్తె శారద చదివి వినిపించారు. గద్దల నరసింహారావు మాట్లాడుతూ ఇద్దరు గొప్ప యోధులు చేసిన పోరాటాలు వారిచ్చిన పోరాట స్ఫూర్తితో నిలవాలని చెప్పారు. అనంతరం సభికులందరూ పోరాటయోధుల చిత్రపటాలకు పూలను వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో జయరాజ్, భాస్కర్ రావు, శారద, గౌస్య, అంజలి,శోభ, శ్రీనివాస రావు, వీబీ ఆచార్యులు, వెంకటేశ్వరరావు, యాదగిరి రావు, నరసింహారావు, శ్రీమన్నారాయణ, ప్రమీల, నాగలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

రేవంత్ సర్కారు చారిత్రాత్మక నిర్ణయం

- అన్ని వర్గాల సంక్షేమమే కాంగ్రెస్ లక్ష్యం
- టీపీసీసీ ఉపాధ్యక్షుడు వజ్రేష్ యాదవ్

నవతెలంగాణ-బోడుప్పల్

రాష్ట్ర ప్రభుత్వం ఎస్సీ రిజర్వేషన్లు, బీసీ రిజర్వేషన్ల అంశంలో చారిత్రక నిర్ణయం తీసుకుందని టీపీసీసీ ఉపాధ్యక్షుడు, మేడ్చల్ కాంగ్రెస్ ఇన్‌చార్జి తోటకూర వజ్రేష్ యాదవ్ అన్నారు. బుధవారం బోడుప్పల్‌లోని అంబేద్కర్ విగ్రహం వద్ద నిర్వహించిన కృతజ్ఞత సభలో అంబేద్కర్ విగ్రహానికి పూల మాల వేసిన అనంతరం సీఎం రేవంత్ రెడ్డి చిత్రపటానికి క్షీరాభిశేకం చేశారు. బోడుప్పల్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు పోగుల నరసింహ రెడ్డి



ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో తోటకూర వజ్రేష్ యాదవ్ మాట్లాడుతూ రేవంత్ రెడ్డి సర్కారు ఎన్నికలలో ఇచ్చిన ప్రతి హామీని నెరవేర్చడానికి కృషి చేస్తుందన్నారు. కామారెడ్డి డిక్లరేషన్, చెవేళ్ల డిక్లరేషన్‌లో భాగంగా బీసీ బిల్లుకు చట్టబద్ధత, ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణకు చట్టబద్ధత కల్పించడంలో సర్కారు విజయవంతం అయ్యిందన్నారు.

ఎస్సీ వర్గీకరణపై రేవంత్ సర్కారు తీసుకున్న నిర్ణయం సాహసోపేతంగా అభివర్ణించారు. కాంగ్రెస్ సర్కారు బీసీ కుల గణన పూర్తి చేయడంతో పాటు 42 శాతం రిజర్వేషన్లు అమలు చేయాలని అసెంబ్లీ లో బీసీ బిల్లకు చట్టబద్ధత కల్పించడంలో విజయవంతం అయ్యిందని అన్నారు. ఈ కార్యక్రమంలో బోడుప్పల్ మాజీ మేయర్ అజయ్ యాదవ్, మాజీ డిప్యూటీ మేయర్ కొత్త స్రవంతి కిషోర్ గౌడ్, మాజీ కార్పొరేటర్లు, పాల్గొన్నారు.

మేడిపల్లి పోలీసు స్టేషన్‌ను సందర్శించిన సీపీ



నవతెలంగాణ-బోడుప్పల్

శాంతిభద్రతల విషయంలో రాజీపడే సమస్యే లేదని అందుకు పోలీసులు నిరంతరం ప్రజలకు అందుబాటులో ఉండాలని రాచకొండ పోలీసు కమిషనర్ సుధీర్ బాబు అన్నారు. బుధవారం కమిషనరేట్ పరిధిలోని మేడిపల్లి పోలీసు స్టేషనును సందర్శించి పీఎస్ పరిధిలో జరుగుతున్న అంశాలను అడిగి తెలుసుకున్నారు. విజుబుల్ పోలీసింగ్,రిసెప్షన్ నిర్వహణ, సీసీ టీవిల నిర్వహణ లాంటి అంశాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మేడిపల్లి సీఐ ఆర్.గోవింద్ రెడ్డి అన్ని అంశాలను తెలిపారు.

బడ్జెట్‌లో బీసీలకు నిరాశే

- బీసీ జన చైతన్య వేదిక జాతీయ అధ్యక్షుడు డాక్టర్ దాసరి అజయ్ కుమార్ యాదవ్

నవతెలంగాణ-సిటీబ్యూరో

రాష్ట్ర బడ్జెట్‌లో బీసీలకు నిరాశే మిగిలిందని బీసీ జన చైతన్య వేదిక జాతీయ అధ్యక్షుడు డాక్టర్ దాసరి అజయ్ కుమార్ యాదవ్ అన్నారు. ఈ మేరకు బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. బీసీలపై కాంగ్రెస్‌ది కపట ప్రేమ అన్నారు. జనాభాలో 50 శాతం ఉన్న బీసీలకు 5 శాతం బడ్జెట్ కేటాయింపు కూడా జరుగలేదన్నారు. రాష్ట్ర జనాభాలో సగానికిపైగా ఉన్న బీసీలకు రూ.11,404 కోట్లు బడ్జెట్ ప్రవేశపెట్టడం వారికి అన్యాయం చేయడమే అన్నారు. దీన్ని బట్టి చూస్తే రాష్ట్ర ప్రభుత్వం బీసీలను చిన్నచూపు చూస్తుందన్నారు. ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన బీసీ కులగణన లెక్కల ప్రకారం బీసీలకు బడ్జెట్ కేటాయింపు జరుగలేదన్నారు. ఎన్నికల సమయంలో కాంగ్రెస్ ఇచ్చిన బీసీ సబ్ ప్లాన్ హామీని గురించి అసెంబ్లీలో ఉసే లేదన్నారు. రాష్ట్ర మంత్రివర్గంలో బీసీలకు 9 మంత్రి పదవులు ఇవ్వాలన్నారు. ప్రధానంగా బీసీల్లో యాదవ, ముదిరాజ్ సామాజిక వర్గాలకు మంత్రివర్గంలో చోటు లేదన్నారు. కాంగ్రెస్ తమ ఆలోచనా విధానాన్ని మార్చుకోకపోతే రాబోయే రోజుల్లో ప్రజలే తగిన గుణపాఠం చెబుతారన్నారు. కాంగ్రెస్‌లో సామాజిక న్యాయం జరగడం లేదన్నారు.

22న సీపీఐ(ఎం) పాదయాత్ర

- ఉప్పల్ సర్కిల్ కార్యదర్శి జే. వెంకన్న

నవతెలంగాణ-ఉప్పల్

ఉప్పల్ నుండి నారపల్లి ఫ్లై ఓవర్ పనులను వెంటనే పూర్తి చేయాలని కోరుతూ సీపీఐ(ఎం) మేడ్చల్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో మార్చి 22న ఉదయం 9:30 గంటలకు చేనిగచర్ల చౌరస్తా నుండి ఉప్పల్ రింగ్ రోడ్డు వరకు పాదయాత్ర నిర్వహించనున్నట్టు సీపీఐ(ఎం) ఉప్పల్ సర్కిల్ కార్యదర్శి జే. వెంకన్న తెలిపారు. ఈ పాదయాత్రను సీపీఐ(ఎం)తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి కామ్రేడ్ జాన్ వెస్లీ హాజరై పాదయాత్ర ప్రారంభిస్తారని తెలిపారు. పాదయాత్రలో కార్యకర్తలు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

నాగారం తైబజార్ వేలం వాయిదా

- కమిషనర్ భాస్కర్ రెడ్డి

నవతెలంగాణ-కీసర

నాగారం మున్సిపాలిటీ 2025-26 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి తైబజార్ బహిరంగ వేలం పాటను బుధవారం నిర్వహించగా ఇట్టి వేలం పాటలో ఎవరూ పాల్గొనక పోవడంతో తై బజార్ వేలం పాటను ఈ నెల 25న మంగళవారం నిర్వహించనున్నట్టు కమిషనర్ భాస్కర్ రెడ్డి తెలిపారు. వేలం పాటలో పాల్గొనే వారు రూ.2,00,000 మున్సిపల్ కమిషనర్, నాగారం పేరున డీడీ తీసి తేది 25.03.2025 ఉదయం 11.30 గంటలలోపు కార్యాలయంలో సమర్పించి వేలంలో పాల్గొనాలని కోరారు.



ఆశా వర్కర్స్ చలో కలెక్టరేట్ కార్యక్రమం సందర్భంగా సీఐటీయూ మేడ్చల్ జిల్లా సహాయ కార్యదర్శి జి.శ్రీనివాసులను బుధవారం పోలీసులు ముందస్తు అరెస్టు చేసి కుషాయిగూడ పోలీస్ స్టేషన్ తరలించారు. నవతెలంగాణ - చర్లపల్లి

అల్వాల్‌లో కాంగ్రెస్ శ్రేణుల సంబరాలు



నవతెలంగాణ -అల్వాల్

బీసీలకు 42శాతం రిజర్వేషన్లు, ఎస్సీ వర్గీకరణకు చట్టబద్ధత, యువతకు రాజీవ్ వికాస్ పథకం అసెంబ్లీలో ఆమోదం పొందడంతో అల్వాల్‌లో కాంగ్రెస్ శ్రేణులు సంబరాలు చేసుకున్నారు. దేశంలోనే కుల గణన చేసి బీసీలకు రిజర్వేషన్లు ఆమోదించిన ఏకైక రాష్ట్రంగా తెలంగాణ నిలుస్తుందని పలువురు అభిప్రాయపడ్డారు. మూడు బిల్లులకు ఆమోదం తెలిపిన సీఎం రేవంత్ రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌లకు కాంగ్రెస్ శ్రేణులు క్షీరాభిషేకం చేశారు. ఈ కార్యక్రమంలో ఏ బ్లాక్ అధ్యక్షుడు నిమ్మ అశోక్ రెడ్డి, సి.ఎల్. యాదగిరి, కార్పొరేటర్ రాజ్ జితేంద్రనాథ్, లక్ష్మీకాంత రెడ్డి, సురేందర్ రెడ్డి, కృష్ణ గౌడ్, రాజసింహారెడ్డి, నాగేశ్వరరావు, ఉదయ్ కుమార్, బలవంత రెడ్డి, అల్వాల్ సర్కిల్ అధ్యక్షురాలు వీనస్ మేరీ, పద్మ, లావణ్య, గాయత్రి, శశికళ, రమాదేవి, విజయ నిర్మల, లక్ష్మి, జ్యోతి, పెద్ద కార్యకర్తలు పాల్గొన్నారు.



బీసీ రిజర్వేషన్ బిల్లులకు ఆమోదం తెలిపిన నేపథ్యంలో సీఎం ఎనుముల రేవంత్ రెడ్డిని మంగళవారం అసెంబ్లీలో మర్యాదపూర్వకంగా కలిసిన చర్లపల్లి డివిజన్ కార్పొరేటర్, స్టాండింగ్ కౌన్సిల్ మెంబర్ బొంతు శ్రీదేవి యాదవ్ ధన్యవాదాలు తెలిపారు. - నవతెలంగాణ - చర్లపల్లి

మందకృష్ణ మాదిగ పోరాట ఫలితమే ఎస్సీ వర్గీకరణ

- ఎమ్మార్పీఎస్ కీసర మండలాధ్యక్షుడు మంచాల మహేందర్ మాదిగ



నవతెలంగాణ-కీసర

మందకృష్ణ మాదిగ పోరాట ఫలితమే ఎస్సీ వర్గీకరణ అని ఎమ్మార్పీఎస్ కీసర మండలాధ్యక్షుడు మంచాల మహేందర్ మాదిగ అన్నారు. అసెంబ్లీ వర్గీకరణకు ఏకగ్రీవంగా ఆమోదం తెలపడంతో ఎమ్మార్పీఎస్ కీసర ప్రధాన కార్యదర్శి కర్రె గణేష్ మాదిగల ఆధ్వర్యంలో కీసర, రాంపల్లి, తిమ్మాయిపల్లి గ్రామాల్లో విజయోత్సవ సంబరాలు జరుపుకున్నారు. డప్పు చప్పులతో గ్రామాల్లో ఊరేగింపు నిర్వహించి అంబేద్కర్ విగ్రహం వద్ద మంద కృష్ణ మాదిగ చిత్ర పటానికి క్షీరాభిషేకాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కీసర మహిళా కమిటీ అధ్యక్షురాలు సుజాత, మండల కమిటీ ఉపాధ్యక్షులు శ్రీనివాస్, అధికార ప్రతినిధి అంజనేయులు, కిరణ్ , మండల ఇన్‌చార్జి బుడిగే జగన్, మాజీ ఎంపీపీ రామారం సుజాత, తదితరులున్నారు.

రాంపల్లిలో మందకృష్ణ మాదిగ చిత్రపటానికి క్షీరాభిషేకం

పద్మశ్రీ మంద కృష్ణ మాదిగ ఆధ్వర్యంలో 30 ఏళ్ల పోరాటం ఫలితంగా ఎస్సీ వర్గీకరణ బిల్లు ఆమోదం పొందిన సందర్భంగా రాంపల్లి ఎమ్మార్పీఎస్ అధ్యక్షులు బందెల పరమేష్ ఆధ్వర్యంలో అంబేద్కర్ చౌరస్తాలో మందకృష్ణ మాదిగ చిత్రపటానికి పాలాభి ,షేకం చేశారు. కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా కీసర మండల ఎమ్మార్పీఎస్ అధ్యక్షులు మంచాల మహేందర్ , రాంపల్లి గ్రామ ఉపాధ్యక్షులు మీసాల భాస్కర్ , ప్రధాన కార్యదర్శి మంచాల నర్సింగ్ రావు, ఆర్గనైజింగ్ సెక్రటరీ పొడుగుల రవి,



మాజీ ఎంపీటీసీ మీసాల మల్లేష్ తదితరులున్నారు.

ఘట్కేసర్‌లో..

ఎస్సీ వర్గీకరణకు అసెంబ్లీలో చట్టబద్ధత కల్పించినందుకు ఎమ్మార్పీఎస్ జాతీయ నాయకులు సగ్గు శివకుమార్ ఉద్యమ నమస్కారాలు తెలియజేశారు. పద్మశ్రీ మందకృష్ణ మాదిగకు ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలిపారు. ఈ సందర్భంగా బుధవారం ఘట్కేసర్‌లో మందకృష్ణ మాదిగ ఫోటోకు క్షీరాభిషేకం చేశారు. ఈ కార్యక్రమం నరేందర్ మాదిగ, ఏనుగుల నాగేష్ మాదిగ, శ్రీనివాస్ మాదిగ, మధు మాదిగ, జగదీష్ మాదిగ, జగన్ మాదిగ, కప్పరగళ్ళ ఆంజనేయులు మాదిగ, శ్రీనివాస్, సుధాకర్, మోహన్‌రావు, తదితరులు పాల్గొన్నారు.



తెలంగాణ ప్రజలను మోసం చేసే బడ్జెట్ ఇది

● బీఆర్ఎస్ సీనియర్ నాయకులు నగేష్ ముదిరాజ్



నవతెలంగాణ-ముషీరాబాద్

తెలంగాణ ప్రజలను మోసం చేసే బడ్జెట్ ఇది అని బీఆర్ఎస్ సీనియర్ నాయకులు నగేష్ ముదిరాజ్ అన్నారు. ఈ మేరకు బుధవారం పత్రిక ప్రకటన ద్వారా బడ్జెట్‌పై స్పందించారు. సీఎం రేవంత్ రెడ్డి ఈ సంవత్సరం రూ.70 వేల కోట్ల రెవెన్యూ తగ్గిందని చెప్తుంటే ఆర్థిక శాఖ మంత్రి రెవెన్యూలో రాష్ట్రం దూసుకు పోతుందని చెప్పడం తప్పుడు లెక్కలు చెప్పి ప్రజలను మోసం చేశార న్నారు. మూడులక్షల ఐదువేల కోట్లు బడ్జెట్ లో అధిక శాతం జనాభా ఉన్న బీసీ లకు కేవలం 11 వేల కోట్లు మాత్రమే కేటాయించారు. బీసీ నాయకులంతా ఒకసారి బడ్జెట్ పై పునరాలోచించాలన్నారు. వైద్య, విద్యా రంగానికి రూ.12 వేల కోట్లు చాలా తక్కువ, చేనేత రంగానికి కేవలం రూ.300 కోట్లు మాత్రమే కేటాయించారని తెలిపారు.

ప్రతి బడ్జెట్‌లో బీసీలకు రూ. 20 వేల కోట్లు ఏవి

● బహుజన లెఫ్ట్ పార్టీ రాష్ట్ర అధ్యక్షులు దండి వెంకట్



నవతెలంగాణ-ముషీరాబాద్

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతి బడ్జెట్‌లో రూ.20 వేల కోట్ల బడ్జెట్ కేటాయిస్తామని ఐదు సంవత్సరాల్లో బీసీ కులాల ప్రజలకు లక్ష కోట్లు బడ్జెట్‌లో కేటాయించి బీసీ కులాల ఆర్థిక, రాజకీయ సామాజిక సాంస్కృతిక అభివృద్ధికి తోడ్పడే విధంగా చర్యలు తీసుకుంటామని కాంగ్రెస్ కామారెడ్డి బీసీ డిక్లరేషన్‌లో ప్రకటించిన గత బడ్జెట్‌లో రూ.9 వేల కోట్లు కేటాయించినట్లు పేపర్ పై ప్రకటించిన బీసీ కులాల కార్పొరేషన్‌లకు నయా పైసా విడుదల చేయలేదని దండి వెంకట్ విమర్శించారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ పై పత్రికా ప్రక్కన ద్వారా స్పందించారు. విద్య ,ఉపాధి, వైద్య అభివృద్ధి కోసం తగిన విధంగా నిధుల కేటాయింపులో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం విఫలమైందని విమర్శించారు.

జీహెచ్ఎంసీకి రూ.3101.21 కోట్లు



నవతెలంగాణ-సిటీబ్యూరో

శాసనసభలో రాష్ట్ర బడ్జెట్‌ను డిప్యూటీ సీఎం, ఆర్థిక మంత్రి భట్టి విక్రమార్క ప్రవేశ పెట్టారు. 2025-26 ఏడాదికి రూ.3,04,9 కోట్లతో బడ్జెట్‌ను సభలో ప్రతిపాదించారు. రెవెన్యూ వ్యయం రూ.2,26,982కోట్లు, మూల ధన వ్యయం రూ.36,504కోట్లుగా పేర్కొన్నారు. దేశానికి తలమాని కంగా ఉండేలా నగరంతో పాటు, ఫ్యూచర్‌సిటీని రూపొందిస్తున్నారు. హైద రాబాద్ నగరం శరవేగంతో అభివృద్ధి చెందు తున్న తరుణంలో ప్రధాన మౌలిక సదుపాయా లతోపాటు, నగరంలో పెరుగుతున్న ట్రాఫిక్ నియంత్రణ, 17 అండర్‌పాస్‌లు, 10 రోడ్ల విస్త రణ, 31 ఫ్లైఓవర్ల ప్రభుత్వం ప్రారం భించింది. అందులో భాగంగా రూ.7,032కోట్ల అంచనా వేయంతో ప్రతిపాదించారు. దీంతో పాటు సుం దరీకరణ పనుల కోసం రూ.150 కోట్లు కేటా యించారు. ఇదిలావుండగా ఓఆర్ఆర్ ఫేజ్-2 నీటి సరఫరా ప్రాజెక్టు చివరి దశకు చేరుకుంది. ఫేజ్2 ద్వారా హెచ్ఎండీఏలో విస్తరించిన ప్రాం తాలకు తాగునీరు అందించనున్నారు. రాష్ట్ర బడ్జె ట్‌లో గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొ రేషన్‌కు రూ.3101.21 కోట్లు కేటాయించడం పై పలువురు హర్షం వ్యక్తం చేశారు.

తాగునీటి సరఫరా... మురుగునీటి నిర్వహణకు...

హైదరాబాద్ మహానగరానికి తాగునీటి సరఫరా, మురుగునీటి నిర్వహ సంస్థ (జల మండలికి) రాష్ట్ర బడ్జెట్‌లో పెద్దపీట వేసింది. పథకాలు, లోన్లు కలిపి రూ.5,470కోట్లు కేటా యించింది. 2024లో జలమండలి ఆధ్వర్యంలో విప్లవాత్మక ప్రాజెక్టులను చేపట్టింది. ఉస్మా న్‌సాగర్, హిమాయత్‌సాగర్ జలాశయాలపై 20ఎంఎల్డీ సామర్థ్యంతో కూడిన నాలుగు మురుగునీటి శుద్ధి కేంద్రాలను నిర్మించింది. మూసీ ప్రక్షాళనలో భాగంగా గోదావరి తాగునీటి పథకం కింద గోదావరి జలాశయాలను నింపి వాటిని పునరుజ్జీవింప చేయాలని ప్రభుత్వం ప్రయత్నిస్తోంది. ఇందుకుగాను జలమండలి టెండర్లను ఆహ్వానించింది. ఇదిలావుండగా మ్యాన్ హోళ్లలో పూడిక తీయడానికి స్పెషల్ డ్రైవ్ పనులు చేపట్టిన జలమండలి 3,025కిలోమీటర్ల మురుగునీటి వ్యవస్థను శుభ్రం చేసింది. 2.39 లక్షల మ్యాన్ హోళ్లకు యునిక్ ఐడీ ఇవ్వడంతోపాటు వాటిని ఎప్పటికప్పుడు పర్యవేక్షించడానికి డ్యాష్ బోర్డును ఏర్పాటు చేసింది. క్రిష్ణా తాగు నీటి పథకంలో భాగంగా చేపట్టిన సుంకి శాల ప్రాజెక్టు పనులు చేపట్టడానికి ప్రభుత్వం రూ. 3,085కోట్లు కేటాయించింది. ఇతర ప్రాజెక్టులు చేపట్టడానికి లోన్లు తీసుకునేందుకు ప్రభుత్వం గ్యారెంటీ ఇచ్చింది. అందులో భాగంగానే రూ. 2,085కోట్ల నిధులను బడ్జెట్‌లో కేటాయించింది. ఇక హైదరాబాద్ మహా నగరంలో మురికివాడలతోపాటు ఇతర ప్రాంతాల్లో సామాన్య, మధ్య తరగతి ప్రజలకు 20కిలోలీటర్ల ఉచిత తాగునీటి పథకాన్నిగత ప్రభుత్వం ప్రకటించిన విషయం తెలిసిందే. ఈ పథకానికి సంబంధించి పరిహారం కింద జలమండలికి రూ.300కోట్లను బడ్జెట్‌లో కేటాయించింది. అభివృద్ధి పనులకు రూ.1450 కోట్లు కేటాయించారు.

ట్రై పోలీస్ కమిషనరేట్లకు కేటాయింపులు

ఈ సారీ హోం శాఖకు ఈ బడ్జెట్ లో రూ. 10,188 కోట్లు ప్రతిపాదించారు. ప్రధానంగా టెక్నాలజీ ఆధారిత పోలీసింగ్‌పై దృష్టి పెట్టిన ప్రభుత్వం, పౌరులకు పారదర్శకంగా, స్నేహ పూర్వకంగా, సమర్థవంతమైన సేవలందించేందుకు అవసరమైన మౌలిక సదుపాయాలను అభివృద్ధి చేస్తోంది. ట్రై పోలీస్ కమిషనరేట్లకు సుమారు రూ.3267.32 కోట్లు కేటాయించగా, హైదరాబాద్‌కు రూ.1876.13కోట్లు, సైబరాబాద్‌కు రూ.722.57, రాచకొండ కమిషనరేట్‌కు రూ.668.61కోట్లు కేటాయించారు. ఇవి సిబ్బంది జీతభత్యాలు, వాహనాలు, కార్యాలయాల నిర్వహణ, ట్రాఫిక్ నిర్వహణతోపాటు వివిధ రకాల అలవెన్స్‌కు కేటాయించారు. ఇదిలావుండగా బాధ్యతాయుతమైన విధులను నిర్వహించే పోలీసు ఉద్యోగుల పిల్లల చదువుల కోసం సైనిక్ స్కూళ్ల మాదిరిగా రంగారెడ్డి జిల్లా మంచిరేవుల గ్రామంలో యంగ్ ఇండియా పోలీస్ రెసిడెన్షియల్ పాఠశాలను అంతర్జాతీయ ప్రమాణాలతో కూడిన మౌలిక సదుపాయాలతో ,క్రీడా ప్రాంగణాలతో వసతీ సౌకర్యాలతోఏర్పాటు చేస్తూ ఉత్తర్వులు జారీ చేసిన విషయం తెలిసిందే. ఈ పాఠశాలలో పోలీసుల పిల్లలతో పాటు, పోలీస్ అమరవీరులు, అగ్నిమాపక, ఎక్సైజ్, స్పెషల్ ప్రొటెక్షన్, జైళ్ల విభాగాలలో పని చేసే వారి పిల్లలకు కూడా ప్రవేశం కల్పిస్తున్నారు. క్షేత్ర స్థాయిలో అత్యంత కీలకమైన హోంగార్డుల రోజు వారి వేతనాన్ని రూ. 921ల నుండి రూ.1,000లకి పెంచారు. సహజ మరణం లేదా విధి నిర్వహణలో ప్రమాదవశాత్తు మృతి చెందిన హోం గార్డుల కుటుంబాలకు రూ. 5 లక్షల రూపాయల ఎక్స్‌గ్రేషియా అందజేస్తున్నారు. ఇదిలావుండగా డ్రగ్స్ రహిత తెలంగాణ సాధించే కార్యచరణలో భాగంగా, తెలంగాణ యాంటీ నార్కోటిక్స్ బ్యూరో పనిచేస్తోంది. ప్రత్యేకంగా ఓ యాప్‌ను రూపొందించారు. మాదక ద్రవ్యాలను వినియోగించే విద్యార్థులలో కనిపించే ప్రవర్తన లక్షణాలను ప్రాథమిక దశలోనే గుర్తించేందుకు తల్లిదండ్రులు, ఉపాధ్యాయులకు ఈ యాప్ సహాయ పడుతుంది. ప్రస్తుతం హైదరాబాద్ పరిసరాలలో ఉన్న 1,000 పాఠశాలలకు దీని ద్వారా సేవలు అందుతున్నాయి. ఇదిలావుండగా హైడ్రాకు రూ.121 కోట్లు కేటాయించారు.

యువత సేవా కార్యక్రమాల్లో ముందుండాలి

సినీ హీరో డాక్టర్ మదాల రవి, ఎస్‌వీకే కార్యదర్శి ఎస్.వినయ్ కుమార్, డాక్టర్ విజయేందర్



నవతెలంగాణ-ముషీరాబాద్

యువత సేవా కార్యక్రమాల్లో ముందుండాలని సినిమా హీరో డాక్టర్ మదాల రవి, సుందరయ్య విజ్ఞాన కేంద్రం కార్యదర్శి ఎస్.వినయ్ కుమార్, డాక్టర్ విజయేందర్ అన్నారు. భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్ఎఫ్ఐ), భారత ప్రజాతంత్ర యువజన సమైక్య (డీవైఎఫ్ఐ) హైదరాబాద్ జిల్లా కమిటీల ఆధ్వర్యంలో షహీద్ భగత్ సింగ్ వర్ధంతి సందర్భంగా యువజన ఉత్సవాల్లో భాగంగా మంగళవారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో రక్తదాన శిబిరం ఏర్పాటు చేయడం జరిగింది. ఈ సందర్భంగా హీరో డాక్టర్ మదాల రవి, సుందరయ్య విజ్ఞాన కేంద్రం కార్యదర్శి ఎస్. వినయ్ కుమార్ ముఖ్య అతిథులుగాహాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ భగత్ సింగ్, రాజ్ గురు, సుఖ్ దేవ్ లు బ్రిటిష్ సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా, భారతదేశ విముక్తి కోసం స్వేచ్ఛా స్వాతంత్ర్యంకి 23ఏండ్ల వయసులో ప్రాణాలర్పిం చిన గొప్ప విప్లవ వీరకిషోరాలు అని అన్నారు. నేటి విద్యార్థి యువత స్వాతంత్ర్య ఉద్యమ పోరాటస్ఫూర్తితో తమ హక్కుల కోసం గళం వినిపించాలన్నారు. ప్రతి ఒక్కరూ రక్తదానం చేసి ప్రాణదాతలుగా కావాలని కోరారు. రక్తహీనతతో బాధపడుతూ అనేకమంది మృత్యువాత పడుతున్నారని బాధ్యతగల విద్యార్థి యువజన సంఘాలుగా ఎస్ఎఫ్ఐ, డీవైఎఫ్ఐ విస్తృతంగా రక్తదాన శిబిరాలు ఏర్పాటు చేసి రక్తదానం చేయాలన్నారు. భగత్ సింగ్ స్ఫూర్తితో నేడు యువత, విద్యార్థులు విస్తృతంగా సేవా కార్యక్రమాల్లో పాల్గొనాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో డీవైఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శిలు కోట రమేష్, అనగంటి వెంకటేష్, ఐపీఎం బ్లడ్ బ్యాంక్ డాక్టర్స్ మదవి, శశిదర్, జె.కే శ్రీనివాస్, ఎస్ఫ్ఐ, డీవైఎఫ్ఐ జిల్లా అధ్యక్ష కార్యదర్శు లు లెనిన్, అశోక్ రెడ్డి, జావీద్, నాగేందర్, ప్రశాంత్, రాజయ్య శ్రీనివాస్, అస్మిత, రమ్య, ప్రజా సంఘాల నాయకులు మహేందర్, విజయ్ కుమార్ అజయ్ బాబు, కిరణ్, శ్రీనివాస్, దశరథ్, పవన్, తదితరులు పాల్గొన్నారు.

రవీందర్ నాయక్ నగర్ కాలనీలో కరెంట్ బిల్లులు తగ్గించాలి

● సీపీఐ(ఎం) చాంద్రాయణగుట్ట జోన్ కమిటీ



నవతెలంగాణ-చాంద్రాయణగుట్ట

రవీందర్ నాయక్ నగర్ కాలనీలో కరెంట్ బిల్లులు తగ్గించాలని సీపీఐ(ఎం) చాంద్రాయణగుట్ట జోన్ కమిటీ ఆధ్వర్యంలో ఫలక్‌నామా ఏడీఈకి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సీపీఐ(ఎం) చాంద్రాయణగుట్ట జోన్ కార్యదర్శి ఎస్.కిషన్, ఏ.కృష్ణ, వీరాంకుమార్ నాయక్ లు మాట్లాడుతూ.. జంగంమెట్ డివిజన్‌లో ఉన్న రవీందర్ నాయక్ నగర్ కాలనీలో కరెంట్ బిల్లులు తగ్గించి, ప్రజలకు ప్రమాదం జరగకుండా ఇనుప స్తంభాల స్థానంలో సిమెంట్ స్తంభాలు వేయాలన్నారు. బస్తీలో చాలామందికి కరెంటు తక్కువగా వినియోగించిన ఎక్కువ మోతాదులో బిల్లులు రావడంతో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. బిల్ కలెక్టర్లకు ఎన్నో దఫాలుగా విన్నవించుకున్న మీరు ఎంత యూనిట్ కలిస్తే అంతే బిల్లు వస్తుందని దాటేస్తున్నారని చెప్పారు. ఇప్పటికైనా ఎలక్ట్రిసిటీ అధికారులు వెంటనే స్పందించి మీటర్ బిల్లులు తగ్గించి, పేద ప్రజలకు ఇబ్బంది లేకుండా చూడాలన్నారు. అదేవిధంగా ఫలక్నామా స్టేషన్ రోడ్డు దేనా బాపు బస్తీలో మూడు ఇనుప స్తంభాలు స్టేషన్ రోడ్డు గల్లీలో ఒక ఇనుప స్తంభము ప్రమాదకర స్థితిలో ఉన్నాయన్నారు. వాటిని వెంటనే మార్చాలని ఎన్నో సార్లు ఫిర్యాదు చేసిన అధికారులు పట్టించుకోవడం లేదన్నారు. ఇప్పటికైనా వెంటనే సిమెంట్ స్తంభాలు వేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీఐటీయు ఆంజనేయులు, దర్జీ, రాజా, రాములు, మజర్ తదితరులున్నారు.

కేంద్రంలో బీసీలకు ప్రత్యేక మంత్రిత్వ శాఖ ఏర్పాటు చేయాలి



నవతెలంగాణ-ముషీరాబాద్

జనగణలో కులగణన చేపట్టాలని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అసెంబ్లీలో బీసీలకు విద్యా ఉద్యోగాలలో 42 శాతం రిజర్వేషన్లు కేటాయించాలని బీసీ ప్రతినిధి బృందం నాయకులు బుధవారం సమాజ్‌వాది పార్టీ అధ్యక్షులు అఖిలేష్ యాదవ్, పార్లమెంట్ సభ్యులు మల్లు రవి, సురేష్ రెడ్డి, రేణుక చౌదరి, నిరంజన్ రెడ్డి డీకే అరుణ, ఈటల రాజేందర్ ను కలిసి వినతిపత్రం అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం త్వరలో జన గణన చేయబోతుందని ఇందులో కుల గణన చేపట్టాలని కోరారు. బీసీలకు ప్రత్యేక మంత్రిత్వ శాఖ ఏర్పాటు చేయాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బీసీ 42 శాతం రిజర్వేషన్లను కేంద్ర ప్రభుత్వం చట్టబద్ధత కల్పించాలని కోరారు. బీజేపీ పాలిత రాష్ట్రాలు మినహాయిస్తే అన్ని రాష్ట్రాలలో జనగణనలో కులగణన చేయాలని తీర్మానం చేశాయన్నారు. బ్యాంకుల ప్రయివేటీకరణను ఆపాలని కోరారు. ఈ ప్రతినిధి బృందంలో జాతీయ కన్వీనర్ గుజ్జ కృష్ణ జాతీయ మహిళా ఉపాధ్యక్షురాలు మట్ట జయంతి గౌడ్, రక్షక దళ్ చైర్మెన్ మినప్పూరి ఉదయనేత, బోను దుర్గా నరేష్, ఆంధ్రప్రదేశ్ బీసీ అధ్యక్షులు విజయ్ రాఘవేందర్ బిక్షపతి సరేందర్ గౌడ్ తదితరులున్నారు.

బీసీలకు 42శాతం రిజర్వేషన్ ప్రవేశపెట్టడం పట్ల హర్షం

● మంత్రి పొన్నం ప్రభాకర్‌కు సన్మానం



నవతెలంగాణ-ముషీరాబాద్

బీసీలకు 42శాతం రిజర్వేషన్ విద్యా, ఉద్యోగ, ఆర్థిక సామాజిక రంగాలలో వాటా కల్పిస్తూ తెలంగాణ రాష్ట్ర అసెంబ్లీలో రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ చేతుల మీదుగా ప్రవేశపెట్టడాన్ని హర్షిస్తూ తెలంగాణ గౌడ కల్లుగీత సంఘాల సమన్వయ కమిటీ చైర్మెన్ బాలగౌని బాలరాజు గౌడ్, వర్కింగ్ ప్రెసిడెంట్ ఎలియట్టే విజయ్‌కుమార్ గౌడ్‌లు మంత్రి పొన్నం ప్రభాకర్‌ను కలిసి శాలువా, పూలబొకేతో సన్మా నించారు. అనంతరం చిక్కడపల్లిలోని సమన్వయ కమిటీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ బీసీ బిల్లును ప్రవేశ పెట్టి అన్ని పార్టీల సంపూర్ణ మద్దతును పొందేలా చేయటం ఆనందదాయమన్నారు. బీసీలకు భవిష్యత్‌లో పెద్ద పీట వేస్తూ బీసీల జీవితా లలో వెలుగు నింపే ప్రయత్నం చేసిన ఘనత మంత్రి పొన్నం ప్రభాకర్‌కు దక్కుతుందన్నారు. ఈ సందర్భంగా బీసీల పక్షాన వారికి ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు.

పుట్టగొడుగుల పెంపకంపై విద్యార్థులకు అవగాహన..

నవతెలంగాణ-సుల్తాన్‌బజార్

పుట్టగొడుగుల పెంపకంపై విద్యార్థులకు వీరరాణి చాకలి ఐలమ్మ మహిళ విశ్వవిద్యాలయం లో ప్రకృతి క్లబ్ సమన్వయకర్త సాయి భవాని ఆధ్వర్యంలో అవగాహన నిర్వహించారు. బుధవారం ఇస్రా హాల్‌లో విశ్వవిద్యాలయ వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ సూర్య ధనంజయ్, ప్రిన్సిపల్ లోక పావని హాజరై మాట్లాడుతూ.. విద్యా పరిజ్ఞానంతో పాటు ఆచరణాత్మక నైపుణ్యాలను పొందడం యొక్క ప్రాముఖ్యత పై ప్రసంగించారు. రోజువారీ జీవితంలో స్థిరమైన పద్ధతుల యొక్క ప్రాముఖ్యతను తెలియజేశారు. ప్రకృతి క్లబ్ సమన్వయకర్త డాక్టర్ సాయి భవాని మాట్లాడుతూ.. ప్రకృతి క్లబ్ స్వయం ఉపాధిని ప్రోత్సహించి పర్యావరణ పరిరక్షణకు దోహద పడేలా కృషి చేస్తామన్నారు. పుట్టగొడుగుల పెంపకం ద్వారా తక్కువ పెట్టుబడితో ఎక్కువ లాభాన్ని ఆర్జించవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ లోక పావని, పకృతి క్లబ్ సమన్వయకర్త డాక్టర్ సాయి భవాని, స్వస్తిక ఎంటర్ప్రైజెస్ మహేష్, పీఆర్ఓ కృష్ణ, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

లో ప్రెషర్ నీటి సమస్య పరిష్కారానికి కృషి

● కార్పొరేటర్ ఇ. విజయ్ కుమార్ గౌడ్



నవతెలంగాణ-అంబర్‌పేట

లో ప్రెషర్ మంచినీటి సమస్య పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తున్నానని అంబర్‌పేట కార్పొరేటర్ ఇ.విజయ్ కుమార్ గౌడ్ అన్నారు. బుధవారం అంబర్‌పేట డివిజన్ పరిధిలోని హైమద్‌నగర్‌లో లోప్రెషర్ నీటి సమస్య ఉందని స్థానికులు కార్పొరేటర్ దృష్టి తీసుకెళ్లడంతో వెంటనే స్పందించిన కార్పొరేటర్ విజయ్ కుమార్ గౌడ్ స్థానిక అధికారులను పిలిపించి సమస్యను పరిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇలాంటి సమస్య భవిష్యత్తులో తలెత్తకుండా అధికారులు ముందస్తు ప్రణాళిక ఏర్పాటు చేసుకోవాలని మంచినీటి నల్లాలకు బోర్లు పెట్టకూడ స్థానిక అధికారులు చూడాలని ప్రతి ఒక్క ఇంటికి మంచి నీరు అందించే విధంగా అధికారులు చూడాలని సూచించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ సీనియర్ నాయకులు రంగు సతీష్ గౌడ్, మహమ్మద్ మోసిన్, షేక్ రఫీక్, మహమ్మద్ అజార్, డాక్టర్ మమ్మద్ పాషా, షేక్ నిజాం, ట్రక్, జాంగిర్ తదితర నాయకులు పాల్గొన్నారు.

'రాష్ట్ర బడ్జెట్‌లో యువజన రంగానికి అన్యాయం'

ఏఐవైఎఫ్ రాష్ట్ర సమితి

నవతెలంగాణ-హిమాయత్ నగర్

రాష్ట్ర ప్రభుత్వం అసెంబ్లీలో ఆర్థిక శాఖ మంత్రి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ప్రవేశ పెట్టిన బడ్జెట్‌లో యువజన రంగానికి తీవ్ర అన్యాయం జరిగిందని, రాష్ట్ర ప్రభుత్వం యువజన కమిషన్‌ను ఏర్పాటు హామీని ప్రకటించకపోవడం బాధాకరమని అఖిల భారత యువజన సమాఖ్య (ఏఐవైఎఫ్) రాష్ట్ర అధ్యక్షులు వలి ఉల్లా ఖాద్రీ, కార్యదర్శి కల్లూరు ధర్మేంద్రలు బుధవారం ఒక ప్రకటనలో ఆరోపించారు. కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం ప్రచారార్భాటాలకు ఇస్తున్న ప్రాధాన్యత ఉద్యోగాల భర్తీపై లేదన్న విమర్శలు వస్తున్నాయన్నారు. పేరుకు మాత్రమే జాబ్ క్యాలెండర్ ప్రకటించిం దని విమర్శించారు. యూత్ డిక్లరే షన్‌లో జాబ్ క్యాలెండర్‌తో పాటు నిరుద్యోగ భృతి రూ.4 వేలు ఇస్తామని ప్రకటించిందని, విద్య, ఉపాధి కల్పనకు యూత్ కమిషన్ ను ఏర్పాటు చేస్తామని ఎన్నికల్లో హామీ ఇచ్చార న్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని, ప్రశ్నించే నిరుద్యోగులపై బీఆర్ఎస్ తరహాలోనే నిర్బంధాన్ని ప్రయోగించడాన్ని మానుకోవాలని, లేకపోతే యువత ఆగ్రహానికి గురికాక తప్పదని వారు రాష్ట్ర ప్రభుత్వాన్ని హెచ్చరించారు.

ఆరోగ్య బడ్జెట్ పెరిగినా ప్రజారోగ్య భద్రతకు ప్రాధాన్యత లేదు..



నవతెలంగాణ-సుల్తాన్‌బజార్

తెలంగాణ ప్రభుత్వం 2025-26 బడ్జెట్‌లో ఆరోగ్య, వైద్య, కుటుంబ సంక్షేమ శాఖకు రూ.12,393 కోట్లు కేటాయించింది. ఇది గత సంవత్సరం కంటే స్వల్ప పెరుగుదల మాత్రమేనని, ప్రజారోగ్య భద్రతకు సరైన ప్రాధాన్యత లభించలేదని ఐఎంఏ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్. దువ్వూరు ద్వారకానాథ రెడ్డి, గౌరవ కార్యదర్శి డాక్టర్.వి.అశోక్, ఫైనాన్స్ కార్యదర్శి డాక్టర్. టి. దయాల్ సింగ్ విడుదల చేసిన ప్రకటనలో తెలిపారు. ఈ మొత్తం రాష్ట్ర మొత్తం బడ్జెట్‌లో 4శాతం మాత్రమే, ఇది జాతీయ ఆరోగ్య విధానం 2017 ప్రకారం కనీసం 8 శాతం ఉండాల్సిన అవసరం ఉందన్నారు. బడ్జెట్ కేటా యింపులతోనే ఆరోగ్య వ్యవస్థ బలోపేతం కావడం లేదని ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించాలంటే సరైన అమలు విధానాలు అవసరమన్నారు. ప్రభుత్వ ఆస్పత్రుల నాణ్యతను పెంచేందుకు ప్రత్యేక మార్గదర్శకాలు అవసరం ఉందన్నారు. వైద్య సిబ్బంది కొరత ఉన్నందున తక్షణ నియామకాలు చేపట్టాలని కోరారు. మెట్రో సిటీల కు మాత్రమే కాకుండా గ్రామీణ ప్రాంతాల్లోనూ నాణ్యమైన వైద్య సదుపాయాలు అందించాలని నకిలీ డాక్టర్ల (క్వాక్స్) పై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. తెలంగాణ గ్రామీణ ప్రజారోగ్యం నకిలీ డాక్టర్ల చేతుల్లో తీవ్ర ప్రమా దంలో ఉందని, ఈ క్వాక్స్ సరైన అర్హతలు లేకుండా ప్రజలకు అనవసర యాంటీబయోటిక్స్ ఇస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

యువత చెడు వ్యసనాలకు బానిస కావద్దు

● తెలంగాణ శిశు పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క



నవతెలంగాణ-ముషీరాబాద్

యువత చెడు వ్యసనాలకు బానిసలు కావొద్దని సమాజంలో ఉన్నతమైన స్థానాల్లో ఉండాలని తెలంగాణ శిశు పంచాయతీ రాజ్ శాఖ మంత్రి సీతక్క అన్నారు. (ఎస్ఎఫ్ఐ), భారత ప్రజాతంత్ర యువజన సమైక్య (డీవైఎఫ్ఐ) హైదరాబాద్ జిల్లా కమిటీల ఆధ్వర్యంలో షహీద్ భగత్ సింగ్ వర్ధంతి సందర్భంగా యువజన ఉత్సవాల సందర్భంగా బుధవారం బాగ్‌లింగంపల్లి సుందరయ్య విజ్ఞాన కేంద్రం వద్ద మంత్రి సీతక్క ఉత్సవాల పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ భగత్ సింగ్ బ్రిటిష్ సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా, భారతదేశ విముక్తి కోసం స్వేచ్ఛా స్వాతంత్ర్యానికి 24ఏండ్ల వయసులో ప్రాణాలర్పించిన గొప్ప విప్లవ కిషోరం అని అన్నారు. నేటి విద్యార్థి యువత స్వాతంత్ర్య ఉద్యమ పోరాటస్ఫూర్తితో తమ హక్కుల కోసం గళం వినిపించాలన్నారు. భగత్‌సింగ్ స్ఫూర్తితో నిర్వహించబోయే కార్యక్రమాలన్నీ విజయవంతం కావాలని కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి, మాజీ డీవైఎఫ్ఐ నాయకులు ఎం .మహేందర్, ఎస్ఎఫ్ఐ హైదరాబాద్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు లెనిన్ అశోక రెడ్డి, నాగేందర్, స్టాలిన్, రజినీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

హమాలీ కార్మికులకు వేల్ఫేర్ బోర్డు ఏర్పాటు చేయాలి



● సీఐటీయు హైదరాబాద్ సౌత్ జిల్లా కార్యదర్శి మీసాల శ్రావణ్

నవతెలంగాణ-సుల్తాన్‌బజార్/ధూల్‌పేట్

హమాలీ కార్మికులకు వేల్ఫేర్ బోర్డు ఏర్పాటు చేయాలని హైదరాబాద్ సౌత్ జిల్లా సీఐటీయు కార్యదర్శి మీసాల శ్రావణ్ అన్నారు. మార్చి 21 ఇందిరా పార్క్ వద్ద జరిగే మహా ధర్నాను జయప్రదం చేయాలని ముక్తార్ గంజ్ మహారాజ్ గంజ్ దాల్ మార్కెట్ హమాలీ కార్మికుల జనరల్ బాడీ సమావేశం కె. జంగయ్య అధ్యక్షతన మహారాజ్ గంజ్‌లో జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా హైదరాబాద్ సౌత్ జిల్లా సీఐటీయు కార్యదర్శి మీసాల శ్రావణ్ కుమార్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హమాలీ కార్మికుల సమస్యల పరిష్కారం కోసం సీఐటీయు ఆధ్వర్యంలో అనేక సంవ త్సరాల నుండి పోరాటాలు నిర్వహిస్తున్నామని హమాలీ కార్మికుల సమస్యలు పరిష్కారించడంలో పాలక ప్రభుత్వాలు కాల యాపన చేస్తున్నాయని ఆయన విమర్శించారు. కాయకష్టం చేస్తున్న హమాలీ కార్మికులకు వేల్ఫేర్ బోర్డు ఏర్పాటు చేసి హమా లీ కార్మికులను ఆదుకోవాలని ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. హమాలీలకు ప్రమాద భీమా, ఇఎస్ఐ, పీఎఫ్, ఇన్సూరెన్స్, పెన్షన్ సౌకర్యాలు కల్పించాలని ప్రభుత్వాన్ని విజ్ఞప్తి చేశారు. హమాలీ కార్మికుల సమస్యల పరిష్కారం కోసం 21న జరిగే మహాధర్నాకు అధిక సంఖ్యలో పాల్గొనాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సీఐటీయు సీనియర్ నాయకులు పి.నాగేశ్వర్, హమాలీ యూనియన్ అధ్యక్ష కార్యదర్శులు ఆర్.సాయిలు, పి.చెన్నయ్య, కోశాధికారి జి.నర్సింహ్మా, ఉపాధ్యక్షులు పి.కుర్మయ్య, నిరంజన్, సత్యనారాయణ, కనకేష్ సహాయ కార్యదర్శులు, కడపయ్య, సిద్దులు, గణేష్, బాల్‌రాజు, మచ్చయ్య, కమిటీ సభ్యులు వెంకటేష్, రాజు, తదితరులున్నారు.

రేపు అడవుల పరిరక్షణకు అవగాహన ర్యాలీ

● తెలంగాణ సిటిజన్స్ కౌన్సిల్ రాష్ట్ర అధ్యక్షులు డా.రాజ్ నారాయణ ముదిరాజ్

నవతెలంగాణ-హిమాయత్ నగర్

తెలంగాణ సిటిజన్స్ కౌన్సిల్ రాష్ట్ర శాఖ, వికాస్ భారతి చారిటబుల్ ట్రస్ట్ సంయుక్త ఆధ్వర్యంలో ఈ నెల 21న శుక్రవారం ఉదయం 10 గంటలకు అంతర్జాతీయ అటవీ దినోత్సవం పురస్కరించుకుని అడవుల పరిరక్షణపై ఎన్ఎస్ఎస్ వాలంటీర్లతో అవగాహన ర్యాలీ, సదస్సులు నిర్వహిస్తున్నట్లు కౌన్సిల్ రాష్ట్ర అధ్యక్షులు డా.రాజ్ నారాయణ ముదిరాజ్, ట్రస్ట్ మేనేజింగ్ డైరెక్టర్ కె.రామ్ గోపాల్ రెడ్డి బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి జాతీయ పర్యావరణవేత్త, ప్రొఫెసర్ కె.పురుషోత్తంరెడ్డి ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగిస్తారని, గౌరవ అతిథులుగా ప్రొఫెసర్ చంద్ర ముఖర్జీ, ఇందిరా ప్రియదర్శిని డిగ్రీ మహిళా కళాశాల ప్రిన్సిపాల్ అధ్యక్షత వహిస్తారని, పర్యావరణ పరిరక్షణ అభివృద్ధి మండలి జాతీయ సలహాదారులు, గ్రీన్ అంబాసీడర్ ఆఫ్ తెలంగాణ స్టేట్ లయన్ డా.కోమటిరెడ్డి గోపాల్ రెడ్డి, ఫిలంతర్పిస్ట్ టి.రామచంద్రారెడ్డి, నగర ప్రముఖ వైద్య నిపుణురాలు డాక్టర్ మూల్పూరు ఊహ తదితరులు పాల్గొంటారని వారు పేర్కొన్నారు.

స్థానిక సంస్థల ఎన్నికల్లో వికలాంగులకు రిజర్వేషన్ కల్పించాలి


● డెవలప్మెంట్ సొసైటీ ఫర్ డెఫ్ కన్వీనర్, కో కన్వీనర్‌లు వల్లభనేని ప్రసాద్, కాటమోని వెంకటేష్



నవతెలంగాణ-ముషీరాబాద్

స్థానిక సంస్థల ఎన్నికల్లో వికలాంగులకు రిజర్వేషన్ కల్పించాలని డెవలప్మెంట్ సొసైటీ ఫర్ డెఫ్ కన్వీనర్, కో కన్వీనర్‌లు వల్లభనేని ప్రసాద్, కాటమోని వెంకటేష్‌లు తెలిపారు. ఈ మేరకు బుధవారం రాష్ట్ర ప్రభుత్వం బీసీలకు 42 శాతం రిజర్వేషన్ కల్పించడంపై హర్షం వ్యక్తం చేస్తూ సీఎం రేవంత్ రెడ్డికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. అనంతరం వారు మాట్లాడుతూ స్థానిక సంస్థల ఎన్నికల్లో వికలా గులకు ప్రత్యేక రిజర్వేషన్ కల్పించాలని కోరారు. జనగామ జిల్లాను సర్వాయి సర్దార్ పాపన్న గౌడ్ జిల్లాగా పేరు మార్చాలని రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఎస్ ఎ ఉద్దీన్, అబ్దుల్ కరీం తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణ, బీసీ కులగణన అభినందనీయం



నవతెలంగాణ-ధూల్ పేట్

ఎస్సీ వర్గీకరణ, బీసీ కులగణన అభినందనీయమని బహదూర్ పుర, చార్మినార్, చాంద్రాయణగుట్ట, యాకత్‌పూర నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జిలు పులిపాటి రాజేశ్ కుమార్, ముజీబ్ ఉల్లాహ్ షరీఫ్, బోయ నగేష్, కే. రవి రాజ్‌లు అన్నారు. ఇది స్వతంత్ర భారత దేశం లోనే మొట్టమొదటి సారి అని అది కాంగ్రెస్ కే సాధ్యమని సంతోషం వ్యక్తం పరిచారు. ఈసందర్భంగా వారు బీసీ సంక్షేమ మంత్రి పొన్నం ప్రభాకర్‌ను కలిసి ఘనంగా సన్మానించారు. అనంతరం వారు మాట్లా డుతూ.. రాహుల్ గాంధీ ఆలోచన మేరకు, కామారెడ్డి డిక్లరేషన్‌లో ఇచ్చిన హామీ విధంగా అసెంబ్లీలో బీసీ కులగణనను, వర్గీకరణను సీఎం ఎ.రేవంత్ రెడ్డి ప్రభుత్వం ఆమోదించినందుకు బీసీ కాంగ్రెస్ నాయకులుగా ఎంతో గర్వంగా ఉందన్నారు. బీసీ, ఎస్సీ సబ్ కాబినెట్ మంత్రులకు, టీపీసీసీ అధ్యక్షులు బొమ్మ మహేష్ కుమార్ గౌడ్, బీసీ కమిషన్ చైర్మెన్ నిరంజన్, ఈ బిల్లుకు మద్దతు తెలిపిన వారికి అభినందనలు తెలిపారు.



జీహెచ్ఎంసీ గోషామహల్ సర్కిల్-14 కార్యాలయంలో ఓటర్ల జాబితాపై వివిధ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించిన డిప్యూటీ కమిషనర్ దుబ్బాక లావణ్య, సూపర్డెంట్ జే దానవతి, వివిధ పార్టీ నాయకులు తదితరులు

నవతెలంగాణ-సుల్తాన్‌బజార్

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
12
సికింద్రాబాద్ - సనత్‌నగర్ - జూబ్లీహిల్స్
గురువారం | మార్చి 20, 2025 | www.navatelangana.com

డిప్యూటీ సీఎంకు ఎమ్మెల్యే అభినందనలు



నవతెలంగాణ-కంటోన్మెంట్

తెలంగాణ రాష్ట్ర అసెంబ్లీలో 2025-26 ఆర్థిక ఏడాదికిగాను రాష్ట్ర బడ్జెట్‌ను విజయవంతంగా ప్రవేశ పెట్టినందుకు రాష్ట్ర ఉపముఖ్యమంత్రి, ఆర్థిక శాఖ మంత్రి భట్టి విక్రమార్కను కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీ గణేష్ బుధవారం మర్యాదపూర్వకంగా కలిసి అభినందనలు చెప్పారు. ముఖ్యంగా బడ్జెట్‌లో దళితులకు, వెనుకబడిన తరగతులకు భారీగా నిధులు కేటాయించినందుకు ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలిపారు. ఎమ్మెల్యే శ్రీ గణేష్ మాట్లాడుతూ.. అభివృద్ధికి పెద్దపీట వేస్తూ.. సంక్షేమాన్నికూడా విస్మరించకుండా రెండింటినీ సమన్వయపరుస్తూ రేవంత్ రెడ్డి ప్రభుత్వం ప్రవేశ పెట్టిన బడ్జెట్ రాష్ట్రాన్ని అన్ని రంగాలలనూ అభివృద్ధి పథంలో నడిపిస్తుందని శ్రీగణేష్ ఆశాభావం వ్యక్తం చేశారు.

ఆశా వర్కర్‌ల వేతనాలు పెంచాలి

- సీఐటీయూ జోన్ కన్వీనర్ అజయ్ బాబు



నవతెలంగాణ-ఓయూ

తెలంగాణ ఆశ వర్కర్స్ యూనియన్ (సీఐటీయూ) గ్రేటర్ హైదరాబాద్ సెంట్రల్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ఆశ వర్కర్లకు కనీస వేతనం 18000 ఇవ్వాలని సీఐటీయూ జోన్ కన్వీనర్ అజయ్ బాబు బుధవారం మారేడ్పల్లి మండలం తహశీల్దార్ భూమయ్యకి వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో జోన్ కన్వీనర్ అజయ్ బాబుతో పాటు మమత, విజయ, రేణుక, ఫాతిమా, విజయలక్ష్మి, లక్ష్మీ రేచల్ పాల్గొన్నారు.

మెట్రో ముందుకు సాగేనా..!

- మెట్రో ఫేజ్-2 పనులకు రూ.1100 కోట్ల కేటాయింపు
- పాతబస్తీ మెట్రో విస్తరణకు రూ.500 కోట్లు
- నాగోల్-ఎయిర్‌పోర్టు కారిడార్‌కు రూ.100 కోట్లు
- హెచ్‌ఎంఆర్‌ఎల్ నిర్వహణకు రూ.500 కోట్లు



నవతెలంగాణ-సిటీబ్యూరో

తెలంగాణ ప్రభుత్వం, సీఎం రేవంత్ రెడ్డి హైదరాబాద్ మెట్రో ఫేజ్-2పై ప్రత్యేక శ్రద్ధ పెట్టిన విషయం తెలిసిందే. రెండో దశ ప్రతిపాదనలు సిద్ధం చేసే సమయంలో అనేక మార్లు మెట్రోపై సమీక్ష కూడా చేశారు. సెకండ్ ఫేజ్ ఎంపిక సమాజంలోని అన్ని వర్గాల ప్రజల అవసరాలను తీర్చడంతో పాటు అన్ని వైపులా నగరం సమాన వృద్ధి సాధించాలనేది సీఎం విజన్‌గా ఉండటంతో.. అందుకు అనుగుణంగా మెట్రో అధికారులు సైతం మెట్రో ఫేజ్-2లో డీపీఆర్‌లు చకచకా పూర్తి చేసే పనిలో నిమగ్నమయ్యారు. ఇప్పటికే ఫేజ్-2 పార్ట్-ఏలోని డీపీఆర్‌లు పూర్తిచేసి కేంద్రానికి పంపగా.. ఫేజ్-2 పార్ట్-బీకి సంబంధించి పూర్తిచేసే పనిలో ఉన్నారు. ఈ నేపథ్యంలో బుధవారం ప్రభుత్వం అసెంబ్లీలో ప్రవేశపెట్టిన 2025-26 రాష్ట్ర బడ్జెట్‌లో హైదరాబాద్ మెట్రో ఫేజ్-2కు రూ.1100కోట్లు కేటాయించింది. ఇందులో పాతబస్తీ మెట్రోకు రూ.500కోట్లు, హెచ్‌ఎంఆర్‌ఎల్ సంస్థ నిర్వహణకు రూ.500కోట్లు, నాగోల్-ఎయిర్‌పోర్టు కారిడార్‌కు రూ.100కోట్లు కేటాయించింది. గత బడ్జెట్‌లోనూ రూ.1100కోట్లు కేటాయించడం గమనార్హం. వీటిలో దాదాపు రూ.300కోట్లను విడుదల చేసింది. ఇక ఫేజ్-2లోని పార్ట్-ఏలో నిర్మించబోయే అయిదు కారిడార్ల నిర్మాణానికి భారీగా నిధులు కావాల్సి ఉంది. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల భాగస్వామ్యంతో చేపట్టే ఫేజ్-2 పనులకు రాష్ట్ర ప్రభుత్వం 30శాతం నిధులు, మిగతా నిధులను కేంద్ర ప్రభుత్వం, అంతర్జాతీయ రుణ సంస్థల నుంచి సమీకరించాలని భావిస్తోంది. ఇప్పటికే ఆ పనులకు సంబంధించిన డీపీఆర్‌లను రాష్ట్ర ప్రభుత్వం కేంద్ర ప్రభుత్వానికి పంపించింది. ఫేజ్-2 పార్ట్-బీలో మరో 2 కారిడార్లకు మెట్రో అధికారులు డీపీఆర్‌లను సిద్ధం చేస్తున్నారు. మొత్తంగా ఆశించిన స్థాయిలో నిధులు కేటాయింపు లేకపోవడంతో పనులు వేగంగా పూర్తయ్యే అవకాశం కనిపించడంలేదు.

కొనసాగుతున్న ఓల్డ్‌సిటీ పనులు ...

మెట్రో ఫేజ్‌లోని మొదటి అయిదు లైన్‌లను రూ.2741కోట్లతో వచ్చే నాలుగేండ్లలో పూర్తి చేయాలని సర్కారు లక్ష్యంగా పెట్టుకుంది. ఫేజ్-2లో భాగంగానే ప్రస్తుతం పాతబస్తీ మెట్రో పనులు కొనసాగుతున్నాయి. కేంద్ర ప్రభుత్వ అనుమతి లభించిన వెంటనే ప్రధానమైన పనులను చేపట్టేందుకు అనుగుణంగా ఆస్తుల సేకరణ, రోడ్డు విస్తరణపై దృష్టి సారించారు. ఎంజీబీఎస్ నుంచి చాంద్రాయణగుట్ట వరకు 7.5 కిలోమీటర్ల మేర నిర్మించనున్నారు. దీంతో జేబీఎస్ నుంచి చాంద్రాయణగుట్ట వరకు అతి పెద్ద గ్రీన్ కారిడార్ అందుబాటులోకి రానుంది. ఎంజీబీఎస్-చాంద్రాయణగుట్ట వరకు 11,00 ఆస్తులను అధికారులు గుర్తించారు. ఈ మేరకు గుర్తించిన 980 నిర్మాణాల్లో 400 నిర్మాణాలకు ప్రాథమిక నోటీసులు అందజేశారు.

325 మంది నుంచి ఆమోదం లభించగా.. వాటిలో 216 ఆస్తులకు అవార్డు డిక్లేర్ చేశారు. ఇప్పటివరకు 80 ఆస్తులను తొలగించేందుకు చర్యలు చేపట్టారు. వీటిలో 39 నిర్మాణాల కూల్చివేత పూర్తికాగా.. మరో 41 నిర్మాణాల కూల్చివేతల పనులు వివిధ దశల్లో ఉన్నాయని మెట్రో అధికారులు చెబుతున్నారు. కాగా మొత్తం ఆస్తుల సేకరణకు సుమారు వెయ్యి కోట్లు ఖర్చు కానున్నట్టు అధికారులు అంచనా వేశారు.

సకాలంలో వైద్యం అందించాలి



- ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్

నవతెలంగాణ-బేగంపేట్

సకాలంలో వైద్యం అందించడం ద్వారా ఆరోగ్యవంతమైన జీవితాన్ని గడపడానికి అవకాశం ఉంటుందని మాజీమంత్రి, సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ అన్నారు. బుధవారం వెస్ట్ మారేడ్‌పల్లిలోని తన కార్యాలయంలో బన్సీలాల్ పేటకు చెందిన శరణ్ కుమార్‌కు చికిత్స నిమిత్తం సీఎంఆర్‌ఎఫ్ నుంచి మంజూరైన రూ.2 లక్షల ఎల్‌ఓసీని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆర్థిక ఇబ్బందుల కారణంతో వైద్యం అందించడంలో నిర్లక్ష్యం చేయొద్దని ముఖ్యమంత్రి సహాయ నిధిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. బన్సీలాల్‌పేటలోని సీ క్లాస్‌కు చెందిన శరణ్ కుమార్ కొద్దికాలంగా నరాల సంబంధిత సమస్యతో బాధపడుతున్నాడు. ఆర్థిక సమస్యల కారణంగా చికిత్సకు సహాయం కోసం ఎమ్మెల్యేను ఆశ్రయించారు. ఎమ్మెల్యే చొరవతో ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి రూ.2 లక్షల ఆర్థిక సహాయం మంజూరు చేయించారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు లక్ష్మీపతి, జనార్దన్, అబిషేక్, రాజు, శ్రీనివాస్ రావు, ఉదయ్ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర బడ్జెట్‌పై డిప్యూటీ మేయర్ హర్షం



నవతెలంగాణ-ఓయూ

తెలంగాణ శాసనసభలో బుధవారం ప్రవేశపెట్టిన 2025-26 రాష్ట్ర బడ్జెట్‌పై జీహెచ్‌ఎంసీ డిప్యూటీ మేయర్ మోతే శ్రీలత శోభన్ రెడ్డి హర్షం వ్యక్తం చేశారు. ఈ బడ్జెట్ తెలంగాణ ప్రజల ఆకాంక్షలను నెరవేర్చే విధంగా ఉందని అభినందించారు. బడ్జెట్‌లో ప్రధానంగా ప్రతి విభాగానికి ప్రత్యేక కేటాయింపులు చేయడం ద్వారా రాష్ట్ర ప్రగతికి బాటలు వేసిందని ఆమె వ్యాఖ్యానించారు. ఆర్థిక శాఖ మంత్రి భట్టి విక్రమార్క జీహెచ్‌ఎంసీకి కేటాయించిన ప్రత్యేక నిధులపై కృతజ్ఞతలు తెలుపుతూ, బడ్జెట్ ప్రత్యేకతలను ప్రజలకు తెలియజేశారు. ఈ బడ్జెట్ ప్రజా సంక్షేమానికి, సమగ్ర అభివృద్ధికి పునాది వేసినట్టు తెలంగాణ ప్రభుత్వం పేర్కొందని తెలిపారు.

ఎన్నో ఏండ్ల నిరీక్షణకు తెర..



- కార్పొరేటర్ విజయ రెడ్డి

నవతెలంగాణ-బంజారాహిల్స్

శాసనసభలో బీసీలకు 42శాతం రిజర్వేషన్ బిల్లు, ఎస్సీ వర్గీకరణకు బిల్లుకు చట్టబద్ధత కల్పించినందుకు రాహుల్ గాంధీ, సీఎం రేవంత్ రెడ్డి చిత్ర పటలకు ఖైరతాబాద్ నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి, కార్పొరేటర్ పి.విజయ రెడ్డి పాలాభిషేకం చేశారు. అంతకు ముందు నియోజకవర్గంలోని వెంకటేశ్వర నగర్ డివిజన్ బంజారాహిల్స్ రోడ్ నెంబర్ వన్ జీవికే ఎదురుగా ఉన్న డా. బీఆర్ అంబేద్కర్ విగ్రహానికి పుష్పాంజలి ఘటించారు. రాజీవ్ యువ వికాసాన్ని అమలు చేసినందుకు హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఖైరతాబాద్ నియోజకవర్గంలోని పలు డివిజన్ల అధ్యక్షులు, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, మహిళా అధ్యక్షులు యూత్ కాంగ్రెస్ నాయకులతో పాటు కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

బోరబండలో 18వ రోజు సేహరి ఏర్పాటు



నవతెలంగాణ-జూబ్లీహిల్స్

రంజాన్ మాసం సందర్భంగా బోరబండలో కార్పొరేటర్ బాబా ఫసిద్దిన్ ఆధ్వర్యంలో 18వ రోజు ముస్లిం సోదరులకు సేహరి ఏర్పాట్లు చేశారు. ఈ సందర్భంగా బాబా మాట్లాడుతూ.. రంజాన్ మాసంలో గత పదేండ్ల నుంచి ప్రతిరోజు ఉదయం 5 గంటలకు హిందూ సోదరులు పాల్గొని, ముస్లిం సోదరులకు షహరీ ఏర్పాటు చేయటం ఎంతో ఆనందంగా ఉందని బోరబండలో కులమతాలకు అతీతంగా ప్రతి ఒక్కరూ భాయ్-భాయ్‌గా ఉంటారని బాబా తెలిపారు. ఈ కార్యక్రమంలో బోరబండ డివిజన్ యువకులు, నాయకులు పాల్గొన్నారు.

ఓయూలో భారీ రాస్తారోకో

- విద్యార్థి నేతలు అరెస్టు



నవతెలంగాణ-ఓయూ

ఓయూ ఐక్య విద్యార్థి సంఘాల జేఏసీ ఆధ్వర్యంలో బుధవారం ఓయూ ప్రధాన రహదారిపై విద్యార్థి నేతలు రాస్తారోకో నిర్వహించారు. రాస్తారోకో చేస్తున్న విద్యార్థులను అరెస్టు చేసిన పోలీసులు నగరంలోని వివిధ పోలీస్ స్టేషన్లకు తరలించారు. ఈ సందర్భంగా ఓయూ ఐక్య విద్యార్థి సంఘాల జేఏసీ నేతలు మాట్లాడుతూ.. విద్యా రంగంలో సమస్యలు పరిష్కరించాలని, యూనివర్సిటీలకు బడ్జెట్‌లో నిధులు పెంచాలని, ఓయూ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ.. ఉద్యమాలు నిర్వహిస్తున్న విద్యార్థి పోరాటాలను అణిచివేయాలని కాంగ్రెస్ ప్రభుత్వం నియమించిన ఓయూ వీసీ ప్రొ. ఎం.కుమార్ కుట్ర చేస్తున్నారని ధ్వజమెత్తారు. ఓయూలో ఉద్యమాలను నిషేధిస్తూ విడుదల చేసిన సర్క్యులర్‌ను తక్షణమే వాపస్ తీసుకోవాలి డిమాండ్ చేశారు. తెలంగాణ ఉద్యమానికి మార్పు కోసం జరిగిన ఉద్యమానికి ప్రతీక ఉస్మానియా యూనివర్సిటీ అని అన్నారు. ఓయూ లో వాయిస్ నిషేధిస్తే తెలంగాణ ప్రజలకు ఆక్సిజన్ సరఫరా నిలిపివేసినట్టె అవుతుందన్నారు. రాష్ట్ర ముఖ్య మంత్రి విద్యా శాఖ మంత్రిగా ఉండి ఓయూలో నిషేధాలు విధించడం అన్యాయమని పేర్కొన్నారు. విద్యార్థులకు రాజ్యాంగం కల్పించిన భావ ప్రకటన స్వేచ్ఛను వ్యతిరేకించే విధానాలను కాంగ్రెస్ పార్టీ అమలు చేయాలనుకుందా అనే విషయం స్పష్టం చేయాలని డిమాండ్ చేశారు. వందేండ్ల చరిత్ర కలిగిన ఉస్మానియాలో అనేక ఉద్యమాలు జరిగాయని, ఇటువంటి అప్రజాస్వామిక చర్యలకు వ్యతిరేకంగా కొట్లడిన చరిత్ర ఓయూ విద్యార్థుల సొంతమన్నారు. ఓయూలో అప్రజాస్వామికంగా విడుదల చేసిన సర్క్యులర్‌ను తక్షణమే వాపస్ తీసుకోవాలి డిమాండ్ చేశారు. ఈ రాస్తారోకో సందర్భంగా అరెస్టు అయిన వారిలో జార్జిరెడ్డి పీడీఎస్‌యూ రాష్ట్ర అధ్యక్షులు ఎస్.నాగేశ్వరావు, ప్రధాన కార్యదర్శి ఎస్.సుమంత్, డీబీఎస్‌ఏ జంగిలి దర్శన్, బీఆర్‌ఎస్వీ పెద్దమ్మ రమేష్, జంగయ్య, స్పోర్ట్స్ ఫెడరేషన్ శాగంటి రాజేష్, ఎస్ఎస్‌యూ మొగిలిపాక నవీన్, జేవీఎస్ చేరాల వంశీ, బీఆర్‌ఎస్వీ రాజేష్ నాయక్, మిథున్ ప్రసాద్, రామకృష్ణ, శివ, జార్జి రెడ్డి పీడీఎస్‌యూ నేతలు ఎం.వెంకటేష్, ఎస్.అంజి తదితరులు ఉన్నారు. ఈ కార్యక్రమంలో లెఫ్ట్, దళిత, బహుజన, గిరిజన, ఆదివాసీ, ఇండిపెండ్ సంఘాల నేతలు నాయకత్వం వహించారు.

వర్గీకరణ కోసం ఎన్నో పోరాటాలు జరిగాయి



- ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్

నవతెలంగాణ-బేగంపేట్

ఎస్సీ వర్గీకరణ కోసం ఎన్నో ఏండ్ల నుంచి అనేక పోరాటాలు జరిగాయని మాజీమంత్రి, సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ అన్నారు. ఎస్సీ వర్గీకరణ బిల్లుకు ఆమోదం లభించిన నేపథ్యంలో బుధవారం బన్సీలాల్ పేటకు చెందిన పలువురు ఎస్సీ నాయకులు ఎమ్మెల్యేను వెస్ట్ మారేడ్‌పల్లిలోని కార్యాలయంలో మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేను వారు శాలువాతో సత్కరించారు. బిల్లు ఆమోదం పొందడం పట్ల వారికి శుభాకాంక్షలు తెలిపారు. ఎమ్మెల్యేను కలిసిన వారిలో ఎస్సీ నాయకులు లక్ష్మీపతి, జగదీష్, శివ, శ్రీనివాస్, లక్ష్మీనారాయణ, జనార్దన్, రాజు, గోవర్ధన్ తదితరులు పాల్గొన్నారు.

నేడు జైలు సంస్కరణలపై రెండు రోజుల సదస్సు



నవతెలంగాణ-బంజారాహిల్స్

జాతీయ స్థాయి జైళ్లలో చేపట్టాల్సిన సంస్కరణలపై నేడు, రేపు జూబ్లీహిల్స్‌లోని డాక్టర్ మర్రి చెన్నారెడ్డి మానవ వనరుల కేంద్రంలో జరగనుంది. ఈ రెండు రోజుల సదస్సుకూ ముఖ్య అతిథిగా తెలంగాణ రాష్ట్ర గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ హాజరుకానున్నారని ప్రిజన్స్ వరల్డ్ ఆర్గనైజేషన్ ఉపాధ్యక్షుడు రిటైర్డ్ ఐజీ ఎ.నర్సింహ తెలిపారు. ఈ మేరకు బుధవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో జరిగిన మీడియా సమావేశంలో ఇందుకు సంబంధించిన పోస్టుకార్డును ఆవిష్కరించారు. ఈ సదస్సుకు దేశవ్యాప్తంగా సుమారు 30 స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, జైళ్లశాఖ ముఖ్య అధికారులు హాజరవుతారు. సమావేశంలో వినీత్ సింగ్, ఎ.అశోక్ కుమార్, ఎల్.ఎమ్.చౌదరి, వినోద లక్ష్మి పాల్గొన్నారు.

ఇంజనీర్లతో సమావేశమైన నామినేటెడ్ సభ్యురాలు



నవతెలంగాణ-కంటోన్మెంట్

కంటోన్మెంట్ బోర్డు పరిధిలో చేపట్టాల్సిన అభివృద్ధి పనులుపై చర్చించేందుకు కంటోన్మెంట్ బోర్డు సివిల్ నామినేటెడ్ సభ్యురాలు భానుక నర్మదా మల్లికార్జున్ బుధవారం కంటోన్మెంట్ బోర్డ్ ఇంజనీర్లతో సమావేశమయ్యారు. పరిధిలో జరుగుతున్న అభివృద్ధి పనులుపై చేపట్టాల్సిన పనులపై ఆమె ఆరా తీశారు. ఇప్పటివరకు వర్క్ ఆర్డర్ ఇచ్చి జరగని పనులు ఏవి ఉన్నాయో వాటి వివరాలు తమకు ఇవ్వాలని, అలాగే పెండింగ్‌లో ఉన్న అభివృద్ధి పనులపై చర్చించి వచ్చే సమావేశంలో చర్చించేందుకు సిద్ధం చేయాలని ఆమె ఇంజనీర్లకు సూచించారు. ప్రజా సమస్యలు ఎప్పటికప్పుడు తెలుసుకునేందుకు బస్తీ బాట కార్యక్రమాలు కూడా నిర్వహిద్దామని తెలిపారు. మ్యాన్ హోల్స్ ఏర్పాట్లు, మురుగు కాలువలు, రోడ్ల మరమ్మతు సమస్యలపై కూడా దృష్టి పెట్టాలని చెప్పారు. ఇంజినీర్లు ఉమాశంకర్, ఫణికుమార్, రాజేశ్వం రావు, క్రిష్ణ, సాగర్, దినేష్, జిష్ణు, శ్రీనివాస్, తరుణ్ రెడ్డి, శివాజీ పాల్గొన్నారు.

మల్లారెడ్డి దంపతుల 49వ వివాహ వార్షికోత్సవం



- బోయిన్‌పల్లి క్యాంపు కార్యాలయానికి తరలి వచ్చిన అభిమానులు

నవతెలంగాణ-కంటోన్మెంట్

మాజీ మంత్రి మల్లారెడ్డి బుధవారం బోయిన్‌పల్లిలోని తన క్యాంపు కార్యాలయంలో 49వ వివాహ వార్షికోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించుకున్నారు. మేడ్చల్ నియోజకవర్గం నుంచి వచ్చిన కార్యకర్తలు, అభిమానులు శుభకాంక్షలు తెలిపి సంబరాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా మల్లారెడ్డి, కల్పన దంపతులు కేక్ కట్ చేసి నృత్యాలు చేశారు. ఈ సందర్భంగా మల్లారెడ్డి మాట్లాడుతూ.. తన సతీమణి కల్పన సహకారంతోనే ఉన్నత స్థాయికి చేరుకున్నానని వెల్లడించారు. ప్రతి పురుషుని వెనుక ఒక స్త్రీ ఉంటుందని విషయం తనకు రుజువైందని చెప్పారు. 49 ఏండ్లలో అనేక విద్యాసంస్థలు నెలకొల్పి వ్యాపారాలు చేసి ఈ స్థాయికి చేరుకున్నానని అన్నారు. రాబోయే రోజులలో ప్రజలకు మరిన్ని సేవలు చేస్తూ వందలాదిమంది ఇంజినీర్లు, డాక్టర్లను తయారు చేస్తానని అన్నారు.

సంస్కృత అకాడమీలో భారతీయ విజ్ఞానంపై సెమినార్



నవతెలంగాణ-ఓయూ

సంస్కృత అకాడమీలో భారతీయ విజ్ఞానపరంపర మీద ఒకరోజు సంగోష్ఠిని నిర్వహించామని సంస్కృత అకాడమీ డైరెక్టర్ ఆచార్య పెన్నా మధుసూదన్ తెలిపారు. దీనిలో భాగంగా నేషనల్ ఇన్ఫర్మేషన్ సెంటర్ మాజీ డైరెక్టర్ సీఎస్‌ఆర్ ప్రభూ భారతీయ భౌతికశాస్త్రం గురించి, వేదభారతీ సంస్థ నిర్వాహకులు డాక్టర్ ఆర్‌వీఎస్‌ఎస్ అవధానులు భారతీయ గణిత వైశిష్ట్యం గురించి, నాగపూర్ సంస్కృత విశ్వవిద్యాలయంలో గణితశాస్త్రంపై దేవులపల్లి అన్వేష్ భాస్కరాచార్య గణిత శిక్షణంపైన ఉపన్యసించారని తెలిపారు. ప్రస్తుతం భారతీయ నూతన విద్యావిధానంలో భారతీయ విజ్ఞానశాస్త్రానికి విశేషమైన ప్రాచుర్యం ఉన్నదని, భారతీయ విజ్ఞానశాస్త్రం అంతా సంస్కృత భాషలోనే ఉన్నాయని వాటి గురించి అందరికీ తెలియజెప్పాలనే ఉద్దేశ్యంతో ఈ సెమినార్ నిర్వహించామని ఆచార్య మధుసూదన్ తెలిపారు. ఈ సభలో మా పూర్వనిదేశకులు ఆచార్య నీలకంఠం పాల్గొన్నారని డిగ్రీ కాలేజీ అధ్యాపకులు తెలుసుకోవాలని ఈనాటి విద్యార్థులకు భారతీయ విజ్ఞానశాస్త్రం గురించి తెలియజెయ్యాలని అన్నారు. ఈ సందర్భంగా ప్రతి ఏడాది ఇచ్చే శ్రీభాష్యం విజయసారథి పురస్కార ప్రదానం కూడ నిర్వహించామని చెప్పారు. ఈ సభకు పద్మశ్రీ పురస్కార గ్రహీత బృహత్సహస్రావధాని మాడుగుల నాగఫణిశర్మ, జియ్యర్ ఎడ్యుకేషనల్ ట్రస్ట్ నిర్వాహకులు మహామహోపాధ్యాయ సముద్రాల రంగరామానుజాచార్యులు, సర్వవైదికసంస్థానం కులపతి శ్రీభాష్యం వరప్రసాద్ పాల్గొన్నారని, ఈ ఏడాది భువనేశ్వర్లోని కలింగ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సోషల్ సైన్సెస్ వైస్ ఛాన్సర్ ఆచార్య హరే కృష్ణ శతపతిని శ్రీభాష్యం పురస్కారంతో సన్మానించామని పెన్నా మధుసూదన్ పేర్కొన్నారు. శ్రీభాష్యమ విజయసారధి కావ్యసంపుటాలను ఈ సందర్భంగా లోకార్పణం చెయ్యడం చాలా ప్రశంసించదగినదని ఆచార్య నీలకంఠం అన్నారు. ఆ మహనీయుని పేరుతో పురస్కారం లభించడం చాలా అదృష్టమని ఆచార్య హరేకృష్ణ శతపతి అన్నారు. ఈ సభలో సర్వవైదికసంస్థానపు సభ్యులు అనంతాచార్యులు, అకాడమీకి చెందిన డాక్టర్ వరలక్ష్మి, సూర్యప్రకాశ్. సంతోష్ జోషి పాల్గొన్నారు.

బస్తీలో సీపీఐ(ఎం) నాయకుల పర్యటన

- రేషన్ కార్డులపై రోజుకొక మాట,
- కొత్త పథకాలకూ రేషన్ అవసరం.. కానీ ఇవ్వడం లేదు
- నేడు సీఆర్‌ఓ ఆఫీసు ముందు ధర్నా..
- సీపీఐ(ఎం) నాయకులు, టి. సాయి శేషగిరి రావు



నవతెలంగాణ-జూబ్లీహిల్స్

సీపీఐ(ఎం) రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు నిర్వహిస్తున్న సర్వేలో స్థానిక బస్తీల్లో ప్రజలు ఎదుర్కొన్న సమస్యలపై బుధవారం బోరబండ డివిజన్ డైలీ లేబర్ బస్తీలో సర్వే నిర్వహించారు. ఈ సర్వేలో స్థానిక ప్రజలు పాల్గొని నిత్యం వారు ఎదుర్కొన్న అనేక సమస్యలపై నాయకులకు ఫిర్యాదు చేశారు. ప్రధానంగా రేషన్ కార్డులో పేర్లు నమోదు చేయడంలో ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని, పేర్లు తీస వేసిన, నమోదు చేసిన కూడా ఆ కార్డులు ఇంతవరకు రాలదని, కొత్తగా అప్లై చేసుకోవటానికి అవకాశం ఉండటం లేదన్నారు. సీపీఐ(ఎం) కృషి వల్ల కొన్ని వీధీ దీపాలు వేయటం జరిగిందని, అవి కూడా పూర్తిస్థాయిలో వేయలేదని తెలిపారు. ఓపెన్ డ్రయినేజీ, నాలాల సమస్య ఉన్నదని స్థానిక ప్రజలు సీపీఐ(ఎం) నాయకులు, టి. సాయి శేషగిరి రావు తెలియజేశారు. స్థానిక సమస్యలపై పత్రికలలో వచ్చిన వెంటనే అధికారులు స్పందించి,వెంటనే పరిష్కారం చేయటానికి ప్రయత్నించాలని, వాస్తవానికి అలా జరగటం లేదని నిమ్మకు నీరెత్తినట్టుగా, అధికారులు వ్యవహరిస్తున్నారని, ఇది తీవ్ర ఆక్షేపమైనదని అన్నారు. రేషన్ కార్డులపై రోజుకు ఒక మాట, అసెంబ్లీలో ఒక మాట బయట ఒక మాట చెప్పి పాలకులు జాప్యం చేస్తున్నారని, వెంటనే రేషన్ కార్డులు హామీ ఇచ్చిన విధంగా ఇవ్వాలని డిమాండ్ చేశారు. గత పదేండ్ల కాలంలో హైదరాబాదు నగరంలో 1,63,392 రేషన్ కార్డులు తొలగించారని, హైదరా బాదు నగరంలో కేవలం 56వేల 65 రేషన్ కార్డులు మాత్రమే ఇచ్చారని, గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం రేషన్ కార్డులు ఇచ్చిన దానికంటే, అదనంగా 1,65,257 రేషన్ కార్డులను తొలగించిందని, అందుకే బీఆర్‌ఎస్ ప్రభుత్వాన్ని 2023 జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో ప్రజలు ఫామ్ హౌస్‌కే పరిమితం చేశారని, కొత్తగా అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ రేషన్ కార్డు విషయంలో అనేక ఆశలు రేకెత్తించిందని, ఏడాది గడుస్తున్నా వాయిదాల పద్ధతి అవలంబిస్తుందన్నది అందరికీ తెలిసిన విషయమేనని అన్నారు. ఉగాది నాటికి అందిస్తామని చెబుతున్న ప్రజలలో నమ్మకం కుదరటం లేదని తెలిపారు. హైదరాబాదు నగరంలో కొత్తగా పెళ్లి అయిన కుటుంబాలు పిల్లల పేర్లు నమోదు కానీ కుటుంబాలు, రేషన్ కార్డులు లేని కుటుంబాలు, సుమారు 7 లక్షల మంది వరకు ఉన్నారని, వీరందరూ దరఖాస్తులు చేసుకొని ఎదురుచూస్తున్నారని, పేర్లు వెంటనే తొలగిస్తున్నా రని, కానీ కొత్తగా రేషన్ కార్డులో ఎక్కించి కార్డులు ఇవ్వడం లో తీవ్ర జాప్యం జరుగుతుందని పేర్కొన్నారు. ప్రభుత్వం ప్రకటించిన అనేక సంక్షేమ పథకాలలో వీరందరూ కూడా అర్హత కోల్పోతున్నారని, ఏ పథకంలో అయినా రేషన్ కార్డ్ ప్రాథమికంగా అవసరం ఉంటుందని, ప్రభుత్వానికి తెలిసి నా కూడా పట్టించుకునే పరిస్థితి లేదని తెలిపారు. ప్రభుత్వం ఇప్పుడు కొత్తగా ప్రవేశపెట్టిన రాజీవ్ యువ స్వయం ఉపాధి మూడు లక్షలు సబ్సిడీతో కూడిన పథకానికి, కూడా రేషన్ కార్డు కంపల్సరిగా కావాలని వారే చెబుతున్నారని, కానీ కార్డులు మాత్రం ఇంతవరకు ఇవ్వలేదని, అందువల్ల చాలామంది అర్హత ఉన్నా రేషన్ కార్డులు లేనందువల్ల ఈ స్కీములో అప్లై చేసుకోలేకపోతున్నారని చెప్పారు. కేరళ, తమిళనాడు రాష్ట్రాల్లో ప్రతి రేషన్ కార్డుపై 14 రకాల వస్తువులు ఇస్తున్న, మన దగ్గర మాత్రం కేవలం బియ్యం మాత్రమే ఇస్తున్నారని, గౌరవ పౌరసరఫరాల శాఖ మంత్రి చెప్పిన సన్న బియ్యం మాట ఇంతవరకు నెరవేరటం లేదనీ, పాలకులు ప్రకటించిన వాగ్దానాలు వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. రేషన్ కార్డులు వెంటనే ఇవ్వాలని డిమాండ్ చేస్తూ.. నేడు సీఆర్‌ఓ ఆఫీసు సికింద్రాబాద్ ముందు జరిగే ధర్నాకు, రేషన్ కార్డులు కోసం అప్లై చేసిన ప్రజలందరూ హాజరు అయ్యి ధర్నాను, విజయ వంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో బోరబండ డివిజన్ సైట్ 3లో ఉన్న బస్తీలకు చెందిన గంగులప్పా, ఆనంద్ రాజ్, బాబురావు, రాజేష్, రవి, రాథోడ్, శ్రీదేవి, శివమ్మ మున్నా, హేమలత, మంజుల, ఎమ్మార్పీఎస్ బోరబండ నాయకులు సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
హైదరాబాద్
HMDA
గురువారం | మార్చి 20, 2025 | www.navatelangana.com

ఐఎస్ సదన్‌లో మహిళ అదృశ్యం



నవతెలంగాణ-చంపాపేట్

మహిళ అదృశ్యమైన సంఘటన బుధవారం ఐఎస్ సదన్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. యాకుత్ పురా నియోజకవర్గం కుర్మాగూడ డివిజన్ పరిధిలోని ధోబి ఘాట్ ఇద్గారోడ్డుకు చెందిన 45 ఏండ్ల మహముద్దకు మతిస్థిమితం సరిగా లేదు. ఈనెల 16 న అక్క ఇంటికి వెళ్లి వస్తానని బయటకు వెళ్లి తిరిగి ఇంటికి చేరుకోలేదు. కుటుంబ సభ్యులు ఆచూకీ కోసం చుట్టుపక్కల ప్రాంతాల్లో వేతికించడంతో పాటు తెలిసిన వారికి ఫోన్‌లో ఆరా తీసినా ఫలితం లేకపోవడంతో స్థానిక పోలీస్ స్టేషన్‌ను ఆశ్రయించారు. బాధితులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

విద్యార్థి నాయకుల అక్రమ అరెస్ట్‌ను ఖండిస్తున్నాం

- బీఆర్ఎస్ రాష్ట్ర యువజన కార్యదర్శి కనకరాజ్ గౌడ్



నవతెలంగాణ - చర్లపల్లి

బీఆర్ఎస్వీ ఉప్పల్ నియోజక వర్గం నాయకుల అక్రమ అరెస్టను తీవ్రంగా ఖండిస్తున్నామని బీఆర్ఎస్ రాష్ట్ర యువజన కార్యదర్శి కనకరాజ్ గౌడ్ ఒక ప్రకటనలో తెలిపారు. తెలంగాణ కోసం అహర్నిశలు కొట్లాడి వారి జీవితాలను వ్యవస్థ కోసం వారి వ్యక్తిత్వాన్ని త్యాగం చేసిన త్యాగధనులు విద్యార్థి నాయకులు జైకృష్ణ సంపత్ అని, ఇలాంటి వారిని అరెస్ట్ చేయడం ఖండిస్తున్నామని అన్నారు. సీఎం అక్రమ అరెస్టులు ఆపకపోతే రాబోయే రోజుల్లో మరో పోరాటం తప్పదన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న అరాచకాలు ప్రజలు గమనిస్తున్నారని చెప్పారు. త్వరలో తగిన గుణపాఠం తప్పదన్నారు. తమ పోరాటం కొత్త కాదు, తెలంగాణ కోసం తెగించి కొట్లాడినం అని గుర్తు చేశారు. ఇకనుంచి అక్రమ అరెస్టులు చేస్తే ఊరుకునేది లేదనే హెచ్చరించారు.



త్వరితగతిన భూసేకరణ పూర్తి చేయాలి

- అడిషనల్ కమిషనర్ శివకుమార్ నాయుడు

నవతెలంగాణ-సిటీబ్యూరో

గ్రేటర్‌లో ట్రాఫిక్ ఇబ్బందులను తగ్గించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా హెచ్-సిటీ కార్యక్రమానికి శ్రీకారం చుట్టిన విషయం విదితమే. గ్రేటర్‌లో హెచ్ సిటీ ద్వారా మొత్తం రూ. 7032 కోట్ల వ్యయంతో చేపట్టనున్న పనులు ప్రారంభించేందుకు కావాల్సిన భూసేకరణ పూర్తి చేసేం దుకు బుధవారం అడిషనల్ కమీషనర్ శివ కుమార్ నాయుడు సికింద్రాబాద్ జోన్ లోని పలు ప్రాంతాల్లో పరిశీలించారు. సికింద్రాబాద్ జోన్‌లోని పాటిగడ్డ ఆర్ ఓ బి, రసూల్ పుర ఫ్లైఓవర్, ఏటీసీ చుట్టూ ప్రత్యామ్నాయ రోడ్డు నిర్మాణం, ఆర్.కే పురం, చిలకలగూడ ఆర్.యూ.బీ పనులకు స్థల పరిశీలన చేశారు. త్వరితగతిన భూసేకరణ పూర్తి చేయాలని ఈ సందర్భంగా అడిషనల్ కమిషనర్ అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ప్రాజెక్టు ఈ .ఈ రోహిణి, టౌన్ ప్లానింగ్ అధికారులు, భూసేకరణ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ రాములు నాయక్ తదితరులు పాల్గొన్నారు.

తల్లికి ఫోన్ చేసి వ్యక్తి ఆత్మహత్య

- భార్య వేధింపులు భరించలేకపోతున్నానని చనిపోయే ముందు తల్లికి ఏకరువు పెట్టుకున్న మృతుడు

నవతెలంగాణ- జూబ్లీహిల్స్.

"భార్య వేధింపులు భరించలేకపోతున్నాను, నన్ను గూండాలతో కొట్టిస్తున్నది ,పోలీస్ కేసులు పెట్టి జైలుకు పంపుతానని బెదిరిస్తున్నది, ప్రతిరోజు అన్నం కూడా పెట్టకుండా రూము నుండి బయటకు వెళ్ళనీయకుండా అనేక రకాలుగా ఇబ్బంది పెడుతున్నది. అందుకే చనిపోతున్నాను. మీరు కూడా జాగ్రత్తగా ఉండండి. మిమ్మల్ని కూడా చంపిస్తుంది" అని ఓ వ్యక్తి తన తల్లికి ఫోన్ చేసి ఏకరువు పెట్టుకుని ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్న సంఘటన జూబ్లీహిల్స్ పోలీస్ స్టేషన్ పరిధిలోని కృష్ణా నగర్ లో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం నిజామాబాద్ జిల్లా బాన్సువాడ మండలం, బుదిమి గ్రామానికి చెందిన మహమ్మద్ నవాజ్(35) సినీ పరిశ్రమలో కెమెరామెన్ గా పనిచేస్తూ 2020లో జీడిమెట్లలో ఉంటున్న శ్వేతా రెడ్డిని ప్రేమ వివాహం చేసుకున్నాడు. ఇద్దరు కలిసి కృష్ణా నగర్ లో ఇల్లు కిరాయికి తీసుకుని ఉంటున్నారు. కొన్ని సంవత్సరాలు బాగానే ఉన్నా ,ఇటీవల కొన్ని నెలలుగా తన స్వగ్రామంలో ఉన్న రూ. 30 లక్షల విలువైన ఆస్తిని తన పేరుతో రాయాలంటూ భార్య వేధిస్తున్నాదని. గుండాలతో తనను కొట్టించడంతో పాటు తిండి పెట్టకుండా రోజుల పాటు ఆకలితో ఉండేలా చేస్తున్నదని.. కేసులు పెట్టి జైలుకు పంపుతానని మానసికంగా వేధిస్తున్నదని నవాజ్ తన తల్లికి ఫోన్‌లో చేసి చెప్పుకున్నాడు. తనకు ఆత్మహత్య చేసుకోవడం మినహా మరో మార్గం లేదంటూ ఈనెల 16న రాత్రి తన ఇంట్లో ఉరి వేసుకుని చనిపోయాడు. విషయం తెలుసుకున్న అతని తల్లి సవేరా బేగం 17వ తారీకు బాన్సువాడ నుండి హైదరాబాద్‌కు వచ్చి జూబ్లీహిల్స్ పోలీసులకు తన కుమారుడు చనిపోయినట్లు ఫిర్యాదు చేసింది. జూబ్లీహిల్స్ పోలీసులు కేసు నమోదు చేసుకుని మృతదేహాన్ని ఉస్మానియా హాస్పటల్ పంపి పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని తల్లికి, బంధువులకు అప్పజెప్పారు. ఆత్మహత్యగా కేసు నమోదు చేసుకుని బీఎస్ఎన్ 194 సెక్షన్ ప్రకారం కేసు దర్యాప్తు చేస్తున్నామని జూబ్లీహిల్స్ ఇన్‌స్పెక్టర్ వెంకటేశ్వర్ రెడ్డి తెలిపారు.



నిమ్స్‌కు సోలార్ ప్యానెల్స్ అందజేత

నవతెలంగాణ-సిటీబ్యూరో

హైదరాబాద్‌కు చెందిన అకార్డియన్ సొల్యూషన్స్ మేనేజింగ్ డైరెక్టర్ అకృతి, నిమ్స్ హాస్పిటల్‌కు నిర్మాణ్ ఎన్జీఓ ద్వారా రూ.20 లక్షల విలువ చేసే సోలార్ ప్యానల్స్‌ను విరాళంగా అందజేశారు. అకార్డ్, నిర్మాన్ సంయుక్తంగా నిమ్స్‌లోని డయాలసిస్ కేంద్రానికి సౌర విద్యుత్‌ను అందించే "ప్రాజెక్ట్ గ్రీన్ డయాలసిస్ ఇనిషియేటివ్" అనే సోలార్ ప్యానెల్‌లను ఏర్పాటు చేశారు. ఇది 50 కిలోవాట్ల సామర్థ్యం గల సౌర వ్యవస్థ. ఇది రోజుకు 200 యూనిట్లను ఉత్పత్తి చేస్తుంది. నెలకు రూ.65వేలు ఆదా అవుతుంది. ఈ సందర్భంగా నిమ్స్ డైరెక్టర్ నగరి బీరప్ప మాట్లాడుతూ ఈ సోలార్ పవర్ వల్ల ఎంతో విద్యుత్ ఆదా కావడమే కాకుండా డయాలసిస్ రోగులకు ఎలాంటి అంతరాయం లేకుండా సేవలందించవచ్చని తెలియజేస్తూ దాతలను ప్రతేకంగా అభినందిస్తూ ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో నెఫ్రాలజీ ప్రొఫెసర్లు డాక్టర్ భూషణ్ రాజు, డాక్టర్ గంగాధర్, డాక్టర్ స్వర్ణలత, అసిస్టెంట్ ప్రొఫెసర్స్ డాక్టర్ చరణ్, డాక్టర్ రాకేష్, ఆర్ఎంఓ హేమంత్ పాల్గొన్నారు.

పారిశుధ్య కార్మికురాలు.. పట్టించుకున్న నాథుడే లేడు...

- తెల్లవారు జామున విధులు నిర్వహిస్తుండగా రోడ్డు ప్రమాదం..
- ఢీకొట్టిన ఆటో.. ఆస్పత్రికి తరలింపు
- మహిళా దినోత్సవం మరునాడే ఘటన..
- పట్టించుకోని అధికారులు...
- జీహెచ్ఎంసీ అధికారులు ఆర్థికంగా ఆదుకోవాలి : సీఐటీయూ నేత పి.నాగేశ్వర్..

రెక్కాడితే కానీ డొక్కాడని స్థితి.. దూరమైన..., ఆరోగ్యం సహకరించకపోయినా పని చేయాలని పరుగులు పెడుతున్న పారిశుధ్య కార్మికులకు భద్రత, భరోసా లేదు. పని చేస్తూ.. ప్రమాదంతో మంచాన.. ప్రాణా పాయ స్థితిలో కొట్టు మిట్టాడుతున్నా.. లేవలేని స్థితిలో ఉస్మానియాలో చికిత్స పొందుతూ జీవచ్ఛవంలా పడిన ఓ పారిశుధ్య కార్మికురాలి గురించి అధికారులు కనీసం పట్టించుకోవట్లేదని విమర్శలు వస్తున్నాయి. ఒక్క రోజు పనికి రాకపోతే అప్సెంట్.. పరిస్థితుల బట్టి రెండు.. మూడు రోజులు ఆపై రాక పోతే అంతే.. పని చేయనియ్యరు.. హాజరు వేయరు. వేతనం కట్. అదే కార్మికురాలు విధి నిర్వహణలో ప్రమాదం కు గురై లేవలేని స్థితి లో ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నా కనీసం పరామర్శించాల్సిన అధికారులు స్పందించక పోవడం దారుణం.





నవతెలంగాణ - ధూల్ పేట్

ఇబ్రహీం పట్నం ఆరుట్ల ప్రాంతానికి చెందిన కనుగొంటే పద్మ చాంద్రాయణ గుట్ట ఫిసల్ బండ లో పారిశుధ్య కార్మికురాలు గా పని చేస్తున్నది. ఈ నెల 9వ తేదీ తెల్లవారు జామున రోజు మాదిరిగా విధులు నిర్వర్తించిటకు చాంద్రాయణ గుట్ట కు వచ్చి హాజరు వేసుకుని ఫిసల్ బండ లో విధి నిర్వహణలో పని చేస్తుంది. అదేక్రమంలో ఆటో వచ్చి ఒక్కసారి ఢీకొట్టడంతో అక్కడికక్కడే ఆమె పడి పోయింది. దీంతో అక్కడే విధులు నిర్వహిస్తున్న ట్రాఫిక్ పోలీస్, తోటి కార్మికులు అంబులెన్స్ లో చికిత్స నిమిత్తం ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు.

విరిగిన పక్కటెముకలు ..

ప్రమాదానికి గురైన పద్మకు పక్క భాగంలో తీవ్ర గాయం కావడంతో పక్కటెముకలు విరిగినట్లు వైద్యులు పేర్కొన్నట్లు తోటి కార్మికులు వాపోతు న్నారు. ప్రమాదం గాయాలైన ఆమెను అధికారులు కనీసం పరమార్శించకపోవడం. పట్టించుకోవడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి.

ఇద్దరు పిల్లలు..

రోజూ పని చేసి కుటుంబాన్ని పోషించే తల్లి పిల్లల పరిస్థితి అగమ్య గోచరంగా మారింది. ముగ్గురు పిల్లల్లో పెద్ద కూతురు వివాహం చేసింది. చిన్న కూతురు, కొడుకు చదువుకుంటున్నారు. భర్త లేకపోవడంతో పిల్లలను సాధ్యమైనంత వరకు చదివించాడానికే తాను కష్టమైన పని చేస్తూ కుటుంబాన్ని నెట్టుకొస్తున్నది. అలాంటి ఆమెకు ప్రమాదం సంభవించడంతో పిల్లలకు ఏమి చేయాలో తోచని పరిస్తితి ఏర్పడింది.

ఆర్థిక సహాయం అందించాలి..

ప్రమాదంలో గాయమై ఉస్మానియాలో చికిత్సలు పొందుతున్న కార్మికురాలు పద్మకు అధికారులు స్పందించి ఆర్థిక సహాయం అందించాలి. నెల వేతనం వచ్చేలా చూడాలి. వారి కుటుంబంలో మరొకరిని ఆమెకు బదులుగా వీధుల్లోకి చేర్చుకోవాలి. కార్మికులకు భద్రత, భరోసా కల్పించాలి.

– సీఐటీయూ నేత పి నాగేశ్వర్..

ప్రజా వ్యతిరేక బడ్జెట్‌ను సవరించాలి



తెలంగాణ రాష్ట్ర ఆర్థిక మంత్రి బట్టి విక్రమార్క అసెంబ్లీలో 3,04,965 కోట్లతో ప్రవేశపెట్టిన బడ్జెట్ ప్రజా వ్యతిరేకంగా ఉన్నది. హైదరాబాద్ ను గ్లోబల్ సిటీగా మారుస్తామని ప్రకటించి అందుకు అనుగు ణంగా నిధులు కేటాయింపులు చేయలేదు. అరకొరగా నిధులు కేటాయించి చేతులు దులుపుకున్నారు. మురికివాడలు, పేదల అభివృద్ధికి ప్రత్యేకంగా ఏమీ కేటాయింపులు లేవు. గత బడ్జెట్ సందర్భంగా కేటాయించిన నిధులను కూడా ఖర్చు చేయని పరిస్థితి ఉన్నది. 6 గ్యారంటీలా అమలుకు ఎలాంటి ప్రణాళిక లేదు. మహిళలకు ఇస్తామన్న 2500/- పెన్షన్ల పెంపు గురించి ఊసే లేదు. 73 షెడ్యూల్డ్ పరిశ్రమలలో పనిచేస్తున్న కార్మికులకు కనీస వేతనాల పెంపదళపైన ఎలాంటి ప్రతిపాదనలేదు. ఆశా అంగన్వాడి ఉద్యోగుల వేతనాల పెంపదలపై ఎలాంటి ప్రకటన లేదు. కావున ఈ ప్రజా వ్యతిరేక బడ్జెట్ ను సవరించాలని సిపిఎం డిమాండ్ చేస్తున్నది

ఎం. వెంకటేష్,
సీపీఐ(ఎం) గ్రేటర్ హైదరాబాద్ సెంట్రల్ సిటీ కమిటీ కార్యదర్శి

జీహెచ్ఎంసీకి బడ్జెట్ కేటాయింపుపై మేయర్ హర్షం



నవతెలంగాణ-సిటీబ్యూరో

రాష్ట్ర బడ్జెట్‌లో గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్‌కు రూ.3101.21 కోట్లు కేటాయించడం పై నగర మేయర్ గద్వాల్ విజయలక్ష్మి హర్షం వ్యక్తం చేశారు. ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుండి జీహెచ్ఎంసీ ఆర్థిక ఇబ్బందులు గట్టెక్కించేందుకు కృషి చేస్తున్న రాష్ట్ర ముఖ్య మంత్రి, ఆర్థిక శాఖ మంత్రికి కృతజ్ఞతలు తెలిపారు. గతంలో జీహెచ్ఎంసి ఉద్యోగుల జీతభత్యాలు చెల్లించడం కష్టంగా ఉండేదని, కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే బడ్జెట్‌లో రూ. 10 వేల కోట్లు కేటాయించారని గుర్తు చేశారు. రిజిస్ట్రేషన్, మ్యుటేషన్ ద్వారా జీహెచ్ఎంసీకి రావాల్సిన రూ. 3030 కోట్లు విడుదల చేసినట్టు మేయర్ వెల్లడించారు. ఈ నిధులతో మొదటి తేదీన ఉద్యోగుల వేతనాల చెల్లింపుతో పాటుగా మౌలిక సదుపాయాలు కల్పించడం, ప్రతి జోన్‌కు రూ. 25 కోట్ల నిధులు మంజూరు చేసినట్టు మేయర్ వివరించారు. రాష్ట్ర ప్రభుత్వం జీహెచ్ఎంసీకి ఈ ఆర్థిక సంవత్సరంలో కేటాయింపు చేసిన నిధులతో పాటుగా నగర వ్యాప్తంగా ట్రాఫిక్ సమస్యను అధిగమించడానికి హెచ్ సిటీ ద్వారా రూ.7032 కోట్ల అంచనా వ్యయంతో సుమారు 40 పనులు రోడ్డు వెడల్పు, ఆర్ ఓబిలు, అండర్ పాసులు, ఫ్లైఓవర్ పనులు చేపట్టి హైదరా బాద్‌ను గ్లోబల్ సిటీగా అభివద్ధి చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం విశేష కృషి చేస్తున్నట్టు మేయర్ తెలిపారు. నగర సుందరీకరణకు రూ.150 కోట్లు, వాటర్ హోల్డింగ్ స్ట్రక్చర్ నిర్మాణాలకు రూ. 100 కోట్లు, నాలాల అభివద్ధికి రూ. 585 కోట్ల రూపాయల నిధులు మంజూరు చేసిన ఘనత ఈ ప్రభుత్వానికి దక్కుంతుందని మేయర్ గద్వాల్ విజయలక్ష్మి పేర్కొన్నారు.

పబ్లిక్ టాయిలెట్స్‌లలో ఫ్రీ యూరినల్స్ కొనసాగించాలి..



- సీపీఐ(ఎం) గోషామహల్ కన్వీనర్ పి నాగేశ్వర్
- గోషామహల్ సర్కిల్ -14 డీసీకి వినతిపత్రం
- సీపీఐ(ఎం) ఇంటింటి పాదయాత్రలో వెలుగులోకి ప్రజా సమస్యలు..

నవతెలంగాణ - ధూల్ పేట్

పబ్లిక్ టాయిలెట్స్ లల్లో (సులభ్ కంప్లెక్) ఫ్రీ యూరినల్స్ కొనసాగించాలని సీపీఐ(ఎం) గోషామహల్ కన్వీనర్ పి నాగేశ్వర్ అన్నారు. సామాన్యుల సౌకర్యం కోసం లక్షల రూపాయల విలువచేసే స్థలాలను సులభ్ కాంప్లెక్స్ ల నిర్వాహకులకు ప్రభుత్వం ఉచితంగా కేటాయించగా ఇదే అదనుగా భావించి వ్యాపారం చేస్తున్నారన్నారు. గోషామహల్ రోడ్డు లోని సులభ్ కాంప్లెక్స్(టీ. ఎస్. ఏ డి యి ఆఫీస్ పక్కనున్న) యాజమాన్యం, ఇమ్లీబన్ బస్ స్టేషన్ ఎదురు రోడ్డు లోని రవీంద్ర బార్ ప్రక్కనున్న సులభ్ కాంప్లెక్స్ వారు గత 10 నెలల క్రితం నుంచి ఫ్రీ యూరినల్స్ ను ఎత్తేసి ఒక్కొక్కరి నుంచి రూ. 5 లు వసూలు చేస్తూ అక్రమ వ్యాపారం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. వెంటనే ఉచిత మూత్ర విసర్జనను పునరుద్ధరించాలని ఆయన డిమాండ్ చేశారు.

ఇంటింటికీ సీపీఐ(ఎం) 12వ రోజు పాదయాత్ర లో వెలుగు చూసిన ప్రజా సమస్యలను పరిష్కరించాలని గోషామహల్ సర్కిల్ -14 డిప్యూటీ కమిషనర్ జే.గీతా దేవి కి పార్టీ ఆధ్వర్యంలో వినతి పత్రం ఇచ్చారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. నగరం లోని సులభ్ కాంప్లెక్స్ లలో మరుగుదొడ్డి కి వెళ్లేవారికి, మూత్ర విసర్జనకు ఉచితంగా ఉండాలని, అలాగే మహిళలకు ఉచిత టాయిలెట్ వినియోగ సౌకర్యం ఉండాలని ప్రజల నుంచి ప్రతిపాదనలు, అభిప్రాయాలు వచ్చాయని చెప్పారు. ప్రజల నుంచి వచ్చిన సూచనలపట్ల ప్రజా పాలన ప్రభుత్వం సానుకూల దిశగా స్వీకరించాలని, నిత్యం పనులు దొరకని దినసరి కూలీలు టాయిలెట్స్‌లలో వసూల్ చేసే డబ్బులు చెల్లించలేక రోడ్డుపక్కన బహిరంగ మూత్ర విసర్జన చేస్తున్నారని తమ పరిశోధనలో గుర్తించామని చెప్పారు. అత్యవసర పనులమీద వేలాది మంది బేగం బజార్,, గోషామహల్ అఫ్జల్గంజి, కోటి, అబిడ్స్ ప్రాంతాలకు వస్తుంటారని వారి అత్యవసర ఆరోగ్య అవసరాన్ని (మల,మూత్ర విసర్జనలను)ఆసరా చేసుకొని సేవాభావం పేరుతో ప్రారంభమైన సులభ్ కాంప్లెక్స్‌లు డబ్బు సంపాదనే ధ్యేయంగా ఆచరణలో వ్యవహరిసున్నాయన్నారు. వీటిపట్ల జీహెచ్ఎంసీ అధికారుల పర్యవేక్షణ లేకపో వడంతో వీరు ఇష్టా రీతిగా డబ్బులు దండుకుంటున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రజల నిత్య జీవిత అవసరానికి సంబంధించిన ఈ సమస్య సీపీఐ(ఎం) పాదయాత్ర బృందం దృష్టికి ప్రజలు తీసుకు వచ్చారని ఆయన తెలిపారు. దీంతో వెంటనే సర్కిల్ -14 డీసీ స్పందించి ఈ సమస్య పై క్షేత స్థాయిలో పరిశీలించి తగిన చర్యలు తీసుకుం టామని హామీ ఇచ్చారన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ(ఎం) గోషామహల్ జోన్ కమిటీ కన్వీనర్ పి.నాగేశ్వర్, జోన్ కమిటి సభ్యులు బీ.సత్యనారాయణ, ఎన్ శ్రీ రాములు తదితరులున్నారు.

చాలా దేశాల్లో కొనసాగుతోన్న హరిత నిర్మాణాల ప్రక్రియ

- ఇఎస్‌సీఐలో జరిగిన వర్క్ షాప్‌లో పాల్గొన్న పలువురు వక్తలు



నవతెలంగాణ-సిటీబ్యూరో

నిర్మాణ రంగంలో స్థిరమైన ఆవిష్కరణలు జరగాలంటే గ్రీన్ బిల్డింగ్స్ ఆవశ్యకత ఉందని ఇండియన్ జియోటెక్నికల్ సొసైటీ అధ్యక్షుడు, ఇన్‌స్టిట్యూషన్ ఆఫ్ ఇంజనీర్స్ ఇండియా జాతీయ మండలి సభ్యుడు డాక్టర్ అనిల్ జోసెఫ్ అన్నారు. సివిల్ ఇంజనీరింగ్‌లో నూతనంగా వస్తున్నటెక్నాలజీని ఉపయోగించుకుని స్థిరత్వంగా వుండే గ్రీన్ బిల్డింగ్స్ నిర్మాణాల ఆవశ్యకతపై గచ్చిబౌలిలోని (ఇఎస్‌సీఐ) ఇంజనీరింగ్ స్టాఫ్ కాలేజ్ ఆఫ్ ఇండియా సెంటర్ ఫర్ క్లయిమేట్ చేంజ్ విభాగం బుధవారం ఏర్పాటు చేసిన వర్క్ షాప్‌లో ఆయన ముఖ్య అతిధిగా పాల్గొన్నారు. భవన నిర్మాణాల్లో వెలుతురుకు ప్రాధాన్యం ఇవ్వాలని, వర్టికల్ గార్డెన్స్, సెల్ఫ్ హీలింగ్ కాంక్రీట్, స్మోగ్ వాక్యూమ్ క్లీనర్లతో పాటుగా వ్యర్థాలను తగ్గించడం, రీసైక్లింగ్ విధానాలు పాటించడం, విద్యుత్ శక్తిని ఆదాచేసే పరికరాలను ఉపయోగించడం వలన హరిత నిర్మాణాలకు అవకాశం ఉంటుందన్నారు. ఇలాంటి సౌకర్యాలు లేకుండా బహుళ అంతస్తుల నిర్మాణాలు ఎన్నో ఉన్నాయని, పర్యవరణానికి హానిచేసే వీటి స్థానంలో హరిత నిర్మాణాలను నిర్మించే ప్రక్రియ చాలా దేశాల్లో కొనసాగుతున్నదన్నారు. హైదరాబాద్ లోని రహేజా ఐటీ స్థలంలో శాస్త్రీయ విధానంతో కట్టలేని భవనాన్ని కొన్నేండ్ల కింద కూల్చివేశామన్నారు. సమావేశానికి మరొక ముఖ్య అతిధిగా విచ్చేసిన దేవశ్రీ ఇస్పాత్ స్టీల్ ప్రాడక్ట్స్ అధినేత రాజీవ్ బిష్ట్ మాట్లాడుతూ ప్రపంచంలో భారతదేశం మూడో అతి పెద్ద ఆర్థిక వ్యవస్థగల దేశంగా ఉండబోతున్నదని, దేశంలోని ప్రధాన పట్టణాల్లో అత్యుత్తమ మౌలిక సదుపాయాలతో నిర్మిస్తున్న కార్పొరేట్ భవనాలు, ఆధునిక ఆస్పత్రులు, ఎయిర్ పోర్టులు, మెట్రో రైళ్లు, ఓడ రేవులు, అద్భుతమైన కాలేజీలు, ఐటీ కార్యాలయాలు, స్పేస్ టెక్నాలజీ తదితర అన్నిరంగాల్లో గణనీయమైన అభివృద్ధితో భారతదేశం ముందుకు దూసుకుపోతున్న దశలో కూడా రీ సైక్లింగ్ విధానంలో క్వాలిటీ తగ్గకుండా ఉత్పత్తులు జరుగుతున్నాయన్నారు. ఇందుకు మన ఇంజనీర్లను, శాస్త్రవేత్తలను అభినందించాలన్నారు. సివిల్ ఇంజనీరింగ్‌లో వస్తున్న నూతన మార్పులతో ఇండియాలో గ్రీన్ బిల్డింగ్స్ నిర్మాణాల ఆవశ్యకత ఉందన్నారు. అనంతరం ఇంజనీరింగ్ స్టాఫ్ కాలేజ్ ఆఫ్ ఇండియా డైరెక్టర్ డాక్టర్ జీ. రామేశ్వర్ రావు మాట్లాడుతూ గ్లోబల్ వార్మింగ్ వలన ఏర్పడుతున్న ప్రమాదాలను తగ్గించుకోవడంపై సివిల్ ఇంజనీరింగ్ విధానాల్లో వస్తున్న నూతన మార్పులతో వాతావరణానికి అనుకూలంగా వుండే డిజైన్ల ద్వారా సోలార్ ప్యానెల్స్, వర్షపు నీటిని సేకరించే వ్యవస్థలు, స్మార్ట్ ఎనర్జీ సిస్టమ్స్ వంటి హరిత సాంకేతికతలను ఉపయోగిస్తూ సుస్థిర భవన నిర్మాణాలను చేపట్టాలని అన్నారు. ఇందువలన నిర్మించిన కట్టడాలు బలంగా, దీర్ఘకాలం మన్నికను పెంచుతాయన్నారు. ఈ కట్టడాలు కార్బన్ ఉద్గారాలను తగ్గించడంతో పాటుగా నిర్మాణ సామర్థ్యాన్ని పెంచుతున్నాయని భవిష్యత్తు తరాలకు స్థిరమైన, తక్కువ ఖర్చుతో కూడిన, మరియు పర్యావరణానికి అనుకూలమైన మౌలిక సదుపాయాలను సష్టించడానికి తోడ్పడతాయన్నారు. సస్టైనబుల్ గ్రీన్ బిల్డింగ్ కోసం వినూత్న నిర్మాణ సాంకేతికతలు- స్మార్ట్ టెక్నాలజీలు, ఆటోమేషన్, పర్యావరణ హితమైన నిర్మాణ పద్ధతుల అన్వేషణపై మెథడిస్ట్ కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ అసిస్టెంట్ ప్రొఫెసర్ శ్రీకాంత్ రేణికుంట మాట్లాడారు. సాంప్రదాయ భవనాలను గ్రీన్ టెక్నాలజీలతో ఆధునీకరించడం ద్వారా మెరుగైన శక్తి సాధించడం, పర్యావరణ హితమైన పరిష్కారాలతో అప్‌గ్రేడ్ చేసే పద్ధతుల పై మల్లారెడ్డి హెల్త్ సిటీ చీఫ్ అక్రిడిటేషన్ అధికారి బి.వంశీకృష్ణతోపాటు సాంకేతికతను ఉపయోగించి గ్రీన్ బిల్డింగ్స్ నిర్మాణాల ద్వారా సుస్థిరత్వాన్ని సాధించడంపై ఉస్మానియా యూనివర్సిటీ ప్రొఫెసర్ వి. బిక్ష్మా, గ్రీన్ బిల్డింగ్‌ల కోసం సమర్థవంతమైన నీరు, వ్యర్థాల నిర్వహణ, మురుగు నీటి పునర్వినియోగం, జీరో వ్యర్థ నిర్మాణాలపై కాన్ఫడరేషన్ ఆఫ్ ఇండియన్ ఇండస్ట్రీ గ్రీన్ ప్రో ఇంజనీర్ ఎస్.పి అలగప్పన్ తదితరులు మాట్లాడారు. ఈ సమావేశంలో సివిల్ ఇంజనీర్లు, ఆర్కిటెక్ట్ నిపుణులు, వివిధ నిర్మాణ సంస్థలు, కాంట్రాక్టర్లు, కార్బన్ ఉద్గారాల నియంత్రణకు పరిష్కారాలను అందించే నిపుణులు, పర్యావరణ సలహాదారులు పాల్గొన్నారు. కార్యక్రమం మొత్తం సెంటర్ ఫర్ క్లయిమేట్ చేంజ్ హెడ్ డాక్టర్ చంద్రకళ ఫ్యాకల్టీ డాక్టర్ ఆది నరేష్ నిర్వహణలో జరిగింది.

గ్రానైట్ రాయి మీద పడి వ్యక్తి మృతి


(ఫైల్ ఫోటో)

నవతెలంగాణ-పేట్ బషీరాబాద్

గ్రానైట్ రాయి మీద పడి వ్యక్తి దుర్మరణం చెందిన ఘనటన పేట్‌బషీరాబాద్‌లో చోటుచేసు కుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం..మధ్యప్రదేశ్ రాష్ట్రం సత్న జిల్లా బిసల్పుర్ గ్రామ వాసి పుష్ప యాదవ్(40) కుత్బుల్లాపూర్‌లో నివాసం ఉంటు న్నాడు. బుధవారం మధ్యాహ్నం సుమారు 12:30 గంటలకి పెట్ బషీరాబాద్‌లోని దండమూడి ఎంక్లేవ్‌లో లారీలో నుంచి గ్రానైట్ రాయి దింపుతున్నాడు. ఈ క్రమంలో ప్రమాదవశాత్తు గ్రానైట్ రాయి మీద పడి ఊపిరాడక అక్కడికక్కడే మృతి చెందాడు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.


అనుమానస్పదంగా వ్యక్తి మృతి

నవతెలంగాణ- పేట్ బషీరాబాద్

అనుమానస్పద వ్యక్తి మృతి చెందిన ఘటన పేట్ బషీరాబాద్‌లో చోటు చేసుకుంది. పోలీ సులు తెలిపిన వివరాల ప్రకారం అమీర్ కుమార్ పహాడీ (40) పేట్ బషీ రాబాద్ పరిధిలోని అపర్ణా తులిప్ ఫ్లాట్ నెంబర్ 502లో కుటుంబంతో సహా 2019 నుంచి నివా సం ఉంటున్నాడు. మద్యానికి బానిసైన సదరు వ్యక్తి భార్య సుచిస్మితతో గొడవ పడటంతో ఆమె పిల్లల్ని తీసుకొని ఒరిస్సాలోని స్వగ్రామానికి వెళ్లి పోయింది. మంగళవారం రాత్రి 9 గంటల వరకు భార్యతో ఫోన్‌లో మాట్లాడాడు. బుధవారం ఉదయం నుంచి భార్య ఎంత ఫోన్ చేసినా లిఫ్ట్ చేయలేదు. భార్యకు అనుమానం వచ్చి పక్క ఫ్లా ట్ వాళ్లకి చెప్పింది. వారు పలుమార్లు డోర్ కొట్టిన తీయకపోవడంతో సెక్యూరిటీ గార్డ్ సహాయం తో బాల్కనీలో నుంచి చూడగా బెడ్ రూమ్‌లో పడి ఉన్నాడు. వెంటనే 108కి ఫోన్ చేసి సిబ్బంది సహాయంతో తలుపు తెరిచి చూడగా సదరు వ్యక్తి మరణించినట్టు 108 సిబ్బంది చెప్పారు. అమీర్ కుమార్ పహాడి మద్యం అధికం గా సేవి ంచడం వల్ల అపస్మారక స్థితిలోకి వెళ్లి ఉండవ చ్చని లేదా హార్ట్ స్ట్రోక్ వల్ల అతను మరణించి ఉండవచ్చని 108 సిబ్బంది అనుమానం వ్యక్తం చేశారు. మృతుడికి భార్య, ఒక కొడుకు, ఒక కూతురు ఉన్నారని, కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్టు పేట్ బషీరాబాద్ పోలీసులు తెలిపారు.

రోడ్డు మరమ్మతులు చెయ్యండి

- వరద కాలువపై స్లాబ్ పలకలు ధ్వంసం
- ట్రాఫిక్ సమస్యతో ప్రమాదాలు
- అధికారులకు ఫిర్యాదులు చేసినప్పటికీ ఫలితం శూన్యం



నవతెలంగాణ-కూకట్‌పల్లి

కూకట్‌పల్లి సర్కిల్ పరిధిలోని కూకట్‌పల్లి డివిజన్ విజ్ఞాన్ పురి కాలని వినాయక మండపం వద్ద వర్షపు నీరు వెళ్ళడానికి, రోడ్డు పక్కన నిర్మించిన వరద కాలువపై స్లాబ్ పలకలు ధ్వంసమై గుంతలు ఏర్పడింది. దాంతో ట్రాఫిక్ సమస్యతో పాటు ప్రమాదాలు జరుగుతున్నాయి. సంబంధిత అధికారులకు ఫిర్యాదులు చేసినప్పటికీ ఫలితం శూన్యం. ఇకనైనా త్వరగా రోడ్డు మరమ్మతు పనులు పూర్తి చేయాలని స్థానికులు కోరారు. రోడ్డుపై స్లాబ్ పలకలు పగిలిపోయి గుంతలు ఏర్పడి కాలువలో పూర్తిగా మట్టి పేరుకుపోయి ఉంది. కాలనీ చుట్టు పక్కల ప్రాంతాలు, పూర్తిగా పారిశ్రామిక ప్రాంతం కావడంతో.. కాలనీలో నుంచి ప్రతి రోజూ భారీ వాహనాలతో పాటు వందల సంఖ్యలో ఇతర వాహనదారులు ప్రయత్నిస్తుంటారు. విజ్ఞాన పూరి మండపం వద్ద అధిక లోడ్‌తో వచ్చే భారీ వాహనాలు, పోవడానికి ఇబ్బందిగా మారింది. ట్రాఫిక్ సమస్య ఏర్పడటంతో పాటు, పలు మార్లు ప్రమాదాలు సైతం జరిగాయి.

-ధ్వంసమైన రోడ్డు పనులు పూర్తి చేయాలి..



ధ్వంసమైన రోడ్డును త్వరగా పూర్తి చేసి, ట్రాఫిక్ సమస్య తగ్గించాలి. అలాగే భారీ వాహనాలు కాలనీలోకి రాకుండా, కమాన్ వంటివి నిర్మించాలి. కాలనీవాసుల సమస్యలు పరిష్కరించాలి

-విజ్ఞాన్ పురి సంక్షేమ సంఘం అధ్యక్షుడు మధుసూదన్ రెడ్డి..

పది పరీక్షలకు సర్వం సిద్ధం

- విద్యార్థులకు ఆర్‌టీసీ బస్సులో హాల్ టికెట్‌తో ఉచిత ప్రయాణం
- కూకట్‌పల్లిలో మొత్తం 38 పరీక్ష కేంద్రాలు
- పరీక్షలు రాయనున్న 8165 మంది విద్యార్థులు



నవతెలంగాణ-కూకట్‌పల్లి

రేపే పది పరీక్షలు ప్రారంభం. శుక్రవారం నుంచి ప్రారంభమయ్యే పదవ తరగతి పరీక్షలకు, అన్ని ఏర్పాట్లు పూర్తి చేయడం జరిగిందని కూకట్‌పల్లి మండల విద్యాధికారి కిషన్ తెలిపారు. విద్యార్థులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా, పరీక్ష కేంద్రాల్లో మంచి నీరు, ఫ్యాన్‌లు వంటి సౌకర్యాలు కల్పించడం జరిగిందన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పదవ తరగతి విద్యార్థులు పరీక్ష కేంద్రాలకు వెళ్లేందుకు తెలంగాణ ప్రభుత్వం ఆర్‌టీసీ బస్సులో ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించిందని తెలిపారు. బస్సులో హాల్ టికెట్ చూపెట్టి తమ పరీక్ష కేంద్రాలకు ఉచితంగా వెళ్ళొచ్చని పేర్కొన్నారు. శుక్రవారం ఉదయం 9.30 గంటలకు పరీక్ష ప్రారంభమవుతుంది. ఐదు నిమిషాలు ఆలస్యమైనా 9.35 గంటల వరకు హాలులోకి అనుమతించడం జరుగుతుందన్నారు. ఈ ఏడాది మొట్టమొదటి సరిగా 24 పేజీలతో బుక్ లెట్ ఇవ్వడం జరుగుతుంది. భౌతిక శాస్త్రం, జీవ శాస్త్రం పేపర్‌లకు మాత్రం 12 పేజీలతో బుక్ లెట్ అందించడం జరుగుతుందని తెలిపారు. అందులోనే జవాబులు రాయాల్సి ఉంటుంది. పేపర్ లీకేజీ అరికట్టేందుకు క్యూ అర్ కోడ్ సైతం ముద్రించడం జరుగుతుందని తెలిపారు. విద్యార్థులు నిర్భయంగా, ప్రశాంతంగా పరీక్షలు రాసి మంచి ఫలితాలు సాధించాలని కోరుతున్నానని అన్నారు.

కూకట్‌పల్లిలో మొత్తం 8165 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారు..



కూకట్‌పల్లి మండలంలో మొత్తం 38 పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేయడం జరిగింది. అందులో ఆరు ప్రభుత్వ పరీక్ష కేంద్రాలు, 32 ప్రైవేట్ పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేశారు. ఈ అకడమిక్ ఇయర్‌లో మండలానికి సంబంధించి మొత్తం 8165 మంది విద్యార్థులు పరీక్షలు రాస్తున్నారు.

-కూకట్‌పల్లి మండల విద్యాధికారి కిషన్..

ఆత్మీయ అనుబంధానికి ప్రతీక ఇఫ్తార్



- సెయింట్ మార్టిన్ ఇంజినీరింగ్ కళాశాల యాజమాన్యం

నవతెలంగాణ-పేట్ బషీర్‌బాద్

ఆత్మీయ అనుబంధానికి ప్రతీక ఇఫ్తార్ విందు అని సెయింట్ మార్టిన్ ఇంజినీరింగ్ కళాశాల యాజమాన్యం తెలిపింది. రంజాన్ పవిత్ర మాసంలో ఉపవాసం ఉండే లక్షలాది మంది ముస్లింలకు, ఇఫ్తార్ కేవలం భోజనం మాత్రమే కాదని ఇది కుటుంబం కమ్యూనిటీలను ఒక దానితో ఒకటి బంధించే ఆధ్యాత్మికంగా నిర్వహించే పండుగ అన్నారు. బుధవారం రంజాన్ మాసం సందర్భంగా కళాశాల బృందం, కళాశాల ప్రాంగణంలో ముస్లిం విద్యార్థులకు, సిబ్బందికి ఇఫ్తార్ విందు అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతు ముస్లింలు రంజాన్ మాసంలో ఉపవాసం (రోజా) భక్తి స్వీయ-క్రమ శిక్షణ, స్వీయ నియంత్రణ, త్యాగం బోధిస్తారని నమ్ముతారని తెలిపారు. ముస్లింలు తమను తాము ఎలా శుద్ధి చేసుకోవాలో సర్వశక్తిమంతుడైన అల్లాతో వారి సంబం ధాన్ని ఎలా బలోపేతం చేసుకోవాలో గుర్తుచేస్తుందని పేర్కొన్నారు. ఇది తెల్లవారుజామున, సూర్యాస్తమయం మధ్య గమనించబడుతుందన్నారు. అనంతరం కళాశాల ప్రొఫెసర్ గ్రూప్ డైరెక్టర్ డా.పి.సంతోష్ కుమార్ పాత్ర మాట్లాడుతూ భారతీయులలో ఐక్యత సౌభ్రాతృత్వ సందేశాన్ని వ్యాప్తి చేయడానికి ఇంజినీరింగ్ కళాశాలలో మొట్టమొదటి ప్రధానమైన అభ్యాసం అన్నారు. ఈ కార్యక్రమాన్ని నిర్వహించిన యాజమాన్య సభ్యులకు ఆయన కృతజ్ఞతలు తెలుపుతూ విద్యార్థులకు శుభా కాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సుమారు 100 మంది విద్యార్థులు, సిబ్బంది పాల్గొన్నారు. ఇఫ్తార్ సందర్భంగా ఖర్జూరాలు, పండ్లు, స్నాక్స్, రుచికరమైన వంటకాలు మొదలైనవి అందించారు. ఈ కార్యక్రమం లోకళాశాల చైర్మెన్ మర్రి లక్ష్మణ్ రెడ్డి, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్, జి. చంద్రశేఖర్ యాదవ్, పాల్గొని ముస్లిం సమాజానికి హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు.

విద్యాశాఖకు గత ఏడాది కంటే తగ్గిన కేటాయింపులు

- విద్యారంగ అభివృద్ధికి 15 శాతం నిధులు కేటాయించాలి
- టీఎస్‌యూటీఎఫ్ మేడ్చల్ జిల్లా కోశాధికారి గొడుగు శ్రీనివాస్



నవతెలంగాణ-కూకట్‌పల్లి

బడుగు,బలహీన వర్గాల ఎస్సీ, ఎస్టీ, బీసీ విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించడానికి విద్యా శాఖకు కేటాయించిన నిధులు ఏమాత్రం సరిపోవని టీఎస్‌యూటీఎఫ్ మేడ్చల్ జిల్లా కోశాధికారి గొడుగు శ్రీనివాస్ అన్నారు. విద్యాశాఖ పరిధిలోని పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పనకు, మెరుగైన మధ్యాహ్నభోజనం అందించేందుకు, నాణ్యమైన విద్యను అందించడానికి, కాంగ్రెస్ పార్టీ మేనిఫెస్టోలో పొందుపరిచిన 15 శాతం నిధులు కేటాయించాలని ప్రభుత్వాని ఆయన కోరారు.

2025 - 26 సంవత్సరానికి గాను బుధవారం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో, ఈ సంవత్సరం రూపాయలు మొత్తం 3,04,965 కోట్ల బడ్జెట్‌లో, విద్యాశాఖకు కేటాయించింది. అందులో 7.57 శాతం మాత్రమే అని,అదే గత సంవత్సరం రూపాయలు 2,74,058 కోట్ల బడ్జెట్ లో విద్యకు కేటాయించింది. రూ 21292 కోట్లు 7.77 శాతం అది గత ఏడాది కంటే తగ్గించడం జరిగింది. అంకెల్లో రూ.1816 కోట్లు పెరిగినట్టుగా ఉన్నప్ప టికీ, శాతాల్లో చూస్తే మాత్రం గత సంవత్సరం కంటే తగ్గించి కేటాయించడం జరిగిందని తెలిపారు.

విద్యాశాఖ పరిధిలో ఉన్న, 26,067 పాఠశాలలను పక్కన పెట్టి, ఈ ప్రభుత్వం రెసిడెన్షియల్, యంగ్ ఇండియా రెసిడెన్షియల్ స్కూల్స్ గురించి మాత్రమే ఆసక్తి చూపెడుతుందన్నారు. గురుకులాల్లో చదివేది 5.5 లక్షల మంది మాత్రమే. ప్రభుత్వ, జిల్లాపరిషత్, మండల పరిషత్ పాఠశాలల్లో చదివే విద్యార్థులు 16 లక్షల మంది పేద విద్యార్థులున్నారు. వారిలో అత్యధికులు బడుగు, బలహీన వర్గాల ఎస్సీ, ఎస్టీ, బీసీ వారు బాలికలు ఉన్నారు.

హైదరాబాద్ అభివృద్ధిని విస్మరించిన బడ్జెట్

- మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాకు మొండి చెయ్యి
- సీపీఐ(ఎం) మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా కార్యదర్శి పి.సత్యం



నవతెలంగాణ-సిటీబ్యూరో

అసెంబ్లీ బడ్జెట్‌లో హైదరాబాద్ అభివృద్ధిని విస్మరించి, మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాకు మొండి చెయ్యి ఇచ్చిందని సీపీఐ (ఎం) మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా కార్యదర్శి పి.సత్యం తెలిపారు. ఈ మేరకు రాష్ట్ర బడ్జెట్‌పై బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. అసెంబ్లీలో ఉప ముఖ్యమంత్రి, ఆర్థికశాఖ మంత్రి భట్టి విక్రమార్క ప్రవేశపెట్టిన బడ్జెట్ ప్రజలను నిరాశపర్చిందన్నారు. గత బడ్జెట్ కంటే ఐదు శాతం మాత్రమే ఎక్కువ అన్నారు. ఈ బడ్జెట్ అప్పులపై ఆధారపడిన బడ్జెట్‌గానే ఉందన్నారు. ఓపెన్ మార్కెట్‌లోకి తెచ్చే రూ.64,539 కోట్లతో కలిపి మొత్తం రూ.70 వేల కోట్ల అప్పులు చేయబోతున్నట్టు చెప్పారని తెలిపారు. గత బడ్జెట్‌లో రుణ సేవల కింద రూ.17,729 కోట్లు చూపితే, అది జనవరి 2025 నాటికే రూ.22 వేల కోట్లకు చేరిందని తెలిపారు. ఈ బడ్జెట్‌లో రుణ సేవల కోసం రూ.19,370 కోట్లుగా చూపారనీ, ఇది మరింత పెరిగే ప్రమాదం ఉందని తెలిపారు.

హైదరాబాద్ అభివృద్ధిని బడ్జెట్‌ను పెంచాలి..

హైదరాబాద్ అభివృద్ధి కోసం గత బడ్జెట్‌లో రూ.10వేల కోట్లు కేటాయిస్తే, ఈ సారి ఫ్లైఓవర్లు, అండర్ పాసులు, రోడ్డు విస్తరణ పనుల కోసం రూ.7,032 కోట్లు మాత్రమే కేటాయించారనీ, ఇది పెరుగుతున్న హైదరాబాద్ అవసరాలను ప్రతిబింబించదు అన్నారు. హైదరాబాద్ అభివృద్ధికి బడ్జెట్‌ను పెంచాలన్నారు. హైదరాబాద్‌లో ప్రజల సొంత ఇంటి కల నెరవేరేలా కేటాయింపులు లేవన్నారు. అసంపూర్తిగా మిగిలిన రాష్ట్రంలో 34 వేల డబుల్ బెడ్ రూం ఇండ్ల నిర్మాణానికి రూ.305 కోట్లు మాత్రమే కేటాయిం చారని తెలిపారు. నియోజకవర్గానికి 3,500 ఇందిరమ్మ ఇండ్లు కేటాయిస్తున్నట్టుగా చెప్పారనీ, ఇది హైదరాబాద్ అవసరాలని తీర్చదని తెలిపారు. హైదరాబాద్‌లో కనీసం అదనంగా 2 లక్షల డబుల్ బెడ్ రూం ఇండ్ల నిర్మాణానికి ఈ బడ్జెట్‌లో కేటాయింపులు చేయాలన్నారు. గతంలో అల్పాదాయ, మధ్య తరగతి వర్గాల కోసం గృహ నిర్మాణ సంస్థ చేపట్టినట్టు నిర్మాణాలు విస్తతంగా చేపట్టేలా బడ్జెట్‌లో కేటాయింపులు చేయాలని కోరారు. కొత్త పెన్షన్లకు, కొత్త రేషన్ కార్డులకు బడ్జెట్‌లో తగిన విధంగా కేటాయింపులు లేవ న్నారు. ఫీజు రీయింబర్స్‌మెంట్‌కు తగిన కేటాయింపులు చేయ లేదన్నారు. ఈ విద్యా సంవత్సరం కలిపితే రూ.8వేల కోట్లు బకా యిలు ఉన్నాయనీ, వీటిని తక్షణమే విడుదల చేయడానికి కేటా యింపులు చేయాలన్నారు. ఆరోగ్యశ్రీ బకాయిలు కూడా రూ. 1200 కోట్లు విడుదలకు కేటాయింపులు చేయాలన్నారు. నియో జకవర్గానికి ఒక యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ విద్యా సంస్థల నిర్మాణాలకి రూ.11,600 కోట్లు కేటాయించడం మంచిదే.. కానీ మొత్తం ప్రభుత్వ విద్యా సంస్థల బలోపేతానికి తగిన కేటాయింపులు చేయాలన్నారు. గత బడ్జెట్‌లో రూ. 21,292 కోట్లు కేటాయిస్తే, ఈ బడ్జెట్‌లో 23,108 కోట్లు స్వల్పంగా పెంచుతూ కేటాయించారని తెలిపారు. దేశ అక్షరాస్యత 77శాతం ఉంటే తెలం గాణ అక్షరాస్యత 66.5శాతంగా ఉందన్నారు. ఇది విద్యా వ్యవస్థలో తెలంగాణ వెనుకబాటును సూచిస్తుందని తెలిపారు. అందుకోసం విద్యారంగానికి కేటాయింపులు పెంచాలన్నారు. తలసరి ఆదా యాలు, జీడీపీల పెరుగుదలను చూపి రైజింగ్ తెలంగాణ అని చెప్పటం కాదనీ, మానవ అభివృద్ధి సూచికలో మెరుగు ఉండాలనీ, అందుకు విద్యా, వైద్యంపై బడ్జెట్‌లో కేటాయింపులు పెంచాలని కోరారు.

మున్సిపాల్టీల అభివృద్ధికి రూ.4,500 కోట్లే..

మొత్తం రాష్ట్రంలో కొత్తగా ఏర్పాటు చేసిన మున్సిపాల్టీలకు రూ.4,500 కేటాయిస్తున్నట్టుగా చూపారు. మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలో ఔటర్ రింగ్ రోడ్డు లోపల జీహెచ్‌ఎంసీలో కలుపుతామనీ, బయట ఉన్న గ్రామాలు అన్ని మున్సిపాల్టీలుగా కలుపుతామనీ, కొత్తగా మున్సిపాల్టీలను ఏర్పాటు చేశారు. వాటి అభివృద్ధికి రూ. 10వేల కోట్లు కేటాయించాలని డిమాండ్ చేశారు. బడ్జెట్‌లో చూపి నట్టుగా కేంద్రం నుంచి తెలంగాణకు నిధుల కేటాయింపు తగ్గుతున్నదన్నారు. అభివృద్ధి, సంక్షేమం రాష్ట్రాల పరిధిలో జరుగుతు న్నందున పన్నుల్లో రాష్ట్ర వాటాను 41 శాతం నుంచి 50 శాతానికి పెంచాలన్నారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వంపై ఒత్తిడికి రాష్ట్ర ప్రభుత్వం ఇతర రాష్ట్రాల సమన్వయంతో కృషి చేయాలని సీపీఐ (ఎం) సూచిస్తుందనీ, ఆ దిశగా తెలంగాణలోని 8 మంది బీజేపీ ఎంపీలు కూడా రాష్ట్రానికి నిధులు రాబట్టడానికి కృషి చేయాలని కోరారు.

బడ్జెట్ సమావేశాల్లో ఆశాలకు రూ.18వేల వేతనం నిర్ణయించాలి

- సీఐటయూ మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా అధ్యక్షులు ఎ.అశోక్



నవతెలంగాణ-సిటీబ్యూరో

ఆశా వర్కర్ల సమస్యలు పరిష్కారించాలనీ, పర్మినెంట్ చేయాలనీ, ఆ లోపు ఫిక్స్‌డ్ వేతనం రూ.18వేలు ఇవ్వాలనీ, ఈఎస్ఐ, పీఎఫ్ సౌకర్యం కల్పించాలని సీఐటీయూ మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా అధ్యక్షుడు ఎ.అశోక్ డిమాండ్ చేశారు. తెలంగాణ ఆశా వర్కర్స్ యూనియన్ (సీఐటీయూ) ఆధ్వర్యంలో ఆశా వర్కర్ల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ కలెక్టరేట్ ముట్టడి కార్యక్రమం చేపట్టారు. దీంతో పోలీసులు ఎక్కడికక్కడ అరెస్టులు చేసి పోలీస్ స్టేషన్లకు తరలించారు. ఈ సందర్భంగా అశోక్ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఆశాలకు రూ.18వేల ఫిక్స్‌డ్ వేతనం ఇస్తామని చెప్పి ఇప్పటి వరకు అమలు చేయలేదన్నారు. పీఎఫ్, ఈఎస్ఐ, రిటైర్మెంట్ బెనిఫిట్, పెన్షన్ సౌకర్యాలు కల్పించాలని డిమాండ్ చేశారు. ఆశా వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఎ.హేమలత, ఎం.రేవతి కల్యాణి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఆశాల సమస్యల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నదన్నారు. తమ పార్టీ అధికారంలోకి వస్తే మెరుగైన సౌకర్యాలు కల్పిస్తుందనీ, ఆశాలకు వేతనాలు పెంచడంతోపాటు ఉద్యోగ భద్రత కల్పిస్తామని కాంగ్రెస్ తన ఎన్నికల మేనిఫెస్టోలో పొందుపర్చి, ఆశాల ఓట్లతో అధికారంలోకి వచ్చి ఇప్పుడు సమస్యలు పరిష్కరించడం లేదన్నారు. సమస్యలు పరిష్కరించాలని కోరుతూ జిల్లా ఉన్నతాధికారులు, జిల్లా వ్యాప్తంగా ఎమ్మెల్యేలకు, మంత్రులకు ఆశాలు అనేకసార్లు వినతి పత్రాల ద్వారా విజ్ఞప్తులు చేసినా, ఇప్పటికీ నిరంతరం నిరసనలు, పోరాటాలు చేస్తున్నామని చెప్పారు. సీఐటీయూ జిల్లా కోశాధికారి కె.ఉన్నికృష్ణన్ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం చలనం లేనట్టు వ్యవహరిస్తున్నదన్నారు. జిల్లాలో ఆశాలు తమ సమస్యలను పరిష్కరించాలని కలెక్టర్‌కు తమ సమస్యలను చెప్పుకుందామంటే ఆశా కార్యకర్తలను రాత్రికి రాత్రి ఎక్కడికిక్కడ అరెస్టులు చేయడం సరికాదన్నారు. ప్రజా పాలన ప్రభుత్వంలో ఇలాంటి అరెస్టులు ఎలాంటి పరిపాలన గుర్తుకు చేస్తున్నాయో తెలుస్తున్నాయన్నారు. గతంలో కాంగ్రెస్ ఎన్నికల ముందు కార్మికులకు అనేక హామీలిచ్చి అమలు చేయడం లేదన్నారు. అడిగితే అరెస్టులు చేయడం సరికాదన్నారు. ఇప్పటికీ దాదాపు 300 మంది ఆశా వర్కర్లని, సీఐటీయూ జిల్లా నాయకులు రాజశేఖర్, లింగస్వామిని అరెస్టు చేశారనీ, వారిని వెంటనే విడుదల చేయాలని సీఐటీయూ శామిర్ పేట మండల కార్యదర్శి కృష్ణప్ప డిమాండ్ చేశారు.

ఎన్యుమరేటర్లు ధర్నా..



నవతెలంగాణ-కుత్బుల్లాపూర్

కుత్బుల్లాపూర్ సర్కిల్ కార్యాలయం ముందు ఎన్యుమరేటర్లు ధర్నా చేపట్టారు. కులగణన సర్వే పూర్తి చేసిన ఎన్యుమరేటర్లు బుధవారం ఆందోళ నకు దిగారు. కులగణన సర్వేలో పనిచేసిన తమకు వేతనాలు ఇవ్వకుండా... ప్రభుత్వం పూర్తిగా విస్మరించిందన్నారు. అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారని.. సర్వే పూర్తయినప్పటికీ ఇప్పటివరకు తమకు గౌరవేతనం అందివ్వడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. డిప్యూటీ కమిషనర్ బయటకు రావాలని నినాదాలు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కుల గణన సర్వే కోసం ఇంటింటికి తిరుగుతూ చేసిన పనికి ఫలితంగా ప్రభుత్వం తమకు గౌరవ వేతనం రూ.10 వేలు ఇస్తామని హామీ ఇచ్చిందని తెలిపారు. కానీ ఇప్పటివరకు గౌరవ వేతనం ఇవ్వకుండా.. తమతో వెట్టిచాకిరి చేయించుకు న్నారని ఆసహానం వ్యక్తం చేశారు. ఇప్పటికైనా డిప్యూటీ కమిషనర్ వెంటనే స్పందించి, తమకు వేతనాలు ఇప్పించేలాపై అధికారులతో మాట్లాడి తమకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

హీరో నితిన్‌తో కలిసి డాన్స్ స్టెప్ వేసిన మల్లా రెడ్డి



నవతెలంగాణ-కుత్బుల్లాపూర్

మల్లారెడ్డి ఇనిస్ట్యూట్ ఆఫ్ మెడికల్ కళాశాలలో ఏర్పాటు చేసిన ఒక ప్రోగ్రాంకి మాజీ మంత్రి మేడ్చల్ ఎమ్మెల్యే మల్లారెడ్డి హీరో నితిన్‌తో కలిసి డాన్స్ స్టెప్ వేసి కుర్ర కాలనీ హొూరెత్తించారు. మల్లారెడ్డి స్టెప్పులు చూసినటువంటి కుర్ర కారు కేరింతలతో సందడి చేశారు.

తొమ్మిది నెలల నిరీక్షణ ఫలించింది. ఎప్పుడెప్పుడా అని ఎదురు చూస్తున్న రోజు వచ్చేసింది. యావత్ ప్రపంచం ఆమె రాకకోసం ఇన్ని రోజులు ఎంతో ఉత్కంఠతతో ఎదురుచూసింది. చివరకు దివి నుంచి భూవి పైకి అడుగుపెట్టారు సునీతా విలియమ్స్. ఇప్పటి వరకు మూడు సార్లు అంతరిక్ష ప్రయాణం చేసిన ఆమె ప్రపంచం గర్వించదగ్గ ముద్దు బిడ్డగా అనేక రికార్డులు నెలకొల్పారు. ఓ సాధారణ మహిళగా అవధులు లేని స్వప్నాలను సాకారం చేసుకోవాలని తపించే మహిళలందరికీ ఆమె జీవితం స్ఫూర్తిదాయకం.

దివి నుండి భువికి సునీతా విలియమ్స్



గత ఏడాది జూన్ 5న కేవలం ఎనిమిది రోజుల మిషన్ కోసం అంతరిక్షంలోకి వెళ్లిన సునీత కొన్ని సాంకేతిక కారణాల వల్ల అక్కడే చిక్కుకుపోయిన విషయం ప్రపంచం మొత్తానికి తెలిసిందే. సుమారు తొమ్మిది నెలలు అంటే 286 రోజులు ఆమె మరో వ్యోమగామి విల్మోర్‌తో కలిసి అంతరిక్షంలో ఉండిపోయారు. సుదీర్ఘ నిరీక్షణ తర్వాత ఎట్టకేలకు నాసా వారిని భూమికి తీసుకొచ్చింది. సునీతా విలియమ్స్ భారత మూలాలున్న రెండో అమెరికా వ్యోమగామి. కల్పనా చావ్లా తర్వాత, ఎక్స్‌పెడిషన్-14 బృందంలో భారత సంతతికి చెందిన సునీతా విలియమ్స్‌ను నాసా భూమికి చేర్చింది.

పశువైద్యురాలు కావాలనీ...

సునీత తల్లిదండ్రులు దీపక్ పాండ్యా, బోనీ పాండ్యా. వీరిది గుజరాత్‌లోని జులాసన్ అనే గ్రామం. ఆమె తండ్రి 1957లో అమెరికాకు వలస వెళ్లారు. న్యూరో శాస్త్రవేత్తగా ఆయన అక్కడే స్థిరపడ్డారు. ఆయనకున్న ముగ్గురు పిల్లల్లో సునీత చిన్నది. అన్న జై థామస్, అక్క ధినాఅన్నా. అమెరికాలోని ఓహియోలో 1965లో సునీత జన్మించారు. చిన్నప్పటి నుండి ఈమె ధైర్య సాహసాలకు పెట్టింది పేరు. 'నువ్వు ఈ పని చేయలేవు' అని ఎవరైనా అంటే ఆమెకు అస్సలు నచ్చేది కాదు. అలాగే ఆమెకు జంతువులన్నా అత్యంత ప్రేమ. సునీతకు ఐదేండ్లు ఉండగా ఓ పెంపుడు కుక్కను వాళ్లు ఇంటికి తెచ్చుకున్నారు. దానితో సునీతకు ఎంతో అనుబంధం ఏర్పడింది. అందుకే ఆమె తన చిన్నతనంలో పశు వైద్యురాలు కావాలని కలలు కన్నారు. అందుకు కారణం తల్లి బోనీలోని జంతుకారుణ్యం. కానీ తర్వాత కాలంలో పరిస్థితి మారిపోయింది.

తొలి అంతరిక్ష యాత్ర

సునీత 1987లో మేరీల్యాండ్‌లోని అమెరికా నావల్ అకాడమీ నుండి భౌతికశాస్త్రంలో పట్టా పొందారు. తర్వాత అమెరికా నావికా దళంలో చేరారు. అక్కడ విశేషమైన నైపుణ్యంతో ఆరు నెలల్లోనే బేసిక్ డైవింగ్ ఆఫీసర్‌గా పదోన్నతి పొందారు. 1989లో నేవల్ ఏవియేటర్‌గా పని చేశారు. నేవల్ ఏవియేటర్‌గా యుద్ధ విమానాలు నడపడంలో ఆమె శిక్షణ పొందారు. నావీ నుండి రిటైర్ అయ్యాక 1998 ఆగస్టులో జాన్సన్ స్పేస్ సెంటర్‌లో వ్యోమగామిగా శిక్షణ పొందారు. 2006లో తొలిసారి అంతరిక్ష యాత్ర చేశారు. అంతరిక్షంలో 195 రోజులు గడిపి దాని నిర్వహణ, మరమత్తులతో పాటు తదితర విషయాలపై అనుభవం గడించారు. 1993లో అమెరికా నావల్ టెస్ట్ పైలెట్ స్కూల్లో ప్రవేశం పొందారు.

స్పేస్ వాక్‌లో ఘనత

2012లో రెండో సారి అంతరిక్ష కేంద్రానికి వెళ్లిన ఆమె 127 రోజులు అక్కడే ఉన్నారు. అత్యధిక సమయం స్పేస్ వాక్ చేసిన మహిళా వ్యోమగామిగా సునీత ఘనత వహించారు. ఆమె తన కెరీర్‌లో అంతరిక్షంలో 62 గంటల పాటు స్పేస్ వాక్ చేశారు. ఎక్కువ సేపు స్పేస్ వాక్ చేసిన వారిలో మొత్తంగా సునీత విలియమ్స్ నాలుగో స్థానంలో ఉన్నారు. అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రంలో మారథన్ రన్ చేసిన తొలి వ్యక్తిగానూ ఆమె రికార్డు సృష్టించారు. 2007లో ఐఎస్ఎస్‌లో ఆమె ట్రెడ్‌మిల్‌పై మారథన్ రన్ చేశారు. అమెరికా సైన్యానికి సంబంధించి



నాలుగు అవార్డులు పొందిన ఆమె అంతరిక్షంలో విశేష సేవలు అందినందుకు గాను నాసా స్పేస్‌ఫ్లైట్ మెడల్‌ను సైతం అందుకున్నారు. 2008లో పద్మభూషణ్ పురాస్కారంతో ఆమెను భారత ప్రభుత్వం సత్కరించింది. అమెరికా హెలికాప్టర్ అసోసియేషన్, సొసైటీ ఆఫ్ ఎక్స్‌పెర్‌మెంట్ టెస్ట్ పైలెట్‌తో సహా ఇతర సంస్థల్లో ఆమె సభ్యురాలిగా ఉన్నారు. సునీత 20 ఏండ్ల కిందట ఫెడరల్ మార్షల్ మైఖేల్ విలియమ్స్‌ను వివాహం చేసుకున్నారు. కెరీర్ తొలినాళ్లలో వీరిద్దరూ హెలికాప్టర్ పైలెట్లుగా పని చేశారు. ప్రస్తుతం ఆయన ఒక పోలీస్ అధికారిగా పనిచేస్తున్నారు. టెక్సాస్‌లోని హూస్టన్‌లో ప్రస్తుతం వీరు నివాసం ఉంటున్నారు. పిల్లలు లేని ఈ జంట 2012లో అహ్మదాబాద్‌కు చిందిన ఓ బాలికను దత్తత తీసుకుంటున్నట్టు ప్రకటించారు. సునీత ఇప్పటి వరకు 30 వేర్వేరు రకాల విమానాలపై 2700 గంటలకు పైగా విమానయానం చేశారు.

భారత్ పర్యటన


తొలి అంతరిక్ష యానం పూర్తి కాగానే సునీత భారత్‌ను సందర్శించారు. 2007 సెప్టెంబర్‌లో ఆమె గుజరాత్‌లోని సబర్మతీ ఆశ్రమంతో పాటు స్వగ్రామాన్ని కూడా సందర్శించారు. అప్పుడే ఆమె తన గ్రామంలో పాఠశాలకు విరాళం అందించారు. తర్వాత 2013లో రెండవ అంతరిక్షయానం పూర్తి చేసిన తర్వాత మరోసారి భారత్‌కు వచ్చారు. మూడో సారి కూడా అంతరిక్షయానం విజయవంతంగా పూర్తి చేసుకున్న ఆమె మరోసారి భారత్‌ను సందర్శిస్తారనే చర్చ జరుగుతోంది. మూడోసారి తన అంతరిక్ష యాత్రలో సునీత భూమి చుట్టూ 4 వేల 576 సార్లు తిరిగారు. అంటే అంతరిక్షంలో 19 కోట్ల 52 లక్షల కిలోమీటర్ల దూరం ప్రయాణం చేశారు.

జెండర్ న్యూట్రల్...

స్పేస్ ట్రావెల్ టాస్క్ గతంలో పురుషులకే పరిమితమై దాన్ని 'మ్యాన్ మిషన్'గా వ్యవహరించేవారు. కానీ ఆస్ట్రనాట్స్‌కిచ్చే ట్రైనింగ్‌లో ఆడ, మగ అనే తేడా ఉండదు. ఇద్దరూ ఒకేరకమైన శక్తితో ఉంటారు. ఇంకా చెప్పాలంటే శారీరకంగా, మానసికంగా పురుషుల కన్నా స్త్రీలే బెటర్. అందుకే ఇప్పుడు దాన్ని 'హ్యూమన్ మిషన్' పేరుతో జెండర్ న్యూట్రల్ చేశారు. మానసికంగా, శారీరకంగా స్ట్రాంగ్‌గా ఉన్న వాళ్లనే స్పేస్‌కి సెలెక్ట్ చేసుకుంటారు. టెక్నికల్ ప్రాబ్లమ్స్ దగ్గర నుంచి అక్కడ పరిస్థితి, అనుకోని అవాంతరాలను ఎదుర్కోవడం వరకు ట్రైనింగ్ చాలా టఫ్‌గా ఉంటుంది. అటువంటి కఠినమైన శిక్షణనే సునీతా విలియమ్స్ పూర్తి చేశారు.

ఆమె పర్‌ఫెక్ట్...

ఆస్ట్రనాట్ సేఫ్టీ అనేది చాలా ముఖ్యం. అందుకే ఒకవేళ మిషన్ ఫెయిలైతే స్పేస్ షిప్ నుంచి ఎలా తప్పించుకోవాలో కూడా శిక్షణ ఇస్తారు. ఇదీ వాళ్ల మానసిక, శారీరక దారుఢ్యం మీదే ఆధారపడి ఉంటుంది. వీటన్నిటిలో సునీతా విలియమ్స్ పర్‌ఫెక్ట్. కాబట్టే స్పేస్ స్టేషన్‌కి వెళ్లారు. అయితే ఎనిమిది రోజులు మాత్రమే ఉంటామనే మైండ్‌సెట్‌తో వెళ్లిన వాళ్లు తొమ్మిది నెలలు అక్కడే ఉండిపోవాల్సి వచ్చింది. అలా స్పేస్ స్టేషన్‌లో చిక్కుకుపోయిన విలియమ్స్, మరో ఆస్ట్రోనాట్‌ను నాసా వాళ్లు ఎప్పటికప్పుడు మానిటరింగ్ చేస్తూ వచ్చారు. ఆహారం దగ్గర నుంచి వాళ్ల అవసరాలన్నీ కనిపెట్టుకున్నారు. ఫిజికల్ ఫిట్‌నెస్‌కి సంబంధించిన ఇన్‌స్ట్రక్షన్స్ ఇచ్చారు. వాళ్లక్కడ క్రమం తప్పకుండా ఎక్సర్‌సైజెస్ చేశారు. వాళ్లు తమ హెల్త్ కండిషన్స్‌ను చెక్ చేసుకునేందుకు కావల్సిన స్పేస్ స్టేషన్‌లో ఉన్నాయి. మూడు నెలలకోసారి ఫుడ్, మెడిసెన్స్‌ను స్పేస్ స్టేషన్‌కి పంపారు. వాళ్ల మానసిక స్థితిని కూడా ఎప్పటికప్పుడు అంచనా వేస్తూ మనోధైర్యం కోల్పోకుండా చూసుకున్నారు. చివరకు నలుగురు వ్యోమగాములను భూమిపైకి తీసుకొచ్చింది క్రూ డ్రాగన్ వ్యోమనౌక. అంతరిక్షం నుండి 17 గంటలు ప్రయాణం చేసిన తర్వాత అది ఫ్లోరిడా తీరంలో సముద్ర జలాల్లో ప్రశాంతంగా దిగింది. అలా సునీత విలియమ్స్ భూమికి చేరుకున్నారు. ■





ఆరు గ్యారంటీలు గోవిందా..

(మొదటిపేజీ తరువాయి)

ప్రకటించిన మహా లక్ష్మి ఏమైందని ప్రశ్నించారు. ఆటో డ్రైవర్లు అవస్థలు పడుతుంటే.. వారికి ఉపశమనం కల్పించే లా మాట్లాడలేదని ఆవేదన వ్యక్తం చేశారు. స్విగ్గి, జుమాటో వర్కర్లకు వర్కర్స్ బోర్డు అని చెప్పి మరిచిపోయారన్నారు. ఆడ బిడ్డలకు తీరని అన్యాయం చేశారని విమర్శించారు. 500 రోజులు పూర్తయినా కూడా రూ.2500 ఇవ్వలేదని చెప్పారు. యాదవులకు గొర్రెలు అని చెప్పి పట్టించుకోలేదని తెలిపారు. గౌడలకు మద్యం దుకాణాల్లో ప్రత్యేక వాటా అని చెప్పి మోసం చేశారని విమర్శించారు. అశోక్ నగర్‌లో చాయి తాగుతూ 2 లక్షల ఉద్యోగాలు ఇస్తామని రాహుల్ గాంధీ ఫోజులు కొట్టారనీ, ఆయన ఇస్తానన్న ఉద్యోగాల భర్తీ ఎక్కడని ప్రశ్నించారు. విద్యా భరోసా లేదన్నారు. గురుకులాల్లో విద్యార్థులు చనిపోతుంటే పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. పేక మెడల్లగా తెలంగాణ ఆర్థిక వ్యవస్థను చిన్నా భిన్నం చేస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. తెలంగాణ కు కాంగ్రెస్ వైరస్ సోకిందని చెప్పారు. ఇది డిల్లీకి మూటలు పంపే బడ్జెట్‌గా ఉందని ఎద్దేవా చేశారు. ఏ ఒక్క ఊరిలో 100 శాతం రుణ మాఫీ జరిగినట్టు చూపించినా మా ఎమ్మెల్యేలమంతా రాజీనామా చేస్తామని సవాల్ విసిరారు. రేవంత్ రెడ్డి అసమర్థత వల్ల ఆర్థిక వ్యవస్థ పడిపోతుందని ఆవేదన వ్యక్తం చేశారు. రూ.లక్షా 60 వేల కోట్లు అప్పు చేసి ఒక్క ప్రాజెక్టు కూడా మొదలు పెట్టలేదన్నారు. తొండ ముదిరితే ఊసరవెల్లి అయినట్టు ఊసరెల్లి ముదిరితే రేవంత్ రెడ్డి అవుతాడని చెప్పారు. కార్యకర్తలకు రూ.6 వేల కోట్ల పంచి పెడతాం అంటే అది యువ వికాసం కాదు.. డిల్లీ వికాసం అవుతుందన్నారు. రాష్ట్రంలో ఎవరు ఆనందంగా ఉన్నారని అందాల పోటీలు పెడుతున్నారా? అని ప్రశ్నించారు.

చేదు, తీపి కలగలిసిన బడ్జెట్

(మొదటిపేజీ తరువాయి)

చేయటం ఈ బడ్జెట్‌తో సాధ్యం కాదన్నారు. వాటిని అమలు చేయాలంటే సుమారు రూ.ఐదు లక్షల కోట్ల బడ్జెట్ కావాలని చెప్పారు. ఉన్న దానిలో అధిక అంచనాతో బడ్జెట్ పెట్టకుండా, వాస్తవికంగా ఈ బడ్జెట్ పెట్టారని తెలిపారు. నీటి పారుదల శాఖకు బడ్జెట్ పెద్దగా పెంచలేదన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టు రిపేరుకు వేల కోట్ల రూపాయలు కావాలన్నారు. యంగ్ ఇండియా స్కూళ్లకు నాలుగేండ్లకు కలిపి పెట్టారా లేదా అనేది చూడాలన్నారు. విద్యా రంగానికి 7.5శాతం కేటాయించారనీ, విద్యా, వైద్య రంగానికి నిధులు పెంచాలనేది మేధావుల అభిప్రాయమని చెప్పారు. అభివృద్ధి చెందిన దేశాల్లో వీటికి బడ్జెట్ కేటాయింపులు భారీగా ఉంటాయని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం నుండి రావలసిన వాటా కోసం కొట్లాడాలన్నారు. ఖర్చు లేకుండా ఆదాయ మార్గాలు ప్రభుత్వం చూసుకోవాలని సూచించారు. కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల ప్రస్తావన బడ్జెట్‌లో చెప్పలేదన్నారు. ప్రతి వర్గానికి పని భద్రత బడ్జెట్‌లో లేదన్నారు. చేదు, తీపి కలగలిసిన బడ్జెట్ ఇదనీ, ఉగాది పచ్చడిలా ఉందని తెలిపారు.

ఐఏఎస్ స్మితా సబర్వాల్‌కు నోటీసులు ?

నవతెలంగాణ- రాజేంద్రనగర్

తెలంగాణ పర్యాటక శాఖ కార్యదర్శి స్మితా సబర్వాల్‌కు నోటీసులు జారీ చేసేందుకు ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ యూనివర్సిటీ రంగం సిద్ధం చేసినట్టు తెలుస్తోంది. ఇన్నోవా వాహనం అద్దె కింద తీసుకున్న నిధులు తిరిగి యూనివర్సిటీకి చెల్లించాలంటూ ఆ నోటీసుల్లో పేర్కొననున్నట్టు తెలుస్తోంది. గతంలో సీఎంవోలో అదనపు కార్యదర్శి హోదాలో ఉన్న స్మితా సబర్వాల్ లేఖ మేరకు 2016 అక్టోబర్ నుంచి 2024 మార్చి వరకు నెలకు రూ. 63 వేల చొప్పున రూ. 61 లక్షలు అద్దె రూపంలో యూనివర్సిటీ నుంచి తీసుకున్నట్టు ఇటీవల ఆడిట్‌లో తెలింది. నిబంధనలకు విరుద్ధంగా వాహనం అద్దె పేరిట 90 నెలులు తీసుకోవడాన్ని ఆడిట్ శాఖ తీవ్రంగా అభ్యంతరం వ్యక్తం చేసింది. స్మితా సబర్వాల్ అద్దెకు తీసుకున్న టీఎస్ 08 ఈసీ 6345 వాహనం నాన్ టాక్స్ కాదు, ఎల్లో వాహనం కాదని, ప్రయివేటు, వ్యక్తిగత వాహనం పవన్ కుమార్ పేరిట ఉన్నట్టు ఆడిట్ విచారణలో వెల్లడైంది. సీఎంవో స్మితా సబర్వాల్ కార్యాలయం నుంచి ప్రతినెలా వాహనం అద్దె రశీదులు రావడంతో యూనివర్సిటీ యాజమాన్యం డబ్బులు చెల్లించినట్టు తేల్చింది. ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ యూనివర్సిటీ పనితీరుపై ఇటీవల ఏజీ జరిపిన విచారణలో కొన్ని తీవ్రమైన అవకతవకలు ఉన్నట్టు వెల్లడయ్యాయి. అందులో ఈ అంశం సైతం ఉంది. ఈ విషయంపై వివరణ కోరగా.. స్మితా సబర్వాల్ వాహనం అద్దెపై ఆడిట్ అభ్యంతరం నిజమేనని ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం ఉపకులపతి ఆచార్య అల్దాస్ జానయ్య అన్నారు.

సుదీర్ఘ నిరీక్షణకు తెర

(మొదటిపేజీ తరువాయి)

సూర్యోదయం అయ్యేది. మొత్తంమీద వారు 4,500 సార్లు భూమి చుట్టూ తిరిగారు. 121 మిలియన్ల స్టాట్యూట్ మైళ్లు ప్రయాణించారు.

భూమికి బయలుదేరే ముందు స్పేస్ స్టేషన్‌లోని వ్యోమగాములందరూ ఫొటోలు తీసుకుంటూ సందడి చేశారు. భారత కాలమానం ప్రకారం మంగళవారం ఉదయం 8.15 గంటలకు హ్యాచ్ మూసివేశారు. 10.15 గంటలకు అన్‌డాకింగ్ మొదలైంది. ఆ తర్వాత క్రూ డ్రాగాన్ వ్యోమనౌక అంతరిక్ష కేంద్రం నుండి విడిపోయింది. భూ వాతావరణంలోకి ప్రవేశించడానికి వీలుగా బుధవారం తెల్లవారు జామున 2.41 గంటలకు ఇంజన్ల ప్రజ్వలన చేపట్టారు. ఆ తర్వాత 40 నిమిషాలకు అంటే తెల్లవారుజామున 3.27 గంటలకు క్యాప్సుల్ ఫ్లోరిడా తీరంలోని సముద్ర జలాలలో దిగింది. సునీత, విల్మోర్‌తో పాటు వ్యోమగామి నిక్ హేగ్, కాస్మొనాట్ అలెగ్జాండర్ గోర్బునోవ్ కూడా క్యాప్సుల్‌లో భూమికి చేరుకున్నారు. వ్యోమనౌక చివరి దశ ప్రయాణం చాలా క్లిష్టమైనది. ఎందుకంటే భూ వాతావరణంలో ప్రవేశించే వ్యోమనౌక 1600 సెంటీగ్రేడ్ల ఉష్ణోగ్రత వరకూ తట్టుకుంటుంది. వేగాన్ని క్రమేపీ తగ్గించుకునేటప్పుడు వ్యోమగాములు గురుత్వాకర్షణ శక్తిని ఎదుర్కోవాల్సి వస్తుంది. ఇది భూ గురుత్వాకర్షణ శక్తి కంటే నాలుగింతలు ఎక్కువగా ఉంటుంది. చివరికి నాలుగు అతి పెద్ద పారాచూట్లను తెరచుకొని వ్యోమనౌక నెమ్మదిగా సముద్రంలో దిగింది. అదే సమయంలో ఫ్లోరిడా జలాలపై ఈదుతున్న డాల్ఫిన్లు వ్యోమగాములకు స్వాగతం పలకడం అందరినీ ఆశ్చర్యపరచింది. కాగా సునీతా విలియమ్స్, బచ్ విల్మోర్‌లు కోలుకున్న తర్వాత శ్వేతసౌధానికి వస్తారని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రకటించారు.

ఆరోగ్య సమస్యలు తప్పవా?

భూమికి తిరిగి వచ్చిన వ్యోమగాములకు హూస్టన్‌లోని అంతరిక్ష కేంద్రంలో వైద్య పరీక్షలు నిర్వహించారు. ఎందుకంటే సుదీర్ఘ కాలం పాటు అంతరిక్షంలో గడపడంతో వారు అనేక ఆరోగ్య సమస్యలు ఎదుర్కోవాల్సి వస్తుంది. అంతరిక్షంలో గురుత్వాకర్షణ శక్తి ఉండదు. కాబట్టి కండరాల ద్రవ్యరాశి, ఎముకల సాంద్రత తగ్గిపోతాయి. దీంతో ఎముకలు పెళుసుగా మారి విరిగే ప్రమాదం ఉంటుంది. కండరాలు కూడా బలహీనపడతాయి. వెన్ను నెప్పి వంటి సమస్యలు కూడా రావచ్చు.

చెక్కు చెదరని విశ్వాసానికి ప్రతీక : మోడీ

అంతరిక్షం నుంచి భూమికి సురక్షితంగా చేసిన నాసా వ్యోమగాములు చెక్కు చెదరని విశ్వాసానికి ప్రతీకలని ప్రధాని నరేంద్ర మోడీ ప్రశంసించారు. అనేక ప్రతికూల పరిస్థితులు ఎదురైనప్పటికీ అచంచలమైన సంకల్పంతో మానవాళికి స్ఫూర్తినిచ్చారని కొనియాడారు. మానవ శక్తికి ఉన్న పరిమితులను అధిగమించి, కన్న కలలకు వాస్తవ రూపం ఇవ్వడమే అంతరిక్షంలో అన్వేషణకు అర్థమని చెప్పారు. భారత సంతతికి చెందిన సునీతా విలియమ్స్ కెరీర్ మొత్తం అత్యంత స్ఫూర్తి దాయకంగా సాగిందని తెలిపారు. రాష్ట్రపతి ద్రౌపది ముర్ము, పలువురు కేంద్ర మంత్రులు, రాష్ట్రాల గవర్నర్లు, ముఖ్యమంత్రులు, వివిధ రాజకీయ పార్టీలకు చెందిన నేతలు కూడా సునీతను అభినందించారు.

సురక్షితంగా భూమికి చేరుకున్న నాసా వ్యోమగామి సునీతా విలియమ్స్‌ను అభినందిస్తూ సందేశాలు వెల్లువెత్తున్నాయి. సునీతను కేరళ, హర్యానా శాసనసభలు అభినందించాయి. కలలకు పరిమితులు ఉండవని కేరళ స్పీకర్ షంషీర్ వ్యాఖ్యానించారు. సునీత సురక్షితంగా భూమికి చేరడంతో 140 కోట్ల భారతీయులు ఊపిరి పీల్చుకున్నారని కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే అన్నారు. వివిధ రాష్ట్రాల ముఖ్యమంత్రులు కూడా సునీతను అభినందిస్తూ సందేశాలు పంపారు. 'మీ అనుభవాలు అంతరిక్ష అన్వేషణలో ఉపయోగపడాలని కోరుకుంటున్నాం' అని ఇస్రో తెలిపింది. సునీతకు భారతరత్న ఇవ్వాలని పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ కోరారు.

రైల్వే భద్రత, నియామకాల్లో కేంద్రం నిర్లక్ష్యం

నవతెలంగాణ-న్యూఢిల్లీ బ్యూరో

రైల్వే భద్రత, నియామకాల్లో కేంద్ర ప్రభుత్వం తీవ్ర నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని సీపీఐ(ఎం) ఎంపీ ఎఎ రహీమ్ విమర్శించారు. రైల్వే మంత్రిత్వ శాఖ పనితీరుపై బుధవారం రాజ్యసభలో జరిగిన చర్చలో ఆయన మాట్లాడారు. రైల్వేల్లో తగినంత నియామకాలు లేకపోవడానికి, రైల్వే భద్రతకు మధ్య దగ్గరి సంబంధం ఉందన్నారు. మొత్తం లోకో పైలట్ పోస్టుల సంఖ్య 1,37,000 ఉండగా ప్రస్తుతం 20,000కి పైగా పోస్టులు ఖాళీగా ఉన్నాయని అన్నారు. దీని కారణంగా లోకో పైలట్ల పని గంటలు పెరిగి, భారం పెరుగుతుందన్నారు. వారికి వారంలో సెలవు కూడా ఉండటం లేదని, ఈ అమానవీయ పని గంటలు ఇండియన్ రైల్వేల భద్రతను ప్రభావితం చేస్తున్నాయని పేర్కొన్నారు. లోకో పైలట్ల పని గంటలను 9 గంటలకు తగ్గించాలని రైల్వే హై పవర్ కమిటీ సిఫార్సు చేసిందని, కానీ అమలు కాకపోవడంతో వారు ఇబ్బందులకు గురవుతున్నారని విమర్శించారు. ఈ విషయంపై రైల్వే మంత్రిత్వ శాఖ మౌనం వహిస్తోందని దుయ్యబట్టారు. ఇండియన్ రైల్వే చరిత్రలో 2024 అక్టోబర్ 15 చీకటి రోజని, ఆ రోజున రైల్వేలలో ఖాళీగా ఉన్న పోస్టులకు కాంట్రాక్టు ప్రాతిపదికన పదవీ విరమణ చేసిన అధికారులను తిరిగి నియమించాలని ఆదేశించారని ఆయన తెలిపారు. రైల్వే సిగ్నలింగ్, లోకో పైలట్ వంటి పోస్టులకు ఇలాంటి చర్యలతో విస్తృతమైన పరిణామాలను కలిగిస్తాయని, అది భద్రతను ప్రతికూలంగా ప్రభావితం చేస్తుందని అన్నారు. ఆ ఉత్తర్వును వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. దేశంలోని లక్షలాది మంది యువత శాశ్వత ఉద్యోగం కోసం ఎదురు చూస్తున్నారని, ఈ నేపథ్యంలో రైల్వేలు తిరిగి నియామక ఉత్తర్వులు జారీ చేయాలని డిమాండ్ చేశారు. ట్రాక్‌మెన్, కీ మెన్ వంటి కార్మికుల పరిస్థితి చాలా దయనీయంగా ఉందని, 361 మంది రైల్వే కార్మికులు పట్టాలపై ప్రాణాలు కోల్పోయారని మంత్రి అంగీకరించారని గుర్తు చేశారు. కేంద్ర ప్రభుత్వం కనీస భద్రతా వ్యవస్థలను కూడా అందించలేకపోతోందని, రక్షక్ వంటి ఆధునిక భద్రతా వ్యవస్థలు ఇంకా అన్ని విభాగాలలో నిర్ధారించబడలేదని ఎంపీ ఎఎ రహీమ్ అన్నారు. కేరళలో రైలు ప్రయాణికుల బాధలు మాటల్లో చెప్పలేనివని, రద్దీగా ఉండే రైళ్లలో స్పృహ కోల్పోయి పడిపోతున్న ప్రయాణికుల సంఖ్య రోజురోజుకూ పెరుగుతోందని పేర్కొన్నారు. ప్రయాణికుల సంఖ్య పెరుగుతున్న కొద్దీ రైళ్ల సంఖ్యను లేదా కోచ్‌లను పెంచడానికి కేంద్ర ప్రభుత్వం సిద్ధపడటం లేదని విమర్శించారు. మరోవైపు ప్యాసింజర్ రైళ్లను ఎక్స్‌ప్రెస్ రైళ్లుగా మార్చి అధిక చార్జీలను డిమాండ్ చేస్తూ ప్రయాణికులను దోపిడీ చేస్తోందని ధ్వజమెత్తారు.

అర్హులకు రేషన్ కార్డులు అందడం లేదు

(మొదటిపేజీ తరువాయి)

ఆదాయం పెరుగుతుందని చెప్పే రాష్ట్రాలు కూడా బీపీఎల్ కుటుంబాలు ఎక్కువ ఉన్నాయని చెబుతాయని ధర్మాసనం పేర్కొంది. పేదలకు న్యాయం చేస్తున్నామని చెప్పుకునేందుకే రాష్ట్రాలు రేషన్ కార్డుల లెక్కలు చెబుతున్నాయని, వాస్తవానికి మాత్రం పేదలకు రేషన్ ఫలాలు అందడం లేదని సుప్రీం ధర్మాసనం వ్యాఖ్యానించింది. అనర్హులే ఎక్కువగా బీపీఎల్ ప్రయోజనాలు పొందుతున్నారని, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పేదల రేషన్‌పై ప్రత్యేక శ్రద్ధ చూపాల్సిన అవసరం ఉందని న్యాయస్థానం అభిప్రాయపడింది. కోవిడ్-19 మహమ్మారి సమయంలో వలస కార్మికులు ఎదుర్కొంటున్న ఇబ్బందుల నేపథ్యంలో నమోదైన సుమోటో కేసును బుధవారం సుప్రీం కోర్టు న్యాయమూర్తులు జస్టిస్ సూర్యకాంత్ , జస్టిస్ ఎన్. కోటీశ్వర్ సింగ్‌లతో కూడిన ధర్మాసనం విచారించింది. "ఇన్ని రేషన్ కార్డులు" జారీ చేశామని చెప్పుకునే రాష్ట్రాలు రేషన్ కార్డులను ప్రచారం కోసం ఉపయోగిస్తున్నాయని పేర్కొంది. రేషన్ వ్యవస్థతో అవసరమైన వారికి సబ్సిడీ తో కూడిన నిత్యావసర వస్తువులను సరఫరా చేస్తున్నట్లు అనేక రాష్ట్రాలు గొప్పలు చెప్పుకుంటున్నప్పటికీ, అటువంటి రేషన్ తరచుగా ఉద్దేశించిన లబ్దిదారులకు, దారిద్ర్యరేఖకు దిగువన (బీపీఎల్) కుటుంబాలకు చేరడం లేదని సుప్రీంకోర్టు పేర్కొంది. విచారణ సందర్భంగా సీనియర్ న్యాయవాది ప్రశాంత్ భూషణ్ వాదనలు వినిపిస్తూ అనేక మంది వలస కార్మికులు తమకు అర్హులైన రేషన్ ప్రయోజనాలను పొందలేకపోయారని తెలిపారు. దీనివల్ల రేషన్ సరఫరాలకు అర్హులు కాని ఇతరులు రేషన్ కార్డులను దుర్వినియోగం చేయడంపై ధర్మాసనం ఆందోళన వ్యక్తం చేసింది. "మా ఆందోళన ఏమిటంటే నిజమైన బీపీఎల్ కుటుంబాలకు ప్రయోజనాలు అర్హత లేని వారికి చేరుతున్నాయా? రేషన్ కార్డు ఇప్పుడు 'పాపులారిటీ కార్డ్'గా మారింది. రాష్ట్రాలు 'మేము చాలా జారీ చేసాం' అని అంటున్నాయి. కొన్ని రాష్ట్రాలు వారు తమ అభివృద్ధిని చూపించాలనుకున్నప్పుడు 'తలసరి ఆదాయం పెరుగుతోంది' అని చెబుతారు. అయితే బీపీఎల్ కుటుంబాల సమస్యను ఎలా పరిష్కరించవచ్చు? వివాదం అంతర్లీనంగా ఉంది. అది అర్హులైన వ్యక్తు లకు చేరేలా మనం నిర్ధారించుకోవాలి" అని జస్టిస్ సూర్యకాంత్ అన్నారు.

8 కోట్లకు పైగా వలస కార్మికులకు రేషన్ కార్డులు లేవు ప్రశాంత్ భూషణ్

కేంద్ర ప్రభుత్వ ఈశ్రమ్ పోర్టల్‌లో నమోదు చేసుకున్న దాదాపు 30 కోట్ల మంది వలస కార్మికులల, 8 కోట్లకు పైగా వలస కార్మికులకు రేషన్ కార్డులు లేవని న్యాయవాది ప్రశాంత్ భూషణ్ కోర్టుకు తెలిపారు. చాలా మంది పేదలు రేషన్ ప్రయోజనాల కోసం దరఖాస్తు చేసుకోవడం లేదని సూచించారని, ఎందుకంటే వారు దానిని ఎలాగైనా పొందుతారని ఆశించరని ఆయన అన్నారు. "పేదలు 'మనకు రేషన్ అందడం లేదు. కాబట్టి దాని కోసం ఎందుకు దరఖాస్తు చేసుకోవాలి?' అని అనుకుంటున్నారు. 80 శాతం జనాభా చాలా పేదవారు. వారందరికీ ఆహార భద్రత అవసరం" అని భూషణ్ అన్నారు. ఇది నిజమైన సమస్య అని, పేదలు అర్హులైన రేషన్ పొందేలా చర్యలు తీసుకోవాలని ధర్మాసనం పేర్కొంది. "రేషన్ కార్డుల జారీలో ఎటువ ంటి రాజకీయ అంశం ఉండకూడదని మేము ఆశిస్తున్నాం. నేను నా మూలాల ను కోల్పోలేదు. పేద ప్రజల దుస్థితిని నేను ఎల్లప్పుడూ తెలుసుకోవాలనుకుం టున్నాను. పేదరికంలో కొనసాగుతున్న కుటుంబాలు ఉన్నాయి" అని జస్టిస్ సూర్యకాంత్ అన్నారు.

అన్యాయంపై తిరుగుబాటు చేసిన ధీరవనిత మల్లు స్వరాజ్యం

(మొదటిపేజీ తరువాయి)

ప్రయత్నం చేస్తున్నారని చెప్పారు.

కేంద్రంలో కాంగ్రెస్, కమ్యూనిస్టులు, ఇతర భాగస్వామ్య పార్టీలతో కలిసి ఏర్పడిన యూపీఏ ప్రభుత్వ హయాంలోనే ఉపాధి హామీ చట్టం వచ్చిందని గుర్తు చేశారు. ఉపాధి హామీ చట్టంతో వలసలు ఆగిపోవడమే కాక.. కరోనా విజృంభణ సమయంలో పల్లెలకు తిరిగొచ్చిన వారికి ఆ చట్టమే అన్నం పెట్టిందన్నారు. పోడు భూములు, ఆహార భద్రత, సమాచార హక్కు చట్టాలన్నీ ఆ ప్రభుత్వంలోనే వచ్చాయని గుర్తుచేశారు. ముఖ్యమంత్రితో మాట్లాడి ట్యాంక్ బండ్‌పై మల్లు స్వరాజ్యం విగ్రహ ఏర్పాటు, ట్రస్ట్‌కు స్థలం కేటాయించేలా మాట్లాడుతానని, ఆ పని జరిగేలా చూస్తానని హామీ ఇచ్చారు. మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి మాట్లాడుతూ.. మల్లు స్వరాజ్యం ఎన్నో త్యాగాలు చేశారని, ఆమె స్ఫూర్తిని తీసుకొని పోరాటాలు చేయాలన్నారు. సినీ నిర్మాత తమ్మారెడ్డి భరద్వాజ మాట్లాడుతూ.. నేటి యువత అమ్మను ఆదర్శంగా తీసుకుని మహిళల హక్కుల కోసం ప్రశ్నించాలన్నారు. దొరలకు వ్యతిరేకంగా అమ్మ అటువంటి పోరాటాలు చేశారని.. ఆ పోరాట స్ఫూర్తిని యువత కొనసాగించాలని సూచించారు. ఐద్వా సీనియర్ నాయకురాలు టి.జ్యోతి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మల్లు లక్ష్మి మాట్లాడుతూ.. కూలి ఉద్యమంతో ప్రారంభమైన స్వరాజ్యం విప్లవ జీవితం 8 శతాబ్దాలపాటు అనేక ఒడిదుడుకులు వచ్చినా ఏనాడూ వెనుతిరగలేని దీశాలి అన్నారు. సాయుధ రైతాంగ పోరాటంలో ఆమె ముఖ్య భూమిక పోషించారన్నారు. నేటికీ దోపిడీ, పీడన పోలేదని, మహిళలపై హింస, లైంగికదాడులు జరుగుతున్నాయని, వీటికి వ్యతిరేకంగా ఉద్యమించాలని పిలుపునిచ్చారు. పీవోడబ్ల్యూ జాతీయాధ్యక్షులు సంధ్య మాట్లాడుతూ.. రమీజాబి లైంగికదాడి కేసు విషయంలో మహా ఉద్యమం జరగ్గా.. అప్పుడు ఎమ్మెల్యేగా ఉన్న మల్లు స్వరాజ్యం అసెంబ్లీలో దద్దరిల్లేలా మాట్లాడారని చెప్పారు. ఎక్కడ సమస్య ఉంటే అక్కడ తన పాటలతో స్వరాజ్యం ప్రజలని చైతన్యం చేస్తూ.. అప్పటికప్పుడే పాట కట్టి జనాన్ని మేల్కొలిపే వారన్నారు. ప్రజాగాయకులు విమలక్క మాట్లాడుతూ.. మల్లు స్వరాజ్యం, మంత్రి సీతక్క సమసమాజ స్థాపన కోసం, తెలంగాణ విముక్తి కోసం పోరాటం చేశారన్నారు.

ఆ పోరాటాల్లో ఎందరో అసువులు బాసారని, వారందరి పోరాట స్ఫూర్తిని ఆదర్శంగా తీసుకోని వారి ఆశయాల కోసం పోరాడాలన్నారు. కార్యక్రమంలో ఎన్ఎఫ్ఐడబ్ల్యూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జ్యోతి, పీవోడబ్ల్యూ రాష్ట్ర అధ్యక్షులు అనసూయ, డి.స్వరూప, ఐద్వా రాష్ట్ర ఉపాధ్యక్షులు బత్తుల హైమావతి, కె.ఎస్.ఆశాలత, మద్దిల వినోద, కె.శశికళ, వరలక్ష్మి, రాష్ట్ర కమిటీ సభ్యులు స్వరూప, సృజన, పద్మ, లక్ష్మి, లక్ష్మమ్మ, షబానా, సుమలత, విజయలక్ష్మి, మంగ పాల్గొన్నారు.



న్యాయమైన నీటి వాటాలే లక్ష్యం

ట్రిబ్యునళ్లల్లో వాదనలు | ఎ, బి కేటగిరీలుగా పెండింగ్ ప్రాజెక్టులు | సాగునీటికి రూ.23,373 కోట్లు

నవతెలంగాణ ప్రత్యేక ప్రతినిధి-హైదరాబాద్

కృష్ణా, గోదావరి జలాల కేటాయింపుల్లో తెలంగాణకు రావాల్సిన న్యాయమైన వాటా కోసం ప్రయత్నాలు చేస్తున్నట్టుగా బడ్జెట్ ప్రసంగంలో సర్కారు ప్రకటించింది. గత ప్రభుత్వం ఈ తరహా చర్యలు తీసుకోలేదని విమర్శించింది. కృష్ణా జలాల్లోని 811 టీఎంసీల్లో, 511 టీఎంసీలు ఎపీకి వాడుకోవచ్చని గత పాలకులు అధికారికంగా చెప్పడంతో తెలంగాణ రైతాంగానికి తీవ్ర అన్యాయం జరిగినట్టు పేర్కొన్నది. తెలంగాణకు రావాల్సిన వాటా కోసం బ్రిజేష్‌కుమార్ ట్రిబ్యునల్ ముందు బలమైన వాదనలు వినిపించినట్టు చెప్పింది. దిగువ రాష్ట్రమైన ఏపీ తక్కువ కేటాయింపుతో ఎక్కువ నీటిని వినియోగిస్తున్న సంగతి తెలిసిందే. ఈ విషయాన్ని ట్రిబ్యునల్ ముందుంచి ఇరు రాష్ట్రాల నీటి వినియోగాన్ని కచ్చితంగా గుర్తించడానికి టెలిమెట్రీ వ్యవస్థ ఏర్పాటు చేయాలని కోరినట్టు ప్రభుత్వం ప్రకటించింది. రాష్ట్రంలోని పెండింగ్ ప్రాజెక్టులన్నింటినీ పూర్తి చేసేందుకు ఏ, బీ కేటగిరీలుగా విభజించింది. తక్కువ ఖర్చుతో ఎక్కువ ఆయకట్టును సేద్యంలోకి తీసుకురావాలన్నది ప్రభుత్వ ఉద్దేశం. నల్లగొండ, యాదాద్రి-భువనగిరి జిల్లాల్లోని కరువు ప్రభావిత ప్రాంతాలకు నీటిని అందించడానికి వీలుగా ఉదయ సముద్రం, బ్రాహ్మణ వెల్లంల ఎత్తిపోత పథకాలను ప్రారంభించింది. మూసీ ప్రాజెక్టు పరిధిలోని బునాదిగాని కాలువ పునరుద్ధరణ పనులకు రూ.266.65 కోట్లకు పరిపాలనా పరమైన అనుమతులు ఇచ్చింది. అలాగే పిల్లాయపల్లి, ధర్మారెడ్డిపల్లి కాలువల పునరుద్ధరణకు ఈ నిధులు ఖర్చు చేయాలని నిర్ణయించింది. 2025-26 సంవత్సరానికి నీటిపారుదల శాఖకు రూ. 23,373 కోట్లు ప్రతిపాదించింది.



ప్రస్తుత పరిస్థితి ఎలా ఉంది ?

రాష్ట్రంలో నిర్మాణంలో ఉన్న ప్రాజెక్టుల అవసరాలకు భారీగా నిధులు కావాల్సి ఉంటుంది. రాష్ట్రంలోని ప్రాజెక్టులన్నీ పూర్తి కావాలంటే సుమారు రూ. లక్ష కోట్లు' అవసరమని సాగునీటిరంగ నిపుణులు చెబుతున్నారు. కానీ ప్రభుత్వాల అవసరాలు మాత్రం మరోరకంగా ఉంటున్నాయి. ప్రతిష్టాత్మకంగా గత సర్కారు చేపట్టిన కాళేశ్వరం ప్రాజెక్టు పూర్తి కావాలంటే ఇంకా రూ. 22 వేల కోట్లు కావాలి. తాజా బడ్జెట్‌లో కేటాయించిన నిధులు సరిపోవనే వ్యాఖ్యానాలు వినిపిస్తున్నాయి.

కేటాయింపులు రూ.23,373 కోట్లు మాత్రమే

2025-26 ఆర్థిక సంవత్సరానికి సాగునీటి శాఖ రూ.38,648 కోట్లను ప్రతిపాదనల కింద సర్కారుకు పంపింది. కేటాయించింది మాత్రం రూ.23,373 కోట్లు మాత్రమే. గత ఏడాది రూ.22,301 కోట్లు ప్రతిపాదించారు. ఇందులో సగమే ఖర్చుచేసినట్టు ప్రజాసంఘాలు చెబుతున్నాయి. ప్రాజెక్టుల నిర్మాణంలో భూసేకరణ చాలా కీలకమైన అంశం. అన్ని ప్రాజెక్టులకుగాను 10 నుంచి 15 వేల ఎకరాల భూమిని సేకరించాల్సి ఉంది. దీనికోసం రూ. 20 నుంచి 25 వేల కోట్లు కావాల్సి ఉంటుందని సమాచారం.

సాగునీటిరంగ కేటాయింపులు (రూ.కోట్లల్లో)

ప్రాజెక్టులు	2022-23	2023-24	2024-25	2025-26
భారీ, మధ్యతరహా	18,622.04	29,438.52	21,081.82	22,019.97
చిన్న తరహా	708.87	308.17	892.32	1,019.10
సీఏడీ	16.22	18.67	28.59	35.88
వరద నష్టం నివారణ	2.11	1.67	282.24	280.00
మొత్తం	19,349.24	29,766.00	22,284.96	23,354.95

కేటాయింపులు

- ఇరిగేషన్ మొత్తం బడ్జెట్ రూ.23,373 కోట్లు
- గత ఏడాది బడ్జెట్ రూ.22,301 కోట్లు
- కాళేశ్వరం లోన్లు రూ.6914.54 కోట్లు
- తెలంగాణ వాటర్ రీసోర్సెస్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ లిమిటెడ్ రుణాలు రూ.2962.47 కోట్లు
- ప్రగతి పద్దు కింద రూ.11828.84 కోట్లు కేటాయింపు.. నిర్వహణ పద్దు కింద రూ.11,544 కోట్లు
- డిండి లిఫ్ట్‌కు రూ.1599.90 కోట్లు
- ఎస్ఎల్‌బీసీకి రూ.899.90 కోట్లు
- నాగార్జునసాగర్ ప్రాజెక్టుకు రూ.297.95 కోట్లు
- ప్రాణహిత చేవెళ్లకు రూ.32.27 కోట్లు
- కాళేశ్వరం బ్యాక్ వాటర్ రక్షణ గోడ మంచిర్యాలకు రూ.100 కోట్లు
- కల్వకుర్తి లిఫ్ట్ స్కీమ్ రూ.800 కోట్లు
- పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్టుకు రూ.1714 కోట్లు
- సీతారామలిఫ్ట్ కు రూ.643.04 కోట్లు
- సీతమ్మసాగర్ ప్రాజెక్ట్ రూ.56.31 కోట్లు
- కాళేశ్వరం ప్రాజెక్టుకు రూ.2685 కోట్లు

నీటిపారుదలకు పెద్దపీట

బడ్జెట్‌లో నీటిపారుదల రంగానికి అధికంగా నిధులు కేటాయించాం. రైతులపై మక్కువతోనే నిధులు ఎక్కువిచ్చాం. కృష్ణాగోదావరి నదుల నీటివాటాను తెలంగాణకు కచ్చితంగా సాధిస్తాం. రాష్ట్ర హక్కులను కాపాడుకుంటాం.

– మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి

సాదాసీదా బడ్జెట్

విద్యారంగంలో మౌలిక మార్పు వచ్చేలా కేటాయింపుల్లేవ్

- సర్కారు బడుల్లో ప్రీప్రైమరీ తరగతులు ప్రారంభించాలి : మండలి మీడియా పాయింట్‌లో ఎమ్మెల్సీ నర్సిరెడ్డి

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్



రాష్ట్రంలో గత బడ్జెట్‌ల తరహాలోనే 2025-26 బడ్జెట్ కూడా సాదాసీదాగా ఉందని ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి అన్నారు. విద్యారంగంలో మౌలిక మార్పు వచ్చేలా అనుకూల అంశాల్లేవనీ, అందుకోసం తగిన కేటాయింపుల్లే వని చెప్పారు. బుధవారం శాసనమండలి మీడియా పాయింట్‌లో ఆయన మాట్లాడుతూ ఆరేండ్లుగా బడ్జెట్ ప్రసంగాలు వింటు న్నాననీ, ప్రసంగ పదాలు, వాక్యాలు ఎవరో ఒక్కరే రాసినట్టుగా ఉందని వివరించారు. సమ్మిళిత అభివృద్ధి, సామాజిక సంక్షేమం, అందరికీ సంక్షేమ ఫలాలు అందించడం వంటి పదాలున్నాయని అన్నారు. అప్పుల రాష్ట్రంగా కూరుకుపోయిందంటూ సీఎం రేవంత్‌రెడ్డి ఇటీవల చెప్తున్నట్టుగానే బడ్జెట్ ఉందన్నారు. విద్యారంగ అభివృద్ధికి ప్రత్యేకంగా కేటాయింపుల్లేవని చెప్పారు. 7.57 శాతం నిధులను కేటాయించిందని వివరించారు. రాష్ట్రంలో పాఠశాల విద్యారంగం ధ్వంసమైందన్నారు. దాన్ని ఎలా పునరుద్ధరిస్తారో ఎక్కడా చెప్పలేదని అన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో ప్రీప్రైమరీ తరగతులను ప్రవేశపెడితే ప్రాథమిక విద్య నిలబడుతుందని సూచించారు. ప్రీప్రైమరీ తరగతులను ప్రారంభించాలని ప్రభుత్వాన్ని ఆయన డిమాండ్ చేశారు. ఉద్యోగులు, ఉపాధ్యాయులకు సంబంధించి ఈ-కుబేర్‌లో పెండింగ్ బకాయిలున్నాయని చెప్పారు. వాటిని ఎప్పుడు, ఎంత కాలంలో చెల్లిస్తారో స్పష్టత ఇవ్వాలని కోరారు. డీఏలు పెండింగ్‌లో ఉన్నాయనీ, పీఆర్సీని అమలు చేయాలని అన్నారు. బడ్జెట్ ప్రసంగంలో వాటి ప్రస్తావన ఎక్కడా లేదన్నారు. ప్రభుత్వ సమాధానంలో వాటి గురించి చెప్పాలని కోరారు.

కార్మిక, ఉద్యోగులకు

బడ్జెట్‌లో ఊరటేది? :సీఐటీయూ

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్



గతేడాదితో పోలిస్తే బడ్జెట్ మొత్తం రూ.13,806 కోట్లు పెంచినా కార్మికులు, ఉద్యోగుల వేతనాలు, సంక్షేమం గురించి ప్రస్తావన లేకపోవటాన్ని సీఐటీయూ రాష్ట్ర కమిటీ వ్యతిరేకించింది. బుధవారం ఈ మేరకు సీఐటీయూ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు చుక్కరాములు, పాలడుగు భాస్కర్ ఒక ప్రకటన విడుదల చేశారు. రాష్ట్రంలో శ్రామిక శక్తి 68.7 శాతం ఉందనీ, అందులో పారిశ్రామిక రంగంలో 22.5 శాతం, సర్వీసు రంగంలో 34.8 శాతం పని చేస్తుందని చెబుతూనే కార్మిక శాఖకు నామమాత్రంగా రూ.900 కోట్లు కేటాయించడ మేంటని ప్రశ్నించారు. 1.5 కోట్ల కార్మికులకు ఈ కేటాయింపులు ఏ మూలకూ సరిపోవని విమర్శించారు. అంగన్‌వాడీ, ఆశా, మధ్యాహ్న భోజనం, గ్రామ పంచాయతీ, మున్సిపల్, కాంట్రాక్ట్ - ఔట్‌సోర్సింగ్ తదితర శాఖల వేతనాల పెంపు గురించి గానీ, వారి ఉద్యోగాల రెగ్యులరైజేషన్ గురించిగానీ ఊసే లేదని వాపోయారు. ఉద్యోగ నియామకాలకు, ఉద్యోగ కల్పనకు ఎటువంటి విధానాన్ని చేపట్టబోతున్నారనే దానిపై ఎక్కడా చెప్పలేదని పేర్కొన్నారు. లక్షల సంఖ్యలో ఉన్న రాష్ట్ర ప్రభుత్వ కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్, టైంస్కేల్, డైలీవేజ్ తదితర ఉద్యోగుల రెగ్యులరైజేషన్ గురించిగానీ, ప్రభుత్వ ఉద్యోగులకు, పెన్షనర్లకు చెల్లించాల్సిన డీఏ బకాయిల గురించిగానీ, ఉద్యోగ, ఉపాధ్యాయ వర్గాలు ఎదురుచూస్తున్న రెండో పీఆర్సీ గురించిగానీ నామమాత్రంగా కూడా మాట్లాడలేదని విమర్శించారు. 73 షెడ్యూల్డ్ ఎంప్లాయిమెంట్ పరిధిలోకి వచ్చే లక్షలాది మంది పారిశ్రామిక, అసంఘటితరంగ కార్మికులు కనీస వేతనాల జీఓలు సవరించాలని, వేతనాలు పెంచాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నా పట్టించుకోకపోవటాన్ని తప్పుబట్టారు. కాంగ్రెస్ పార్టీ మేనిఫెస్టోలో కార్మికుల సంక్షేమం కోసం పెట్టిన అంశాలు ఈ బడ్జెట్‌లో లేవని ఎత్తిచూపారు. బీడీ కార్మికులకు చేయూత, జీవిత బీమా, ఈఎస్ఐ, అసంఘటితరంగ కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు, దీనికి బడ్జెట్‌లో కేటాయింపులు, ఆటో డ్రైవర్లు, క్యాబ్ డ్రైవర్లు, స్విగ్గి, జొమాటో కార్మికులకు సామాజిక భద్రత కల్పిస్తూ రాజస్థాన్ తరహా చట్టాన్ని తెస్తామన్న హామీలేమయ్యాయని నిలదీశారు. చిరు వ్యాపారాలు, ఫుట్‌పాత్ వ్యాపారులకు వడ్డీ లేని రుణం సదుపాయం కల్పిస్తానన్న వాగ్దానాన్ని గాలికొదిలేశారని విమర్శించారు. మిషన్ భగీరథ కార్మికులకు కనీస వేతనాలు, గ్రామ పంచాయతీ కార్మికుల, మధ్యాహ్న భోజన కార్మికుల బకాయి వేతనాల చెల్లింపునకు ఎలాంటి చర్యలు ఈ బడ్జెట్‌లో లేవని ఆవేదన వ్యక్తం చేశారు. ఉద్యోగ వర్గాన్ని, అసంఘటిత కార్మికులను, స్కీం వర్కర్లను, పారిశ్రామిక కార్మికులను, మొత్తంగా రాష్ట్ర కార్మికవర్గాన్ని ఈ బడ్జెట్ నిరుత్సాహపరిచిందని పేర్కొన్నారు. రాబోయే రోజుల్లో తమ జీవితావసరాలను మెరుగుపరుచుకునేందుకు పోరాటాలకు సిద్ధంగా ఉండాలని కార్మికవర్గానికి పిలుపునిచ్చారు.

సీఎం చూస్తున్న శాఖకు నిధులేవి?

జీఎంపీఎస్ ప్రధాన కార్యదర్శి ఉడుత రవిందర్

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్



ముఖ్యమంత్రి చూస్తున్న పశుసంవర్ధక శాఖకు తక్కువగా నిధులు కేటాయిస్తే రైజింగ్ తెలంగాణా ఎలా సాధ్యమవుతుందని గొర్రెలు, మేకల పెంపకందార్ల సంఘం (జీఎంపీఎస్) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఉడుత రవిందర్ ఒక ప్రకటనలో ప్రశ్నించారు. రాష్ట్రంలో ఉన్న గొర్లకాపర్ల సంక్షేమానికి, జీవాల సంరక్షణకు ఏ మాత్రం సరిపోయే అవకాశం లేదని తెలిపారు. పశుసంవర్ధక శాఖకు బడ్జెట్‌లో కేవలం రూ.1,674 కోట్లు మాత్రమే ప్రతిపాదించారని పేర్కొన్నారు. గతేడాది కంటే రూ. 65 కోట్లు తగ్గించిందని తెలిపారు. ఈ మూడేండ్ల కాలాన్ని పరిశీస్తే మొత్తం బడ్జెట్ రూ.60వేల కోట్లు పెంచగా, పశుసంవర్ధక శాఖకు మాత్రం రూ.361 కోట్లు తగ్గించారని విమర్శించారు. కేటాయింపులే ఈ విధంగా ఉంటే నిధులు విడుదల చేసే నాటికి ఇంకా ఎన్ని కోతలు పెడుతారోనని ఆందోళన వ్యక్తం చేశారు. ఆ నిధుల్లో సింహభాగం ఉద్యోగుల జీతభత్యాలు, కార్యాలయాల నిర్వహణకే ఎక్కువ మొత్తం ఖర్చవుతుందని తెలిపారు. ఇక మిగిలిన వాటిల్లో మామిడిపల్లిలో నిర్మితమవుతున్న పశు వైద్య టీకా ఉత్పత్తి కేంద్రానికి రూ.100కోట్లు, మేలు జాతి పశువుల అభివృద్ధి కోసం కంసాన్‌పల్లిలో కొత్త ఫ్రోజెన్ సెమన్ బుల్ స్టేషన్ నిర్మాణానికి రూ. 21.06 కోట్లు, కొహెడలో ఎక్స్‌పోర్ట్ ఓరియెంటెడ్ హోల్‌సేల్ చేపల మార్కెట్‌కు రూ. 47 కోట్లు కేటాయించిందని పేర్కొన్నారు. పాడిరైతుల ప్రోత్సాహకానికి రూ. 4.20 కోట్లు, పశువుల ఆరోగ్య సంవరక్షణను గాలికొదిలేసి కేవలం రూ. 6.25 కోట్లుగా చూపారని తెలిపారు. గొర్రెల పెంపకందార్ల ఊసేలేదని పేర్కొన్నారు. గొర్రెల పెంపకందార్ల ఫెడరేషన్‌కు ఒక్క పైసా ఇవ్వలేదని విమర్శించారు. గొల్లకురుమ ఆత్మగౌరవ భవనాలకు ఒక్క రూపాయి కేటాయించలేదనీ, యాదవ కార్పొరేషన్‌కు రూ. 50 కోట్లు కేటాయించారనీ, అవి దేనికి ఖర్చు చేస్తారనే వివరణ లేదని పేర్కొన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం బడ్జెట్‌ను సవరించి పశుసంవర్ధక శాఖకు నిధులు కేటాయింపులు పెంచాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో గొర్రెల కాపరుల ఆగ్రహాన్ని చవి చూడాల్సి వస్తుందని ఆయన హెచ్చరించారు.

పశుసంవర్ధక శాఖకు కేటాయించిన నిధుల పట్ల హర్షం : పశువైద్య పట్టభద్రుల సంఘం అధ్యక్షులు కాట శ్రీధర్

రాష్ట్రం ఏర్పడిన నాటి నుంచి ఇంత పెద్ద మొత్తంలో పశుసంవర్ధక శాఖకు బడ్జెట్ కేటాయించటం పట్ల పశువైద్య పట్టభద్రుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు కాట శ్రీధర్ హర్షం వ్యక్తం చేశారు. ఈ సీఎం రేవంత్‌రెడ్డి మంత్రిగా ఉండడం వల్లే ఇంత పెద్ద బడ్జెట్ వచ్చే అవకాశం దక్కిందని ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మూగజీవాలకు వ్యాక్సిన్‌లను అందించేందుకు దేశంలోనే అతిపెద్ద వ్యాక్సిన్ ఉత్పత్తి కేంద్రానికి రూ. 400 కోట్ల బడ్జెట్ కేటాయించడాన్ని స్వాగతిస్తున్నట్టు తెలిపారు.

గిరిజనుల వాగ్దానాలకు తిలోదకాలు : టీజీఎస్



నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

గిరిజనులకిచ్చిన వాగ్దానాలకు బడ్జెట్‌లో రాష్ట్ర ప్రభుత్వం తిలోదకాలిచ్చిందని తెలంగాణ గిరిజన సంఘం (టీజీఎస్) విమర్శించింది. ఈ మేరకు ఆ సంఘం రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎం ధర్మానాయక్, ఆర్ శ్రీరాం నాయక్ బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రావడానికి చేవెళ్ల డిక్లరేషన్ పేరుతో గిరిజనులకు అనేక హామీలిచ్చిందని గుర్తు చేశారు. సమ్మక్క సారక్క పథకం కింద ప్రతి గిరిజన తండా, గూడెం పంచాయితీలకు రూ.25 లక్షలిస్తామని వాగ్దానం చేసినట్టు తెలిపారు. అంబేద్కర్ అభహస్తం కింద ప్రతి ఎస్టీ కుటుంబానికి రూ.12 లక్షల ఆర్థిక సాయం అందిస్తామని చెప్పినట్టు పేర్కొన్నారు. పెండింగ్‌లో ఉన్న పోడు భూములకు హక్కు పత్రాలిస్తామనీ, మైదాన ప్రాంతాల్లో ఉమ్మడి జిల్లాల ప్రాతిపదికన ఐదు ఐటీడీఏలను ఏర్పాటు చేస్తామన్నా రని గుర్తుచేశారు. అధికారంలోకొచ్చిన తర్వాత పూర్తి స్థాయి బడ్జెట్‌లో గిరిజనులకు ఇచ్చిన హామీల గురించి బడ్జెట్ ప్రసంగంలో కానీ, కేటాయింపుల్లో లేకపోవడం వారిని మోసం చేయటమేనని విమర్శించారు.

హామీలకు బడ్జెట్ దూరం

తెలంగాణ రైతు సంఘం

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్



రాష్ట్ర ప్రభుత్వం రైతులకిచ్చిన హామీలను నెరవేర్చే విధంగా వ్యవసాయ బడ్జెట్ లేదని తెలంగాణ రైతు సంఘం అభిప్రాయపడింది. ఈ బడ్జెట్‌ను సవరించి హామీలకనుగుణంగా కేటాయింపులు చేయాలని కోరింది. ఈ మేరకు బుధవారం ఆ సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పోతినేని సుదర్శన్ రావు, టి. సాగర్ ఒక ప్రకటన విడుదల చేశారు. ఈ బడ్జెట్‌ను రుణమాఫీ కాని రైతులకు ఇక మాఫీ అయ్యే అవకాశం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. 2024-25 బడ్జెట్‌లో రుణమాఫీకి రూ.15,470 కోట్లు కేటాయించి, రూ.10,611.88 కోట్లు మాత్రమే ఖర్చు చేసిందని గుర్తు చేశారు. ఉద్యాన శాఖ అభివృద్ధికి కేటాయింపులు లేవని తెలిపారు. కూరగాయలు, పప్పులు, ఉల్లి, వంటనూనెలు, పంచదార దిగుమతులు చేసుకుంటుం దని పేర్కొన్నారు. యాంత్రీకరణకు రూ.25.47 కోట్లు మాత్రమే కేటాయించడం వల్ల రైతులకు వ్యవసాయ పనిముట్లు అందే అవకాశం లేదని తెలిపారు. వానాకాలం రైతు భరోసా నిధులు విడుదల చేయలేదని పేర్కొన్నారు. యాసంగి పంటల కోత కాలం దగ్గరకు వచ్చినా నిధులు అందరికీ అందలేదని గుర్తు చేశారు. జాతీయ ఆహార భద్రత, నూనెగింజల అభివృద్ధి వ్యవసాయ విస్తరణ రాష్ట్రీయ కృషి వికాస్ యోజనలకు కేటాయింపులు లేదని తెలిపారు. పామాయిల్ తోటల అభివృద్ధిపై విస్తృత ప్రచారం చేసినా ప్రభుత్వం అందుకు తగిన నిధులు కేటాయించలేదని పేర్కొన్నారు. కృష్ణా, గోదావరి నదులపై ప్రాజెక్టులను ప్రాధాన్యత క్రమంలో పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. కౌలు రైతుల రైతు భరోసాపై ఊసేత్తలేదని తెలిపారు. వ్యవసాయ, ఉద్యాన, విశ్వ విద్యాలయాలకు పరిశోధనల కోసం బడ్జెట్‌లో కేటాయింపులు ఉండాలని సూచించారు. రైతుల బీమా పథకం 18-59 మధ్య వయసు వారికే వర్తిస్తుందనీ, 18-65 ఏండ్లకు పెంచాలని తెలిపారు. రాష్ట్రంలో 'ధరల నిర్ణాయక కమిషన్' అన్ని పంటలకు ధరలను నిర్ణయించాలని కోరారు.పంటలను మార్క్‌ఫెడ్, సివిల్ సప్లయిస్ ద్వారా కొనుగోలు చేయాలని సూచించారు. ఇందుకు మార్కెట్ జోక్యం పథకం కింద కనీసం రూ.3వేల కోట్లు బడ్జెట్‌లో కేటాయించాలని డిమాండ్ చేశారు. ఈ సూచనలను అమలు జరిపేలా బడ్జెట్‌ను సవరించాలని విజ్ఞప్తి చేశారు.

రజకుల సంక్షేమానికి బడ్జెట్ పెంచాలి

పైళ్ల ఆశయ్య

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్



రజకుల సంక్షేమానికి బడ్జెట్ పెంచాలని తెలంగాణ రజక వృత్తిదారుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పైళ్ల ఆశయ్య డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. 2025-26 బడ్జెట్‌లో రజక వృత్తిదారుల సంక్షేమానికి రూ.200కోట్లు కేటాయింపులు చేశారని తెలిపారు. ఉచిత విద్యుత్ పథకానికి రూ.150కోట్లు, మోడ్రన్ ధోబీఘాట్ల నిర్మాణానికి కేవలం రూ.50 కోట్లు కేటాయించటమేంటని ప్రశ్నించారు. రాష్ట్రంలో సుమారుగా ఐదు లక్షల కుటుంబాలు రజక వృత్తిపై ఆధారపడి జీవిస్తున్నాయని తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లో నేటికీ కులవృత్తి జీవనాధారంగా బతికే కుటుంబాలు పేదరికంలో మగ్గుతున్నాయని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో సంక్షేమానికి మరింత బడ్జెట్ పెంచి కేటాయింపులను సవరించీ, రూ.1000కోట్లు కేటాయించాలని డిమాండ్ చేశారు. ఇప్పటికే రాష్ట్రంలో నాలుగు వేల రజక సహకార సంఘాలు ఏర్పాటు చేశారనీ, వాటన్నిటికీ రుణాలివ్వాలని కోరారు. రజక వృత్తిలో అధునాతన మార్పుల్ని వచ్చాయని తెలిపారు.వృత్తి శిక్షణ- ఉపాధి కల్పన ఆధునిక యాంత్రీకరణ ధోబిఘాట్లను, నూతన డ్రై క్లీనింగ్ లాండ్రీలను నెలకొల్పడానికి ప్రభుత్వం రూ:10లక్షల వరకు వృత్తిదారులకు ఇచ్చే విధంగా బడ్జెట్‌ని పెంచాలని డిమాండ్ చేశారు. వృత్తి పనిలో వృద్ధులయిన వారికి ప్రత్యేక పెన్షన్ స్కీం ఏర్పాటు చేయాలనీ, సామాజిక దాడులు దౌర్జన్యాలు అరికట్టేందుకు ప్రత్యేక రక్షణ చట్టం ఈ అసెంబ్లీ సమావేశాల్లో తీసుకురావాలని డిమాండ్ చేశారు.

విద్యారంగానికి నిరాశే

స్వల్పంగా నిధులు పెరిగినా అవి సరిపోవు

అరకొర కేటాయింపులతో విప్లవాత్మక మార్పులు ఎలా సాధ్యం

టీఎస్‌యూటీఎఫ్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు చావ రవి, వెంకట్

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన 2025-26 బడ్జెట్‌లో విద్యారంగానికి తీవ్ర నిరాశను మిగిల్చిందని తెలంగాణ రాష్ట్ర ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (టీఎస్‌యూటీఎఫ్) విమర్శించింది. మొత్తం బడ్జెట్‌లో విద్యారంగానికి కేవలం 7.57శాతం నిధులనే కేటాయించిందని తెలిపింది. గత బడ్జెట్ కంటే స్వల్పంగా రూ.1,816 కోట్ల నిధులు పెరిగినప్పటికీ విద్యారంగ బలోపే తానికి అవి సరిపోవని అభిప్రాయపడింది. ఈ మేరకు టీఎస్‌యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు చావ రవి, ప్రధాన కార్యదర్శి ఎ.వెంకట్ బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. గతం కంటే 0.2 శాతం నిధులు పెరిగాయని తెలిపారు. ఒకవైపు సాంకేతిక విద్య, ఉన్నత విద్యారంగాలను బలోపేతం చేస్తామంటూ మొత్తం విద్యారంగానికి కలిపి కేవలం 7.57 శాతం నిధులు కేటాయించడం శోచనీయమని విమర్శించారు. కాంగ్రెస్ తన మ్యానిఫెస్టోలో పేర్కొన్నట్టుగా విద్యారంగానికి 15 శాతం నిధుల కేటాయింపు అనే హామీకి ఆమడ దూరంలో ఉందని తెలిపారు. ఒకవైపు విద్యా కమిషన్‌ను నియమించి విద్యారంగంలో విప్లవాత్మక మార్పులు తీసుకొస్తామంటున్న పరిస్థితుల్లో అరకొర కేటాయింపులతో ఆ మార్పులు ఎలా సాధ్యమవుతాయనేది ప్రశ్నార్థకంగా మారిందని ఆందోళన వ్యక్తం చేశారు. గడిచిన 12 ఏండ్లుగా రాష్ట్రంలో విద్యారంగం పూర్తిగా నిర్లక్ష్యానికి గురవుతుందనేది వాస్తవమని పేర్కొన్నారు. మేధావులు, విద్యారంగ శ్రేయోభిలాషులు ప్రభుత్వ విద్యారంగా కేటాయింపుల పెంపు కోసం ప్రభుత్వంపై ఒత్తిడి తేవడం ద్వారా విద్యారంగాన్ని కాపాడుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఇంటిగ్రేటెడ్ గురుకుల పాఠశాలల పేరుతో రాష్ట్ర ప్రభుత్వం ఈ బడ్జెట్‌లో రూ.11,600 కోట్లు కేటాయించిందని తెలిపారు. తద్వారా వాటిని కార్పొరేట్ సంస్థలకు ధారాదత్తం చేసే కుట్రలో భాగమని విమర్శించారు. విద్యాశాఖ పరిధిలో ఉన్న 26,067 పాఠశాలలను గాలికొదిలేసి, గురుకులాలు, సమీకృత గురుకులాల గురించి మాత్రమే ప్రభుత్వం మాట్లాడుతున్నదని వివరించారు. గురుకులాలు ఈ రాష్ట్రంలో కేవలం ఐదు లక్షల మంది విద్యార్థులకు మాత్రమే విద్యనందిస్తున్నాయని వివరించారు. కానీ ప్రభుత్వ, మండల పరిషత్, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో దాదాపు 20 లక్షల మంది పిల్లలు అభ్యసిస్తున్నారని తెలిపారు. వారి సంక్షేమం పట్ల సౌకర్యాల పట్ల ప్రభుత్వాలు దృష్టి సారించకుండా అందరికీ సమానమైన విద్య అందించడం సాధ్యం కాదని పేర్కొన్నారు. ప్రభుత్వ ఆధీనంలోనే అంతరాలతో కూడిన విద్యా విధానం ఉండడం ఏమాత్రం భావ్యం కాదని తెలిపారు. ఇప్పటికైనా ప్రభుత్వం ఆలోచించి మండల పరిషత్, జిల్లా పరిషత్, ప్రభుత్వ, గిరిజన సంక్షేమ పాఠశాలల అభివృద్ధికి నిధులను పెంచాలని వారు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

ప్రభుత్వ బడులను బలోపేతం చేయాలి : ఎస్టీయూటీఎస్

గత బడ్జెట్ కన్నా విద్యారంగానికి స్వల్పంగా 0.2 శాతం నిధులు పెరిగాయని ఎస్టీయూటీఎస్ రాష్ట్ర అధ్యక్షులు ఎం పర్వత్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి జి సదానందంగౌడ్ తెలిపారు. 58 యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ గురుకులాల నిర్మాణానికి రూ.11,600 కోట్లు కేటాయించడం చారిత్రాత్మకమని పేర్కొన్నారు. ప్రతి నియోజకవర్గంలో 20 నుంచి 25 ఎకరాల విస్తీర్ణంలో ఒక సమీకృత గురుకుల పాఠశాలను ప్రారంభించాలని ప్రభుత్వం నిర్ణయించడం హర్షణీయమని తెలిపారు. ప్రభుత్వ, పంచాయతీరాజ్ పాఠశాలలను మరింత బలోపేతం చేయాలని కోరారు. గురుకులాలకు సొంత భవనాలను నిర్మించాలని సూచించారు. సంక్షేమ వసతి గృహాల్లో చదువుకునే విద్యార్థులకు కామన్ డైట్ పథకాన్ని ప్రారంభించడాన్ని స్వాగతిస్తున్నామని తెలిపారు.

విద్యారంగాన్ని విస్మరించిన బడ్జెట్ : టీపీటీఎఫ్

రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన 2025-26 బడ్జెట్‌లో విద్యారంగాన్ని విస్మరించిందని టీపీటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు సిహెచ్ అనిల్‌కుమార్, ప్రధాన కార్యదర్శి నన్నెబోయిన తిరుపతి విమర్శించారు. విద్యకు 15 శాతం నిధులు కేటాయిస్తామన్న హామీ బుట్టదాఖలైందని తెలిపారు. విద్యారంగానికి ఈ బడ్జెట్‌లో 7.57 శాతం నిధులను కేటాయించడాన్ని తీవ్రంగా నిరసిస్తున్నామని పేర్కొన్నారు. కొఠారి కమిషన్ సిఫారసుల మేరకు విద్యకు రాష్ట్ర బడ్జెట్‌లో 30 శాతం నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు. కనీసం 20 శాతం నిధులను కేటాయించి విద్యారంగ అభివృద్ధికి పాటుపడాలని కోరారు.

విద్యారంగాన్ని గాలికొదిలిన కాంగ్రెస్ : తపస్

కాంగ్రెస్ ఇచ్చిన హామీకి అనుగుణంగా బడ్జెట్‌లో 15 శాతం నిధులను కేటాయించలేదని తపస్ రాష్ట్ర అధ్యక్షులు హన్మంతరావు, ప్రధాన కార్యదర్శి నవాత్ సురేష్ ఆరోపించారు. కేవలం 7.57 శాతం నిధులను కేటాయించి విద్యారంగాన్ని గాలికొదిలేసిందని తెలిపారు. కాంగ్రెస్ ఇచ్చిన హామీకి కేటాయింపులకు పొంతన లేకుండా ఉందని పేర్కొన్నారు. యంగ్ ఇండియా సమీకృత గురుకులాల గురించి ప్రభుత్వం మాట్లాడుతున్నదని తెలిపారు. కానీ వాటిలో చదివేది కేవలం 5.5 లక్షల మంది మాత్రమేనని పేర్కొన్నారు. ప్రభుత్వ, మండల, జిల్లా పరిషత్ పాఠశాలల్లో 16 లక్షల మంది విద్యార్థులు చదువుతున్నారని వివరించారు. వారికి నాణ్యమైన విద్యను అందించడానికి ప్రభుత్వ కేటాయింపులు ఏమాత్రం సరిపోవని తెలిపారు.

సరిపడా కేటాయింపుల్లేవ్ : టీఎస్టీయూ

విద్యారంగానికి ఈ బడ్జెట్‌లో సరిపడా కేటాయింపుల్లేవని టీఎస్టీయూ రాష్ట్ర అధ్యక్షులు ఎండీ అబ్దుల్లా, ప్రధాన కార్యదర్శి సిహెచ్ రాజిరెడ్డి తెలిపారు. ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పెన్షనర్ల పెండింగ్ బకాయిలు, డీఏలు, వేతన సవరణ కోసం కేటాయింపుల ప్రస్తావన లేకపోవడం బాధాకరమని పేర్కొన్నారు. విద్యారంగానికి కనీసం 20 శాతం నిధులను కేటాయించాలని డిమాండ్ చేశారు.

నిరాశపర్చిన బడ్జెట్ : ఎస్టీటీయూ

రాష్ట్ర బడ్జెట్‌లో విద్యారంగానికి అరకొర నిధులతో నిరాశపర్చిందని ఎస్టీటీయూ రాష్ట్ర అధ్యక్షులు కరివేద మహిపాల్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి ఎ వెంకటేశం విమర్శించారు. 15 శాతం నిధులు కేటాయిస్తామంటూ హామీ ఇచ్చి 7.57 శాతం నిధులను కేటాయించడం సమంజసం కాదని తెలిపారు. ప్రభుత్వ విద్యారంగం అభివృద్ధి కావాలంటే కొఠారి కమిషన్ సిఫారసుల ప్రకారం రాష్ట్ర బడ్జెట్‌లో 30 శాతం నిధులను కేటాయించాలని సూచించారు.

విద్యకు నిరాశ : వెంకటరెడ్డి

రాష్ట్ర బడ్జెట్‌లో విద్యకు తక్కువ నిధులను కేటాయించడం నిరాశాజనకమని ఎంవీ ఫౌండేషన్ కన్వీనర్, సామాజిక కార్యకర్త వెంకటరెడ్డి తెలిపారు. 15 శాతం నిధులను కేటాయిస్తామంటూ హామీ ఇచ్చి 7.57 శాతం అతితక్కువ నిధులను విద్యకు కేటాయించడం సరైంది కాదని పేర్కొన్నారు. సంక్షోభంలో ఉన్న ప్రభుత్వ విద్యారంగాన్ని ఈ నిధులతో బయటపడేయలేదని తెలిపారు.

Printed and Published by Nandayala Narsimha Reddy On behalf Of Navatelangna Printers Private Limited, Printed At M.H Bhavan, 1st Floor, Plot No. 21/1, Azamabad Near Rtc Kalyana Mandapam, Baghlingampally, Hyderabad-500020,Telangana State,
Published at Navatelangana Printers Private Limited, M.H Bhavan,1st Floor No.21/1, Azamabad, Near Rtc Kalyana Mandapam, Baghlingampally, Hyderabad-500020, Telangana State, Editor : R.Sudha Bhaskar TELTEL/2014/59462.



వ్యవసాయ కార్మికులను విస్మరించిన రాష్ట్ర బడ్జెట్

- ప్రతిపాదనలను పున:సమీక్షించాలి
- తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం డిమాండ్

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్ర ప్రభుత్వం బడ్జెట్లో వ్యవసాయ కార్మికులను విస్మరించిందని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షులు జి. నాగయ్య, ప్రధాన కార్యదర్శి ఆర్. వెంకట్రాములు: ఒక ప్రకటనలో ఆందోళన వ్యక్తం చేశారు. 2025-26 ఆర్థిక సంవత్సరానికి రాష్ట్ర ప్రభుత్వం అసెంబ్లీలో ప్రవేశపెట్టిన రూ. 3,04,965 కోట్ల బడ్జెటుకు అనుగుణంగా ప్రతిపాదనలు లేవని విమర్శించారు. పేదల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని బడ్జెట్‌ను సవరించాలని డిమాండ్ చేశారు. భూమిలేని వ్యవసాయ కార్మికులకు నిధులు పెంచాలని కోరారు. గృహ నిర్మాణ రంగానికి సరైన నిధులు కేటాయించలేదని అన్నారు. రాష్ట్రంలో గుడిసెలేసుకుని జీవిస్తున్న దాదాపు లక్ష మంది పేదల ప్రస్తావన బడ్జెట్లో లేదని విమర్శించారు. అలాగే ఉపాధి హామీ చట్టాన్ని పట్టణాలకు విస్తరింపజేయాలని సూచించారు. 150 రోజుల పనిదినాలు కల్పించి రూ.400లు వేతనం ఇస్తామన్న హామీ అమలుకు ఇందులో కేటాయింపులు లేవని గుర్తు చేశారు. కో-ఆపరేటివ్ ద్వారా మినీ సూపర్ మార్కెట్లో రేషన్ షాపులను నడిపి ప్రజా పంపిణీని బలోపేతం చేస్తా మన్న హామీ అరకొర కేటాయింపుల ద్వారా ఎలా సాధ్యమవుతుందని ప్రశ్నించారు..

11 ఏండ్ల బడ్జెట్ కేటాయింపులు.. ఖర్చులు వెల్లడించాలి

- అబద్ధాల్లో, అంకెల్లో, అప్పుల్లో, దోపిడీలో బీఆర్ఎస్‌ను మించిన కాంగ్రెస్ : బండి

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

రాష్ట్ర మేర్పడిన తర్వాత బీఆర్ఎస్ ప్రభుత్వ, కాంగ్రెస్ సర్కారు హయాల్లో ప్రవేశపెట్టిన బడ్జెట్‌లు, వాస్తవిక ఖర్చులతో కూడిన వివరాలను ప్రజల ముందుంచాలని కేంద్ర మంత్రి బండి సంజయ్‌కుమార్ డిమాండ్ చేశారు. బుధవారం ఈ మేరకు ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. ఆరు గ్యారెంటీలపై ఆశలు వదులుకునేలా బడ్జెట్ తీరుందనీ, కేటాయింపులకు, ఆచరణకు పొంతనే లేదని విమర్శించారు. మ్యానిఫెస్టోలోని 10 శాతం హామీలను కూడా అమలు చేయలేని అసమర్థ సర్కారని తేలిపోయిందని పేర్కొన్నారు. విద్య, వైద్య రంగాల కేటాయింపులు దారుణమని విమర్శించారు. అభయ హస్తం కాదు....మహిళల పాలిట శూన్య హస్తమని నిరూపించిన బడ్జెట్ అని దెప్పిపొడిచారు. 2 లక్షల ఉద్యోగాల భర్తీ, రూ.4 వేల నిరుద్యోగ భృతి ఊసేదని ప్రశ్నించారు. వృద్ధాప్య పింఛన్ల సంగతేదని నిలదీశారు. ఆరోగ్యశ్రీ, ఫీజు రీయింబర్స్ మెంట్, పెండింగ్ బిల్స్ అన్నీ ఇగ ఎగవేసినట్లేనా? అన్న సందేహాన్ని వ్యక్తం చేశారు. ఎస్సీ, ఎస్టీ, బీసీలకంటే మీకు మైనారిటీలే మీకు ముఖ్యమా? అని ప్రశ్నించారు. గోబెల్స్ ను మించిన అబద్ధాల కోరులు కాంగ్రెస్ నేతలు అని విమర్శించారు.

మాటల్లోనే దళిత సంక్షేమం

- కేటాయింపుల్లో వెల్లడైన వైనం
- అంబేద్కర్ అభయహస్తం అనుమానమే..

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

రాబోయే(2025- 26) ఆర్థిక సంవత్సరానికి రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన బడ్జెట్‌ను పరిశీలిస్తే..మాటల్లోనే దళిత సంక్షేమం తప్పితే..ఆచరణలో ముందుకు పోయే స్థితి లేదని దళిత సంఘాలు ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి. రాష్ట్రంలో సుమారు 18 శాతం ఉన్న దళితులకు ప్రతి ఏటా బడ్జెట్లో అంకెలు పెంచి చూపించటం వరకే పరిమితమవుతున్నారన్న విమర్శకు ప్రస్తుత బడ్జెట్ కేటాయింపులు ఉదాహరణగా ఉన్నాయి. 2024-25 ఆర్థిక సంవత్సరంలో వారికి కేటాయించిన బడ్జెట్‌లో నూటికి 30శాతం కూడా ఖర్చు చేయలేదు. 2023- 24 లోనూ కేటాయించిన మొత్తంలో రూ. 13,617 కోట్లు ఖర్చు చేయలేదు.ఈ విషయాన్ని ఆర్థిక మంత్రి ప్రకటించటం పాలకుల నైజానికి అద్దం పడుతుందని పలువురు వ్యాఖ్యానిస్తున్నారు. 2020-21 లో రూ.16,534 కోట్లు కేటాయించగా రూ.11,884 కోట్లు మాత్రమే ఖర్చు చేశారు. 2021- 22లో రూ.21,306 కోట్లు కేటాయించగా రూ.17,085 కోట్లు ఖర్చు చేశారు. 2022- 23 బడ్జెట్లో రూ.33,937 కోట్లు కేటాయించగా రూ.15,440 కోట్లు ఖర్చయ్యాయి. 2024- 25లో రూ.33,127 కోట్లు కేటాయించగా రూ.9,824 కోట్లు మాత్రమే ఖర్చు చేశారు. ఈ రకంగా సుమారు 70శాతం నిధులు ఖర్చు చేయలేదంటే..దళితుల అభివృద్ధి పట్ల ప్రభుత్వాల చిత్త శుద్ధి విదితమవుతున్నది. గత ప్రభుత్వం ఎస్సీ ఎస్టీ సబ్ ప్లాన్‌ను నిర్లక్ష్యం చేసింది. ఇవన్నీ 2023-24 ఆర్థిక సంవత్సరం బడ్జెట్‌లో ఎస్సీ ప్రత్యేక అభివృద్ధి నిధులను రూ.13,617 ఖర్చు చేయలేదు. ఆ బకాయిలను కలిపి నిధులను కేటాయిస్తున్నట్టు ప్రకటించటం గమనార్హం. ఇవన్నీ కలిపే ప్రస్తుత బడ్జెట్‌లో ఎస్సీ లకు రూ.40,232 వేల కోట్లను కేటాయించారు.



శంషాబాద్ నుంచి వియత్నాంకు విమానం

- హెూచిమిన్ నగరానికి కొత్తగా
- నాన్ స్టాప్ సేవలు ప్రారంభం

నవతెలంగాణ-హైదరాబాద్

శంషాబాద్ విమానాశ్రయం నుంచి నుంచి వియత్నాంలోని హెూ చి మిన్ నగరంలోని టాన్ సోన్‌న్హాట్ అంతర్జాతీయ విమానాశ్రయానికి నూతనంగా నాన్ - స్టాప్ విమాన సేవలు ప్రారంభమయ్యాయి. వియెట్‌జెట్ ఉన్నతాధికారులు, ప్రముఖ భాగస్వాములు జీఎంఆర్ ఎయిర్‌పోర్టులో జరిగిన ప్రారంభ కార్యక్రమానికి హాజరయ్యారు. ప్రతి మంగళవారం, గురువారం రోజుల్లో ఈ విమాన సర్వీసులు ప్రయాణీకులకు అందుబాటులో ఉంటాయి. ఈ విమానం 4.35 గంటల్లో భారతదేశం నుంచి వియత్నాం చేరుతుంది. ఈ కొత్త రూట్ భారతీయ ప్రయాణికులకు వియత్నాం పర్యాటకాన్ని అస్వాదించడానికి ఉపయోగపడనుంది. ముఖ్యంగా, ఈ మార్గం హైదరాబాద్‌కు చెందిన ఐటీ, ఔషధ పరిశ్రమలకు ప్రయోజనం కలిగించనుందని జీఎంఆర్ అధికారులు తెలిపారు. అలాగే ఈ ప్రత్యక్ష విమాన సర్వీస్ దక్షిణాసియా అంతటా అందుబాటులో ఉంటుం దన్నారు. ప్రయాణికులకు ప్రపంచస్థాయి సౌకర్యాలు అందుబాటులో ఉంటాయని చెప్పారు.

చర్చలకు ఇంకా అవకాశాలు వున్నాయి

హమాస్ వ్యాఖ్యలు.. బుధవారం నాటి దాడుల్లో 29మంది మృతి

అంతర్జాతీయ సమాజం చొరవ తీసుకోవాలన్న జోర్డాన్, ఫ్రాన్స్


గాజా : గాజావ్యాప్తంగా ఇజ్రాయిల్ మళ్ళీ దాడులు మొదలుపెట్టినా తాము చర్చలకు ద్వారాలు మూసివేయలేదని హమాస్ పేర్కొంది. సంతకాలు చేసిన ఒప్పందం అమల్లో వుండగా, కొత్త ఒప్పందాలు చేయాల్సిన అవసరం లేదని స్పష్టం చేసింది. కాగా 'ఇది కేవలం ప్రారంభం మాత్రమే'నని ఇజ్రాయిల్ ప్రధాని బెంజామిన్ నెతన్యాహు వ్యాఖ్యానించారు. కాల్పుల విరమణకు ఉద్దేశించిన చర్చలన్నీ ఇక కాల్పుల మధ్యనే జరుగుతాయని తేల్చి చెప్పారు. మంగళవారం తెల్లవారు జామునుండి మళ్ళీ ప్రారంభించిన వైమానిక దాడుల్లో ఇప్పటివరకు 436మంది మరణించారు.

పచ్చి అబద్ధాలు, అసత్యాలు, అతిశయోక్తులు

భట్టి బడ్జెట్ బడా జూటా బడ్జెట్ :
మాజీ మంత్రి హరీశ్ రావు

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్ర ప్రభుత్వ బడ్జెట్ అబద్ధాలు, అసత్యాల, అతిశయోక్తులతో కూడుకుని ఉన్నదని ఆర్థికశాఖ మాజీ మంత్రి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్ రావు విమర్శించారు. బుధవారం ఆయన మీడియా సమావేశంలో మాట్లాడారు. భట్టి బడ్జెట్ బడా జూటా బడ్జెట్ అనీ, ఈ బడ్జెట్‌తో కాంగ్రెస్ పార్టీ తన విశ్వసనీయతను కోల్పోయిందని తెలిపారు. సీఎం రేవంత్ రెడ్డి అసెంబ్లీ లోపల, బయట అబద్ధాలే ఆడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. మహిళలకు వడ్డీ లేని రుణం ఇస్తున్నామనీ బయట చెప్పి, అసెంబ్లీలో రూ.5 లక్షల వరకే వడ్డీ లేని రుణమని చెబుతున్నారన్నారు. దీంతో రూ.15 లక్షలకు మహిళలే వడ్డీలు కడుతున్నారని చెప్పారు. మొత్తం డబ్బుకు వడ్డీ లేని రుణం ఇస్తే ప్రభుత్వం చెప్పేది నిజమవుతుందని సూచించారు. స్కూల్ విద్యార్థుల డ్రెస్ కుట్టు ఛార్జీలు రూ.75కు పెంచామనీ చెప్పారే కానీ ఇస్తున్నది రూ.50 మాత్రమేనని తెలిపారు. ఒక్క రేషన్ కార్డు కూడా ఇవ్వలేదన్నారు. బీఆర్ఎస్ హయాంలో 6.47



లక్షల రేషన్ కార్డులు ఇచ్చినట్టు తెలిపారు. అందాలపోటీల కోసం రూ.2,500 కోట్లు కేటాయించి, మహిళలకు రూ.2,500 ఆర్థిక సాయం, చేయూత కింద పింఛన్ రూ.4,000 మరిచారని విమర్శించారు. లక్షా 50 వేల పింఛన్లు తగ్గించి కోత పెట్టారని తెలిపారు. రూ.2 లక్షలలోపు ఉన్న, ఎక్కువ ఉన్న వారికి రుణమాఫీ కాలేదంటూ, తన నియోజకవర్గంలో 10,500 మందికి రుణమాఫీ కాలేదన్నారు. తులం బంగారం, రైతు రుణమాఫీ చేయలేదనీ, ఎక్కడైనా చర్చకు సిద్ధమని సవాల్ విసిరారు. బడ్జెట్ అవాస్తవికంగా ఉందని తెలిపారు.

జీఎస్టీపీ గ్రోత్ రేటు 12.9 శాతం నుంచి కాంగ్రెస్ పాలనలో 10.1 శాతానికి అంటే 2.8 శాతం ఎందుకు తగ్గిందని హరీశ్ రావు ప్రశ్నించారు. తలసరి ఆదాయం బీఆర్ఎస్ పాలనలో 12.4శాతముంటే కాంగ్రెస్ పాలనలో 9.6 శాతానికి పడిపోయిందని తెలిపారు. గతేడాది 5888 కోట్ల రెవెన్యూ మిగిలి ఉంటే, ఈ బడ్జెట్‌లో 2738 కోట్ల సర్ ప్లస్ ఉంటదని ప్రతిపాదించారని చెప్పారు. సర్ ప్లస్ గా ఉన్న రాష్ట్రాన్ని అప్పుల రాష్ట్రంగా చిత్రీకరించారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ ఏడాది ఎక్సైజ్ ద్వారా 50వేల కోట్ల రాబడి ఆశిస్తూ, తాగుబోతుల తెలంగాణగా మారుస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. భూముల అమ్మకం విపరీతంగా పెంచుతున్నారనీ, తమ హయాంలో రూ.23వేల కోట్ల నాన్ టాక్స్ రెవెన్యూ ఉంటే కాంగ్రెస్ రూ.32, 618 కోట్లు పెట్టారని తెలిపారు. మైనార్టీస్ కోసం గతంలో రూ.3 వేల కోట్లు అని చెప్పి రూ.ఒక వెయ్యి కోట్లు కూడా ఖర్చు చేయలేదన్నారు. బీసీలకు రూ.20 వేల కోట్లు ఏవి అని ప్రశ్నించారు. సబ్ ప్లాన్ ఎందుకు అమలు చేయడం లేదో చెప్పాలన్నారు. సీఎస్ఎస్ ద్వారా కేంద్రం నుంచి రూ.15,729 కోట్లు వస్తాయని బడ్జెట్ లో పేర్కొన్నారనీ, 2023-24 లో వచ్చింది 5,966 కోట్లు మాత్రమేనని గుర్తుచేశారు. కేంద్రం 1.34 శాతమే ఇస్తే 2.9శాతం అని పెట్టారని విమర్శించారు. కేంద్రం నరేగా కోసం గతేడాది, ఈ ఏడాది కూడా రూ.86 వేల కోట్ల చొప్పున పెడితే గతేడాది రూ.2,600 కోట్లు, ఈ ఏడాది రూ.3 వేల కోట్లు వస్తాయని బడ్జెట్‌లో ఎలా పెట్టారని ప్రశ్నించారు. మిడ్ డే మీల్స్ కోసం గతేడాది రూ.145 కోట్లు వస్తే, ఈసారి రూ.1200 కోట్లు, మహిళలకు సంబంధించి రూ.9.90 కోట్లు వస్తే, ఈ సారి రూ.1,949 కోట్లు ఎలా వస్తాయో సమాధానం చెప్పాలన్నారు. పేదల ఇళ్ల నిర్మాణం కోస గతేడాది బడ్జెట్‌లో రూ.22,500 కోట్లు పెట్టి 22 పైసలు ఖర్చు చేయలేదని విమర్శించారు. రాష్ట్రంలో కోటి మంది కూలీలుంటారనీ, ఆ కూలీలకు రూ.12 వేలు చొప్పున ఇవ్వాలంటే ఎంత కావాలని ప్రశ్నించారు. ఇందిరమ్మ ఆత్మీయ భరోసాకు కేవలం రూ.600 కోట్లు మాత్రమే కేటాయించారని తప్పుపట్టారు. బడ్జెట్ అంకెల గారడీ, అబద్ధాల గారడీ అని విమర్శించారు.

వచ్చే వానాకాలం, యాసంగి సీజన్లకు 'రైతు భరోసా'



బడ్జెట్‌లో రూ. 18 వేల కోట్లు కేటాయింపు

రుణమాఫీ కానీ రైతులకు నిరాశే

పశుసంవర్ధక శాఖకు గతంలో 'జీరో'...ఇప్పుడు రూ.1,674 కోట్లు

వ్యవసాయానికి బడ్జెట్‌లో రూ. 24,439 కోట్లు

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

కాంగ్రెస్ ప్రభుత్వం పోయిన వానాకాలం సీజన్‌కు రైతుభరోసాను విస్మరించింది. యాసంగి సీజన్‌లో ప్రారంభించినా ఇప్పటివరకు మూడెకరాల భూమి ఉన్న రైతులకు మాత్రమే రైతు భరోసా నిధులు జమ చేసింది. మిగితా రైతులకు యాసంగి ముగుస్తున్నా రైతు భరోసా పూర్తవ్వలేదు. కానీ 2025-26 వార్షిక బడ్జెట్‌లో మాత్రం రూ.18వేల కోట్లు కేటాయించి రైతులకు గుడ్‌న్యూస్ చెప్పింది. రైతులకు వచ్చే ఏడాదికి ఎకరాకు రూ.12 వేలు ఇవ్వనుంది. ఇవీ కాకుండా వ్యవసాయానికి రాష్ట్ర బడ్జెట్‌లో రూ 24,439 కోట్లు కేటాయించింది. 2024-25 ఓటాన్ అకౌంట్ బడ్జెట్‌లో ప్రభుత్వం వ్యవసాయరంగానికి కేవలం రూ.19,746 కోట్లు మాత్రమే నిధులు కేటాయించింది. గతేడాదిలో పోల్చితే ఈసారి రూ.4,693 కోట్లు మాత్రమే అదనంగా కేటాయించింది. అయితే ఇప్పటికే రాష్ట్ర ప్రభుత్వం రెండు లక్షల రుణమాఫీ కింద రూ.20,616.89 కోట్లను 25.35 లక్షల మంది రైతులకు చెల్లించింది. పెద్ద మొత్తంలో రుణమాఫీ చేసినా వివిధ కారణాలతో రుణమాఫీ కానీ రైతులకు ఈ బడ్జెట్ నిరాశే మిగిల్చింది. ఆ రైతుల గురించి బడ్జెట్‌లో ప్రస్తావించలేదు. రైతులకు విత్తనాల సరఫరా, ప్రొఫెసర్ జయశంకర్, కొండా లక్ష్మణ్ ఉద్యాన విశ్వవిద్యాలయానికి, రైతువేదికల నిర్వాహణ, మార్కెట్ ఇంటర్వెన్షన్ ఫండ్, వ్యవసాయ విస్తరణ కార్యకలాపాలకు, మైక్రో ఇరిగేషన్ తదితరాలకు కూడా నిధులు కేటాయించింది. గతేడాది పశువర్ధక శాఖ జీరో నిధులు కేటాయించిన సర్కారు...ఈసారి రూ.1,674 కేటాయించింది. అందులో ప్రధానంగా వెటర్నరీ బయోలాజికల్ రీసర్చ్ ఇన్స్టిట్యూట్ నిర్మాణం కోసం రూ. 300 కోట్లు కేటాయించింది. దీంతో పశువులు వ్యాధుల బారిన పడకుండా నిరోధించే టీకాలను ఉత్పత్తి చేస్తుంది. కొహెడ్ ఫ్రూట్ మార్కెట్ నిర్మాణం కోసం రూ. 47 కోట్లు కేటాయించింది. రాష్ట్రంలో పండ్లు, కూరగాయల సాగును ప్రోత్సహించేందుకు నిధులను కేటాయించలేదు. మరోవైపు కూరగాయల సాగు రైతులను ప్రోత్సహిస్తామంటూ చెబుతున్న సర్కారు.. ఆ శాఖను ప్రోత్సహించే దిశగా చర్యలు చేపట్టలేదు.

పామాయిల్ సాగును లక్షల ఎకరాలకు విస్తరించాలనే లక్ష్యానికి అనుగుణంగా కేటాయింపులు లేవు. కేవలం గతంలో ఇస్తున్న సబ్సిడీని కొనసాగిస్తామని పేర్కొంది. ఇప్పటికే పామాయిల్ గెలలకు సరైన ధర అందడం లేదంటున్న రైతులకు బడ్జెట్ నిరాశను కలిగిస్తున్నది. దిగుమతి సుంకాన్ని ఎత్తేసేందుకు కృషి చేస్తామని చెప్పింది. ప్రకృతి వైపరీత్యాలకు పంట నష్టపోతే ఆ రైతులకు భరోసా కల్పించేలా బడ్జెట్ లేదు. అకాల వర్షాలకు ప్రతియేటా కొన్ని లక్షల ఎకరాల్లో పంట నష్టం జరుగుతున్నది. ఆ బాధల నుంచి రైతులను గట్టెక్కించేందుకు సర్కారు చర్యలు చేపట్టలేదు. పంటల బీమా అందకపోవడంతో రైతులు ఇప్పటికీ ఎన్నో ఇబ్బందులు పడుతున్నారు.

భట్టి బడ్జెట్ అంతా డొల్ల..బోగస్

బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ కాసం వెంకటేశ్వర్లు



నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్


శాసనసభలో మంత్రి భట్టి విక్రమార్క ప్రవేశపెట్టిన బడ్జెట్ అంతా డొల్ల , బోగస్ అని బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ కాసం వెంకటేశ్వర్లు విమర్శించారు. బుధవారం హైదరాబాద్‌లోని బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి బడ్జెట్ రూపకల్పన చేయడమే తెలియదన్నట్టుగా ఉందని ఎద్దేవా చేశారు. రెవెన్యూలోటు ఉన్న రాష్ట్రంలో రెవెన్యూ మిగులు చూపెట్టడమేంటని ప్రశ్నించారు. రెవెన్యూ లోటు ఉన్న రాష్ట్రాలకు కేంద్ర ప్రభుత్వం నిధులిచ్చి పూడ్చే ప్రయత్నం చేస్తున్నదని గుర్తుచేశారు. ఏపీ బడ్జెట్‌ను గమనిస్తే రూ.33 వేల కోట్ల లోటు చూపించారని గుర్తుచేశారు. 17 రాష్ట్రాల్లో రెవెన్యూ లోటును పూడ్చేందుకు కేంద్ర ప్రభుత్వం కృషి చేస్తోందని తెలిపారు.

రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం మాత్రం రెవెన్యూ లోటును ఒప్పుకోవడం లేదనీ, దీనివల్ల తెలంగాణకు తీవ్ర అన్యాయం జరుగుతున్నదని పేర్కొన్నారు. ఆదాయం కోసం ప్రభుత్వ ఆస్తులను తెగనమ్ముకునే ప్రయత్నం చేస్తుంది తప్పితే మరే ప్రత్యామ్నాయ ఆలోచన చేయడంలేదని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజా అవసరాలకు బదులుగా, కమీషన్ల కోసం ఖర్చు చేసే విధంగా బడ్జెట్ రూపొందించిందని ఆరోపించారు. ఐదేండ్లలో బీసీల సంక్షేమం కోసం ఏటా రూ. 20 వేల కోట్ల చొప్పున ఖర్చుపెడతామని చెప్పి ఇప్పుడు బడ్జెట్‌లో కేవలం రూ.11,405 కోట్లు ప్రతిపాదించడమేంటని నిలదీశారు. ఎస్సీ వర్గీకరణను రాజకీయంగా ఉపయోగించుకోవడం మాత్రమే రేవంత్‌రెడ్డికి తెలుసునని దెప్పిపొడిచారు. నిరుద్యోగ యువతను నిట్టనిలువునా కాంగ్రెస్ ప్రభుత్వం ముంచిందని విమర్శించారు. నిరుద్యోగ భృతి కోసం నిధులు ఎందుకు కేటాయించలేదు? అని ప్రశ్నించారు. రేవంత్‌రెడ్డి సర్కారుకు ఇదే చివరి బడ్జెట్ అవుతుందేమోనని ప్రజలు భావిస్తున్నారని పేర్కొన్నారు.

మాదిగలను ముంచింది కాంగ్రెస్సే..

మా పోరాట ఫలితమే వర్గీకరణ, సామాజిక న్యాయం :
ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు మందకృష్ణ మాదిగ

నవతెలంగాణ - బంజారా హిల్స్



అప్పుడు.. ఇప్పుడు.. మాదిగలను ముంచింది కాంగ్రెస్సేనని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు మందకృష్ణ మాదిగ అన్నారు. హైదరాబాద్ సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో బుధవారం ఆయన మీడియాతో మాట్లాడారు. మాదిగలకు ఉద్యోగ అవకాశాలు రాకుండా కాంగ్రెస్ ప్రభుత్వం కుట్ర చేస్తున్నదని ఆరోపించారు. అందులో భాగంగానే గతంలో ఉద్యోగ నోటిఫికేషన్‌లకు వర్గీకరణ అమలు చేస్తామని మోసం చేసిందన్నారు. ఈ కుట్రకు ప్రధాన సూత్రధారులు సీఎం రేవంత్ రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రి దామోదర్ రాజనర్సింహనే అని ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ద్వంద్వ వైఖరి స్పష్టమవుతోందన్నారు. మాల సామాజిక తరగతి నాయకుల ఆధిపత్యానికి తలొగ్గి రేవంత్‌రెడ్డి మాదిగలకు అన్యాయం చేశారన్నారు. మాదిగ మంత్రి అని చెప్పుకుంటున్న దామోదర రాజనర్సింహ సొంత మంత్రిత్వ శాఖలోనే ఉన్న వైద్య ఆరోగ్య శాఖలో సుప్రీం కోర్టు తీర్పు ఆగస్టులో వస్తే సెప్టెంబర్‌లో ఉద్యోగాలు భర్తీ చేశారన్నారు. మొదట ఇచ్చిన కమిషన్ నివేదికనే చట్టం చేస్తున్నామని అసెంబ్లీలో చెప్పారని, మరి రెండోసారి నివేదిక సమయాన్ని ఎందుకు పొడిగించారని, దాన్ని ఎందుకు బయట పెట్టడం లేదని ప్రశ్నించారు. ఎస్సీ వర్గీకరణ మాదిగ సామాజిక తరగతి అమరుల త్యాగాలు, కార్యకర్తల కృషి వల్లే వచ్చిందని చెప్పారు. తెలంగాణలోని 33 జిల్లాల్లో వర్గీకరణ విజయోత్సవాలు నిర్వహిస్తామని ప్రకటించారు. 30 సంవత్సరాల సుదీర్ఘ పోరాటం తర్వాత వర్గీకరణ జరిగిందన్నారు. ఈ చట్టం ఆమోదించడంలో ప్రధాని మోడీతో పాటు మాజీ ఉప రాష్ట్రపతి వెంకయ్య నాయుడు కీలక పాత్ర వహించారన్నారు. సుప్రీం కోర్టు తీర్పు రాకపోతే ఇది సాధ్యమయ్యేది కాదన్నారు. కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి, హర్యానా గవర్నర్ దత్తాత్రేయ చాలా తోడ్పాటు అందించారని చెప్పారు. ఈ సమావేశంలో ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షులు గోవింద్ నరేష్ మాదిగ, క్రాంతి దళ్ వ్యవస్థాపకాలు పృథ్వీరాజు యాదవ్, తెలంగాణ విఠల్, సీనియర్ జర్నలిస్ట్ ఇస్మాయిల్, ఎమ్మార్పీఎస్ జాతీయ అధికార ప్రతినిధి బొర్ర బిక్షపతి మాదిగ, ఎంఎస్పీ జాతీయ నాయకులు సొట్ట నరేంద్ర బాబు, ఎంఎస్ఎఫ్ జాతీయ అధ్యక్షులు సోమశేఖర్ మాదిగ, రచయిత మచ్చ దేవేందర్ పాల్గొన్నారు.

అంతర్రాష్ట్ర కిడ్నాప్ ముఠాల గుట్టురట్టు

కూపీలాగితే డొంక కదిలింది

27 మంది నిందితుల అరెస్ట్

ఇప్పటి వరకు 16 మంది పిల్లలను రక్షించిన ఎస్‌వోటీ పోలీసులు



నవతెలంగాణ-సిటీబ్యూరో/హయత్‌నగర్

పసి పిల్లలను కిడ్నాప్ చేసి విక్రయిస్తున్న కేసులో కూపీ లాగితే డొంక కదిలింది. ఐదు అంతర్రాష్ట్ర ముఠాల గుట్టు రట్టయింది. పసిపిల్లలను విక్రయిస్తున్న అంతర్రాష్ట్ర ముఠాను గతంలో రాచకొండ పరిధిలో ఎస్‌వోటీ పోలీసులు అరెస్టు చేసి ఆరుగురు శిశువులను రక్షించిన విషయం తెలిసిందే. ఈ కేసులో దర్యాప్తును చైతన్యపురి పోలీసులు, ఎస్‌వోటీ పోలీసులు మరింత సమగ్రంగా విచారించడంతో ఐదు ముఠాల మాడుల్స్ బయటకు వచ్చాయి. ప్రధాన నిందితులు కోల కృష్ణవేణి, దీప్తి, వందనను పోలీసులు కస్టడీలోకి తీసుకుని విచారణ జరిపారు. విచారణలో ఈ ముఠాలు 25 మంది పిల్లలను విక్రయించినట్టు తేలింది. ఈ క్రమంలో 27 మంది నిందితులను అరెస్టు చేసిన పోలీసులు తాజాగా 10 మంది పిల్లలను రక్షించారు. మిగిలిన 9 మందిని కూడా రక్షించేందుకు ప్రత్యేక బృందాలను రంగంలోకి దించారు. బుధవారం ఎల్బీనగర్‌లోని సీపీ క్యాంప్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఎస్‌వోటీ డీసీపీ ఏ.రమణారెడ్డి, అదనపు డీసీపీ ఎస్.నర్సింహారెడ్డితో కలిసి సీపీ జి.సుధీర్‌బాబు వివరాలు వెల్లడించారు.

మలక్‌పేట్‌లో ఆశా వర్కర్‌గా పనిచేస్తున్న సోము అమూల్య(ప్రధాన నిందితురాలు), గాంధీ ఆస్పత్రిలో ల్యాబ్ టెక్నీషియన్‌గా పనిచేస్తున్న జంపల్లి కార్తీక్, నాగ్‌పూర్‌కు చెందిన వైషాలీ భీమ్రావ్ వాస్నిక్, చార్మినార్ వద్ద మ్యారేజ్ బ్యూరో నిర్వహిస్తున్న సజ్జన్ అగర్వాల్, అబ్దుల్లాపూర్‌మెట్‌కు చెంది వ్యాపారీ బనాల మంగయ్య, ఆసిఫాబాద్‌కు చెందిన వ్యాపారీ బోదను నాగరాజు, నేరేడ్‌మెట్‌కు చెందిన రామారాం అశోక్, మైలార్‌దేవ్‌పల్లికి చెందిన షేక్ ఇస్మాయిల్, నిజాంపేట్‌కు చెందిన మాచర్ల వంశీకృష్ణ ఒక ముఠాగా ఏర్పడ్డారు. అమూల్య ఆశా వర్కర్‌గా పనిచేస్తూనే ఆస్పత్రిలో పనిచేసే ఇస్మాయిల్ ద్వారా శిశువులను విక్రయించే రాకెట్‌లో చేరింది. మొదట ఆమె తెలిసిన దంపతులకు శిశువులను అందించగా, ఆ తర్వాత దీప్తి, కోల కృష్ణవేణి సహకారంతో వివిధ రాష్ట్రాలకు చెందిన ముఠాలతో పరిచయం పెంచుకుంది. అమూల్య మొత్తం 18మంది శిశువులను అక్రమంగా విక్రయించింది. ఈ కేసుల్లో ఐదు ముఠాలకు చెందిన 27 మందిని పోలీసులు అరెస్టు చేశారు. ఈ ముఠా సభ్యులు, క్రయవిక్రయాలు జరిపిన వారు ఇతర రాష్ట్రాల్లో ఉండటంతో మరింత సమగ్రంగా విచారిస్తున్నామని సీపీ తెలిపారు. సంచలనమైన కేసును ఛేదించడంతో ఎస్‌వోటీ పోలీసులతోపాటు చైతన్యపురి పోలీసులను సీపీ ప్రత్యేకంగా అభినందించారు. ఈ సమా వేశంలో ఎస్‌వోటీ ఇన్‌స్పెక్టర్లు జి.జంగయ్య, పి.చంద్రశేఖర్‌రెడ్డి, డి.ప్రవీణ్‌బాబు, చైతన్యపురి ఎస్‌హెచ్‌వో జి.వెంకటేశ్వరరావు, ఎస్‌ఐలు భద్రయ్య, వాసుదేవ్, పరమేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

చట్టప్రకారం దత్తత తీసుకోవాలి: సీపీ

శిశువులను దత్తత తీసుకోవాలనుకునే దంపతులు తప్పనిసరిగా చట్టపరమైన విధానాలను పాటించాలని రాచకొండ సీపీ సుధీర్‌బాబు తెలిపారు. దత్తత తీసుకునే అంశంలో డబ్బుల ప్రమేయం వస్తే అది ఖచ్చితంగా అక్రమమే అవుతుందన్నారు. పిల్లల దత్తత కోసం విక్రయించే ఏజెంట్లు, మిడిల్ మెన్‌లను సంప్రదించకూడదని, చట్టప్రకారం దత్తత తీసుకోవాలని సూచిం చారు. లేనిపక్షంలో దత్తత ఇచ్చేవారు, తీసుకునే వారిపై చట్టప్రకారం చర్యలు తప్పవని హెచ్చరించారు.

రూ.5 నుంచి 6లక్షలు

ఆడ శిశువులను రూ.2 నుంచి 3 లక్షలకు కొనగోలు చేస్తున్న అంతర్రాష్ట్ర ముఠాలు రూ.3 నుంచి 4లక్షల వరకు విక్రయిస్తున్నాయి. మగ శిశువులకైతే రూ.4 నుంచి 5లక్షలు లేదా రూ.5నుంచి 6లక్షల వరకు విక్రయిస్తున్నాయి. ముఖ్యంగా ముంబయి(మహారాష్ట్ర), కాన్పూర్(ఉత్తరప్రదేశ్), రాయ్‌పూర్ (ఛత్తీస్‌గఢ్), అమరావతి(మహారాష్ట్ర), హైదరాబాద్ నుంచి శిశువులను కొనుగోలు చేస్తున్న ఈ ముఠాలు కోల్‌కతా(పశ్చిమ బెంగాల్), చెన్నై (తమిళనాడు), బెంగళూరు (కర్ణాటక), హైదరాబాద్, గుంటూరు (ఆంధ్రప్రదేశ్)లో విక్రయిస్తున్నాయి.

రేపటినుంచి టెన్త్ పరీక్షలు

ఏర్పాట్లు పూర్తి చేసిన విద్యాశాఖ

హాజరుకానున్న 5,09,403 మంది విద్యార్థులు

2,650 పరీక్షా కేంద్రాల ఏర్పాటు

ఐదు నిమిషాల వరకు గ్రేస్ పీరియెడ్

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలో పదోతరగతి వార్షిక పరీక్షలు శుక్రవారం నుంచి ప్రారంభం కానున్నాయి. ఏప్రిల్ నాలుగో తేదీ వరకు ఈ పరీక్షలు జరుగుతాయి. ఈ పరీక్షల నిర్వహణ కోసం పాఠశాల విద్యాశాఖ ఏర్పాట్లు పూర్తి చేసింది. పదోతరగతి పరీక్షలు ఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు జరుగుతాయి. ఫస్ట్ లాంగ్వేజ్ కాంపొజిట్ కోర్సు సబ్జెక్టు పరీక్ష ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12.50 గంటల వరకు నిర్వహిస్తారు. సైన్స్ సబ్జెక్టును రెండు విభాగాలుగా పార్ట్-1 ఫిజికల్ సైన్స్, పార్ట్-2 బయలాజికల్ సైన్స్‌గా వేర్వేరు రోజుల్లో ఉదయం 9.30 నుంచి 11 గంటల వరకు జరుగుతుంది. పదో తరగతి పరీక్షలకు 11,547 పాఠశాలల నుంచి 5,09,403 మంది విద్యార్థులు హాజరవుతారు. వారిలో అబ్బాయిలు 2,58,895 మంది, అమ్మాయిలు 2,50,508 మంది ఉన్నారు. ఈ పరీక్షల నిర్వహణ కోసం రాష్ట్రవ్యాప్తంగా 2,650 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశారు. రాష్ట్రవ్యాప్తంగా 2,650 మంది చీఫ్ సూపరింటెండెంట్ (సీఎస్), 2,650 మంది డిపార్ట్‌మెంటల్ ఆఫీసర్ (డీవో)లతోపాటు 28,100 మంది ఇన్విజిలేటర్లను నియమించారు. ఈ పరీక్షలను పకడ్బందీగా నిర్వహించడం కోసం ప్రభుత్వ పరీక్షల విభాగం కార్యాలయంలో కంట్రోల్ రూంను ఏర్పాటు చేసింది. విద్యార్థులకు ఏమైనా సందేహాలు, సమస్యలుంటే 040-23230942 నెంబర్‌ను సంప్రదించాల్సి ఉంటుంది. పదో తరగతి పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమల్లో ఉంటుంది. పరీక్షలు జరిగే సమయంలో ఆ చుట్టుపక్కల జిరాక్స్ సెంటర్లు మూసేయాలి. పరీక్షా కేంద్రాల్లోకి విద్యార్థులకు ఉదయం 9.35 గంటల వరకు అనుమతి ఉంటుంది. అంటే ఐదు నిమిషాలు గ్రేస్ పీరియెడ్ ఉంటుంది. ట్రాఫిక్, ఇతర సమస్యలను దృష్టిలో ఉంచుకుని ముందుగానే పరీక్షా కేంద్రాలకు విద్యార్థులు చేరుకోవాలని అధికారులు సూచించారు. ఒకరోజు ముందే పరీక్షా కేంద్రాలను చూసుకోవాలని కోరారు. పరీక్షలను పకడ్బందీగా నిర్వహించడం కోసం పాఠశాల విద్యాశాఖ సంచాలకులు సీనియర్ అధికారులను జిల్లా స్థాయిలో పరిశీలకులుగా నియమించారు.

అన్ని పరీక్షా కేంద్రాల వద్ద పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. మాల్ ప్రాక్టీస్ సంఘటనలు చోటుచేసుకోకుండా ఉండేందుకు రాష్ట్రవ్యాప్తంగా 144 మంది ఫ్లైయింగ్ స్క్వాడ్‌లను నియమించారు. సమస్యాత్మక పరీక్షా కేంద్రాల వద్ద సిట్టింగ్ స్క్వాడ్‌లను నియమించారు. చీఫ్ సూపరింటెండెంట్ గదిలో సీసీటీవీ కెమెరాలను ఏర్పాటు చేశారు. పరీక్షా కేంద్రాల్లోకి విద్యార్థులు, సిబ్బంది మొబైల్ ఫోన్లు, ఎలక్ట్రానిక్ వస్తువులను తీసుకురావడాన్ని నిషేధించారు. ఈ ఏడాది నుంచి పదో తరగతి ప్రశ్నాపత్రాలపై క్యూఆర్ కోడ్ ఉంటుంది. విద్యార్థులకు 24 పేజీల బుక్‌లెట్‌ను సమాధానాలు రాసేందుకు ఇస్తారు.

సమతుల్యత పాటించిన బడ్జెట్

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

రైతులు, పేదలు, మహిళలు, యువత, విద్యార్థులు, బడుగు బలహీనవర్గాల కేటాయింపుల్లో సమతుల్యత పాటించాలని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ అన్నారు. బుధవారం అసెంబ్లీ మీడియా పాయింట్‌లో ఆయన మాట్లాడారు. వాస్తవానికి దగ్గరగా ఈ బడ్జెట్ ఉన్నదని చెప్పారు. బీఆర్ఎస్‌లాగా ఫాంహౌస్‌లో, ఇంటిదగ్గర కూర్చొని పాలించటం లేదని గత ప్రభుత్వ పాలన తీరుపై విమర్శించారు. పదేండ్లలో ధనిక రాష్ట్రాన్ని రూ. ఏడు లక్షల కోట్లకు పైగా అప్పులపాలు చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజాపాలన చేపట్టిన అభివృద్ధి చూసి ఓర్వలేక దిగజారుడు మాటలు మాట్లాడుతున్నారని విమర్శించారు. రాజకీయ విమర్శలకు పోకుండా ప్రభుత్వానికి సూచనలు ఇవ్వడంలో సహకరించాలని సూచించారు.



బీఆర్ఎస్‌లో మార్పులేదనీ, ఇందుకు బడ్జెట్‌ను విమర్శించటమే ప్రత్యక్ష ఉదాహరణని చెప్పారు. కల్వకుంట్ల కుటుంబం ప్రజల సొమ్ము వేనకేసుకోవడానికి ప్రయత్నిస్తే, సీఎం రేవంత్‌రెడ్డి రాష్ట్ర అభివృద్ధి కోసం రోజుకు 18 గంటలు పని చేస్తున్నారని తెలిపారు. నాటి ప్రభుత్వం ఎగ్గొట్టిన రైతు రుణ మాఫీ తమ ప్రభుత్వం చేసిందని గుర్తు చేశారు. సత్వరమే తమ ప్రభుత్వం కొందుర్గు-పరిగి-లక్ష్మి దేవిపల్లి ప్రాజెక్టు చేపడతుందని తెలిపారు.

ప్రజల ఆకాంక్షలకు ప్రతిబింబం : బీర్ల ఐలయ్య



గత పదేండ్లలో తెలంగాణ సంపద దోచుకున్న వారు బడ్జెట్‌ను విమర్శించటం విడ్డూరంగా ఉందని ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య అన్నారు. బుధవారం అసెంబ్లీ మీడియా పాయింట్‌లో ఆయన మాట్లాడుతూ బడ్జెట్‌లో మహిళలకు, రైతులకు, యువతకు, విద్యకు పెద్దపీట వేశారని కొనియాడారు. బడ్జెట్ ప్రసంగం పూర్తికాకముందే మీడియా పాయింట్ వద్దకు వచ్చి బీఆర్ఎస్ నేతలు బడ్జెట్‌ను విమర్శించే పని పెట్టుకున్నారన్నారు. తమ ప్రభుత్వం చేసిన బీసీ డిక్లరేషన్, కుల గణన, ఎస్సీ వర్గీకరణ, రుణ మాఫీ బీఆర్ఎస్ నేతలు జీరించుకోలేకపోతున్నారని చెప్పారు.

అన్ని వర్గాలకు పెద్దపీట : కాంగ్రెస్ ఎమ్మెల్యే టి రాంమోహన్‌రెడ్డి

అన్ని వర్గాల ప్రజలకు ఈ బడ్జెట్ పెద్ద పీట వేసిందని కాంగ్రెస్ ఎమ్మెల్యే టి రాంమోహన్‌రెడ్డి అన్నారు. సోమవారం అసెంబ్లీ మీడియా పాయింట్‌లో ఆయన మాట్లాడారు. ఎంపీ ఎన్నికల్లో శూన్యం సీట్లు వచ్చినా

అన్ని వర్గాలకు న్యాయం చేకూర్చే బడ్జెట్ : ఎమ్మెల్యే వీరపల్లి శంకరయ్య

అన్ని వర్గాలకు న్యాయం చేసే విధంగా బడ్జెట్ ఉన్నదని కాంగ్రెస్ ఎమ్మెల్యే వీరపల్లి శంకర్ అన్నారు. బుధవారం అసెంబ్లీ మీడియా పాయింట్‌లో ఆయన మాట్లాడారు. తెలంగాణ ప్రజల ఆకాంక్షలను నెరవేర్చే బడ్జెట్ ఇదని చెప్పారు. లక్ష్మి దేవిపల్లి ప్రాజెక్టు విషయంలో కేసీఆర్ మాట తప్పారని గుర్తు చేశారు. బీఆర్ఎస్ ప్రభుత్వం దళితులను దగా చేసి, ఇప్పుడు వారి సంక్షేమం విషయంలో మొసలి కన్నీరు కారుస్తున్నారని దుయ్యబట్టారు. బీజేపీతో లోపాయికారీ ఒప్పందంతో ముందుకు పోతున్నారని ఆరోపించారు.

సమన్యాయం చేసే బడ్జెట్ ఇది :ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి

అన్ని వర్గాల ప్రజలకు సమన్యాయం అందించే విధంగా బడ్జెట్ కేటాయింపులున్నాయని కాంగ్రెస్ ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి అన్నారు. బుధవారం అసెంబ్లీ మీడియా పాయింట్‌లో ఆయన మాట్లాడుతూ లక్ష్మి దేవి పల్లి ప్రాజెక్టు విషయంలో కేసీఆర్ మోసం చేశారని విమర్శించారు. ప్రభుత్వ విప్ రామచంద్రునాయక్ మాట్లాడుతూ గత ప్రభుత్వం సంక్షేమ పథకాల నిధులు దారి మళ్లించి వాటిని కొల్లగొట్టారని ఆరోపించారు. ఎమ్మెల్యే రాందాస్ నాయక్ మాట్లాడుతూ తెలంగాణ సమాజానికి సామాజిక న్యాయం చేసే బడ్జెట్ ఇదని చెప్పారు. గత ప్రభుత్వం ఎస్సీ, ఎస్టీ, బీసీ కార్పొరేషన్లను నిర్వీర్యం చేసిందని విమర్శించారు.

ఆరు గ్యారంటీలకు గోవిందా..: కేటీఆర్



ఆరు గ్యారంటీలకు కాంగ్రెస్ ప్రభుత్వం గోవింద పలికిందని మాజీ మంత్రి కేటీఆర్ విమర్శించారు. బుధవారం అసెంబ్లీ మీడియా పాయింట్‌లో బీఆర్ఎస్ ఎమ్మెల్యేలతో కలిసి మాట్లాడారు. తమ ప్రయోజనాలకు అనుగుణంగా బడ్జెట్ కేటాయింపులు ఉంటాయని రైతులు, ప్రజలు ఎదురు చూశారని చెప్పారు. 420 హామీల్లో ఒక్క గ్యారంటీపై కూడా మాట్లాడలేదన్నారు. రూ. నాలుగు వేల పింఛన్ మరిచి పోయారని చెప్పారు. మహిళలకు ప్రకటించిన మహా లక్ష్మి ఏమైందని ప్రశ్నించారు. ఆటో డ్రైవర్లు అవస్థలు పడుతుంటే.. వారికి ఉపశమనం కల్పించేలా మాట్లాడలేదని ఆవేదన వ్యక్తం చేశారు. స్విగ్గి, జుమాటో వర్కర్లకు వర్కర్స్ బోర్డు అని చెప్పి మరిచిపోయారన్నారు. ఆడ బిడ్డలకు తీరని అన్యాయం చేశారని విమర్శించారు. 500 రోజులు పూర్తయినా కూడా రూ.2500 ఇవ్వలేదని చెప్పారు. యాదవులకు గొర్రెలు అని చెప్పి పట్టించుకోలేదని తెలిపారు. గౌడలకు మద్యం దుకాణాల్లో ప్రత్యేక వాటా అని చెప్పి మోసం చేశారని విమర్శించారు. అశోక్ నగర్‌లో చాయి తాగుతూ 2 లక్షల ఉద్యోగాలు ఇస్తామని రాహుల్ గాంధీ ఫోజులు కొట్టారనీ, ఆయన ఇస్తానన్న ఉద్యోగాల భర్తీ ఎక్కడని ప్రశ్నించారు. విద్యా భరోసా లేదన్నారు. గురుకులాల్లో విద్యార్థులు చనిపోతుంటే పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. పేక మెడల్లగా తెలంగాణ ఆర్థిక వ్యవస్థను చిన్నా భిన్నం చేస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. తెలంగాణ కు కాంగ్రెస్ వైరస్ సోకిందని చెప్పారు. ఇది డిల్లీకి మూటలు పంపే బడ్జెట్‌గా ఉందని ఎద్దేవా చేశారు. ఏ ఒక్క ఊరిలో 100 శాతం రుణ మాఫీ జరిగినట్టు చూపించినా మా ఎమ్మెల్యేల మంతా రాజీనామా చేస్తామని సవాల్ విసిరారు. రేవంత్ రెడ్డి అసమర్థత వల్ల ఆర్థిక వ్యవస్థ పడిపోతుందని ఆవేదన వ్యక్తం చేశారు. రూ.లక్షా 60 వేల కోట్లు అప్పు చేసి ఒక్క ప్రాజెక్టు కూడా మొదలు పెట్టలేదన్నారు. తొండ ముదిరితే ఊసరవెల్లి అయినట్టు ఊసరెల్లి ముదిరితే రేవంత్ రెడ్డి అవుతాడని చెప్పారు. కార్యకర్తలకు రూ.6 వేల కోట్ల పంచి పెడతాం అంటే అది యువ వికాసం కాదు.. డిల్లీ వికాసం అవుతుందన్నారు. రాష్ట్రంలో ఎవరు ఆనందంగా ఉన్నారని అందాల పోటీలు పెడుతున్నారా? అని ప్రశ్నించారు.

కేసీఆర్ ప్రభుత్వం ప్రాజెక్టులను నిర్మించింది కేసీఆర్ ప్రభుత్వం :పల్లా రాజేశ్వర్‌రెడ్డి

రాష్ట్రంలో ప్రాజెక్టులను నిర్మించింది కేసీఆర్ ప్రభుత్వమేనని బీఆర్ఎస్ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి చెప్పారు. బుధవారం అసెంబ్లీ మీడియా పాయింట్‌లో ఆయన మాట్లాడారు. అవగాహన రాహిత్యం వల్ల చేతగాని తనం వల్ల రైతులు, ప్రజలు నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఎండిపోయిన లక్ష ఎకరాలకు నష్ట పరిహారమివ్వాలని డిమాండ్ చేశారు.

ప్రజలను వంచించే బడ్జెట్ : బీజేపీ శాసన సభా పక్ష నేత మహేశ్వర్‌రెడ్డి

రాష్ట్ర ప్రజలను ఈ బడ్జెట్ వంచించిందని బీజేపీ శాసన సభా పక్ష నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి విమర్శించారు. బుధవారం అసెంబ్లీ మీడియా పాయింట్‌లో తమ పార్టీ ఎమ్మెల్యేలతో కలిసి మాట్లాడారు. బడ్జెట్ అంతా డొల్లగా ఉందని చెప్పారు. ప్రజల ఆకాంక్షలకు భిన్నంగా ఉందని చెప్పారు. ఏ ఒక్క హామీ సంపూర్ణంగా అమలు అయ్యే పరిస్థితి లేదని చెప్పారు.

రాహుల్‌తోనే వర్గీకరణ

దళిత సంఘాలతో సీఎం రేవంత్

నవతెలంగాణ ప్రత్యేక ప్రతినిధి-హైదరాబాద్

రాహుల్‌గాంధీ చొరవతోనే ఎస్సీ వర్గీకరణ సాధ్యమైందని ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి అన్నారు. ఆయన ఇచ్చిన ప్రోత్సాహంతోనే వర్గీకరణ చేయగలిగామనీ, ఆయనే శక్తి ఇచ్చారని అభిప్రాయపడ్డారు. భవిష్యత్‌లో న్యాయపరమైన చిక్కులు ఉండకూడదనే ఏకసభ్య కమిషన్ ఏర్పాటు చేశామని వ్యాఖ్యానించారు. బుధవారం అసెంబ్లీలో దళిత సంఘాలు ముఖ్యమంత్రిని సన్మానించాయి. మంత్రి దామోదర రాజనర్సింహా, మాజీ మంత్రి కడియం శ్రీహరి తదితరులు సమక్షంలో సీఎంకు అసెంబ్లీ కమిటీ హాల్‌లో సన్మానం చేశారు. ఈసందర్భంగా సీఎం మాట్లాడుతూ ఏకసభ్య కమిషన్ 199 పేజీల నివేదిక ఇచ్చిందన్నారు. ఎస్సీలను మూడు గ్రూపులుగా విభజించి రిజర్వేషన్లు కల్పిస్తున్నామన్నారు. ఇది ఎవరికీ వ్యతిరేకంగా చేసింది కాదని వివరించారు. వర్గీకరణ ద్వారా ఎస్సీలకు న్యాయం చేయాలనేదే మా ప్రభుత్వ ఉద్దేశమని తెలిపారు. ఆనాడు వర్గీకరణ తీర్మానం పెట్టాలని డిమాండ్ చేస్తే మమ్మల్ని సభ నుంచి సస్పెండ్ చేశారని గుర్తు చేశారు. పదేండ్లలో పరిష్కారం కాని సమస్యకు కాంగ్రెస్ అధి కారంలోకి వచ్చిన మొదటి ఏడాదిలోనే పరిష్కారం చూపిందన్నారు. సుప్రీంకోర్టులో బలంగా వాదనలు వినిపించి వర్గీకరణకు అనుకూలంగా తీర్పు వచ్చేందుకు కషి చేశామని చెప్పారు. సుప్రీం కోర్టు తీర్పును దేశంలో ఏ రాష్ట్రంలో అమలు చేయలేదన్నారు. బీజేపీ అధికారంలో ఉన్న రాష్ట్రా ల్లోనూ సుప్రీం తీర్పు అమలు కాలేదని చెప్పారు. కానీ తెలంగాణలో అమలు చేసే ప్రక్రియను మొదలు పెట్టామన్నారు. న్యాయపరమైన హక్కుల సమస్యకు పరిష్కారం చూపాలనుకున్నామనీ, ఇప్పుడు సాధించు కున్నామని వివరించారు. వందేండ్లలో ఎప్పుడూ లేని విధంగా ఉస్మానియా యూనివర్సిటీ వీసీగా మాదిగ బిడ్డ కుమార్‌ను నియమించామని చెప్పారు. ఆర్ట్స్ కాలేజ్ ప్రిన్సిపాల్ గా ప్రొఫెసర్ ఖాసీం నియమించామని తెలిపారు. ఉన్నత విద్యామండలి, పబ్లిక్ సర్వీస్ కమిషన్, విద్యాకమిషన్‌లలో మాదిగలకు ప్రాధాన్యం ఇచ్చామని గుర్తు చేశారు.

అన్ని వర్గాల ఆశలపై నీళ్లు

- బీఆర్ఎస్ శాసనమండలిపక్ష నేత మధుసూదనాచారి

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

కాంగ్రెస్ సర్కారు ప్రవేశపెట్టిన బడ్జెట్ అన్ని వర్గాల ఆశలపై నీళ్లు చల్లిందని బీఆర్ఎస్ శాసనమండలిపక్ష నేత మధుసూదనాచారి విమర్శించారు. బుధవారం శాసనమండలిలో మీడియా పాయింట్ వద్ద ఆయన మాట్లాడారు. శుష్కప్రియాలు, శూన్యహస్తాలు, పరనింద, ఆత్మస్తుతితో బడ్జెట్ ఉందని తెలిపారు. బీసీ సబ్ ప్లాన్ ఏదని ప్రశ్నించారు.

బీఆర్ఎస్ ఎమ్మెల్సీ మహమూద్ అలీ మాట్లాడుతూ మైనార్టీలకు గతేడాది రూ.వెయ్యి కోట్లు కూడా ఖర్చు చేయలేదని విమర్శించారు. మైనార్టీ సబ్‌ప్లాన్ ఊసు మరిచారని ఆగ్రహం వ్యక్తం చేశారు. బీఆర్ఎస్ ఎమ్మెల్సీ దేశపతి శ్రీనివాస్ మాట్లాడుతూ ప్రభుత్వం ఆత్మ విశ్వాసం కోల్పోయిందనీ, 6 గ్యారంటీలపై కనీసం ప్రతిపాదన కూడా పెట్టలేదని విమర్శించారు. జాబ్ క్యాలెండర్ ఏదని ప్రశ్నించారు. బీఆర్ఎస్ ఎమ్మెల్సీ ఎల్.రమణ మాట్లాడుతూ కామారెడ్డి డిక్లరేషన్ హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. బీఆర్ఎస్ ఎమ్మెల్సీ శేరి సుభాష్ రెడ్డి మాట్లాడుతూ ఉద్యోగులను వంచించిన బడ్జెట్ అని విమర్శించారు.

ఔరంగజేబ్ సమాధి ప్రాంతం వద్ద 'నో డ్రోన్' జోన్



ఛత్రపతి శంభాజీనగర్ : మహారాష్ట్రలోని ఖుల్తాబాద్‌లోని ఔరంగజేబ్ సమాధిని తొలగించాలని నిరసనలు తలెత్తుతున్న వేళ ఆ సమాధి గల ప్రాంతాన్నంతటినీ 'నో డ్రోన్' జోన్ గా జిల్లా యంత్రాంగం ప్రకటించింది. ఈ మేరకు బుధవారం సంబంధిత అధికారి ఒకరు సమాచారాన్ని వెల్లడించారు. ఈ విషయమై అభ్యంతరకరమైన పోస్టులు అనేకం వెల్లువెత్తుతున్నందున వాటిని కనిపెట్టడంలో పోలీసులు తలమునకలై వున్నారు. ఇప్పటివరకు సోషల్ మీడియాలో 500 వరకు అటువంటి ఆన్‌లైన్ పోస్టులు తొలగించామని అధికారి ఒకరు చెప్పారు. కాగా మరోవైపు సమాధిని తొలగించాలంటూ రాష్ట్రవ్యాప్తంగా ప్రదర్శనలు జరుగుతున్నాయి. అనేకమంది రాజకీయ నేతలు కూడా ఈ మేరకు పిలుపులిస్తున్నారు. ఇటువంటి పరిస్థితుల్లో ఉద్రిక్తతలు పెచ్చరిల్లే అవకాశం వున్నందున ముందు జాగ్రత్తగా నో డ్రోన్ జోన్ ప్రకటించారు. ఖుల్తాబాద్‌పట్టణంలో రాష్ట్ర రిజర్వ్ పోలీసు బలగాలను మోహరించారు. ప్రజలెవరూ వదంతులు నమ్మరాదని, ఎక్కడైనా ఏదైనా సమాచారం అందితే వెంటనే పోలీసులు లేదా జిల్లా యంత్రాంగాన్ని కలవాలని జిల్లా కలెక్టర్ దిలీప్ స్వామి విలేకర్లకు చెప్పారు.

30రోజుల కాల్పుల విరమణకు సిద్ధం !

- ట్రంప్ ప్రతిపాదనలకు పుతిన్ సానుకూల స్పందన
- పలు అంశాలపై రెండున్నర గంటల సుదీర్ఘ ఫోన్ కాల్



వాషింగ్టన్ : ఉక్రెయిన్‌లో యుద్ధాన్ని నివారించేందుకు, ఆ ఘర్షణలకు శాంతియుత పరిష్కారాన్ని కనుగొనేందుకు రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్‌తో అమెరికా అగ్ర నేత ట్రంప్ చేసిన ఫోన్ కాల్ సుదీర్ఘంగా సాగింది. రెండు గంటలకు పైగా సాగిన ఈ ఫోన్ సంభాషణల్లో 30రోజుల కాల్పుల విరమణ ప్రతిపాదన, సముద్ర జలాల భద్రత, ఖైదీల మార్పిడి వంటి పలు అంశాలపై సుదీర్ఘంగా చర్చించినట్లు క్రెమ్లిన్ తెలిపింది. ట్రంప్ ప్రతిపాదనలకు పుతిన్ సానుకూలంగా స్పందించారు. 30రోజుల పాటు ఇంధన సదుపాయాలపై దాడులు చేయకుండా ఇరు పక్షాలు సంయమనం పాటించాలని ట్రంప్ ప్రతిపాదించారు. ఇందుకోసం ఉభయపక్షాలు పరస్పర ఒప్పందం కుదుర్చుకోవాలన్నారు. ఈ చొరవను పుతిన్ స్వాగతించారు. తక్షణమే వాటికి అనుగుణంగా చర్యలు తీసుకోవాల్సిందిగా రష్యా మిలటరీని ఆదేశించారు. అమెరికా,రష్యా సంబంధాలను సాధారణ స్థాయికి తీసుకురావడంపై ఇరువురు నేతలు ఆసక్తి కనబరిచారు. అంతర్జాతీయ భద్రత, ఆర్థిక సహకారం వంటి అంశాలపై చర్చలు కొనసాగించేందుకు అంగీకరించారు. ఉక్రెయిన్ ఘర్షణలకు శాంతియుత పరిష్కారానికి తన నిబద్ధతను పుతిన్ పునరుద్ఘాటించారని క్రెమ్లిన్ ప్రచురించిన ప్రకటన తెలిపింది. కూలంకషమైన, సమగ్రమైన పరిష్కారం కోసం అమెరికా భాగస్వాములతో కలిసి పనిచేయడానికి పుతిన్ సంసిద్ధత వ్యక్తం చేశారని ఆ ప్రకటన పేర్కొంది. రష్యాకు గల చట్టబద్ధమైన భద్రతా ప్రయోజనాలను పరిగణనలోకి తీసుకుంటూనే ఈ సంక్షోభానికి మూల కారణాలను పరిష్కరించేలా, స్థిరమైన, దీర్ఘకాలిక ఒప్పందం వుండాలని పుతిన్ నొక్కి చెప్పారు. 30రోజుల కాల్పుల విరమణ గురించి ప్రస్తావిస్తూ, తమ కీలకమైన ఆందోళనలను రష్యా పక్షం వివరించింది. కదనరంగం పొడవునా కాల్పుల విరమణ పర్యవేక్షణకు సమర్థవంతమైన యంత్రాంగం వుండాలని, ఉక్రెయిన్‌లో బలవంతంగా సమీకరణలను నిలుపుచేయాలని, వారి సైన్యానికి తిరిగి ఆయుధాలు సమకూర్చే చర్యలను ఆపు చేయాలని కోరింది. ఉక్రెయిన్‌కు విదేశీ మిలటరీ సాయం పూర్తిగా ఆగిపోవాలని, అలాగే ఉక్రెయిన్‌తోనిఘా సమాచారం పంచుకోవడం నిలిచిపోవాలని స్పష్టం చేసింది. పరిస్థితులు పెచ్చరిల్లకుండా నివారించాలంటే ఇది కీలకమైన షరతని నొక్కి చెప్పింది.

అంచనాలు భారీ..అమల్లో మాత్రం సారీ

- బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు, కేంద్ర మంత్రి జి.కిషన్‌రెడ్డి

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్



అంచనాలు భారీ..అమల్లో మాత్రం సారీ అని కాంగ్రెస్ ప్రభుత్వ బడ్జెట్ మరోమారు స్పష్టం చేసిందని బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు, కేంద్ర మంత్రి జి.కిషన్‌రెడ్డి విమర్శించారు. బుధవారం ఈ మేరకు ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. 2.26 లక్షల కోట్ల రూపాయలు (74 శాతం) వేతనాలు, ఖర్చులు, సబ్సిడీలు, ఇతర ఖర్చులకు పోతుందనీ, కేవలం రూ.36,504 కోట్లే (12 శాతం) చూపెట్టారనీ, అభివృద్ధికి కేవలం 12 శాతం నిధులే ప్రతిపాదించారని వివరించారు.

అభివృద్ధి కుంటుపడితే రాష్ట్ర ఆదాయం తగ్గుతుందనీ, ఫలితంగా ప్రజల జీవనప్రమాణాలు దెబ్బ తింటాయని పేర్కొన్నారు. గత బడ్జెట్‌లో రెవెన్యూ అంచనాలకు, రాష్ట్ర ప్రభుత్వం చేసిన ఖర్చులకు ఏమాత్రం సంబంధం లేదని బడ్జెట్ నిరూపించిందని తెలిపారు. అమలుకు నోచుకోని హామీలిచ్చి, అబద్ధాలు చెప్పి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ ఇప్పుడు తప్పించుకోవాలని చూస్తున్నదని విమర్శిం చారు. 2024-25 బడ్జెట్ లో జీఎస్టీ ఆదాయాన్ని రూ.58,594 కోట్లుగా చూపి, సవరించిన అంచనాల్లో రూ.5వేల కోట్లు తగ్గించి రూ.53,665 కోట్లుగా వెల్లడించారని తెలిపారు. 8.5 శాతం జీఎస్టీ వసూళ్లు తగ్గడానికి కారణమేంటో రాష్ట్ర ప్రభుత్వం చెప్పాలని డిమాండ్ చేశారు. 2025-26 సంవత్సరానికి గానూ రూ.59,704 కోట్ల జీఎస్టీ వసూళ్లు ఉంటాయని బడ్జెట్లో పేర్కొన్నారనీ, లెక్కలు పెంచి ఎంత రాశారో అర్థం కావడం లేదని విమర్శించారు. మద్యం ద్వారా ఆదాయం పెంచుకోవాలని చూడటం దుర్మార్గమన్నారు. ప్రతిచోటా అంచనాలను పెంచి రాష్ట్ర ఆదాయాన్ని దాదాపు 12 శాతం ఎక్కువగా చూపారని విమర్శించారు. నిరుద్యోగ భృతి గురించి బడ్జెట్ ప్రసంగంలో ఎక్కడా లేదని ప్రస్తావించారు. గత బడ్జెట్‌లో రూ60వేల కోట్ల అప్పులు తీసుకుంటామని చెప్పి.. లక్షన్నర కోట్ల అప్పులు తీసుకున్నారని గుర్తుచేశారు.

ఇప్పుడు రూ. 74 వేల కోట్లు అని చెబుతున్నారనీ, అంటే అది 2.25 లక్షల కోట్లు దాటిపోతుందని విమర్శించారు. రైతులకు ఇచ్చిన హామీలను నెరవేర్చేలా బడ్జెట్‌లో వ్యవసాయ రంగానికి నిధులను ప్రతిపాదించలేదని పేర్కొన్నారు. కౌలు రైతులు, రైతు కూలీల ప్రస్తావనే బడ్జెట్‌లో లేదని తెలిపారు. విద్యారంగానికి 15 శాతం నిధులు కేటాయిస్తామన్న హామీ ఏమైందని నిలదీశారు. ప్రతి విద్యార్థికి రూ.5 లక్షల విద్యాభరోసా కార్డు ఎక్కడకు పోయిందో బడ్జెట్ లో చెప్పలేదని విమర్శించారు.

పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖకు రూ.31, 605 కోట్లు

- మిషన్‌భగీరథ బకాయిల చెల్లింపులకే రూ.6 వేల కోట్లు
- చేయూత పింఛన్లకు రూ. 14,861 కోట్లు
- పింఛన్ల పెంపు ఈసారి లేనట్టే?



నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధి శాఖకు ఈసారి బడ్జెట్‌లో రూ.31, 605 కోట్లు ప్రతిపాదించడమైంది. మొత్తం బడ్జెట్‌లో చూస్తే 9.64 శాతంగా ఉంది. గత బడ్జెట్‌లో ఈ శాఖకు రూ. 29, 816 కోట్లు (9.25 శాతం) కేటాయించడమైంది. మొత్తంగా చూసుకుంటే స్వల్పమొత్తం అనగా 0.39 శాతం మాత్రమే పెరిగింది. ఈ ఏడాది స్థానిక సంస్థల ఎన్నికలున్న నేపథ్యంలో పంచాయతీరాజ్ శాఖకు పెద్ద ఎత్తున నిధుల కేటాయింపు ఉంటుందనే చర్చ జోరుగా నడిచింది. తీరా చూస్తే బడ్జెట్ ప్రతిపాదనల్లో ఆ స్థాయిలో కనిపించలేదు.

చేయూత పింఛన్ల కోసం రూ.14, 861 కోట్లు మాత్రమే ప్రతిపాదించింది. గతంలో ఇచ్చిన పింఛన్లను డబుల్ చేసి ఇవ్వాలంటే చేయూత పింఛన్లకు బడ్జెట్ చూపెట్టిన నిధులు ఏమాత్రం సరిపోవు. దానికి ఏడాదికి కనీసం రూ.24 వేల కోట్లు అవసరం. ఈ లెక్కన చూస్తే ఎన్నికల మ్యానిఫెస్టో పెట్టిన పింఛన్ల పెంపు హామీ ఈసారి నెరవేరేటట్లు కనిపించడం లేదు. 31 వేల కోట్లలో మిషన్‌భగీరథ బకాయిల చెల్లింపులకే రూ.6 వేల కోట్లు అవసరం. స్టేట్ ఫైనాన్స్ కమీషన్ గ్రాంట్స్ రూ. 2062 కోట్లు. ఇందిరమ్మ ఆత్మీయ భరోసాకు రూ.600 కోట్లు ప్రతిపాదించడమైంది.

ఈ బడ్జెట్‌లో మహిళా సంఘాలకు వడ్డీల కోసం రూ.1511 కోట్లు, గ్రామీణ రోడ్ల నిర్మాణం, నిర్వహణ - రూ.1220 కోట్లుగా బడ్జెట్‌లో చూపెట్టారు. మహిళా శిశు సంక్షేమ శాఖ- రూ. 2862 కోట్లు ప్రతిపాదించడమైంది. గతేడాది ఇదే శాఖకు రూ.2736 కేటాయించారు. మరోవైపు రాష్ట్రంలో పంచాయతీల్లో చేసిన అభివృద్ధి పనులకు గానూ మాజీ సర్పంచులకు చెల్లించాల్సిన బకాయిల ప్రస్తావన కనిపించలేదు.

పెద్దల అక్రమ కట్టడాలపై హైడ్రా దృష్టి సారించాలి

- హైకోర్టు వ్యాఖ్య

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

చెరువులు, నీటివనరులు, ప్రభుత్వ జాగాల రక్షణకు హైడ్రా తీసుకునే చర్యలు పేద, మధ్య తరగతి ప్రజల వరకే పరిమితం కారాదనీ, ధనవంతుల ఆక్రమణలను కూల్చినప్పుడే ఆస్తుల రక్షణ లక్ష్యం దిశగా అడుగులు వేసినట్టవుతుందని హైకోర్టు అభిప్రాయపడింది. చట్టం దృష్టిలో అందరూ సమానమనీ, హైడ్రా ఆచరణలో నిరూపించాలని సూచించింది. రంగారెడ్డి జిల్లా రాజేంద్రనగర్ మండలం అత్తాపూర్‌లో 6.10 ఎకరాల స్థలంపై తహసీల్దార్ జారీ చేసిన నోటీసులను షామ్స్ ఫాతిమాఖాన్ ఇతరులు హైకోర్టులో సవాల్ చేసిన పిటిషన్ విచారణ సందర్భంగా జస్టిస్ భాస్కర్‌రెడ్డి పైవిధంగా వ్యాఖ్యలు చేశారు. వక్ఫ్‌బోర్డు భూమి విషయంలో సీఈవో లేఖ ఆధారంగా తహసీల్దార్ నోటీసులు జారీ చేయడం చెల్లదని పిటిషనర్ వాదించారు. ఒక పిల్‌లో హైకోర్టు ఇచ్చిన ఆర్డర్‌కు అనుగుణంగా కూల్చివేత చర్యలు తీసుకుంటున్నట్టు ప్రభుత్వ ప్లీడర్ చెప్పారు. సర్వే చేసి అది ప్రభుత్వ భూమి అయితే చట్ట ప్రకారం చర్యలు తీసుకోవాలనీ, వక్ఫ్‌బోర్డుదని తేలితే ఈ విషయాన్ని బోర్డుకు వదిలేయాలని హైకోర్టు తుది ఉత్తర్వులను జారీ చేసింది.



రేవంత్‌రెడ్డిపై డ్రోన్ కేసు డిస్మిస్

జన్వాడ ఫాంహౌస్ వద్ద పర్మిషన్లు లేకుండా డ్రోన్ ఎగురవేశారంటూ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కాంగ్రెస్ ఎంపీగా ఉండగా బీఆర్ఎస్ పాలనలో నార్సింగ్ పోలీసులు పెట్టిన కేసును హైకోర్టు కొట్టివేసింది. డ్రోన్స్ ఎగురవేయకూడదన్న నిషేధిత లిస్ట్‌లో నార్సింగ్‌లోని మియాఖాన్‌గడ్డ లేదని చెప్పింది. కానిస్టేబుల్ జి.వెంకటేశ్ ఫిర్యాదు మేరకు నార్సింగ్ పోలీసులు 2020లో నమోదు చేసిన కేసును కొట్టివేస్తున్నట్టు జస్టిస్ లక్ష్మణ్ బుధవారం తుది ఉత్తర్వులు జారీ చేశారు.

మాజీ ఎమ్మెల్యేకు లభించని ముందస్తు బెయిల్

రంగారెడ్డి జిల్లా ఈర్లపల్లిలో 20 ఎకరాల భూమిని ఆక్రమించుకున్నారంటూ బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే ఆశన్నగారి జీవన్‌రెడ్డిపై నమోదైన కేసులో ముందస్తు బెయిల్ ఇచ్చేందుకు హైకోర్టు నిరాకరించింది. జీవన్‌రెడ్డి దాఖలు చేసిన ముందస్తు బెయిలు పిటిషన్‌ను కొట్టివేసింది. జీవన్‌రెడ్డి తల్లి రాజుభాయి, భార్య రజితలకు షరతులతో కూడిన ముందస్తు బెయిలు మంజూరు చేస్తూ జస్టిస్ కె.లక్ష్మణ్ బుదవారం ఆదేశాలను జారీ చేశారు.

కేటీఆర్‌పై కేసు కొట్టివేత

సీఎం ఎ.రేవంత్‌రెడ్డిని కించపర్చేలా సోషల్ మీడియాలో అనుచిత వ్యాఖ్యలు చేశారంటూ సైఫాబాద్ పీఎస్‌లో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కె.తారక రామారావుపై నమోదైన కేసును హైకోర్టు డిస్మిస్ చేసింది. రాజ్యాంగ పదవిలో ఉన్న సీఎం రేవంత్‌పై వ్యాఖ్యలు చేయడం ద్వారా కాంగ్రెస్‌కు కూడా ప్రతిష్ట దెబ్బతిందంటూ ఎంపీ అనిల్‌కుమార్ యాదవ్ ఫిర్యాదుతో సైఫాబాద్ పోలీసు స్టేషన్‌లో గత ఏడాది ఎఫ్ఐఆర్ నమోదైంది. దీన్ని సవాల్ చేస్తూ కేటీఆర్ వేసిన పిటిషన్‌ను జస్టిస్ లక్ష్మణ్ విచారించి పైవిధంగా ఉత్తర్వులను జారీ చేశారు.

పాల ఉత్పత్తిని పెంచడానికి రాష్ట్రీయ గోకుల్ మిషన్

- కేంద్ర మంత్రి వర్గం నిర్ణయం



నవతెలంగాణ-న్యూఢిల్లీ బ్యూరో

పాల ఉత్పత్తిని పెంచడంతోపాటు దేశీయ పశువుల జాతుల ఉత్పాదకతను పెంపొందించడానికి ఉద్దేశించిన రాష్ట్రీయ గోకుల్ మిషన్ కోసం రూ. 3,400 కోట్లు కేటాయించినట్టు కేంద్ర ఐటీ, రైల్వే శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్ తెలిపారు. దేశవ్యాప్తంగా పాడి రైతుల మద్దతు ఇవ్వడమే లక్ష్యంగా దేశవ్యాప్తంగా పాల అభివృద్ధి కార్యక్రమం కోసం రూ.2,790 కోట్లను కేటాయించినట్లు చెప్పారు. బుధవారం ప్రధానమంత్రి నరేంద్ర మోడీ అధ్యక్షతన కేంద్ర మంత్రి వర్గ సమావేశంలో ఈ మేరకు నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. మంత్రి వర్గ సమావేశ అనంతరం విలేకరులకు ఈ వివరాలను కేంద్ర మంత్రి అశ్విని వైష్ణవ్ వెల్లడించారు.

యూపీఐ లావాదేవీలు రూ.210 లక్షల కోట్లకు చేరుకున్నాయని వెల్లడించారు. రూ. 2 వేలు కంటే తక్కువ విలువ కలిగిన లావాదేవీలకు ఎలాంటి ఛార్జీ లేదన్నారు. అయితే ప్రస్తుత యూపీఐ విధానంలో కస్టమర్ బ్యాంక్, ఫిన్‌టెక్ సంస్థ, పేమెంట్ సర్వీస్ ప్రొవైడర్, యాప్ సంస్థ ద్వారా 4 అంచెల్లో లావాదేవీలు జరుగుతున్నాయని వివరించారు. తద్వారా లావాదేవీల్లో చార్జీలను భరించాల్సి వస్తోందని పేర్కొన్నారు. రూ.1,500 కోట్లు ఇన్సెంటివ్ రూపంలో చిన్న లావాదేవీలకు చార్జి లేకుండా చేస్తున్నామన్నారు.అలాగే ఈశాన్య రాష్ట్రమైన అస్సాంలోని నామ్‌రూప్ వద్ద రూ.10, 601 కోట్లతో అమ్మోనియా ఫ్యాక్టరీ ఏర్పాటు చేయాలని కేంద్రం నిర్ణయించినట్లు తెలిపారు. అలాగే బ్రహ్మపుత్రా వ్యాలీ ఫెర్టిలైజర్ ప్లాంట్‌లో అమ్మోనియా - యూరియా ఉత్పత్తి చేపడతామన్నారు. ఈశాన్య ప్రాంతంలో రైతులకు సకాలంలో ఎరువుల లభ్యత కోసం ఈ ప్రాజెక్టును చేపట్టినట్లు వివరించారు. ఈ ప్రాజెక్ట్ 48 నెలల్లో పూర్తి కానుందని స్పష్టం చేశారు.

మరోవైపు మహారాష్ట్రలో రూ.4,500. 62 కోట్లతో ఆరు లైన్ల గ్రీన్‌ఫీల్డ్ హైవే నిర్మించాలని నిర్ణయించినట్లు వెల్లడించారు. ఇది జెఎన్‌పిఎ పోర్టు (పగోటే) నుంచి చౌక్ వరకు బిఒటి పద్దతిలో నిర్మాణం చేపడుతున్నట్లు వివరించారు. ఇక ఈ రహదారి సరకు రవాణాలో ఎంతో ప్రయోజనకార ప్రాజెక్టుగా మారనుందని కేంద్ర మంత్రి అశ్వినీ వైష్ణవ్ తెలిపారు. అలాగే ఈ హైవే జెఎన్‌పిఎ పోర్టు, నవీ ముంబై అంతర్జాతీయ విమానాశ్రయం, ముంబై-పుణే ఎక్స్‌ప్రెస్‌వేతోపాటు ఎన్‌హెచ్-66 (ముంబై-గోవా హైవే) మధ్య ఈ కనెక్టివిటీని అందిస్తుందని వివరించారు. ఈ ప్రాజెక్ట్ సరుకు రవాణా సామర్థ్యాన్ని పెంచుతుందని, అలాగే ప్రయాణ సమయాన్ని తగ్గిస్తుందని చెప్పారు.

పదవీ విరమణ వయస్సులో మార్పులు చేసే ఉద్దేశం లేదు

- కేంద్ర మంత్రి జితేంద్ర సింగ్



నవతెలంగాణ-న్యూఢిల్లీ బ్యూరో

ప్రభుత్వ రంగ సంస్థల్లో పని చేసే ఉద్యోగుల పదవీ విరమణ వయస్సులో మార్పులు చేసే ఉద్దేశ్యం లేదని కేంద్ర మంత్రి జితేంద్ర సింగ్ స్పష్టం చేశారు. బుధవారం లోక్‌సభలో సౌగతా రాయ్, గణపతి రాజ్‌కుమార్‌లు ప్రభుత్వ ఉద్యోగుల రిపదవీ విరమణ వయస్సుకు సంబంధించి పలు ప్రశ్నలు వేశారు. ప్రభుత్వ ఉద్యోగులపదవీ విరమణ వయస్సుకు సంబంధించి ఏవైనా మార్పులు చేస్తున్నారా?.. ఉద్యోగుల రిటైర్‌మెంట్ ద్వారా ఏర్పడ్డ ఖాళీలను భర్తీ చేయడానికి ఏదైనా పాలసీ ఉందా? అని ప్రశ్నించారు. కేంద్రం, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల మధ్య పదవీ విరమణ వయస్సులో ఎందుకు తేడాలు ఉన్నాయని వారు అడిగారు. ప్రభుత్వ ఉద్యోగుల పదవీ విరమణతో ఏర్పడ్డ ఖాళీలను భర్తీ చేయడానికి ఎలాంటి పాలసీ లేదని స్పష్టం చేశారు. దానిపై జరుగుతున్న ప్రచారాలను ఆయన ఖండించారు. నేషనల్ కౌన్సిల్ స్టాఫ్ దగ్గరినుంచి పదవీ విరమణ వయస్సు మార్పుకు సంబంధించి ఎటువంటి ప్రతిపాదన రాలేదన్నారు. పదవీ విరమణ వయస్సుకు సంబంధించి కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులకు, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు మధ్య ఉన్న వ్యత్యాసాలపై ఆయన సమాధానం ఇస్తూ.. 'కేంద్రం అలాంటి వాటికి సంబంధించిన డేటాను మెయింటేన్ చేయదు. అది రాష్ట్రానికి సంబంధించింది' అని అన్నారు. కాగా, ప్రస్తుతం కొన్ని రంగాలకు సంబంధించి కేంద్ర ప్రభుత్వ ఉద్యోగుల రిటైర్‌మెంట్ ఏజ్ 60 సంవత్సరాలుగా ఉంది. మరికొన్ని రంగాల్లో పదవీ విరమణ వయస్సు 65 సంవత్సరాల వరకు ఉంది. ఇక, రాష్ట్ర ప్రభుత్వాలు తమ ఉద్యోగులకు సంబంధించి సొంత రిటైర్‌మెంట్ ఏజ్ పాలసీని అమలు చేస్తున్నాయి. అలాగే శాఖ వారీగా పదవీ విరమణ వయస్సులో తేడాలు ఉంటున్నాయి.